

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 220

మంగళవారం 1-11-2022

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | BANGALORE | CHENNAI | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




ఆస్ట్రేలియా ఘన విజయం

టి20 ప్రపంచకప్‌లో ఐర్లాండ్‌పై ఆసీస్ 42 పరుగుల తేడాతో గెలిచింది - 12లో



డిజిటల్ రూపీ ట్రయల్స్ షురూ..

హోల్‌సేల్ లావాదేవీల కోసం నేటి నుంచి ప్రారంభం - 13లో



విచ్ఛిన్నకర శక్తులను ఎదిరిద్దాం

భారతదేశ ఐక్యతను విచ్ఛిన్నం చేసేందుకు శత్రువులు కుట్రలు పన్నుతున్నారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు.

వివరాలు 6లో



134కు చేరిన మృతులు

గుజరాత్‌లోని మచ్చూ నదిపై తీగల వంతెన కూలిపోయిన ఘటనలో మృతుల సంఖ్య సోమవారానికి 134కు చేరుకుంది.

వివరాలు 6లో



శరద్‌పవార్‌కు అస్వస్థత

నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సీపీ) చీఫ్ శరద్ పవార్ అనారోగ్యంతో సోమవారం ముంబైలోని బ్రీచ్ క్యాండీ ఆస్పత్రిలో చేరారు.

వివరాలు 6లో



బ్రెజిల్ అధ్యక్షుడిగా డ సిల్వా

ఉత్కంఠభరితంగా జరిగిన బ్రెజిల్ అధ్యక్ష ఎన్నికల్లో వర్కర్స్ పార్టీ నేత, మాజీ దేశాధ్యక్షుడు డ సిల్వా విజయం సాధించారు.

వివరాలు 6లో

న్యూస్‌రీల్

విశాఖ రాజధాని కోసం.. విద్యార్థుల గర్జన



అనకాపల్లి జిల్లా చోడవరంలో సోమవారం జరిగిన 'విద్యార్థి భేరి' రాజధాని నినాదాలతో హోరెత్తింది. మూడు రాజధానులు ఏర్పాటుచేసే వరకూ ఉద్యమం ఆగదని ఉత్తరాంధ్ర జేఏసీ కన్వీనర్ ప్రొఫెసర్ ఎం.లజపతిరాయ్ స్పష్టంచేశారు.

వివరాలు 3లో

ఎన్ని పోరాటాలకైనా సిద్ధం



విశాఖపట్నం పరిపాలనా రాజధాని అయ్యేంతవరకు ఎందాకైనా వెళ్తామని, ఎన్ని పోరాటాలకైనా సిద్ధమని పలువురు వక్తలు ప్రకటించారు. వికేంద్రీకరణకు మద్దతుగా శ్రీకాకుళంలో పలు స్వచ్ఛంద సంస్థలు 'మన విశాఖ–మన రాజధాని' పేరిట సదస్సు నిర్వహించాయి.

వివరాలు 3లో

లక్ష్యం.. వాస్తవ ప్రగతి

సచివాలయాలే కేంద్రంగా అభివృద్ధి లక్ష్యాలు సాధిద్దాం: సీఎం వైఎస్ జగన్

- అందమైన అంకెల రూపంలో మన ప్రగతి ఉండకూడదు
- క్షేత్రస్థాయిలో నిశిత పరిశీలన, పర్యవేక్షణ.. సుస్థిర లక్ష్యాల సాధనకు సచివాలయాలే యూనిట్
- సిబ్బంది పనితీరుపై మండలాల వారీగా అధికారుల పర్యవేక్షణ
- ఏ విభాగంలోనైనా అధికారి లేకుంటే వెంటనే నియామకాలు
- నెలకు రెండుసార్లు సచివాలయాల సందర్శన.. ఎస్‌వోపీల తయారీ
- సమస్యలను పరిష్కరిస్తూ సిబ్బంది ఎఫీషియన్సీ పెంచేలా పర్యటనలు
- పిల్లలంతా స్కూళ్లకు రావాలి... డ్రాపౌట్స్ మాటే వినిపించకూడదు
- మనం తెచ్చిన సంస్కరణలతో రానున్న రోజుల్లో మంచి ఫలితాలు
- సుస్థిర ప్రగతి లక్ష్యాల సాధనపై ఉన్నత స్థాయి సమీక్షలో సీఎం



సాక్షి, అమరావతి: సుస్థిర లక్ష్యాల సాధనలో గ్రామ, వార్డు సచివాలయాలను యూనిట్‌గా తీసుకోవాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. సచివాలయాల సిబ్బంది పనితీరును మండలాల వారీగా ఆయా విభాగాలకు చెందిన అధికారులు పర్యవేక్షించేలా ఎస్‌వోపీలను రూపొందించాలని సూచించారు. మండల స్థాయిలో అన్ని విభాగాలకు చెందిన ప్రభుత్వాధికారులు నెలకు రెండుసార్లు ఆయా సచివాలయాలను సందర్శించి సమస్యలను పరిష్కరిస్తూ సిబ్బంది సమర్థత పెంచాలని నిర్దేశించారు. సుస్థిర ప్రగతి లక్ష్యాల (ఎస్‌డీజీ) సాధనపై ముఖ్యమంత్రి జగన్ సోమవారం తన క్యాంపు కార్యాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు.

ప్రగతి ఎప్పటికప్పుడు నమోదు

గ్రామ, వార్డు సచివాలయాల రూపంలో మన ప్రభుత్వం విప్లవాత్మక నిర్ణయాలతో గొప్ప వ్యవస్థను తెచ్చింది. అలాంటి సచివాలయాలపై నిరంతర పర్యవేక్షణ, ప్రగతి వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయడం చాలా కీలకం. లేదంటే సుస్థిర ప్రగతి లక్ష్యాలను చేరుకునే ప్రయాణంలో

మిగతా 2వ పేజీలో ▶

> ప్రగతి అనేది వాస్తవ రూపంలో ఉండాలి.. అందమైన అంకెల రూపంలో చూపడం కాదు. ప్రతి అంశంలోనూ సాధించాల్సిన ప్రగతిపై క్షేత్ర స్థాయిలో నిశిత పరిశీలన, పర్యవేక్షణ చేపట్టాలి. వివరాల నమోదు సమగ్రంగా ఉంటేనే అభివృద్ధి ఏ స్థాయిలో ఉందో, లక్ష్య సాధన దిశలో ఎక్కడున్నామో స్పష్టంగా తెలుస్తుంది. ఎస్‌డీజీ లక్ష్యాల్లో పర్యావరణం, పరిశుభ్రతపై దృష్టి పెట్టాలి. గ్రామాల్లో పారిశుద్ధ్యం, పరిశుభ్రత, వాయు కాలుష్యం నివారణ, తాగునీటిపై శ్రద్ధ చూపాలి.
>
> - ముఖ్యమంత్రి వైఎస్ జగన్

'స్పందన'.. ఇంకా మెరుగ్గా..

- వినతిపత్రాల పరిష్కారానికి మరింత మెరుగైన వ్యవస్థ
- సీఎంవో, ఉన్నతస్థాయి అధికారులు పర్యవేక్షించేలా ప్రణాళిక
- ఉన్నత సమీక్షలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ దిశానిర్దేశం

- వివరాలు 2లో

నారాయణకు చుక్కెదురు

కింది కోర్టు ఇచ్చిన బెయిల్‌ను రద్దు చేసిన చిత్తూరు జిల్లా కోర్టు

- 30లోపు న్యాయ స్థానంలో లొంగిపోవాలని ఆదేశం
- మాజీ మంత్రి నారాయణ లొంగిపోతే జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించాలి
- పదో తరగతి ప్రశ్నపత్రాల మాల్‌ప్రాక్టీస్ వ్యవహారంలో కోర్టు తాజా తీర్పు



చిత్తూరు అర్బన్: టీడీపీ నేత, నారాయణ విద్యాసంస్థల అధినేత పొంగూరు నారాయణకు చిత్తూరు జిల్లా కోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. పదో తరగతి పబ్లిక్ పరీక్షల సమయంలో ప్రశ్నపత్రాల మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడ్డ వ్యవహారంలో మాజీ మంత్రి నారాయణకు మేజిస్ట్రేట్ కోర్టు ఇచ్చిన బెయిల్‌ను రద్దు చేసింది. ఈ మేరకు చిత్తూరులోని 9వ అదనపు జిల్లా సెషన్స్ న్యాయస్థానం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 30లోపు నారాయణ కోర్టులో లొంగిపోవాలని న్యాయమూర్తి శ్రీనివాసులు ఆదేశాలిచ్చారు. నారాయణ కోర్టులో

మిగతా 5వ పేజీలో ▶

కాపుల సంక్షేమానికి పెద్దపీట

మూడేళ్లలో రూ.27 వేల కోట్లు ఇచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్

- గతంలో ఏ ప్రభుత్వం ఈ స్థాయిలో మేలు చేయలేదు
- కాపులను అణగదొక్కిన బాబుకు కొమ్ము కాస్తున్న పవన్
- రంగా హత్యకు కారకుడైన వ్యక్తితో అంటకాగుతారా?
- పవన్ దిగజారుడును గ్రామగ్రామాన కాపు యువతకు వివరిద్దాం
- రాజమహేంద్రవరంలో కాపు ప్రజాప్రతినిధుల భేటీలో తీర్మానం
- త్వరలో విజయవాడలో రాష్ట్ర విస్తృతస్థాయి సమావేశం

14లో



మీడియాతో మాట్లాడుతున్న మంత్రులు బొత్స, కొట్టు సత్యనారాయణ, అంబటి రాంబాబు, దాడిశెట్టి రాజా, ఎంపీ వంగా గీత, మాజీ మంత్రులు కన్నబాబు, ముత్తంశెట్టి, పేర్ని నాని తదితరులు

క్లుప్తంగా

అభివృద్ధి పథంలో రాష్ట్ర ప్రభుత్వం పురోగతి

రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన గవర్నర్

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ప్రజలకు గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు రాజ్‌భవన్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయడం, పేదలకు అనుకూలమైన చర్యలను ప్రారంభించడం ద్వారా అభివృద్ధి పథంలో భారీ పురోగతి సాధిస్తోందని పేర్కొన్నారు. అభివృద్ధి ఫలాలు సమాజంలోని చివరి మనిషికి అందేలా చూడాలనే లక్ష్యంతో ప్రజాకేంద్రీకృత విధానాన్ని కొనసాగించాలన్నారు. ఏ ప్రభుత్వమైనా విజయం సాధించాలంటే ప్రజల సంతోషమే బారోమీటర్ అని అన్నారు. సామాన్యుల కలలు సాకారం చేసేందుకు ప్రభుత్వం చేపట్టిన అన్ని కార్యక్రమాలు మరింత విజయం సాధించాలని కోరుకుంటున్నానని గవర్నర్ తెలిపారు.

నేడు ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం

సాక్షి, అమరావతి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని నవంబర్ ఒకటో తేదీ (మంగళవారం) ఉదయం 10.15గంటలకు తాడేపల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. తర్వాత తెలుగుతల్లికి, అమరజీవి పొట్టి శ్రీరాములుకు నివాళి అర్పిస్తారు.

భారతావని నిర్మాణంలో పటేల్ పాత్ర కీలకం

పటేల్ జయంతి సందర్భంగా గవర్నర్ నివాళి



సాక్షి, అమరావతి : దేశ వ్యాప్తంగా రాచరిక రాష్ట్రాలను విలీనం చేయడం ద్వారా సమగ్ర భారతదేశాన్ని నిర్మించడంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ పాత్ర అనిర్వచనీయమని గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ అన్నారు. భారతరత్న సర్దార్ వల్లభాయ్ పటేల్ 147వ జయంతిని పురస్కరించుకుని రాజ్‌భవన్ దర్బార్ హాల్లో సోమవారం జరిగిన కార్యక్రమంలో పటేల్ చిత్రపటానికి గవర్నర్ పూలమాల వేసి నివాళులర్పించారు. భారతదేశ ఉక్కు మనిషిగా పేరొందిన సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని జాతీయ ఐక్యతా దినోత్సవంగా ఏటా పాటిస్తున్నామని గవర్నర్ చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీ చొరవతో ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన 182 మీటర్ల విగ్రహాన్ని గుజరాత్‌లో ప్రతిష్టించారని గవర్నర్ కొనియాడారు. దేశ తొలి ఉప ప్రధానిగా, హోం మంత్రిగా పటేల్.. 565 రాచరిక సంస్థానాలను భారత్‌లో విలీనం చేశారని, దీని వల్లే దేశం ఐక్యంగా, సమగ్రంగా ఉందని గవర్నర్ చెప్పారు. కార్యక్రమంలో గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా, సంయుక్త కార్యదర్శి సూర్యప్రకాష్ తదితరులున్నారు.

మరో 100 అంతర్‌రాష్ట్ర సర్వీసులు

సాక్షి, అమరావతి: అంతర్‌రాష్ట్ర బస్ సర్వీసులకు ఆర్టీసీ మరింత ప్రాధాన్యమివ్వనుంది. ప్రధానంగా మెట్రో నగరాలు బెంగళూరు, చెన్నైలకు మరో 100 అదనపు సర్వీసులు నిర్వహించాలని నిర్ణయించింది. అందుకోసం కర్ణాటక, తమిళనాడు ఆర్టీసీలతో సంప్రదింపుల ప్రక్రియ దాదాపు కొలిక్కివచ్చింది. అదనపు సర్వీసులన్నీ ఏపీ బస్‌లే నిర్వహించాలని ఆర్టీసీ భావిస్తోంది. ప్రస్తుతం ఆర్టీసీ అంతర్‌రాష్ట్ర సర్వీసుల్లో 50 శాతం తెలంగాణాకే కేటాయిస్తోంది. మన రాష్ట్రం నుంచి బెంగళూరుతో సహా కర్ణాటకలోని ప్రధాన పట్టణాలకు బస్ సర్వీసులకు విపరీతమైన డిమాండ్ ఉంది. ఈ రూట్లలోనే ప్రైవేటు ట్రావెల్స్ ఎక్కువగా బస్ సర్వీసులు నిర్వహిస్తున్నాయి. ఈ ప్రాంతాలకు అంతర్‌రాష్ట్ర సర్వీసులు పెంచాలని ఆర్టీసీ నిర్ణయించింది. సంస్థ అధికారులు ఇటీవల బెంగళూరు వెళ్లి ఆ రాష్ట్ర ఆర్టీసీ ఉన్నతాధికారులతో చర్చించారు. బస్ సర్వీసుల సంఖ్యపై సూత్రప్రాయంగా ఓ నిర్ణయానికి వచ్చారు. తిరుపతి, కడప, అనంతపురం, కర్నూలు, నెల్లూరులతోపాటు విజయవాడ నుంచి బెంగళూరుకు 35 బస్ సర్వీసులు, కర్ణాటకలోని ఇతర ముఖ్య పట్టణాలకు మరో 15 బస్ సర్వీసులు పెంచాలని ఏపీఎస్ ఆర్టీసీ ప్రతిపాదించింది. కర్ణాటక ఆర్టీసీ ఏపీలోని తిరుపతి, విజయవాడతోపాటు వివిధ ప్రాంతాలకు బస్ సర్వీసులు నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందిస్తోంది. ఈమేరకు రెండు రాష్ట్రాల ఆర్టీసీలు ఒప్పందం కుదుర్చుకోనున్నాయి. చెన్నైతోపాటు తమిళనాడులోని కోయంబత్తూరు, మధురై, సేలం ప్రాంతాలకు అదనపు అంతర్‌రాష్ట్ర సర్వీసులు నిర్వహించాలని ఏపీఎస్‌ఆర్టీసీ భావిస్తోంది. తిరుపతి, నెల్లూరు, కడపలతోపాటు విజయవాడ నుంచి ఈ సర్వీసులు అందుబాటులోకి తేనుంది. తమిళనాడుకు 50 అదనపు సర్వీసులు నడపాలన్నది ఆర్టీసీ ప్రణాళిక. ఆర్టీసీ ఉన్నతాధికారులు త్వరలోనే చెన్నై వెళ్లి తమిళనాడు ఆర్టీసీ అధికారులతో చర్చించనున్నారు. బస్ సర్వీసుల సంఖ్యపై ఓ అవగాహన వచ్చాక ఒప్పందం కుదుర్చుకుంటాయి.

'స్పందన'.. ఇంకా మెరుగ్గా..

ఉన్నత స్థాయి సమీక్షలో సీఎం జగన్ దిశా నిర్దేశం

సాక్షి, అమరావతి: వివిధ సమస్యలతో ప్రజల నుంచి అందే వినతిపత్రాల పరిష్కారానికి మరింత మెరుగైన వ్యవస్థను అమల్లోకి తేవడంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందులో భాగంగా స్పందనకు మరింత మెరుగైన రూపం కల్పించడంపై ముఖ్యమంత్రి జగన్ సోమవారం తన క్యాంపు కార్యాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. సీఎంవో, ఉన్నతస్థాయి అధికారులు దీన్ని పర్యవేక్షించేలా కార్యాచరణ రూపొందించాలని సీఎం ఆదేశించారు. స్పందన కార్యక్రమాన్ని మరింత మెరుగుపరచి వ్యక్తిగత సమస్యలను సైతం పరిష్కరించే అంశం ఈ సందర్భంగా చర్చకు వచ్చింది. ప్రజలు తమ ఇబ్బందులను నేరుగా ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చే కార్యక్రమాన్ని చేపట్టే అంశం ప్రస్తావనకు వచ్చింది. దీనికి రకరకాల పేర్లు ప్రతిపాదనకు రాగా ''జగనన్నకు చెబుదాం..'' అనే పేరు కూడా పరిశీలనకు వచ్చింది. ఈ సందర్భంగా సీఎం జగన్ ఏమన్నారంటే..

ప్రజలకు అండగా నిలిచాం

ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రజాసమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యం ఇచ్చాం. సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థను తేవడంతోపాటు స్పందన కార్యక్రమాన్ని ప్రవేశపెట్టాం. వ్యక్తుల సమస్యలతోపాటు సామాజిక సమస్యల పరిష్కారంపై దృష్టిపెట్టాం. ఒక నిర్ణీత సమయం నిర్దేశించుకుని శరవేగంగా పరిష్కరిస్తూ ప్రజలకు అండగా నిలిచాం. స్పందన అమలు చేస్తూనే ప్రజలు ఎదుర్కొంటున్న ఇతర సమస్యలపై గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా దృష్టి పెట్టాం. గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో వాటిని పరిష్కరించేందుకు నిధులు కూడా కేటాయించాం. ఇప్పుడు ఇంకా ఏమైనా సమస్యలు మిగిలిపోయి ఉన్నాయా? అన్న దానిపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

ఇతర రాష్ట్రాల్లో విధానాలనూ పరిశీలిద్దాం

వివిధ రాష్ట్రాల్లో అమలు చేస్తున్న విధానాలను కూడా పరిశీలించి స్వీకరించదగ్గవి ఉంటే తీసుకోవాలి. పథకాలు కావచ్చు.. రెవెన్యూ రికార్డులకు సంబంధించిన అంశాలు కావచ్చు.. ఇలా ఏవైనా కావచ్చు. ఏ ఒక్కరూ అర్హులు మిగిలిపోకూడదు, సమస్యలు పరిష్కారానికి నోచుకోకుండా మిగిలిపోరాదు అన్నదే దీని ఉద్దేశం. ఈ విధానం ఎలా ఉండాలి? ఎలాంటి సమస్యలకు ఎలాంటి పరిష్కారాలు చూపాలి? అనే అంశాలపై మార్గదర్శక ప్రణాళిక రూపొందించాలి. సీఎంవో, ఇతర ఉన్నతాధికారులతో కూడిన యంత్రాంగం ప్రజల ఫిర్యాదులు, వినతులకు పరిష్కారాలు చూపడమే దీని ఉద్దేశం. స్పందన కన్నా మరింత మెరుగ్గా, సమర్థంగా నిర్వహించాలన్నదే లక్ష్యం. అధికారులంతా కలిసి ఈమేరకు ప్రణాళిక సిద్ధం చేయాలి. స్పందన కార్యక్రమాన్ని సూక్ష్మ స్థాయిలో పరిశీలించి మరింత మెరుగ్గా తీర్చిదిద్దాలి.

అంకితభావానికి నిదర్శనంగా నిలవాలి

సమస్యల పరిష్కారంలో మనం అంకితభావానికి నిదర్శనంగా నిలవాలి. ప్రజా సమస్యలను తీర్చాలన్నదే మన ఉద్దేశం. అధికారంలోకి వచ్చిన తర్వాత అత్యంత నిజాయితీగా, అంకిత భావంతో, కృత నిశ్చయంతో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేశాం. అంతా కలసికట్టుగా గతంలో ఎన్నడూలేని రీతిలో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి. సమస్యల పరిష్కారం కోసం ఇప్పుడు అమలు చేస్తున్న కార్యక్రమాల్లో వృత్తి నైపుణ్యాలు పెంచడం, నిర్మాణాత్మక రీతిలో వ్యవహరించడంపై మనం దృష్టి సారించాలి. వినతిపత్రాల పరిష్కారంలో ప్రజల సంతృప్తికి పెద్దపీట వేయాలి.

డిజిటల్ హెల్త్‌లో ఏపీకి రెండు అవార్డులు

అభినందించిన సీఎం వైఎస్ జగన్



డిజిటల్ హెల్త్‌లో రాష్ట్ర ప్రభుత్వానికి రెండు గ్లోబల్ అవార్డులు దక్కాయి. రాష్ట్రంలో వైద్య రంగం అభివృద్ధికి ప్రవేశపెట్టిన సంస్కరణలు, అందరికీ వైద్యాన్ని అందుబాటులో ఉంచేందుకు చేపట్టిన కార్యక్రమాలకు గుర్తింపుగా ఈ రెండు గ్లోబల్ డిజిటల్ హెల్త్ అవార్డులు రాష్ట్రాన్ని వరించాయి. ఇటీవల ఢిల్లీలో జరిగిన గ్లోబల్ డిజిటల్ హెల్త్ సమ్మిట్-2022లో వీటిని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని అందుకున్నారు. సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను సోమవారం మంత్రి విడదల రజిని, వైద్య, ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు కలిసి అవార్డు వివరాలు వివరించారు. వారిని సీఎం అభినందించారు.

నేడు 'వైఎస్సార్' అవార్డుల ప్రదానోత్సవం

- వివిధ రంగాల్లో సేవలందించిన 35 మంది వ్యక్తులు, సంస్థలకు పురస్కారాలు
- 20 వైఎస్సార్ జీవిత సాఫల్య, 10 వైఎస్సార్ సాఫల్య అవార్డులు
- ముఖ్య అతిథిగా గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్, ఆత్మీయ అతిథిగా వైఎస్ విజయమ్మ హాజరు
- అవార్డుల ప్రదానోత్సవానికి విశిష్ట అతిథిగా సీఎం జగన్

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక 'వైఎస్సార్ జీవిత సాఫల్య, వైఎస్సార్ సాఫల్య-2022' పురస్కారాలను మంగళవారం ప్రదానం చేయనుంది. ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని వరుసగా రెండో ఏడాది అవార్డులు అందిస్తోంది. ఉదయం 11 గంటలకు విజయవాడలోని ఏ1 కన్వెన్షన్ సెంటర్‌లో జరిగే అవార్డుల ప్రదానోత్సవానికి ముఖ్య అతిథిగా గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్, విశిష్ట అతిథిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఆత్మీయ అతిథిగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి సతీమణి వైఎస్ విజయమ్మ హాజరుకానున్నారు. వ్యవసాయం, కళలు-సంస్కృతి, సాహిత్యం, మహిళా, శిశు సాధికారత, విద్య, జర్నలిజం, వైద్యం, పరిశ్రమ రంగాల్లో విశేషకృషి చేసిన 35 మంది వ్యక్తులు, సంస్థలకు 30 అవార్డులను అందజేయనున్నారు. ఇందులో 20 వైఎస్సార్ జీవిత సాఫల్య, 10 వైఎస్సార్ సాఫల్య పురస్కారాలు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే అత్యున్నత పురస్కారాల తరహాలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'వైఎస్సార్' అవార్డులను అందజేస్తోంది. వ్యవసాయంలో 5, కళలు-సంస్కృతిలో 5, సాహిత్యంలో 3, మహిళా, శిశు సాధికారతలో 3, విద్యలో 4, జర్నలిజంలో 4, వైద్యంలో 5 అవార్డులు, పరిశ్రమల విభాగంలో ఒక అవార్డును ప్రదానం చేయనున్నారు. ఆయా రంగాల్లో సామాజిక అభ్యున్నతి కోసం అసామాన్య కృషిచేసి, విశిష్ట సేవలు అందించిన వ్యక్తులు, సంస్థలకు అవార్డుల్లో రాష్ట్ర హైపవర్ స్క్రీనింగ్ కమిటీ పెద్దపీట వేసింది. వైఎస్సార్ జీవిత సాఫల్య అవార్డు కింద రూ.10 లక్షల నగదుతో పాటు వైఎస్సార్ కాంస్య విగ్రహం, జ్ఞాపిక, ప్రశంసాపత్రం, వైఎస్సార్ సాఫల్య అవార్డుకు రూ.5 లక్షల నగదు, జ్ఞాపిక, ప్రశంసాపత్రం బహూకరించనున్నారు.

కల్లు కిస్తీలు రద్దు

గీత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత

- ఎక్స్‌గ్రేషియా రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంపు
- కల్లుగీత పాలసీ 2022-2027 మార్గదర్శకాల విడుదల
- 95,245 కల్లుగీత కార్మిక కుటుంబాలకు ప్రయోజనం

సాక్షి, అమరావతి: ఏపీలో కల్లుగీత వృత్తిపై ఆధారపడిన కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇచ్చింది. మద్యం నియంత్రణ విధానానికి అనుగుణంగా కల్లుగీత కార్మికుల ప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఐదేళ్ల విధానాన్ని ప్రకటించింది. 2022 నుంచి 2027 వరకు కాలానికి కల్లు గీత విధానం (పాలసీ) అమలులో ఉంటుంది. దీనివల్ల రాష్ట్రంలోని 95,245 కల్లు గీత కార్మిక కుటుంబాలకు లబ్ధి చేకూరనుంది. కల్లుగీత లైసెన్సింగ్ విధానం కూడా అత్యంత పారదర్శకంగా జరిగేలా అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్‌భార్గవ సోమవారం మార్గదర్శకాలు జారీ చేశారు.

పరిహారం పెంపు.. తాటిచెట్ల పెంపకానికి ప్రాధాన్యత

- కల్లు రెంటల్స్ (కిస్తీలు)ను ప్రభుత్వం పూర్తిగా రద్దు చేసింది. రాష్ట్రంలో కల్లుగీత కార్మిక సొసైటీలు, గీసే వానికి చెట్టు పథకం, షెడ్యూల్డ్ ప్రాంతాల్లో షెడ్యూల్డ్ జాతుల వారు కల్లు గీసుకోవడం కోసం ఐదేళ్లకు అనుమతి(లైసెన్స్) ఇస్తారు.
- కల్లు గీస్తూ ప్రమాదానికి గురై శాశ్వత వైకల్యానికి గురైన కార్మికులకు ప్రత్యామ్నాయ నైపుణ్యాభివృద్ధి విభాగం ద్వారా తగిన శిక్షణ ఇచ్చి ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలను చూపిస్తారు. వైఎస్సార్ బీమా ద్వారా నష్టపరిహారం చెల్లిస్తారు.
- కల్లుగీస్తూ ప్రమాదవశాత్తు మరణించిన కార్మికులకు చెల్లించే పరిహారాన్ని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంపు. ఇందులో రూ.5 లక్షలు వైఎస్సార్ బీమా ద్వారా, మిగిలిన రూ.5 లక్షలు ఎక్స్‌గ్రేషియా రూపంలో ప్రభుత్వం చెల్లిస్తుంది.
- కల్లు గీత కార్మికుడు సహజ మరణం చెందితే అతని కుటుంబానికి వైఎస్సార్ బీమా పథకం ద్వారా రూ.5 లక్షల పరిహారం అందజేత.
- ఎన్ఆర్ఈజీఎస్, షెల్టర్ బెడ్ అభివృద్ధి పథకాల కింద తాటి, ఈత వంటి చెట్లను పెంచేలా చర్యలు తీసుకుంటారు. ప్రధానంగా కాలువ గట్లు, నదీ, సాగర తీరాలను పటిష్టం చేస్తూ కల్లు గీతకు కావాల్సిన తాటి, ఈత చెట్లను సమృద్ధిగా పెంచడానికి చర్యలు తీసుకుంటారు.

ప్లాస్టిక్ ఫ్లెక్సీల నిషేధం జనవరి 26 నుంచి..

- ఫ్లెక్సీ తయారీదారుల విజ్ఞప్తి మేరకు సీఎం జగన్ నిర్ణయం
- తయారీ సామగ్రి మార్చుకునేందుకు సమయం
- తయారీదారులకు రూ.20 లక్షల వరకు పావలా వడ్డీకి రుణాలిప్పించాలని సీఎం ఆదేశం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్లాస్టిక్ ఫ్లెక్సీలపై నిషేధం అమలు జనవరి 26కి వాయిదా పడింది. ప్లాస్టిక్ ఫ్లెక్సీలపై నిషేధం మంగళవారం నుంచి అమల్లోకి రావాల్సి ఉంది. అయితే సాంకేతిక పరిజ్ఞానం, తయారీ సామగ్రిని మార్చుకునేందుకు తగిన సమయం ఇవ్వాలంటూ ఫ్లెక్సీ తయారీదారులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వారి విజ్ఞప్తిని అధికారులు సీఎం వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించారు. ప్లాస్టిక్ ఫ్లెక్సీలపై నిషేధాన్ని జనవరి 26 నుంచి అమల్లోకి తేవాలని సీఎం ఆదేశించారు. ఈలోగా ప్లాస్టిక్ ఫ్లెక్సీ తయారీదారులకు చేదోడుగా నిలవాలని, సాంకేతిక పరిజ్ఞానం విషయంలో వారికి అండగా నిలవాలని అధికారులకు సూచించారు. ఫ్లెక్సీ తయారీదారులు సామగ్రిని మార్చుకునేందుకు అవసరం మేరకు రూ.20 లక్షల వరకు పావలా వడ్డీకే రుణాలు ఇప్పించాలని ఆదేశించారు. పర్యావరణ హితం కోసం ప్లాస్టిక్ ఫ్లెక్సీల తయారీ, వినియోగంపై ఇదివరకే రాష్ట్ర ప్రభుత్వం నిషేధం విధించిన విషయం తెలిసిందే.

వైద్య శాఖలో ఫేషియల్ రికగ్నిషన్ హాజరు

సాక్షి, అమరావతి: వైద్య, ఆరోగ్య శాఖ ఉద్యోగులకు ఫేషియల్ రికగ్నిషన్ హాజరు విధానాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. మంగళవారం నుంచి పీహెచ్‌సీ, జిల్లా డీఎంహెచ్‌వో, రీజనల్ డైరెక్టర్, ఇతర కార్యాల ఉద్యోగులకు ఫేషియల్ రికగ్నిషన్ హాజరును తప్పనిసరి చేస్తూ ఆదేశాలిచ్చింది. ప్రజారోగ్య విభాగంలో ఆస్పత్రులు, కార్యాలయాలు అన్ని కలిపి 1,600కు పైగా ఉన్నాయి. వీటిలో 20 వేల మందికి పైగా ఉద్యోగులు పనిచేస్తుంటారు. వీరిలో ఇప్పటికే 70 శాతం మందికిపైగా ఉద్యోగులను యాప్‌లో ఎన్‌రోల్‌మెంట్ చేశారు. ఫేషియల్ రికగ్నిషన్ హాజరు కోసం వైద్య శాఖ ప్రత్యేక యాప్‌ను రూపొందించింది. ఈ యాప్ ద్వారా హాజరు వేయడంపై పీహెచ్‌సీ వైద్యులు, ఇతర సిబ్బందికి శిక్షణను ఇచ్చారు. వైద్య విధాన పరిషత్, డీఎంఈ, వైద్య శాఖలోని ఇతర విభాగాలకు ఫేషియల్ రికగ్నిషన్ హాజరును తప్పనిసరి చేయనున్నారు. ఈ క్రమంలో ఆయా విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల ఎన్‌రోల్‌మెంట్ ప్రక్రియ కొనసాగుతోంది.

లక్ష్యం.. వాస్తవ ప్రగతి

▶ మొదటి పేజీ తరువాయి

వాస్తవికత దూరం అవుతుంది.

నిశిత దృష్టి, జవాబుదారీతనం..

ఆధార్ కార్డు నంబరు, వివరాలతో సహా డేటాను నిక్షిప్తం చేయడంతోపాటు వచ్చిన మార్పులు చెప్పగలిగేలా ప్రగతి కనిపించాలి. ఏమైనా సమస్యలుంటే సచివాలయాల స్థాయిలోనే గుర్తించి పరిష్కారాలు కూడా చూపాలి. ఉదాహరణకు రక్తహీనతను నివారించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నాం. దీనికోసం సంపూర్ణ పోషణ, సంపూర్ణ పోషణ ప్లస్ అమలు చేస్తున్నాం. వీటిని అందుకుంటున్న మహిళల ఆరోగ్యంపై పర్యవేక్షణ కచ్చితంగా ఉండాలి. వారికి సరైన ఆహారం అందుతుందా? లేదా? అన్నదానిపై సచివాలయాల స్థాయిలోనే నిశిత దృష్టి ఉండాలి. తద్వారా ఆ సమస్య ఇక పూర్తి స్థాయిలో పరిష్కారం కావాలి. సచివాలయాల సిబ్బందికి ఆ స్థాయిలో బాధ్యత, జవాబుదారీతనం ఉండాలి. వివిధ ప్రభుత్వ విభాగాల తరఫున గ్రామ, వార్డు సచివాలయాల్లో సిబ్బంది ఉన్నారు. నిర్దేశిత లక్ష్యాల సాధనకు సచివాలయాలను చోదక శక్తిలా వినియోగించుకునేలా సిబ్బందిని పూర్తి స్థాయిలో భాగస్వాములుగా చేయాలి. సచివాలయాల సిబ్బందికి నిర్దేశించిన ఎస్‌వోపీలను మరోసారి పరిశీలించి అవసరమైతే మార్పుచేర్పులు చేయాలి.

సచివాలయాల సందర్శన..

మండల స్థాయిలో ప్రభుత్వంలో ప్రతి విభాగానికి చెందిన అధిపతి ప్రతి నెలా రెండు సార్లు గ్రామ, వార్డు సచివాలయాలను సందర్శించి సమస్యలను పరిష్కరిస్తూ సమర్థత పెరిగేలా చర్యలు తీసుకోవాలి. సిబ్బంది ఎఫిషియన్సీ పెంపొందించేలా చూడాలి. ఆయా శాఖలకు చెందిన సచివాలయ ఉద్యోగులు ఎలా పని చేస్తున్నారు? ప్రగతి లక్ష్యాల సాధన దిశగా ఎలా కృషి చేస్తున్నారో పరిశీలన చేయాలి. ప్రతి విభాగంలోనూ పర్యవేక్షణ ఉండాలి. ఏ విభాగంలోనైనా సంబంధిత అధికారి లేకుంటే ఆయా విభాగాలకు మండలాలవారీగా వెంటనే నియమించాలి. వీలైనంత త్వరగా దీన్ని చేపట్టాలి. దీనివల్ల సచివాలయాల సిబ్బందికి సరైన మార్గదర్శకత్వం లభిస్తుంది. అవగాహన కలుగుతుంది. ఎప్పటికప్పుడు వివరాల నమోదు సమగ్రంగా జరుగుతుందో లేదో పర్యవేక్షణ ఉంటుంది. లక్ష్యాల సాధన దిశలో మనం ఎక్కడున్నామో తెలుస్తుంది.

కలెక్టర్లు, జేసీలు పరిశీలన చేయాలి

గ్రామ, వార్డు సచివాలయాల స్థాయిలో వాస్తవిక రూపం దాల్చిన అంశాలకు సంబంధించి వివరాల నమోదు ఎలా జరుగుతోంది? అనే విషయంపై జేసీలు, కలెక్టర్లు పరిశీలన చేయాలి. సచివాలయాలను తమవిగా భావించాలి. ప్రతి స్థాయిలోనూ ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఉండాలి. దీనివల్ల సచివాలయాల సిబ్బందిలో మెరుగైన పనితీరు కనిపిస్తుంది. ప్రగతి లక్ష్యాల సాధనలో మన అడుగులు ముందుకు పడతాయి. దేశంలో మన రాష్ట్రం నంబర్ వన్‌గా నిలుస్తుంది.

ప్రతి నెలా వివరాలు నమోదు

వ్యవసాయం, విద్య, మహిళ, శిశు సంక్షేమం, ఆరోగ్యం తదితర రంగాలపై మనం ఖర్చు చేస్తున్నట్లు దేశంలో ఏ ప్రభుత్వం కూడా ఖర్చు చేయడం లేదు. వీటిపై సమగ్ర పర్యవేక్షణ అవసరం. ప్రగతి లక్ష్యాల సాధనపై నెల రోజులకు ఒకసారి వివరాలు నమోదు కావాలి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ లాంటి సాంకేతికతను వాడుకోవాలి.

డ్రాపౌట్స్ ఉండకూడదు

పిల్లలు బడి మానేశారన్న మాట ఎక్కడా ఉండకూడదు. డ్రాపౌట్స్ అన్న మాట ఎక్కడా వినిపించకూడదు. సచివాలయాల వారీగా, వలంటీర్ల వారీగా పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు దీనిపై దృష్టి పెట్టాలి. ఎక్కడైనా డ్రాపౌట్ గురించి సమాచారం అందితే అధికారులు వెంటనే స్పందించాలి. క్రమం తప్పకుండా విద్యార్థుల హాజరు పరిశీలించాలి.



తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో ఉన్నత స్థాయి సమీక్షలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

రానున్న రోజుల్లో మంచి ఫలితాలు

విద్య సహా వివిధ రంగాల్లో అమలు చేస్తున్న సంస్కరణల వల్ల రానున్న రోజుల్లో మంచి ఫలితాలు వస్తాయి. విద్యారంగంలో మనం చేపట్టిన సంస్కరణలు భవిష్యత్తు తరాలకు బంగారు బాటలు వేస్తాయి. ఇంగ్లిషు మీడియం సహా పలు సంస్కరణల ద్వారా పరిస్థితులను సమూలంగా మార్చేసే మహా యజ్ఞాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది. ఒక ప్రక్రియ ప్రారంభమైంది. దీన్ని అమలు చేసుకుంటూ ముందుకెళ్తున్నాం. వీటి ఫలితాలు ఉజ్వల భవిష్యత్తు కలిగిన తరాలుగా సమాజానికి అందుతాయి.

ఎవరైనా వరుసగా మూడు రోజులు స్కూలుకు రాకపోతే కచ్చితంగా మూడోరోజు ఇంటికివెళ్లి ఆరా తీయాలి. పిల్లలు బడికి రాకపోతే తప్పనిసరిగా ఎస్ఎంఎస్ పంపాలి. ఇవన్నీ కచ్చితంగా జరగాలి.

కళ్యాణమస్తుతో..

కళ్యాణమస్తు పథకం ద్వారా లబ్ధి పొందేందుకు నిర్దేశించిన అర్హతలు బాల్య వివాహాల నివారణ, అక్షరాస్యత పెరిగేలా దోహదం చేస్తాయి. వధూవరుల కనీస విద్యార్హత పదో తరగతిగా నిర్ణయించాం. పెళ్లి కుమార్తె కనీస వయసు 18 ఏళ్లు, పెళ్లి కుమారుడి కనీస వయసు 21 ఏళ్లుగా నిర్దేశించినందున ఉన్నత చదువులపై దృష్టి సారిస్తారు.

చదువుల యజ్ఞం కొనసాగుతుంది..

ఇంగ్లీషు మాధ్యమానికి వ్యతిరేకంగా కొన్ని పత్రికలు నిరంతరం కథనాలు రాస్తున్నాయి. వారి పిల్లలే ఇంగ్లీషు మీడియంలో చదవాలి, పేద బిడ్డలు మాత్రం ఆంగ్ల మాధ్యమంలో చదవకూడదనే వైఖరిని పదేపదే చాటుకుంటున్నారు. పేద పిల్లలకు ఇంగ్లీషు మీడియం చదువులు అందకూడదన్నదే వారి ధ్యేయంగా కనిపిస్తోంది. ఇవాళ ప్రభుత్వం చేపట్టిన యజ్ఞం కొనసాగుతుంది. స్కూళ్ల నిర్వహణలో ఉత్తమ విధానాలు పాటించడం ద్వారా నాణ్యమైన చదువులు ఉచితంగా అందుతాయి. తద్వారా చదువుల కోసం చేస్తున్న ఖర్చు భారం నుంచి ఆయా కుటుంబాలు ఉపశమనం పొందుతాయి. అంతిమంగా ప్రభుత్వ ఉద్దేశం, లక్ష్యం నెరవేరుతుంది. సమీక్షలో సీఎస్ సమీర్ శర్మ, ఆర్థికశాఖ స్పెషల్ సీఎస్ ఎస్ఎస్ రావత్, గ్రామ, వార్డు సచివాలయాలశాఖ స్పెషల్ సీఎస్ అజయ్‌జైన్, పాఠశాల విద్యాశాఖ స్పెషల్ సీఎస్ బుడితి రాజశేఖర్, వైద్య, ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి కృష్ణబాబు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది, మహిళా, శిశు సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి ముద్దాడ రవిచంద్ర, హోంశాఖ ముఖ్య కార్యదర్శి హరీష్ కుమార్ గుప్తా, ప్లానింగ్ సెక్రటరీ విజయ్‌కుమార్, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్ కుమార్, పాఠశాల మౌలిక వసతుల కమిషనర్ కాటమనేని భాస్కర్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ ప్రవీణ్ కుమార్, వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్ జె.నివాస్, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఎండీ పి.సంపత్ కుమార్, మహిళా, శిశు సంక్షేమశాఖ డైరెక్టర్ డాక్టర్ ఎ.సిరి, మధ్యాహ్న భోజన పథకం డైరెక్టర్ నిధి మీనా తదితరులు పాల్గొన్నారు.

బీచ్ ఐటీ డెస్టినేషన్‌గా విశాఖ

- ఐటీ పెట్టుబడులకు అనువైన ప్రాంతం ఇదే
- రాండ్‌స్టాడ్ కార్యాలయం ప్రారంభోత్సవంలో ఐటీ శాఖ మంత్రి అమర్‌నాథ్



రాండ్‌స్టాడ్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తదితరులు

దొండపర్తి (విశాఖ దక్షిణ): దేశంలో బీచ్ ఐటీ డెస్టినేషన్‌గా విశాఖను తీర్చిదిద్దడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చర్యలు చేపట్టారని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. రాండ్‌స్టాడ్ సంస్థ విశాఖలో నెలకొల్పిన కార్యాలయాన్ని మంత్రి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ హెచ్ఆర్ సేవల్లో ఆరు దశాబ్దాల చరిత్ర, ప్రపంచవ్యాప్తంగా 60 వేల మంది ఉద్యోగులున్న రాండ్‌స్టాడ్ రాకతో విశాఖ ఐటీ ముఖచిత్రం మారుతుందని చెప్పారు. ఈ సంస్థ విశాఖలో రెండేళ్లలో 6 వేల మందికి ఉద్యోగాలు కల్పిస్తుందని వివరించారు. అమెరికాలో ప్రతి 100 మంది ఐటీ ప్రొఫెషనల్స్‌లో 25 మంది తెలుగువారేనని, తెలుగు రాష్ట్రాల్లో ఆ స్థాయిలో నైపుణ్యమున్న మానవ వనరులు ఉండడంతో భారీ సంస్థలు ఆంధ్రప్రదేశ్‌కు రావడానికి ఆసక్తి చూపిస్తున్నాయని తెలిపారు. మరీ ముఖ్యంగా ఐటీ పెట్టుబడులకు విశాఖ అనువైన ప్రాంతమని, దేశంలో భవిష్యత్తు ఐటీ డెస్టినేషన్ విశాఖే అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దావోస్ సదస్సులో స్పష్టం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. అందుకే విశాఖకు రావడానికి బహుళజాతి కంపెనీలు సైతం ఆసక్తి చూపిస్తున్నాయని అన్నారు. రాష్ట్రానికి వచ్చే సంస్థలకు ప్రభుత్వం పూర్తి సహాయ, సహకారాలు అందిస్తుందన్నారు. వచ్చే ఏడాది జనవరి, ఫిబ్రవరి నెలల్లో విశాఖలో ఇన్ఫోసిస్ కార్యకలాపాలు ప్రారంభమవుతాయని వివరించారు. కోవిడ్ అనంతరం వర్క్ ఫ్రం హోమ్ విధానంపై ఆసక్తి పెరిగిందని, రాష్ట్ర ప్రభుత్వం కూడా 'వర్క్ ఫ్రం హోమ్‌టౌన్' విధానాన్ని అమలు చేస్తోందని చెప్పారు. ఇందుకోసం గ్రామీణ ప్రాంతాల్లో 10 వేలకు పైగా డిజిటల్ లైబ్రరీలను అభివృద్ధి చేస్తోందన్నారు. ఒక్కో దానిలో 30 మంది పనిచేసుకోవచ్చన్నారు. ఇప్పటికే కడప జిల్లా పులివెందులలోని ఓ గ్రామంలో డిజిటల్ లైబ్రరీని సీఎం ప్రారంభించారని చెప్పారు. ఐటీ కోర్సుల్లో రాష్ట్ర యువత నైపుణ్యాన్ని మెరుగుపర్చేందుకు స్కిల్ హబ్‌లు, స్కిల్ కాలేజీలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఏపీ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డ్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ప్రమోషన్స్ హెడ్ రాజీవ్, ఏపీ ఐటీ అకాడమీ సీఈవో కిరణ్‌కుమార్‌రెడ్డి, రాండ్‌స్టాడ్ ఎండీ విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల పింఛన్లకు రూ.1,585.60 కోట్లు

- సచివాలయాల వారీగా బ్యాంకు ఖాతాల్లో డబ్బు జమచేసిన ప్రభుత్వం
- నేటి నుంచి 62.33 లక్షల మందికి పంపిణీ చేయనున్న వలంటీర్లు



సాక్షి, అమరావతి/దేవరాపల్లి (అనకాపల్లి జిల్లా): రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం నుంచి అవ్వాతాతలు, వితంతు, దివ్యాంగులతోపాటు దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు సామాజిక పింఛన్ల పంపిణీకి ప్రభుత్వం రూ.1,585.60 కోట్లను విడుదల చేసింది. గ్రామ, వార్డు సచివాలయాల వారీగా ఆ ప్రాంతంలోని లబ్ధిదారుల సంఖ్య ఆధారంగా డబ్బును ప్రభుత్వం ఆయా సచివాలయాల బ్యాంకు ఖాతాల్లో సోమవారమే జమచేసింది. మొత్తం 62,33,382 మంది లబ్ధిదారులకు మంగళవారం తెల్లవారుజాము నుంచే వలంటీర్లు పింఛన్లు పంపిణీ చేయనున్నారు. 2.66 లక్షల మంది వలంటీర్లు లబ్ధిదారులకు వారి ఇళ్లవద్దే పింఛను డబ్బులు పంపిణీ చేస్తారని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలం తారువలోని తన క్యాంప్ కార్యాలయం నుంచి సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. లబ్ధిదారుల గుర్తింపునకు బయోమెట్రిక్, ఐరిస్ విధానాలను అమలు చేస్తున్నామని, ఆర్‌బీఐఎస్ విధానాన్ని కూడా అందుబాటులోకి తీసుకొచ్చామని పేర్కొన్నారు. ఒకటో తేదీ నుంచి ఐదోతేదీ మధ్య వందశాతం పింఛన్ల పంపిణీ పూర్తిచేసేలా అన్ని జిల్లాల డీఆర్‌డీఏ కార్యాలయాల్లో ప్రత్యేక కాల్ సెంటర్లను కూడా ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

ఇదంజగత్



...సైగలతో ఓటు అడుక్కుంటున్నాడు!

క్లుప్తంగా

మూడు రాజధానులతో అన్ని ప్రాంతాల అభివృద్ధి


విజయవాడలో మాలమహానాడు బైక్ ర్యాలీ

- మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు యోనారాజు
- విజయవాడలో బైక్ ర్యాలీ.. ఒక రోజు దీక్ష

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందాలన్న మహోన్నత ఆశయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తలపెట్టిన మూడు రాజధానులకు సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నామని జాతీయ మాల మహానాడు అధ్యక్షుడు నత్తా యోనారాజు పునరుద్ఘాటించారు. మూడు రాజధానులకు మద్దతుగా విజయవాడలో సోమవారం మోటార్ సైకిళ్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం గాంధీనగర్‌లోని ధర్నా చౌక్‌లో నిర్వహించిన ఒక రోజు దీక్ష విజయవంతంగా ముగిసింది. యోనారాజు మాట్లాడుతూ అమరావతి రాజధాని పేరుతో టీడీపీ చేస్తున్న డ్రామాలకు వ్యతిరేకంగా, మూడు రాజధానులకు మద్దతుగా మాలమహానాడు ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఒక రోజు దీక్షలు తలపెట్టామని, ఏలూరు జిల్లాలో పూర్తిచేసినట్లు తెలిపారు. ఎమ్మెల్యే మల్లాది విష్ణు, ఏపీ ఫైబర్ నెట్ చైర్మన్ పి.గౌతంరెడ్డి, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు బొప్పన భవకుమార్, ఏపీ బీసీ సంఘం అధ్యక్షుడు మారేష్, నవ్యాంధ్ర ఎంఆర్‌పీఎస్ అధ్యక్షుడు శ్రీనివాసరావు మద్దతు తెలిపారు.

సమగ్ర క్యాన్సర్ కేర్‌కు రోడ్ మ్యాప్

- తొలి దశలో రూ.119.58 కోట్లతో ఏడు బోధనాస్పత్రుల్లో సదుపాయాలు
- పరిపాలనా అనుమతులిచ్చిన రాష్ట్ర ప్రభుత్వం
- అనంతపురం, కాకినాడ, చినకాకాని, గుంటూరులో రూ.61.93 కోట్లతో లినాక్, ఇతర పరికరాల ఏర్పాటు
- రూ.12.15 కోట్లతో శ్రీకాకుళం, నెల్లూరు, ఒంగోలులోనూ ఏర్పాట్లు
- ఏడుచోట్ల రూ.21 కోట్లతో ఆపరేషన్ థియేటర్ల అభివృద్ధి

సాక్షి, అమరావతి: ప్రభుత్వ రంగంలో క్యాన్సర్ రోగులకు మెరుగైన వైద్యాన్ని అందుబాటులోకి తేవడంతో పాటు.. వ్యాధి నియంత్రణ, నివారణకు కీలక ముందడుగు పడింది. రాష్ట్రంలో కాంప్రెహెన్సివ్ క్యాన్సర్ కేర్‌ను అమలుచేయడానికి రోడ్‌మ్యాప్ ఖరారైంది. ఇందులో భాగంగా తొలిదశ కింద 2022–24లో ఏడు ప్రభుత్వ బోధనాస్పత్రుల్లో రూ.119.58 కోట్లతో మౌలిక వసరుల అభివృద్ధికి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. రెండో దశలో మిగిలిన ఆస్పత్రుల్లో క్యాన్సర్ వైద్య సదుపాయాలను ఏర్పాటుచేస్తారు.

రాష్ట్ర విభజన నేపథ్యంలో క్యాన్సర్ చికిత్స మౌలిక సదుపాయాలను ఏపీ కోల్పోయింది. దీనికితోడు గత టీడీపీ సర్కార్ హయాంలో ప్రభుత్వాస్పత్రులను పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. దీంతో క్యాన్సర్ చికిత్సకు ప్రైవేట్ ఆస్పత్రులపైనే ఆధారపడాల్సి వస్తోంది. ఈ క్రమంలో ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్న సీఎం వైఎస్ జగన్.. ప్రభుత్వ రంగంలో క్యాన్సర్ చికిత్స సదుపాయాలు, బలోపేతం, వ్యాధి నియంత్రణ చర్యలపై దృష్టిసారించారు. అంతేకాక.. వ్యాధిని సమర్థవంతంగా నియంత్రించడానికి క్యాన్సర్‌ను నోటిఫైడ్ జబ్బుల జాబితాలోకి చేర్చారు. ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ నోరి దత్తాత్రేయుడును కాంప్రెహెన్సివ్ క్యాన్సర్ కేర్ సలహాదారుగా నియమించారు. ఈయనతో పాటు మరికొందరు మేధావుల నుంచి సలహాలు, సూచనలు సేకరించారు. ఈ క్రమంలో ప్రజలకు



ప్రాథమిక క్యాన్సర్ చికిత్స అందుబాటులోకి తేవడంతో పాటు, క్యాన్సర్ రోగులు చికిత్స కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్లే పనిలేకుండా అడ్వాన్స్‌డ్ చికిత్సను అందుబాటులోకి తేవడంపై చర్యలకు ఉపక్రమించారు.

రూ.74.08 కోట్లతో పరికరాల ఏర్పాటు

విజయవాడ సిద్ధార్థ వైద్య కళాశాల పరిధిలోని చినకాకాని క్యాన్సర్ ఆస్పత్రి, అనంతపురం, కాకినాడ జీజీహెచ్‌లకు లినాక్, సీటీ సిమ్యులేటర్, బ్రాకీథెరపీ, మామోగ్రామ్ పరికరాలు, గుంటూరు జీజీహెచ్‌కు మామోగ్రామ్, ఇతర పరికరాలు సమకూర్చడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందుకు రూ.61.93 కోట్లు ఖర్చుచేయనుంది. అదే విధంగా రూ.12.15 కోట్లతో శ్రీకాకుళం, నెల్లూరు, ఒంగోలు జీజీహెచ్‌లలోనూ లినాక్, ఇతర పరికరాలు సమకూర్చడానికి ఏర్పాట్లుచేయనున్నారు. ఈ క్రమంలో ఆయా ఆస్పత్రుల్లో లినాక్, సీటీ సిమ్యులేటర్ పరికరాల ఏర్పాటుకు బంకర్ల నిర్మాణం, ఇతర పనులు రెండేళ్లలో పూర్తిచేయాల్సి ఉంటుంది.

ఆధునిక టెక్నాలజీతో రేడియేషన్

క్యాన్సర్ బాధితులకు రేడియేషన్ థెరపీ అందించడానికి ప్రస్తుతం నడుస్తున్న ఆధునిక టెక్నాలజీలో లినాక్ కీలకమైనది. క్యాన్సర్ చికిత్సకు పేరొందిన టాటా మెమోరియల్, సహా ఇతర కార్పొరేట్ ఆస్పత్రుల్లో లినాక్‌ను వినియోగిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 11 ప్రభుత్వ బోధనాసుపత్రులు ఉన్నాయి. వీటిలో కేవలం గుంటూరు జీజీహెచ్‌లో మాత్రమే క్యాన్సర్ చికిత్సకు వినియోగించే అధునాతన లినాక్ అందుబాటులో ఉంది. గుంటూరు మినహా మిగిలిన చోట్ల క్యాన్సర్‌కు కోబాల్ట్ థెరపీ యూనిట్లు అందుబాటులో ఉన్నాయి. ఇందులో క్యాన్సర్ కణితి ఉన్న ప్రాంతంతోపాటు శరీరంలోని ఇతర భాగాలు రేడియేషన్‌కు ప్రభావితం అవుతాయి. అదే లినాక్ ద్వారా రేడియేషన్‌లో కణితిపై ఎక్కువ డోసుతో రేడియేషన్ ఇవ్వడానికి ఆస్కారం ఉంటుంది.

మిగిలిన రూ.45.5 కోట్లతో ఇలా..

ఇక ఏడు బోధనాస్పత్రుల్లో ఆపరేషన్ థియేటర్‌ల అభివృద్ధి, సర్జికల్ పరికరాలు సమకూర్చడానికి రూ.21కోట్లు కేటాయించారు. అదే విధంగా పాథాలజీ యూనిట్‌ల అభివృద్ధికి రూ.10.50 కోట్లు.. మందులు, కీమోథెరపీకి అవసరమయ్యే సదుపాయాల కల్పనకు రూ.14 కోట్లు ఖర్చుచేస్తారు. అదే విధంగా వైద్యులు, నర్సులు, వైద్య సిబ్బందికి పాలియేటివ్ కేర్, ప్రివెంటివ్ అంకాలజీలో ప్రత్యేక శిక్షణనిస్తారు.

ప్రజారోగ్యం పట్ల చిత్తశుద్ధికి నిదర్శనం

తొలి నుంచి మా ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తోంది. ఇప్పటికే రూ.16వేల కోట్లకు పైగా నిధులతో నాడు–నేడు కింద 17 కొత్త వైద్య కళాశాలల నిర్మాణం, ప్రభుత్వాస్పత్రుల బలోపేతం చేస్తున్నాం. తాజాగా మరో రూ.119.58 కోట్ల కాంప్రెహెన్సివ్ కేర్ అమలుకు శ్రీకారం చుట్టాం.

– విడదల రజిని, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి

అత్యాధునిక పరికరాలు సమకూరుస్తున్నాం

రూ.119.58 కోట్లతో తొలిదశ కాంప్రెహెన్సివ్ కేర్ అభివృద్ధికి అనుమతులిచ్చాం. ఇదికాకుండా కర్నూలు జీజీహెచ్, విశాఖ కేజీహెచ్‌లకు రూ.71 కోట్లతో అత్యాధునిక పరికరాలు సమకూర్చడానికి చర్యలు తీసుకున్నాం. ఈ రెండు ఆస్పత్రులకు లినాక్, బ్రాకీథెరపీ, పెట్‌సీటీ, సీటీ సిమ్యులేటర్ పరికరాలు సమకూర్చనున్నాం. పరికరాల కొనుగోలు ప్రక్రియ కొనసాగుతోంది.

– ఎంటీ కృష్ణబాబు, ముఖ్యకార్యదర్శి రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ

అబుదాబి అడిపెక్ ఎగ్జిబిషన్‌లో ఏపీఎండీసీ స్టాల్


ఏపీఎండీసీ స్టాల్ వద్ద విదేశీ ప్రతినిధులు

సాక్షి, అమరావతి: అంతర్జాతీయంగా గ్యాస్, ఆయిల్, ఎనర్జీ రంగాల్లో ప్రముఖ కంపెనీల భాగస్వామ్యంతో అబుదాబిలో జరుగుతున్న ప్రతిష్టాత్మక అడిపెక్ ఎగ్జిబిషన్‌లో ఏపీఎండీసీ పాల్గొంది. సోమవారం నుంచి గురువారం వరకు జరిగే ఈ ఎగ్జిబిషన్‌లో అంతర్జాతీయంగా 28 దేశాల నుంచి 2,200 ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నాయి. ఎగ్జిబిషన్‌లో ఏపీఎండీసీ ఏర్పాటు చేసిన స్టాల్‌ను భారత పెట్రోలియం, సహజ వాయువుల శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పూరి ప్రారంభించారు. తొలి రోజు ఏపీఎండీసీ స్టాల్‌ను అనేక కంపెనీల ప్రతినిధులు సందర్శించారు. వారిలో సౌదీ ఆరామ్ కో, సీఎస్ఎల్ ఎనర్జీ మేనేజ్‌మెంట్ సంస్థల ప్రతినిధులతో ఏపీఎండీసీ వీసీ అండ్ ఎండీ వీజీ వెంకటరెడ్డి భేటీ అయ్యారు. జీఎంలు నతానేయల్, నాగేశ్వరరెడ్డి, డీజీఎం విగ్నేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

విశాఖ రాజధాని కోసం

విద్యార్థుల గర్జన

- ఇక ఉద్యమం ఉధృతం
- ఉత్తరాంధ్ర జేఏసీ కన్వీనర్ లజపతిరాయ్
- చోడవరంలో వేలాదిమంది విద్యార్థులతో భారీ ర్యాలీ


చోడవరంలో భారీ ర్యాలీ

చోడవరం: వెనుకబడిన ఉత్తరాంధ్ర ప్రాంతానికి విశాఖ రాజధాని ఎంత అవసరమో విద్యార్థి భేరి ఎలుగెత్తి చాటిందని, మూడు రాజధానులు ఏర్పాటుచేసే వరకూ ఉద్యమం ఆగదని ఉత్తరాంధ్ర జేఏసీ కన్వీనర్ ప్రొఫెసర్ ఎం.లజపతిరాయ్ స్పష్టం చేశారు. వలస బతుకుల కష్టాల నుంచి విముక్తి కలగాలన్నా, విద్యార్థులకు మంచి భవిష్యత్తు లభించాలన్నా వికేంద్రీకరణ ఒక్కటే మార్గమన్నారు. అనకాపల్లి జిల్లా చోడవరంలో సోమవారం జరిగిన 'విద్యార్థి భేరి' రాజధాని నినాదాలతో హోరెత్తింది. వేలాదిమంది విద్యార్థులు తరలిరావడంతో పట్టణంలో ప్రధాన వీధులు కిటకిటలాడాయి. స్థానిక శివాలయం జంక్షన్ నుంచి ప్రభుత్వ జూనియర్ కాలేజీ వరకు సుమారు కిలోమీటరున్నర మేర భారీ ర్యాలీ జరిగింది. ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎంపీ సత్యవతి, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు పాల్గొన్నారు. విద్యార్థి సంఘాల నాయకులు, న్యాయవాదులు, డాక్టర్లు ర్యాలీని ముందుండి నడిపించారు. ర్యాలీ అనంతరం కాలేజీ గ్రౌండ్ వద్ద జరిగిన సభకు చోడవరం జేఏసీ కన్వీనర్ కాండ్రేగుల దేవిడ్ అధ్యక్షత వహించారు. ఈ సభలో ప్రొఫెసర్ లజపతిరాయ్ మాట్లాడుతూ ఈ ఉద్యమం ఇక్కడితో ఆగదని, మరింత ఉధృతం చేస్తామన్నారు. మూడు రాజధానుల కోసం ఇప్పటికే చిత్తూరు, కర్నూలు, ఉభయ గోదావరి జిల్లాల్లో ఉద్యమాలు ఉధృతమయ్యాయన్నారు.

అడ్డుకునే వారి ఆటలు సాగవు

కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ ఉత్తరాంధ్ర అభివృద్ధిని కొన్ని శక్తులు అడ్డుకోవడానికి ప్రయత్నిస్తున్నాయని, వాటి ఆటలు సాగవని హెచ్చరించారు. విద్యార్థులు మూడు రాజధానులకు తమ మద్దతు ప్రకటించడం అభినందనీయమన్నారు. ఎంపీ బీవీ సత్యవతి మాట్లాడుతూ ఊరే లేనిచోట పూర్తిస్థాయి రాజధాని నిర్మించడం ఎంత కష్టమో అందరికీ తెలుసునని, మూడుచోట్ల రాజధానులు ఏర్పాటు చేస్తే మూడు ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయన్నారు. ఉత్తరాంధ్ర ఓట్లు కావాలి గానీ ఈ ప్రాంత అభివృద్ధి మాత్రం కొన్ని పార్టీలకు అవసరంలేదని మాజీ మంత్రి దాడి వీరభద్రరావు ధ్వజమెత్తారు. ఈ ప్రభుత్వంలో సాధించుకోలేకపోతే విశాఖ రాజధాని ఎప్పటికీ కాదన్నారు. విశాఖ–కాకినాడ పెట్రో కెమికల్ అండ్ పెట్రోలియం కారిడార్ చైర్‌పర్సన్ చొక్కాకుల లక్ష్మి, వైఎస్సార్‌సీపీ నేత చొక్కాకుల వెంకట్రావు, ఉత్తరాంధ్ర జేఏసీ వైస్ కన్వీనర్ దేముడు మాస్టారు తదితరులు పాల్గొన్నారు.

ఎన్ని పోరాటాలకైనా సిద్ధం

పాలన వికేంద్రీకరణతోనే అన్ని ప్రాంతాల అభివృద్ధి సాధ్యం

- అమరావతి ముసుగులో చంద్రబాబు రియల్ ఎస్టేట్ వ్యాపారం
- ఉత్తరాంధ్ర అభివృద్ధికి చంద్రబాబు, రామోజీలే అడ్డంకి
- శ్రీకాకుళంలో జరిగిన మన విశాఖ–మన రాజధాని సదస్సులో వక్తలు


సదస్సులో నినాదాలు చేస్తున్న వక్తలు

శ్రీకాకుళం న్యూకాలనీ: విశాఖ పరిపాలనా రాజధాని అయ్యేంతవరకు ఎందాకైనా వెళ్తామని, ఎన్ని పోరాటాలకైనా సిద్ధమని పలువురు వక్తలు ప్రకటించారు. పరిపాలన వికేంద్రీకరణతోనే అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని వారు స్పష్టం చేశారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి చంద్రబాబు, ఈనాడు అధినేత రామోజీరావే ప్రధాన అడ్డంకిగా మారారన్నారు. వికేంద్రీకరణకు మద్దతుగా శ్రీకాకుళంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సిల్వర్ జూబ్లీ ఆడిటోరియం వేదికగా వివిధ స్వచ్ఛంద సంస్థలు 'మన విశాఖ–మన రాజధాని' పేరిట సదస్సు నిర్వహించారు. సదస్సుకు హాజరైన బీఆర్ఏయూ విశ్రాంత రిజిస్ట్రార్, విశాఖ రాజధాని సాధన ఐక్యవేదిక అధ్యక్షులు ప్రొ. గుంట తులసీరావు మాట్లాడుతూ.. కొన్ని దశాబ్దాలుగా ఉత్తరాంధ్ర వెనుకబడి ఉందని.. విశాఖను పాలనా రాజధానిగా చేయాలన్న సీఎం నిర్ణయం చాలా గొప్పదని కొనియాడారు. ఈ అవకాశాన్ని జారవిడుచుకుంటే మరో చారిత్రక తప్పిదం అవుతుందని.. విశాఖ రాజధాని వద్దన్న వారు చరిత్రహీనులుగా మిగిలిపోతారని హెచ్చరించారు. విశాఖ రాజధాని సాధన ఐక్యవేదిక కన్వీనర్ డాక్టర్ దానేటి శ్రీధర్ మాట్లాడుతూ.. ఉత్తరాంధ్ర వెనుకబాటుతనానికి స్వస్తి పలుకుతూ విశాఖ రాజధానే లక్ష్యంగా సీఎం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తూ ఉద్యమాన్ని పల్లెస్థాయికి తీసుకెళ్తామన్నారు. రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ పి. జగన్మోహనరావు మాట్లాడుతూ.. రాయలసీమను వదిలి వెనుకబడిన ఉత్తరాంధ్రకు రాజధానిని ప్రకటించిన గొప్ప మానవతావాదిగా సీఎం జగన్ చరిత్రలో నిలిచిపోతారని చెప్పారు. అలాంటి ముఖ్యమంత్రి ఉండడం మనందరి అదృష్టమని.. భావితరాలకు విశాఖ రాజధాని అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఉత్తరాంధ్ర వెనుకబాటుతనాన్ని దూరం చేసేందుకు, భావితరాల భవిష్యత్ కోసం విశాఖపట్నం పరిపాలనా రాజధానిగా ఉండాలని సంకల్పించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిరస్మరణీయుడిగా నిలిచిపోతారని సదస్సుకు సంఘీభావం తెలిపిన రెవిన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. సీఎం జగన్ రాయలసీమకు చెందిన వారైనా, ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం తీసుకున్న నిర్ణయాన్ని ఉత్తరాంధ్రులంతా సమర్థించి పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు. అమరావతి పాదయాత్ర ముసుగులో చంద్రబాబు రియల్ ఎస్టేట్ వ్యాపారం దాగి ఉందని, ఆయన రియల్ ఎస్టేట్ వ్యాపారంలో ఆరితేరిన ఘనుడని అన్నారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సురేఖ, లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షులు హారికాప్రసాద్, విద్యావేత్తలు దుప్పల వెంకట్రావు, సురంగి మోహన్‌రావు, శ్రీకాకుళం మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎంవీ పద్మావతి, విశ్రాంత డీఈఓ బలివాడ మల్లేశ్వరరావు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్యావేత్తలు పాల్గొన్నారు.

'నైపుణ్యం'లో ముందడుగు

విశాఖ, అనకాపల్లిలో స్కిల్ కాలేజీలు ప్రారంభం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని యువతను వివిధ రంగాల్లో నిపుణులుగా తీర్చిదిద్దేందుకు పార్లమెంటు నియోజకవర్గానికో స్కిల్ కాలేజీ ఏర్పాటు చేయాలన్న లక్ష్యాన్ని సాధించే దిశగా ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. ఇందులో భాగంగా ప్రభుత్వం ప్రతి పార్లమెంటు నియోజకవర్గ స్థాయిలో స్కిల్ కాలేజీ ఏర్పాటు చేస్తోంది. ఇందులో భాగంగా విశాఖ, అనకాపల్లి పార్లమెంటు నియోజకవర్గాల్లో సోమవారం నుంచి రెండు స్కిల్ కాలేజీల్లో శిక్షణ ప్రారంభమైంది. విశాఖపట్నంలోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ ఇన్ మారిటైమ్ అండ్ షిప్ బిల్డింగ్‌లో మారిటైమ్ రంగానికి చెందిన స్కిల్ కాలేజీ, అనకాపల్లి పరిధిలోని అచ్యుతాపురం సెజ్‌లోని ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కాలేజీలో తరగతులను ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్. సత్యనారాయణ వర్చువల్‌గా ప్రారంభించారు. బ్యాచ్‌కి 30 మంది విద్యార్థులు ఉండేలా మూడు కోర్సులను రూపొందించినట్లు ఆయన తెలిపారు. తొలి బ్యాచ్ సోమవారం నుంచి మొదలు కాగా మరో వారం రోజుల్లో రెండు బ్యాచ్‌లు ప్రారంభమవుతాయన్నారు. విశాఖ కాలేజీలో మెకాట్రానిక్స్ డిజైన్ అండ్ సిస్టమ్ ఇంటిగ్రేటర్, ప్రొడక్ట్ డిజైన్ ఇంజనీర్ మెకానికల్, ఆటోమేషన్ అండ్ రోబోటిక్ ఇంజనీర్ కోర్సుల్లో ఇంజనీరింగ్ విద్యార్థులకు శిక్షణ ఇస్తారు. ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్‌లో ప్రొడక్ట్ డిజైనింగ్, సీఎన్‌సీ టెక్నాలజీ, మెకాట్రానిక్స్‌లో మాస్టర్ సర్టిఫికెట్ కోర్సులు నిర్వహిస్తారు. నవంబర్ 10న మరో రెండు స్కిల్ కాలేజీల్లో తరగతులను పారంభించనున్నట్లు సత్యనారాయణ తెలిపారు.



"ఏదో విధంగా ఉన్న పరిస్థితులకు ఎదురీదనివాడు, ఎక్కడో సంఘంతోనో ప్రజలతోనో విరోధం కల్పించుకోనివాడు గొప్ప కళను సృష్టించలేడు.
– చలం

సాక్షి

మంగళవారం, నవంబర్, 1

శాపమా? పాలకుల పాపమా?

దారుణం... దిగ్భ్రాంతికరం. ఆదివారం సాయంత్రం గుజరాత్‌లోని మోర్బీ వద్ద కుప్పకూలిన తీగల వంతెన దుర్ఘటనను అభివర్ణించడానికి బహుశా ఇలాంటి మాటలేవీ సరిపోవేమో! నదిపై కట్టిన తీగల వంతెన సెకన్ల వ్యవధిలో కూలిపోతుంటే, ఒకరి మీద మరొకరుగా వందల సంఖ్యలో జనం నదీజలాల్లో పడిపోయిన తీరును వీడియోల్లో చూస్తుంటే గొంతు పెగలడం కష్టం. తెగిపోయిన తీగల మొదలు అందిన అవశేషం ఏదైనా సరే పట్టుకొని, ప్రాణాలు దక్కించుకొనేందుకు పైకి ఎగబాకాలని బాధితులు శతవిధాల ప్రయత్నిస్తూనే ప్రాణాలు కోల్పోయిన తీరు ఎంతటివారినైనా కన్నీరు పెట్టిస్తుంది. రెండేళ్ళ చిన్నారి సహా 47 మంది పిల్లలు... కడపటి వార్తలందేసరికి మొత్తం 140 మందికి పైగా అమాయకులు... అన్యాయంగా వారి ప్రాణాలు తీసిన ఈ ఘటన పరిహారమిచ్చి తప్పించుకోలేని పాపం. ఆరంభించిన అయిదు రోజులకే రోప్ బ్రిడ్జి కూలిపోవడం మరమ్మత్తుల పనిలో నాణ్యతా లోపంతో పాటు, ప్రభుత్వ యంత్రాంగ నిర్లక్ష్యానికి పరాకాష్ఠ!

గుజరాత్‌లోని మచ్చు నదిపై దాదాపు 150 ఏళ్ళ క్రితం బ్రిటీషు కాలంలో కట్టిన ఈ తీగల వంతెన పేరున్న పర్యాటక ప్రాంతం. ఇప్పుడిది మరుభూమికి మారుపేరు. కొన్ని కుటుంబాలకు కుటుంబాలు నదిలో పడి ప్రాణాలు కోల్పోయాయి. ఓ పార్లమెంట్ సభ్యుడి సోదరి సహా సమీప బంధువులు 12 మంది ఒకేసారి ఈ దుర్ఘటనలో చనిపోయారు. రాష్ట్రంలో, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వాలు తక్షణ నష్టపరిహారాలు ప్రకటించి, సహాయక చర్యలు దిగాయి. ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) సారథ్యంలో దర్యాప్తునకు ఆదేశించి, పోలీసులతో ఎఫ్ఐఆర్ నమోదు చేయించి, ప్రస్తుతానికి ఈ బ్రిడ్జి మరమ్మత్తులు చేసిన కంపెనీ ఉద్యోగులతో పాటు టికెట్లు అమ్మిన ఇద్దరు క్లర్కుల్నీ, ఒక బ్రిడ్జి కాంట్రాక్టర్‌నీ, భద్రతా సిబ్బందినీ అంతా కలిపి 9 మందిని అరెస్టు చేశారు. ఇప్పటికీ మరో 100 మందికి పైగా జాడ తెలియని పరిస్థితుల్లో ఇవేవీ బాధితుల కన్నీళ్ళను తుడిచేయలేవు. ప్రకృతి కాక, మానవ తప్పిదాలే ఈ ఘోరకలికి కారణం కావడం విచారకరం. అనేక అంశాల్లో పాతుకుపోయిన ప్రభుత్వ యంత్రాంగ నేరపూరిత నిర్లక్ష్యానికి నిలువుటద్దం.

అజంతా బ్రాండ్ పేరుతో గోడ గడియారాలు, కాలిక్యులేటర్లకు ప్రసిద్ధమై, సీఎఫ్ఎల్ దీపాలు, ఇ–బైక్స్ రూపొందిస్తున్న ప్రైవేటు సంస్థ ఒరేవా. ఏటా రూ. 800 కోట్లకు పైగా టర్నోవర్ ఉన్న ఈ గడియారాల కంపెనీకి వంతెన మరమ్మత్తుతో సంబంధం ఏమిటో, దానికి ఈ పని ఎందుకు అప్పగించారో అర్థం కాదు. 51 ఏళ్ళుగా వ్యాపారంలో ఉన్న ఈ సంస్థ బ్రిడ్జి నిర్వహణను 15 ఏళ్ళకు లీజు తీసుకొని, మరమ్మత్తుల పని మూడోవ్యక్తికి కట్టబెట్టింది. బ్రిడ్జి పనులకు అధికారికంగా 8 నుంచి 12 నెలల టైమ్ ఇచ్చినా, హడావిడిగా 5 నెలల్లో పూర్తి చేశారు. ఏడాదికి పైగా పట్టే మరమ్మత్తులను హడావిడిగా అయిందనిపించి, గుజరాతీ సంవత్సరాదికి అక్టోబర్ 26న ప్రారంభించాల్సిన తొందర ఏమిటి? స్థానిక మునిసిపాలిటీ నుంచి అనుమతి లేకుండానే, బ్రిడ్జి దృఢత్వంపై పరీక్షలు చేయకుండానే ఒరేవా సంస్థ రోప్‌బ్రిడ్జిపై పర్యాటకం ఎలా ప్రారంభించింది? ఏకకాలంలో 125 మందిని మించి మోయలేని వంతెనపై అదే పనిగా టికెట్లమ్ముతూ 500 పైచిలుకు మందిని ఎలా అనుమతించారు? తీగల వంతెన పైకి చేరిన కొందరు ప్రమాదకరంగా ఆ తీగలను పట్టుకొని ఊగుతుంటే వారిని ఆపేందుకు సిబ్బంది ఎందుకు ప్రయత్నించలేదు? ఇలా ఎన్నో ప్రశ్నలకు జవాబు లేదు.

మరో నెలలో గుజరాత్‌లో ఎన్నికలున్న వేళ ఈ ప్రమాదం రాజకీయ ఆరోపణల పర్వానికి దారి తీసింది. 2016లో కోల్‌కతాలో ఫ్లై–ఓవర్ కూలి, పలువురు మరణించినప్పుడు అక్కడి మమతా బెనర్జీ ప్రభుత్వాన్ని ప్రధాని మోదీ తప్పుపడుతూ 'ఇది దేవుడి శాపమా, లేక అవినీతి పాపమా' అంటూ చేసిన మాటల దాడిని ప్రతిపక్షాలు వ్యంగ్యంగా గుర్తు చేస్తున్నాయి. శవ రాజకీయాలు ఎవరు చేసినా సమర్థనీయం కాదు కానీ, ఎఫ్ఐఆర్‌లోని నిందితుల పేర్లలో సంస్థ పేరు కానీ, దాని అధిపతి పేరు కానీ, వ్యక్తుల పేర్లు కానీ లేకపోవడం కచ్చితంగా ప్రశ్నార్థమే. చిన్న చేపల్ని పట్టుకొని వ్యాపార తిమింగలాల్ని వదిలేస్తున్నారనే ఆరోపణలకు బలం చేకూరుస్తోంది. కార్పొరేట్లకూ, రాజకీయాలకూ మధ్య పెరుగుతున్న బంధాన్ని సూచిస్తోంది. దాదాపు పాతికేళ్ళుగా గుజరాత్‌ను పాలిస్తున్న బీజేపీకి ఇది కొంత ఇబ్బందికరమైన విషయమే. మోదీ, షాలిద్దరూ గుజరాత్ వారే కావడం మరో ఇబ్బంది. యూపీలోని చందౌలీ దగ్గరా ఛఠ్ పూజ సందర్భంగా ఆదివారం ఓ వంతెన పాక్షికంగా కూలినట్టు ఆలస్యంగా వార్తలందుతున్నాయి. ఎలాంటి ప్రాణహానీ జరగనప్పటికీ, ఇలాంటి ఘటనలన్నీ మన ప్రాథమిక వసతి సౌకర్యాలలోని లోటుపాట్లను ఎత్తిచూపుతున్నాయి.

ఎన్నికల వేళ 3 రోజుల గుజరాత్ పర్యటనలో ఉన్న ప్రధాని మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఘటనాస్థలిలో పర్యటించనున్నారు. కానీ అంతకన్నా ముఖ్యం ఇలాంటివి భవిష్యత్తులో జరగకుండా చూసుకోవడం! ప్రతిపక్షాలు కోరుతున్నట్టు రాష్ట్ర సర్కార్ హయాంలోని అధికారులతో కాక, రిటైర్డ్ జడ్జీల్లాంటి వారితో స్వతంత్ర దర్యాప్తు జరిపి, అసలైన బాధ్యుల్ని కనిపెట్టడం కఠినంగా శిక్షించడం! అలవి మాలిన నిర్లక్ష్యం అన్నింటా ప్రమాదకరమే. ప్రజా సౌకర్యాలపై ప్రభుత్వ నిర్లక్ష్యం కొన్నిసార్లు అది ప్రజల ప్రాణాలకే ముప్పు. ఏమైనా, మోర్బీ ఘటన అక్షరాలా పాలకుల, ప్రభుత్వ యంత్రాంగం వైఫల్యమే. కొందరి బాధ్యతారాహిత్యానికీ, అవినీతికీ ప్రజలు బలి కావాలా? ఆత్మవిమర్శ చేసుకోవాలి. పర్యాటకంతో ఆర్థిక ఆర్జన కన్నా అమాయకుల ప్రాణాలు ముఖ్యమని అర్థం చేసుకోవాలి.

ఏక నాయకత్వం చైనాకు మేలేనా?

విశ్లేషణ



మనోజ్ జోషి

మావోయిస్టు అతివాదపు విధ్వంసక దశాబ్దాల అనంతరం సామూహిక నాయకత్వ శైలిని చేపట్టేలా చైనా కమ్యూనిస్టు పార్టీని ముందుకు నడిపారు డెంగ్ జియావోపింగ్. తదనుగుణంగా అధ్యక్ష పదవిని ఎవరైనా రెండు సార్లే చేపట్టేలా, పదవీ విరమణ వయసు 68 ఏళ్లకే పరిమితమయ్యేలా నిర్ణయమైంది. ఏక నాయకుడి అధికారానికి చెక్ పెట్టే ప్రయత్నమది. కానీ జిన్‌పింగ్ ఈ నిబంధనలన్నీ పక్కన పెట్టేశారు. పార్టీ 20వ కాంగ్రెస్ ముగింపు రోజున పొలిట్ బ్యూరో స్టాండింగ్ కమిటీ సభ్యులను వేదికపై పెరేడ్ చేయించినప్పుడు జిన్‌పింగ్ అధికార కేంద్రీకరణ స్వరూపం తేటతెల్లమైంది. తన అధికారం మీద ఏ తనిఖీ లేని అధినేత పాలన తెచ్చే పర్యవసానాలను చైనా మరోసారి ఎదుర్కోవలసి ఉంటుంది.

ఇటీవల ముగిసిన చైనా కమ్యూనిస్టు పార్టీ (సీపీసీ) 20వ కాంగ్రెస్ సాధించిన అతి ముఖ్యమైన ఫలితం ఏమిటంటే, పార్టీ జనరల్ సెక్రటరీగా షీ జిన్‌పింగ్ మూడోసారి ఎన్నికై రికార్డు సృష్టించడమే. మరోరకంగా చెప్పాలంటే, చైనా ప్రజా రిపబ్లిక్ అధ్యక్షుడిగా జిన్‌పింగ్ పొడిగింపునకు ఇది నాంది. అలాగే, శక్తిమంతమైన సెంట్రల్ మిలిటరీ కమిషన్ చైర్మన్‌గా మరో పర్యాయం తన పొడిగింపునకు, బహుశా జీవితకాల పొడిగింపునకు కూడా ఇది నాంది.

మావోయిస్టు అతివాదానికి సంబంధించిన విధ్వంసక దశాబ్దాల అనంతరం చైనాకు నాయకత్వం వహించిన డెంగ్ జియావోపింగ్, సామూహిక నాయకత్వ శైలిని చేపట్టేలా చైనా కమ్యూనిస్టు పార్టీని ముందుకు నడిపించారు. తదనుగుణంగా అధ్యక్ష పదవిని ఎవరైనా రెండు సార్లు మాత్రమే చేపట్టాలనీ, విరమణ వయసును 68 సంవత్సరాలకు పరిమితం చేయాలనీ పార్టీ నిర్ణయించింది. కానీ 2017లో జరిగిన 19వ పార్టీ కాంగ్రెస్‌లో అధ్యక్ష పదవికి పరిమితులు ఎత్తివేసి, అత్యంత శక్తిమంతుడిగా ఆవిర్భవించేలా జిన్‌పింగ్ ఈ నిబంధనలు అన్నింటినీ పక్కనపెట్టేశారు.

కమ్యూనిస్టు పార్టీ రాజ్యాంగంలో రెండు కీలకమైన రాజకీయ భావనలను ప్రవేశపెట్టడంతో జిన్‌పింగ్ శక్తి నిరూపితమైంది. పార్టీలో 'రెండు వ్యవస్థాపనలు' అనే ఈ భావనలు జిన్‌పింగ్‌ని 'కోర్' గానూ, ఆయన భావాలను పార్టీ పాలనలో కీలకమైన సిద్ధాంతంగానూ ఆమోదించాయి. ఇక 'రెండు రక్షణలు' అనేవి జిన్‌పింగ్ స్థాయిని, చైనాలో పార్టీ కీలక పాత్రను పరిరక్షించాలని పిలుపునిచ్చాయి.

20వ కాంగ్రెస్ ముగింపు రోజున చైనాలో కీలక పాలనా బృందమైన కమ్యూనిస్టు పార్టీ పొలిట్ బ్యూరో స్టాండింగ్ కమిటీ (పీబీఎస్‌సీ) సభ్యులను వేదికపై పెరేడ్ చేయించినప్పుడు జిన్‌పింగ్ అధికార కేంద్రీకరణ స్వరూపం స్పష్టంగా కనిపించింది. వారంతా జిన్‌పింగ్ కీలక మిత్రులు. వారి నియామకానికి విధేయతే కీలక అంశంగా నిలిచిందని సంకేతమిచ్చింది.

సీపీసీ అపెక్స్ బాడీలో జిన్‌పింగ్ తర్వాత నంబర్ 2 ఎవరంటే లీ క్వియాంగ్. నూతన ప్రభుత్వాన్ని ఎంచుకోవడానికి నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్ 2023 మార్చిలో సమావేశమవుతున్నప్పుడు ప్రధానమంత్రి లీ కికియాంగ్ స్థానంలో ప్రధాని కాబోయేది లి క్వియాంగే మరి. లీ క్వియాంగ్ ప్రస్తుతం షాంఘైలో సీపీసీ చీఫ్‌గా పనిచేస్తున్నారు. ఇక కొత్తగా నియమితులైన ఇతరులు ఎవరంటే– బీజింగ్ పార్టీ అధ్యక్షుడు కై క్వి, షీ జిన్‌పింగ్ మాజీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ డింగ్ గ్జ్యూగ్జియాంగ్, గ్వాంగ్ డాంగ్ రాష్ట్ర పార్టీ నేత లీ షీ.

ప్రధాని లీ కికియాంగ్, ఉపప్రధాని వాంగ్ యాంగ్‌లను పీబీఎస్‌సీ నుంచి తొలగించారు. ఈ ఇద్దరి వయస్సు 67 సంవత్సరాలు. మరొక దఫా కూడా వీరికి బాధ్యతలు ఇవ్వవచ్చని భావించారు. 67 సంవత్సరాలు వచ్చిన మరో నేత వాంగ్ హనింగ్‌ని మాత్రం



తిరిగి ఎన్నుకున్నారు. ఆయన కూడా జిన్‌పింగ్ సహచరుడు. ఒకప్పుడు జిన్‌పింగ్ వారసుడిగా పరిగణన పొందిన ఉపప్రధాని హు చున్‌హువా పీబీఎస్‌సీలో సభ్యత్వం పొందడంలో విఫలమయ్యారు. మొత్తంగా ఆయన్ని పొలిట్ బ్యూరో నుంచే తప్పించారు.

నూతన నాయకుల జాబితాలో గుర్తించదగిన విషయం ఏమిటంటే, శిక్షణ పొందిన ఆర్థికవేత్త అయిన లీ కికియాంగ్ వంటి నేతలను తప్పించడమే. మరో ఇద్దరు ముఖ్యమైన నేతలను (పీపుల్స్ బ్యాంక్ ఆఫ్ చైనా గవర్నర్ యి గాంగ్, బ్యాంకింగ్ రెగ్యులేటర్ గువో షుకింగ్) కూడా కొత్త సెంట్రల్ కమిటీ నుంచి తప్పించారు. ఆర్థిక విధానాల్లో ఉదారవాద వైఖరిని ప్రదర్శించిన వారిని పదవుల నుంచి తప్పించారని అంచనా.

వ్యక్తిగత అధికారం మీద రాజ్యాంగ పరంగా ఉన్న ఒకే ఒక్క కీలకమైన పరిమితిని పక్కకు పెట్టేయడంతో, ఆ అధికారాన్ని వినియోగించడంలో ఉన్న నియంత్రణలను కూడా జిన్‌పింగ్ పక్కకుపెట్టేస్తారని ఆందోళన నెలకొంది. జాతీయవాద విధానాలకు, చైనా రోజువారీ జీవితంలో సీపీసీ పాత్ర విస్తరణకు జిన్‌పింగ్ ప్రాధాన్యమిస్తారనేది తెలిసిన విషయమే. అలాగే ఆయనది తైవాన్‌పై కఠిన వైఖరి, పాశ్చాత్య దేశాలు, ఇండియా లాంటి ఇతర దేశాలతో ఘర్షణాత్మక వైఖరి.

ఆర్థిక వ్యవస్థ, దేశ భద్రతకు సంబంధించిన విధానాలకు జిన్‌పింగ్ రెట్టింపు ప్రాధాన్యత ఇస్తారని, పార్టీ కాంగ్రెస్‌కు మొట్టమొదటి రోజునే ఇచ్చిన నివేదికలో ఇవి రెండూ కీలకమైన విషయాలుగా పేర్కొన్నప్పుడే అందరూ అంచనా వేశారు. ఆ తర్వాతి వారంలో సీపీసీ రాజ్యాంగంలో కొన్ని అంశాలను చొప్పించారు. ఈ నివేదిక రాబోయే అయిదేళ్ల కోసం మార్గదర్శక పత్రాన్ని అందజేసింది.

జాతీయ కాంగ్రెస్‌లో చేసిన రెండు గంటల ప్రసంగంలో జిన్‌పింగ్ ఆర్థిక విధానం, భద్రతపై సీపీసీ ప్రాధాన్యతలను వివరించారు. రాజ్యాంగంలో సైన్స్, విద్యపై కొత్త సెక్షన్లు ఉన్నాయి. చైనా భవిష్యత్ ప్రణాళికలో పెరిగిన వీటి ప్రాధాన్యతను ఇవి సూచించాయి. దీని సారాంశం ఏమిటంటే, 'చైనీయ లక్షణాల'తో కూడిన ఆధునీకరణ, పాలన అనే.

ఆర్థిక రంగం గురించి జిన్‌పింగ్ నొక్కి చెప్పడంలో ఉద్దేశం సైన్స్, టెక్నాలజీ అభివృద్ధిని ప్రోత్సహించాలని పిలుపునివ్వడమే. 2021లో 'ఉమ్మడి సౌభాగ్యం' కోసం పిలుపునిస్తూ జిన్‌పింగ్ స్వయంగా ఇచ్చిన నినాదం... మరింత సమాన పంపిణీ వైపుగా సాంప్రదాయ చైనా ఆర్థిక ప్రగతిని ప్రోత్సహించడమే. అయితే ఆర్థిక ప్రగతిని ప్రోత్సహించే సమగ్ర విధానం కొనసాగుతుందని జిన్‌పింగ్ స్పష్టం చేశారు.

అలాగే భద్రతపై జిన్‌పింగ్ నొక్కి చెప్పారు. అమెరికాపై తీవ్ర విమర్శ చేశారు. అమెరికా బ్లాక్ మెయిల్ చేయడానికీ, చైనాను దిగ్బంధించడానికీ, తీవ్రమైన ఒత్తిడిని సృష్టించడానికీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. 2027 నాటికి చైనా ప్రపంచస్థాయి సైన్యాన్ని కలిగి ఉంటుందని అతిశయించి చెప్పారు. వ్యూహాత్మక అణునిరోధకతతో పాటుగా, నూతన పోరాట సామర్థ్యాలను సంతరించుకున్న కొత్త ప్రాదేశిక శక్తులను ప్రవేశపెడతామని చెప్పారు.

భారత దృక్కోణం నుంచి చూస్తే– పీఎల్ఏ(సైన్యం) ఆధునీకరణ అంటే చైనా భద్రతాస్థితిని మెరుగుపరిచి, సంక్షోభాలను నిలువరించి, స్థానిక యుద్ధాలను గెలవడమే. ఇది కచ్చితంగా తైవాన్, భారత్‌లతో చైనాకున్న సమస్యలను ప్రస్తావిస్తోందంటే సందేహించవలసిన పనిలేదు. గల్వాన్ లోయలో భారత్ సైన్యంతో ఘర్షణలకు సంబంధించిన క్లిప్పులను కాంగ్రెస్ ప్రతినిధులకు ప్రదర్శించి చూపారంటే, చైనా విధాన నిర్ణేతల మనసుల్లో భారత్‌కు ఉన్న ప్రాధాన్యత ఏమిటో నిర్ధారణ అవుతోంది.

అత్యున్నత స్థానాల్లో ఉన్నవారి పదవీ కాలాలకు పరిమితి విధించడమనే భావనకు చరిత్రలోకి మళ్లాలి. దానికి జూలియస్ సీజర్, నెపోలియన్ వంటి శక్తిమంతుల నుంచి కూడా వ్యతిరేకత వచ్చింది. అయితే ఎనిమిది లేదా పది సంవత్సరాల పాటు అధికారంలో ఉన్న నేతలు అలసిపోతారని ఆధునిక అనుభవం సూచిస్తోంది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమీర్ పుతిన్, టర్కీ అధ్యక్షుడు ఎర్డోగన్, ఇరాన్ సుప్రీం అధినేత అయతుల్లా ఖొమైనీ, ఉత్తర కొరియా కిమ్ జోంగ్ ఉన్, ఇంకా పలువురు ఆఫ్రికన్ ప్రభుత్వాధినేతల పాలనా రికార్డు దీన్నే నిరూపిస్తోంది.

సామూహిక నాయకత్వాన్ని ప్రోత్సహించడానికి డెంగ్ జియావో పింగ్ చేసిన ప్రయత్నాల్లో నిశ్చయమైన విజ్ఞత ఉంది. ఏక నాయకుడి అధికారాన్ని తనిఖీ చేసే ప్రయత్నమది. అయితే ఇలాంటి ఆంక్షలను జిన్‌పింగ్ తొలగించేశారు. తన అధికారం మీద ఏ తనిఖీ లేని తిరుగు లేని అధినేత పాలన తెచ్చే పర్యవసానాలను చైనా మరోసారి ఎదుర్కోవలసి ఉంటుంది.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఇదేనా నమూనా?



ఇండియాలో ఒక ధనవంతుడు చనిపోతే, దానికి పరిణామాలు ఉంటాయి. ఉన్నట్టుండి కారు వెనకసీట్లో కూడా బెల్ట్ ధరించడాన్ని తప్పనిసరి చేస్తారు. భద్రత గురించి పట్టించుకోవడం చాలా ప్రాముఖ్యత కలిగిన విషయంగా మార్చేస్తారు. కానీ అదే విలువ పేద, మధ్యతరగతి జీవులకు ఇవ్వరు. ఏడు నెలల రిపేరు. ఐదు రోజుల తర్వాత కూలిపోతుంది. 140కి పైగా మంది మరణిస్తారు. ఘనత వహించిన గుజరాత్ మోడల్!

– అభిజిత్ గంగూలీ, వ్యాఖ్యాత

చెడు ప్రభావం



అత్యాచారానికి సంబంధించిన వార్త వచ్చిన ప్రతిసారీ, పోర్న్ సైట్లలో బాధితురాలి పేరును పెద్ద సంఖ్యలో 'సెర్చ్' చేయడం అనేది కాకతాళీయం కాదు. అత్యాచార సంస్కృతికీ, పోర్న్ పరిశ్రమకూ ఉన్న మొత్తం సంబంధాన్ని చెప్పడానికి ఇదొక్కటి సరిపోతుంది.

– ఆలియా, కమ్యూనిస్ట్ 2.0

ఎందుకిలా?



జవహర్‌లాల్ నెహ్రూ. మరణం 1964లో. భారతరత్న 1955.
ఇందిరా గాంధీ. మరణం 1984లో. భారతరత్న 1971. రాజీవ్ గాంధీ. మరణం 1991లో. భారతరత్న 1991.
సర్దార్ పటేల్. మరణం 1950లో. భారతరత్న 1991లో.

– ఆనంద్ రంగనాథన్, రచయిత

జరగకూడదని!



గుజరాత్ మోర్బీలో జరిగిన విషాదానికి నా ప్రగాఢ నివాళి. పోలండ్–భారత సంబంధాల్లో మోర్బీ నగరానికి ప్రత్యేక స్థానం ఉంది.

– జ్బిగ్న్యూఫ్ రవు, పోలండ్ విదేశాంగ మంత్రి

గాలి మారింది



ట్రంప్ దిగిపోయారు (అమెరికాలో). బోల్సొనారో దిగిపోయారు (బ్రెజిల్‌లో). ఇండియా, ఇప్పుడు నీ వంతు!

– వి.పి. సాను, కేరళ విద్యార్థి నాయకుడు

ఇన్‌బాక్స్

ఫొటోజర్నలిజం పితామహుడు

జర్మనీ దేశస్థుడైన ఆస్కార్ బర్నాక్ కెమెరా డిజైనర్, కంటి అద్దాల ఇంజనీర్, పారిశ్రామికవేత్త కూడా. ఆయన రూపొందించిన 'లైకా' కెమెరా అనేక మార్పులతో ఇప్పటికీ అన్నిదేశాల్లో వాడకంలో ఉంది.

మొదట డాగురే 183 సంవత్సరాల క్రితం 'కెమెరా'ను కను గొన్నారు. తొలుత తయారైన కెమెరాలు పెద్దసైజులో ఉండేవి. ఫొటోలు తీయడం కూడా చాలా ఖర్చుతో కూడి ఉండేది. ఆ తర్వాత 75 ఏళ్లకు ఆస్కార్ బర్నాక్ అతిసూక్ష్మమైన సైజులో ఉండే కెమెరాను రూపొందించి మొదటి ప్రపంచ యుద్ధం (1914) సంఘటనలను కళ్ళకు కట్టినట్లుగా చిత్రీకరించి పత్రికా రంగానికి ప్రాణం పోశాడు. అందుకే వీరిని 'ఫొటోజర్నలిజం పితామహుడు' అంటారు. ఆస్కార్ బర్నాక్ జన్మదినం నవంబర్ 1వ తేదీని 'ప్రపంచ ఫొటోజర్నలిజం' దినోత్సవంగా జరుపుకొంటున్నారు.



ఆస్కార్ బర్నాక్

ఎన్నో కొత్తకంపెనీల చిన్న కెమెరాలు ఎన్ని వచ్చినా ఈనాటికీ డిజిటల్ యుగంలో కూడా ఆస్కార్ బర్నాక్ సృష్టించిన లైకా విధాన కెమెరా అత్యంత పరిపూర్ణమైంది.

1914 తర్వాత వార్తలు, సమాచార ఫొటోగ్రఫీ జర్నలిజం ప్రపంచ వ్యాప్తంగా విస్తరింపచేయటంలో ఆయన ఆవిష్కరణ కీలక పాత్ర వహించింది. 1932లో ఓ అడుగు ముందుకువేసి బర్నాక్ కెమెరా లోపల ఒక చిన్న మోటారు అమర్చి ఒక దృశ్యాన్ని తీయగానే ఫిలిం ముందుకు జరిగే విధానానికి నాందిపలికి 1937లో ప్రపంచానికి పరిచయం చేశారు.

బర్నాక్ 57వ ఏట 16 జనవరి 1936న అకాల మరణం చెందారు. 1979 నుంచీ ఆయన శత జయంతి సందర్భంగా 'లైకా ఆస్కార్ బర్నాక్' అంతర్జాతీయ అవార్డును ప్రతి ఏటా ఫొటోజర్నలిజంలో విశేషంగా కృషిచేసిన వారికి లైకా సంస్థ అందిస్తోంది.

– టి. శ్రీనివాసరెడ్డి, ఫొటోజర్నలిస్ట్
ఫెలో ఆఫ్ రాయల్ ఫొటోగ్రాఫిక్ సొసైటీ, గ్రేట్ బ్రిటన్
(నేడు ప్రపంచ ఫొటోజర్నలిజం దినోత్సవం)

అక్షరసత్యాల్లో అర్ధసత్యాలు

అభిప్రాయం



భండారు శ్రీనివాసరావు

''ప్రధాని శ్రీమతి గాంధీ, 1984, అక్టోబర్ 31వ తేదీన ఢిల్లీలో తన అధికార నివాసం ప్రాంగణంలోనే అంగరక్షకుల తుపాకీ కాల్పులకు బలయ్యారు. హత్య జరిగిన అక్టోబర్ మాసంలోనే శ్రీమతి ఇందిరాగాంధీ చాలా మనసుపడి కశ్మీర్ పర్యటన పెట్టుకున్నారు. కశ్మీర్ ప్రకృతి సౌందర్యమంటే ఆవిడ తెగ ముచ్చట పడేవారు. కశ్మీర్ లోయలోని ఒక హిందూ దేవాలయాన్ని, అలాగే ఒక ప్రముఖ మసీదును సందర్శించాలన్న కోరికతో కూడా ఆమె ఆ పర్యటనకు బయలుదేరి వెళ్ళారు. ఆ దేవాలయానికి వెళ్ళినప్పుడు ఆవిడకి ఒక అపశకునం కనబడింది. అది చూడగానే తన రోజులు దగ్గర పడ్డాయని తోచింది. ఆ సమయంలోనే ప్రియాంకా గాంధీ తన రాజకీయ వారసురాలయితే బాగుంటుందని కూడా ఆమెకు అనిపించింది. కాకతాళీయం కావచ్చు కానీ, ఇది జరిగిన కొద్ది రోజుల్లోనే ఆవిడ హఠాత్ మరణానికి గురయ్యారు. ప్రియాంక రాజకీయ వారసత్వం గురించి శ్రీమతి గాంధీ మనసులోని ఈ మాటను తదనంతర కాలంలో సోనియా గాంధీ చెవిలో వేసినా, ఆవిడ దానికి ఇష్టపడలేదు.''

ఈ సంగతులన్నీ, ఇందిరా గాంధీ అంతరంగికుడు ఎం.ఎల్ ఫోతేదార్ రాసిన పుస్తకంలో అక్షరబద్ధం అయ్యాయి.



''వీపీ సింగ్ ప్రభుత్వ పతనానంతరం రాజీవ్ గాంధీని ఆనాడే ప్రధానమంత్రిని చేయాలనే ప్రయత్నాలు జరిగాయి. అయితే అప్పటి రాష్ట్రపతి వెంకట్రామన్ సుముఖత చూపని కారణంగా ఆ ప్రతిపాదన కార్యరూపం దాల్చలేదు. పైగా రాజీవ్ బదులు ప్రణబ్ ముఖర్జీ ప్రధాని కావాలని వెంకట్రామన్ కోరుకున్నారు'' అని మరో వృత్తాంతాన్ని కూడా ఫోతేదార్ పేర్కొన్నారు.

శ్రీమతి గాంధీ దుర్నిరీక్షంగా దేశాన్ని పాలిస్తున్న రోజుల్లో ప్రధాన మంత్రి కార్యాలయాన్ని తమ గుప్పెట్లో పెట్టుకుని పాలించిన ఇద్దరు అధికారులలో ఈ ఫోతేదార్ ఒకరు. రెండో వ్యక్తి ఆర్కే ధావన్. ఇందిర ఆంతరంగిక వర్గంలోని వారు కాబట్టి వారిరువురి మాటా మంత్రులకే కాదు, సీనియర్ అధికారులకు కూడా శిరోధార్యం. పెద్ద పెద్ద వ్యక్తులు రాసే ఆత్మకథలతో పోలిస్తే, వారితో సన్నిహిత సంబంధాలు కలిగిన వాళ్ళు రాసే పుస్తకాల్లో మరిన్ని ఆసక్తికరమైన అంశాలు ఉండడానికి ఆస్కారం ఎక్కువ.

మాజీ ముఖ్యమంత్రి కీర్తిశేషులు జలగం వెంగళరావు 'నా జీవిత కథ' అనే పేరుతో ఒక ఆత్మకథ వెలువరించారు. 'నేనింత వరకు అలాంటి (పీవీ) అసమర్థ నాయకుణ్ణి చూడలేదు. కందూభాయ్ దేశాయ్, త్రిపాఠీ, ఉమా శంకర్ దీక్షిత్ లాగే ఈయనా ఒక సీనియర్ అన్న నమ్మకంతో ఆయన్ని (ఉమ్మడి ఆంధ్రప్రదేశ్) ముఖ్యమంత్రిని చేశాను. కానీ ఆయన బాధ్యతా రాహిత్యంగా వ్యవహరించడం నాకెంతో బాధ కలిగిస్తోందని' ఇందిరాగాంధీ తనతో చెప్పినట్టు వెంగళరావు పేర్కొన్నారు. అలాగే మర్రి చెన్నారెడ్డి గురించి వెంగళరావు 'సంజయ్ మరణ వార్త చెన్నారెడ్డిని సంతోషంలో ముంచివేసింద'ని ఆ పుస్తకం పేర్కొనడం సంచలనమయింది.

అభివృద్ధి చెందిన దేశాల్లో బాగా ప్రాచుర్యం పొందిన ఈ మార్కెటింగ్ టెక్నిక్కులు ఇటీవల మనవైపు కూడా విస్తరిస్తున్నాయి. బ్రిటన్ మాజీ ప్రధానమంత్రి టోనీ బ్లెయిర్, తన జీవితం లోని కొన్ని ఘట్టాలతో రాసిన 'ప్రయాణం' అనే పుస్తకం అమ్మకాలు పెంచే ప్రచార పర్వాన్ని 'సన్' పత్రిక ప్రారంభించింది. టోనీ బ్లెయిర్ మహాశయులవారు, బార్లలో పనిచేస్తూ చదువుకునే రోజుల్లో ఒక ఫ్రెంచ్ యువతితో ప్రేమలో పడ్డారట. ఆమెపై మరులు పెంచుకున్న టోనీకి ఆ వ్యామోహం నుంచి బయటపడడం ఒక పట్టాన సాధ్యం కాలేదుట. 'ఆలోచించడం మానుకో, ఆనందించడం నేర్చుకో' అని ఆ ఫ్రెంచ్ అమ్మడు అతడికి సుద్దులు నేర్పిందట. తనంటే పడిచచ్చిపోతున్న ఆ పడుచువాడు, భవిష్యత్తులో బ్రిటన్ దేశానికి ప్రధానమంత్రి కాగలడని ఆ యువతి అప్పట్లో వూహించి వుండదు.

ఇంగ్లండ్ పుస్తక దుకాణాలలో ఈ పుస్తకాన్ని జనం హాటు కేకుల్లా ఎగరేసుకుపోయారు. ఫ్రెంచి భాషలో సయితం దీనిని ప్రచురించారు. పుస్తక విక్రయాలను పెంచుకునే ప్రచారంలో భాగంగా టోనీబ్లేర్ అమెరికన్ టెలివిజన్లకు కూడా ఇంటర్వ్యూలు ఇచ్చారు. ప్రిన్సెస్ డయానాను ఆకాశానికి ఎత్తేశారు.

ఉపశ్రుతి: జీవిత చరిత్రల నుంచి నేర్చుకునే విషయాలు వుండాలి. అంతేకాని, అమ్మకాలు పెంచుకోవడం కోసమే రాస్తే వాటిపై జనాలకు నమ్మకాలు తగ్గిపోతాయి.

వ్యాసకర్త సీనియర్ పాత్రికేయులు

భావోద్వేగాల బంధం

రాష్ట్రావతరణ దినమైన నవంబర్ ఒకటి, గత చరిత్రలోకి చేజారి పోకుండా మళ్ళీ 'స్వాధీనం' చేసుకుని, సకాలంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గొప్ప పరిణతిని ప్రదర్శించింది. ఇక్కడ స్వాధీనం అంటున్నది– 'క్లెయిమ్' అనే ఆంగ్ల పదాన్ని దృష్టిలో ఉంచుకుని. తెలంగాణ మన నుంచి విడి పోయినప్పుడు, 1956 నుండి నైసర్గిక ఆంధ్రప్రదేశ్ చరిత్రను 'క్లెయిమ్' చేసుకోవలసిన – 'పెద్దన్న' పాత్రను గత ప్రభుత్వం తొలి ఐదేళ్ల వదులుకుంటే, చివరికి ఆ లోపాన్ని జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం సరిచేసింది. ముఖ్యమంత్రిగా ఆయనకు తొలి అనుభవం అయినప్పటికీ, నిర్ణయానికి అవసరమైన మేధోమథనం ఎంత వేగంగా జరిగింది అంటే, 2019 జూన్‌లో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం నుంచి అక్టోబర్ మూడవ వారం నాటికి – నవంబర్ 1 రాష్ట్రావతరణ దినోత్సవం అని ప్రకటన వెలువడింది. అది కూడా చీఫ్ సెక్రటరీ ఈ విషయాన్ని ప్రకటించడం ద్వారా, ఈ ప్రభుత్వం 'బిజినెస్ లైక్' పనిచేస్తుందనే సంకేతాలు కూడా మొదట్లోనే వెలువడ్డాయి.



ఐదేళ్లు ఆలస్యం అయినప్పటికీ కడకు ప్రభుత్వం తలనెరిసినతనంతో, సమ్యక్ దృష్టి (హోలిస్టిక్ అప్రోచ్) తో వ్యవహరించి ఒక చారిత్రిక తప్పిదాన్ని సరిచేసింది. అలా తొలి ఏడాది విజయవాడ తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో రాష్ట్రావతరణ దినోత్సవాలు – 'స్టేట్ ఫంక్షన్'గా జరి గాయి. ఇది జరిగాక, అదే వారంలో 2019 నవంబర్ 6న దీనిపై రాష్ట్ర ప్రభుత్వం జీఓ విడుదల చేసింది. జాతీయ స్థాయిలో అత్యున్నత పురస్కారంగా భావిస్తున్న భారత రత్న, పద్మ విభూషణ్ తరహాలో రాష్ట్రంలో సంస్కృతి , సంప్రదాయాలను పరిరక్షిస్తూ ప్రజా రంగంలో విశేష సేవలు అందించిన వారికి రాష్ట్రావతరణ దినోత్సవం నాడు పురస్కారాలతో ప్రభుత్వం సత్కరిస్తుంది అని అందులో ప్రకటించింది.

అయితే, కరోనా కారణంగా 2020లో 'మెడికల్ ఎమర్జెన్సీ' కావడంతో అది ఆగినా, ఆ తర్వాత రెండేళ్లుగా రాష్ట్రావతరణ దినోత్సవం నాడు ప్రభుత్వం పురస్కారాలతో సత్కరించడం గొప్ప విషయం. గత ఏడాది– 'వైఎస్సార్ లైఫ్ టైం ఎచీవ్‌మెంట్ అవార్డు' పురస్కారానికి 10 లక్షల నగదు, మెమెంటో, ప్రశంసాపత్రం, అలాగే, 'వైఎస్సార్ ఎచీవ్‌మెంట్ అవార్డు' పురస్కారానికి 5 లక్షల నగదు, మెమెంటో, ప్రశంసా పత్రం అందించారు. పురస్కార గ్రహీతల ఎంపిక కోసం ప్రభుత్వం పకడ్బంది 'స్క్రీనింగ్' విధానాన్ని అనుసరిస్తున్నది.

సందర్భం



జాన్‌సన్ చోరగుడి

2022 పురస్కారాలకు 'వైఎస్సార్ లైఫ్ టైం ఎచీవ్‌మెంట్ అవార్డు'కు 20 మందినీ, 'వైఎస్సార్ ఎచీవ్‌మెంట్ అవార్డు'కు 10 మందినీ ఎంపిక చేశారు. వీరిని – వ్యవసాయం, పరిశ్రమలు, వైద్య రంగం, విద్యా రంగం, కళారంగం, సాహిత్యం, మీడియా, స్త్రీ రక్షణ – సాధికారికత రంగాల నుంచి ఎంపిక చేశారు.

అలజడి తర్వాత కుదురుకోవడం గురించి యోచించడానికి, అధినేతకు ప్రజలు – ప్రాంతము మధ్య ఉండే భావోద్వేగాల బంధం ఎటువంటిదో తెలియాలి. లేనప్పుడు, అస్పష్టం అయోమయం మిగులుతుంది. 'రాజ్యం'లో భాగమైన– 'ఎగ్జిక్యూటివ్' అందించే విలువైన మార్గదర్శనాలను అధినేత నిర్ణయాత్మకంగా వినియోగించుకున్నప్పుడు, ప్రజల తీర్పుతో ఎన్నికయిన ప్రభుత్వాలకు అది అదనపు విలువ అవుతుంది. ఇవన్నీ కాకుండా ప్రస్తుత సీఎంకీ ఏపీ 'బ్యూరోక్రసీ'కీ మధ్య వయస్సులో కుదిరిన సారూప్యత వల్ల, ఇక్కడ తక్కువ కాలంలో ఎక్కువ ప్రభావవంతంగా ప్రస్తుతం ప్రభుత్వంలో పని సాగుతున్నది.

వ్యాసకర్త అభివృద్ధి – సామాజిక అంశాల వ్యాఖ్యాత



గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీక మాసం, **తిథి:** శు.అష్టమి రా.10.09 వరకు, తదుపరి నవమి, **నక్షత్రం:** ఉత్తరాషాఢ ఉ.7.11 వరకు, తదుపరి శ్రవణం తె.5.34 వరకు (తెల్లవారితే బుధవారం), **వర్జ్యం:** ఉ.10.54 నుండి 12.24 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.17 నుండి 9.05 వరకు, **అమృతఘడియలు:** రా.7.54 నుండి 9.22 వరకు, తదుపరి రా.10.28 నుండి 11.20 వరకు; **రాహుకాలం :** ప.3.00 నుండి 4.30 వరకు, **యమగండం :** ఉ.9.00 నుండి 10.30 వరకు; **సూర్యోదయం** 6.02; **సూర్యాస్తమయం** 5.27.

క్లుప్తంగా

అమరావతి డ్రామా కంపెనీ కథ ముగిసింది

764వ రోజు రిలే నిరాహార దీక్షలో బహుజన నేతలు



తాడికొండ: కులవాదుల అమరావతి డ్రామా కంపెనీ కథ ఇక ముగిసినట్లేనని బహుజన పరిరక్షణ సమితి నాయకులు అన్నారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 764వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో సోమవారం పలువురు మాట్లాడారు. అమరావతి పేరుతో విరాళాలు సేకరించి ఫైవ్‌స్టార్ హోటల్ వసతులతో సాగిన దొంగ ఉద్యమం కోర్టులు ఆంక్షలు విధించడంతో పలాయానం చిత్తగించిందన్నారు. నిజంగా ఆ యాత్రలో రైతులే ఉంటే ఉన్న పళంగా యాత్ర ఎందుకు ముగించారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఎల్లో మీడియాలో కట్టుకథలు అల్లి బహుజనులకు అన్యాయం చేయాలని చూస్తున్న బాబు అండ్ కోను ప్రజలు ఛీత్కరించుకుంటున్నారన్నారు. ప్రజలంతా మూడు రాజధానులకు జేజేలు కొడుతున్నారని స్పష్టం చేశారు. రాష్ట్రంలో బహుజనులకు పెద్దపీట వేసి .. ఎవరూ చేయని మేలు చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తమ మద్దతు నిరంతరం ఉంటుందన్నారు. రాజధానిలో పేదలకు 900 ఎకరాల్లో ఇళ్లస్థలాలు కేటాయించడం శుభపరిణామమని చెప్పారు. మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, బేతపూడి సాంబయ్య, ఈపూరి ఆదాం, పులి దాసు పలువురు దళిత నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే బిక్కిన మృతి



గోపాలకృష్ణారావు (ఫైల్)

రాజోలు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బిక్కిన గోపాలకృష్ణారావు (83) సోమవారం తెల్లవారుజామున కన్ను మూశారు. వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్న ఆయన స్వగ్రామం తాటిపాకలోని తన నివాసంలో తుదిశ్వాస విడిచారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలున్నారు. 1972లో జరిగిన ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా రాజోలు నుంచి అప్పటి దేవదాయ శాఖ మంత్రి రామలింగరాజుపై పోటీ చేసి గోపాలకృష్ణారావు గెలుపొందారు. అగ్రికల్చరల్ బీఎస్సీ చదివిన ఆయన తాటిపాక గ్రామంలోనే ఉంటూ వ్యవసాయంపై ఆసక్తి చూపుతూ పలు పంటలు పండించేవారు. 1950వ దశకంలో తాటిపాక సర్పంచ్‌గా కూడా బాధ్యతలు చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే గోపాలకృష్ణారావు మృతి పట్ల రాజోలు ప్రస్తుత ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు, మాజీ డిప్యూటీ స్పీకర్ ఏవీ సూర్యనారాయణరాజు, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, మాజీ ఎమ్మెల్యేలు అల్లూరు కృష్ణంరాజు, మానేపల్లి అయ్యాజీ వేమా, పాముల రాజేశ్వరీదేవి సంతాపం వ్యక్తం చేశారు.

నేడు తిరుమలలో పుష్పయాగం

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో మంగళవారం నిర్వహించనున్న పుష్పయాగానికి సోమవారం రాత్రి శాస్త్రోక్తంగా అంకురార్పణ చేశారు. సోమవారం ఉదయం ఆలయంలో మూలవిరాట్ ఎదురుగా ఆచార్య ఋత్విక్‌వరణం (అర్చకులకు విధుల కేటాయింపు) నిర్వహించారు. సాయంత్రం ఆరు గంటలకు శ్రీవారి సేనాధిపతి అయిన శ్రీ విష్వక్సేనులను ఆలయం నుంచి ఊరేగింపుగా వసంత మండపానికి తీసుకెళ్లారు. అక్కడ మృత్సంగ్రహణం, ఆస్థానం నిర్వహించి తిరిగి శ్రీవారి ఆలయానికి చేరుకున్నారు. రాత్రి ఎనిమిది గంటల నుంచి తొమ్మిది వరకు ఆలయంలోని యాగశాలలో అంకురార్పణ చేశారు. టీటీడీ ఈవో ఎ.వి.ధర్మారెడ్డి, వీజీవో బాలిరెడ్డి, పేష్కార్ శ్రీహరి పాల్గొన్నారు.

నేడు స్నపన తిరుమంజనం

పుష్పయాగం సందర్భంగా మంగళవారం ఉదయం తొమ్మిది నుంచి 11 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామి ఉత్సవర్లకు సంపంగి ప్రదక్షిణంలోని కల్యాణమండపంలో స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. సుగంధద్రవ్యాలతో విశేషంగా అభిషేకం చేస్తారు. మధ్యాహ్నం పుష్పయాగం నిర్వహిస్తారు. సాయంత్రం సహస్రదీపాలంకార సేవ తర్వాత ఉభయ దేవేరులతో కలిసి మలయప్పస్వామి మాడవీధుల్లో దర్శనమిస్తారు. పుష్పయాగం కారణంగా మంగళవారం పలు సేవలు రద్దుచేసింది.

ప్రాధాన్యతగా 'తోటపల్లి'

మిగిలిపోయిన పనులు యుద్ధప్రాతిపదికన పూర్తికి ప్రభుత్వం సన్నద్ధం

- నిర్వాసితుల పునరావాసంపై ప్రత్యేక దృష్టి
- తద్వారా పూర్తి సామర్థ్యం మేరకు 2.51 టీఎంసీల నిల్వ
- ప్రధాన కాలువలు, డిస్ట్రిబ్యూటరీలు, బ్రాంచ్ కెనాల్ పూర్తికి ప్రణాళిక
- మొత్తం 2 లక్షల ఎకరాలకు నీరందించాలని సీఎం జగన్ నిర్ణయం

సాక్షి, అమరావతి: ఉత్తరాంధ్రలో అత్యంత కీలకమైన తోటపల్లి బ్యారేజ్ కింద ఆయకట్టులోని మొత్తం 2 లక్షల ఎకరాలకు నీళ్లందించి, రైతులకు జలయజ్ఞ ఫలాలు అందించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయించారు. ఇందుకోసం తోటపల్లి ప్రాజెక్టులో మిగిలిన పనులను ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతగా చేపట్టింది. నిర్వాసితులకు పునరావాసం కల్పించడం ద్వారా బ్యారేజ్‌లో పూర్తి స్థాయి సామర్థ్యం మేరకు 2.51 టీఎంసీలను నిల్వ చేయడం, ప్రధాన కాలువలు, డిస్ట్రిబ్యూటరీల (పిల్ల కాలువలు)లో మిగిలిన పనులను పూర్తి చేయడం ద్వారా జలయజ్ఞం ఫలాలను ఆయకట్టు రైతులందరికీ అందించనుంది. పార్వతీపురం మన్యం జిల్లాలో గరుగుబిల్లి మండలం తోటపల్లి వద్ద నాగావళి నదిపై 1908లో బ్రిటిష్ ప్రభుత్వం రెగ్యులేటర్‌ను నిర్మించింది. పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో 64 వేల ఎకరాలకు నీళ్లందించేలా కాలువల వ్యవస్థను అభివృద్ధి చేసింది. ఆ రెగ్యులేటర్ శిథిలావస్థకు చేరడంతో నాగావళి జలాలను గరిష్ట స్థాయిలో వినియోగించుకుని అదనంగా 1,36,191 ఎకరాలకు నీళ్లందించేలా 2004లో వైఎస్ రాజశేఖర రెడ్డి జలయజ్ఞంలో భాగంగా తోటపల్లి బ్యారేజ్ పనులను చేపట్టారు.



2,151 నిర్వాసితుల కుటుంబాలకు పునరావాసం

బ్యారేజ్‌లో పార్వతీపురం మన్యం జిల్లాలోని 20 గ్రామాలు ముంపునకు గురవుతాయి. ఈ గ్రామాల్లోని 5,629 నిర్వాసిత కుటుంబాలకు పునరావాసం కల్పించాలి. ఇప్పటిదాకా 13 గ్రామాల్లోని 3,478 కుటుంబాలకు మాత్రమే పునరావాసం కల్పించారు. దాంతో బ్యారేజ్‌లో పూర్తి సామర్థ్యం మేరకు నీటిని నిల్వ చేయలేని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో మిగతా ఏడు గ్రామాల్లోని 2,151 కుటుంబాలకు పునరావాసం కల్పించి బ్యారేజ్‌లో పూర్తి స్థాయిలో నీటిని నిల్వ చేయాలని అక్టోబర్ 21న నిర్వహించిన సమీక్షలో జల వనరుల శాఖ అధికారులను సీఎం వైఎస్ జగన్ ఆదేశించారు. బ్యారేజ్‌లో ముంపునకు గురయ్యే భూమితోపాటు ప్రధాన కాలువ, డిస్ట్రిబ్యూటరీలలో మిగిలిన పనులు పూర్తి చేయడానికి అవసరమైన 291.12 ఎకరాల భూమిని యుద్ధ ప్రాతిపదికన సేకరించాలని ఆదేశించారు. బ్యారేజ్ కుడి కాలువలో అంతర్భాగమైన గజపతినగరం బ్రాంచ్ కెనాల్ నిర్మాణానికి అవసరమైన 219.31 ఎకరాలను సేకరించాలని దిశానిర్దేశం చేశారు. దాంతో నిర్వాసితుల పునరావాసం, భూసేకరణలో అధికారులు నిమగ్నమయ్యారు.

ఆయకట్టంతటికీ సాగు నీరు

తోటపల్లి బ్యారేజ్ కింద పాత ఆయకట్టు 64 వేల ఎకరాలకు నీళ్లందిస్తున్నారు. కొత్తగా కుడి, ఎడమ కాలువల కింద సుమారు 80 వేల ఎకరాల ఆయకట్టుకు నీళ్లందిస్తున్నారు. మిగతా 50 వేల ఎకరాలకు నీళ్లందించాలంటే కుడి, ఎడమ కాలువల్లో, డిస్ట్రిబ్యూటరీల్లో మిగిలిన పనులు పూర్తి చేయాలి. కుడి కాలువలో 0 నుంచి 117.89 కిలోమీటర్ల వరకు 15,07,679 క్యూబిక్ మీటర్ల మట్టి పని, 17 కాంక్రీట్ నిర్మాణాలు, 88,636 క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పని మిగిలి ఉంది. రూ. 123.21 కోట్లతో కాంట్రాక్టర్లకు అప్పగించారు. 97.70 కి.మీ నుంచి 25 కిలోమీటర్ల గజపతినగరం బ్రాంచ్ కెనాల్‌ను తవ్వి 15 వేల ఎకరాలకు నీళ్లందించనున్నారు. ఈ పనుల్లో 2,67,847 క్యూబిక్ మీటర్ల మట్టి పని, 30 నిర్మాణాలు, 40 వేల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పని మిగిలింది. ఈ పనులను రూ.137.8 కోట్లతో చేపట్టారు. ఖరీఫ్ పంట కోతలు పూర్తవగానే ఈ పనులు చేపట్టి యుద్ధప్రాతిపదికన పూర్తి చేయడానికి అధికారులు చర్యలు చేపట్టారు.



శ్రీశైలంలో లక్ష దీపోత్సవం

కార్తీకమాసం మొదటి సోమవారాన్ని పురస్కరించుకుని శ్రీశైలంలోని పుష్కరిణి వద్ద లక్ష దీపోత్సవం నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు, పుష్కరిణికి దశవిధ హారతులిచ్చారు. భక్తులు భారీగా హాజరై కార్తీకదీపాలను వెలిగించారు. - శ్రీశైలం టెంపుల్

అదనపు బాధ్యతలు స్వీకరించిన నవీన్‌కుమార్

సాక్షి, అమరావతి: వైద్య, ఆరోగ్య శాఖలోని కోవిడ్ మేనేజ్‌మెంట్, వ్యాక్సినేషన్ విభాగం కార్యదర్శిగా అదనపు బాధ్యతలను ఏపీ శ్యాక్స్ పీడీ జీఎస్ నవీన్‌కుమార్ సోమవారం స్వీకరించారు. సచివాలయంలో బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు.

ఆర్మీకోక చిలక!



వైఎస్సార్ జిల్లా బద్వేలు పట్టణంలోని ఓ ఇంటి వద్ద ఈ అరుదైన సీతాకోకచిలుక కనువిందు చేసింది. ఆర్మీ దుస్తుల రంగులో త్రిభుజాకారంలో ఎంతో ఆకర్షణీయంగా ఉంది. స్పింగిడే కుటుంబానికి చెందిన దీని శాస్త్రీయ నామం జియోమెట్రిడే. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఇది చాలా అరుదుగా కనిపిస్తుంటుంది. దీనిని ఆర్మీ గ్రీన్‌మాత్ లేదా ఒలియాండర్‌హాక్‌మోత్‌గా పిలుస్తారని జంతు శాస్త్ర విభాగం అధ్యాపకులు చెప్పారు. - బద్వేలు అర్బన్

శ్రీశైలానికి 35 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయానికి 35,727 క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చి చేరుతోంది. కుడి, ఎడమ గట్టు కేంద్రాల్లో విద్యుత్ ఉత్పాదన అనంతరం 46,293 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు విడుదల చేశారు. బ్యాక్‌వాటర్ నుంచి పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ ద్వారా 6,500 క్యూసెక్కులు ,కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి 2,400 క్యూసెక్కుల నీటిని వదిలారు. ప్రస్తుతం జలాశయంలో 883.60 అడుగుల మట్టంలో 207.8472 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలి

ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రామకృష్ణ ప్రసాద్

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని, బాధ్యతాయుతమైన ప్రవర్తన అలవర్చుకోవాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.రామకృష్ణప్రసాద్ సూచించారు. గుంటూరులోని పాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్‌ఈ స్కూల్ కూడలిలో స్వాతంత్ర్య సమరయోధుడు పాటిబండ్ల సీతారామయ్య 140వ జయంత్యుత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ఆయన కాంస్య విగ్రహానికి జస్టిస్ రామకృష్ణప్రసాద్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ మాతృభాషలో పరిపూర్ణమైన పరిజ్ఞానాన్ని పొందడం ద్వారా ఉన్నత స్థాయికి ఎదగవచ్చన్నారు. అయితే దేశ, విదేశాల్లో రాణించేందుకు ఆంగ్లం కూడా ముఖ్యమన్నారు. వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందించారు.



పాటిబండ్ల సీతారామయ్య విగ్రహానికి నివాళి అర్పిస్తున్న న్యాయమూర్తి జస్టిస్ రామకృష్ణ ప్రసాద్

కరోనా కాలంలో పేదలను కాపాడిన డీబీటీ

వైఎస్సార్‌సీ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేస్తున్న డీబీటీ పద్ధతి కరోనా సమయంలో మంచి ఫలితాలను ఇచ్చిందని వైఎస్సార్‌సీ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి అన్నారు. ఏపీలో పేదలకు ప్రభుత్వ సాయం నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోకి చేరిందని చెప్పారు. తాడేపల్లిలో సోమవారం ఆయన ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. దళారులు, అవినీతికి తావులేని టెక్నాలజీయే ఏపీ సర్కారు ఆయుధం అని ఆయన చెప్పారు. ఐదేళ్ల టీడీపీ పాలనలో ఆర్థికంగా కుంగిపోయిన సామాన్యులను ఆదుకోవడం, సంక్షేమ పథకాల వల్ల ప్రత్యక్షంగా వారికి మేలు చేయాలనే ఉద్దేశం సీఎం జగన్ ప్రభుత్వం ప్రధాన అజెండా అన్నారు. నవరత్నాలు సహా అనేక సంక్షేమ పథకాల అమలుకు డీబీటీ విధానం అక్కర కొచ్చిందని తెలిపారు. వలంటీర్లతో పాటు సచివాలయ వ్యవస్థ పాలనలో పారదర్శకత తీసుకొచ్చిందన్నారు. గ్రామంలో, వార్డు స్థాయిలో లబ్ధిదారుల జాబితాలు అందుబాటులోకి వచ్చాయి. పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపే ఇంతటి విప్లవాత్మక మార్పులు తెచ్చిన ఏపీ సర్కారు నిజంగా పేదలకు, టెక్నాలజీకి అనుకూలమైనదని రుజువైందన్నారు. తానో హైటెక్ సీఎంగా ప్రచారం చేసుకున్న చంద్రబాబుకు ఈ వాస్తవాలు కనిపించవా? అని ప్రశ్నించారు. మూడేళ్లలో డీబీటీ విధానంలో నేరుగా రూ. 2 లక్షల కోట్లు తమ ఖాతాల్లో జమ చేసిన ప్రభుత్వంపై టీడీపీ నేతలు, ఎల్లో మీడియా ఎన్ని ఆరోపణలు చేసినా ప్రజలు నమ్మరని ఆయన చెప్పారు.

పరిశోధన రంగంలో డ్రగ్ డిస్కవరీ పాత్ర కీలకం

- నోబెల్ గ్రహీత డాక్టర్ సర్ రిచర్డ్ జె.రాబర్ట్స్
- 'విజ్ఞాన్'లో అంతర్జాతీయ సదస్సు



అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌ను ప్రారంభిస్తున్న అతిథులు

చేబ్రోలు : మెడికల్ జీనోమిక్స్ పరిశోధన రంగంలో డ్రగ్ డిస్కవరీ అనేది కీలక పాత్ర పోషిస్తుందని నోబెల్ గ్రహీత సర్ రిచర్డ్ జే.రాబర్ట్స్ అన్నారు. గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ, బయోఇన్ఫర్మాటిక్స్, స్కూల్ ఆఫ్ బయోటెక్నాలజీ అండ్ ఫార్మాస్యూటికల్స్ సైన్సెస్ విభాగాల ఆధ్వర్యంలో ఫ్రాంటీర్స్ ఇన్ న్యూట్రిషన్, మెడికల్ జీనోమిక్స్ అండ్ డ్రగ్ డిస్కవరీ(ఇన్‌బిక్స్-22) అనే అంశంపై మూడు రోజుల అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌ను సోమవారం ప్రారంభించారు. వర్చువల్ విధానంలో హాజరైన డాక్టర్ సర్ రిచర్డ్ జే.రాబర్ట్స్ మాట్లాడుతూ విద్యార్థులకు మొదటి నుంచే బేసిక్ రీసెర్చ్‌పై అవగాహన కల్పించడంతో పాటు వారిని ఆ దిశగా ప్రోత్సహించాలని సూచించారు. విద్యార్థులు పారిశ్రామికవేత్తలుగా మారడానికి వీలు కల్పించే ప్రాథమిక పరిశోధనలను చేపట్టాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. బెంగళూరులోని ఐఐఎస్సీ మాజీ డైరెక్టర్, బైరాక్ చైర్మన్, పద్మభూషణ్ అవార్డు గ్రహీత ప్రొఫెసర్ పద్మనాభన్ మాట్లాడుతూ విద్యార్థులకు నైపుణ్యంతో పాటు పరిశోధనాత్మక ఆలోచనలు కలిగిన విద్యా విధానం అవసరమన్నారు. యూఎస్‌ఏ – కొలంబస్‌లోని ఓహియో స్టేట్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డీపీఎస్ వర్మ మాట్లాడుతూ పరిశోధనలపై విద్యార్థులు ఉత్సుకత పెంచుకోవాలని సూచించారు. ఎంపిక చేసిన 350 రీసెర్చ్ ఆర్టికల్స్‌కు సంబంధించిన ఇన్‌బిక్స్-22 పరిశోధన పుస్తకాన్ని విడుదల చేశారు. కార్యక్రమంలో విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్, వైస్ చైర్మన్‌లు లావు రత్తయ్య, లావు శ్రీకృష్ణదేవరాయలు, వీసీ నాగభూషణ్ తదితరులు పాల్గొన్నారు.

నారాయణకు చుక్కెదురు

▶ మొదటి పేజీ తరువాయి

లొంగిపోయిన అనంతరం ఆయనను జుడీషియల్ రిమాండ్‌కు తరలించాలని తన ఆదేశాల్లో పేర్కొన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 27న పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో తెలుగు కాంపోజిట్ ప్రశ్నపత్రాన్ని తిరుపతి నారాయణ పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ ఎస్.గిరిధర్‌రెడ్డి 'చిత్తూరు టాకీస్' అనే వాట్సాప్ గ్రూప్‌లో పోస్టు చేసిన సంగతి తెలిసిందే. దీనిపై చిత్తూరు డీఈవో పురుషోత్తం ఇచ్చిన ఫిర్యాదుతో వన్‌టౌన్ సీఐ నరసింహరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఏప్రిల్ 29న తిరుపతి జిల్లా చంద్రగిరిలోని శ్రీకృష్ణారెడ్డి చైతన్య ప్రిన్సిపాల్ పి.సురేష్, తిరుపతి ఎన్ఆర్ఐ అకాడమీ ఆంగ్ల ఉపాధ్యాయుడు కె.సుధాకర్, తిరుపతి చైతన్య పాఠశాల ప్రిన్సిపాల్ ఆరిఫ్, డీన్ కె.మోహన్, గిరిధర్‌రెడ్డిలతోపాటు గంగాధర నెల్లూరు మండలంలో ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న పవన్‌కుమార్‌రెడ్డి, బి.సోమును అరెస్టు చేశారు. వీరిలో ప్రభుత్వ ఉపాధ్యాయులు మినహా మిగిలిన వాళ్లంతా గతంలో నారాయణ విద్యాసంస్థల్లో పనిచేసినవాళ్లే కావడం గమనార్హం. గిరిధర్‌రెడ్డి, సుధాకర్, సురేష్, పవన్‌కుమార్‌రెడ్డిలను మే 9న కస్టడీకు తీసుకుని విచారించారు. టీడీపీ నేత నారాయణ ఆదేశాలతోనే తాము ఇదంతా చేసినట్లు నిందితులు అంగీకరించారు. నారాయణ ఆదేశాలతో ఆ సంస్థ సిబ్బంది మరికొందరు కార్పొరేట్ విద్యాసంస్థల ప్రతినిధులతో కలిసి మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడ్డారని వెల్లడైంది. దీంతో నారాయణను మే 10న ఐపీసీ 5 రెడ్‌విత్ 8, 10 ఎగ్జామినేషన్ మాల్‌ప్రాక్టీస్ యాక్టు 408, 409, 201, 120 (బి) ఐపీసీ, 65 ఆఫ్ ఐటీ యాక్ట్ సెక్షన్ల కింద అరెస్టు చేశారు. ఈ వ్యవహారంలో చిత్తూరులోని నాలుగో అదనపు ఇన్‌చార్జ్ మెజిస్ట్రేట్ సులోచనరాణి.. నారాయణకు బెయిల్ మంజూరు చేశారు. దీనిపై పోలీసులు చిత్తూరు జిల్లా కోర్టులో సవాలు చేశారు. ఇదే కేసులో మిగిలిన నిందితులకు జుడీషియల్ రిమాండ్‌కు ఆదేశించారని అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపించారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం తాజాగా తీర్పును వెలువరించింది.



ఎస్పీ రిషాంత్‌రెడ్డి

'బీసీ' సభ విజయవంతంతో బాబుకు కలవరం

- ఉక్రోషంతోనే బీసీ సోదరులతో విమర్శలు చేయిస్తున్నారు
- కృష్ణయ్య బొమ్మ పెట్టుకుని ఆయనపైనే పోరాడతామనడం సరికాదు
- ఏపీ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మారేష్



సాక్షి, అమరావతి: జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో ఇటీవల నిర్వహించిన బీసీ ఆత్మగౌరవసభ విజయవంతం కావడం టీడీపీ అధినేత చంద్రబాబు, ఆయన అనుకూల నేతలకు కలవరపాటుగా మారిందని ఏపీ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎన్.మారేష్ మండిపడ్డారు. సోమవారం విజయవాడలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మారేష్ మాట్లాడారు. చంద్రబాబు పథకం ప్రకారం కొందరు బీసీ సోదరులతో ఆదివారం కార్యక్రమం ఏర్పాటు చేయించి బీసీ ఆత్మగౌరవసభపై విషం కక్కేలా పురిగొల్పారని చెప్పారు. టీడీపీ ట్రాప్‌లో పడిన బీసీలు వాస్తవాలు గ్రహించి మాట్లాడాలని హితవు పలికారు. స్వతంత్ర భారతంలో ఏ రాష్ట్ర ముఖ్యమంత్రి, ఎప్పుడూ చేయని విధంగా రాజ్యాధికారంలో అత్యధిక బీసీలను భాగస్వాముల్ని చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కు దక్కుతుందని చెప్పారు. బీసీల కోసం ఎన్నో పోరాటాలు చేస్తున్న కృష్ణయ్యను పిలిచి సీఎం వైఎస్ జగన్ రాజ్యసభ సీటు ఇచ్చి గౌరవించిన సంగతి గుర్తించాలన్నారు. కృష్ణయ్య ఫొటో పెట్టుకుని సంఘాల్లో నాయకులుగా ఎదిగినవారు కృష్ణయ్య మీదే ఉద్యమిస్తామనడం విడ్డూరంగా ఉందని చెప్పారు.బీసీ సంఘాల ఐక్యతను దెబ్బతీయవద్దని కోరారు. సంఘటితంగా బీసీల రాజ్యాధికారం కోసం ముందుకు సాగాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వేముల బేబీరాణి, బీసీ సంఘం ఎన్టీఆర్, పల్నాడు జిల్లాల అధ్యక్షులు హర్షద్, ఒర్సు బాల తదితరులు పాల్గొన్నారు.

ప్రసాదాల కోసం మార్క్‌ఫెడ్ ద్వారానే కొనుగోళ్లు

- సేంద్రియ ఆహార పదార్థాలతోనే దేవుడి ప్రసాదం తయారీ
- ప్రధాన ఆలయాల ఈవోలకు దేవదాయశాఖ కమిషనర్ ఆదేశాలు

సాక్షి, అమరావతి: పురుగుమందు అవశేషాలకు తావులేని సేంద్రియ ఆహార పదార్థాలతోనే ఆలయాల్లో దేవుడి ప్రసాదం తయారీకి దేవదాయ శాఖ చర్యలు మొదలుపెట్టింది. ప్రసాదాల తయారీకి ఉపయోగించే 12 రకాల సేంద్రియ ఆహార ఉత్పత్తులను ప్రభుత్వరంగ సంస్థ మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసుకోవాలంటూ దేవదాయ శాఖ కమిషనర్ హరిజవహర్‌లాల్ సోమవారం రాష్ట్రంలోని అన్ని ప్రధాన ఆలయాల ఈవోలకు ఆదేశాలు జారీచేశారు. ఆయా సేంద్రియ ఆహార ఉత్పత్తులకు సంబంధించి మార్క్‌ఫెడ్ ఎప్పటికప్పుడు తెలిపే ధరల పట్టిక ఆధారంగా ఆలయానికి కావాల్సిన పరిమాణం మేరకు ఆహార ధాన్యాల కొనుగోలుకు సంబంధించి మొదట ఆలయ ట్రస్టుబోర్డు సమావేశంలో తీర్మానం చేసుకోవాలని సూచించారు. ట్రస్టుబోర్డు లేని ఆలయాల ఈవో ఉన్నతాధికారులకు ముందుగా తెలిపి ఆ కొనుగోలు ప్రక్రియను చేపట్టాలని నిర్దేశించారు. ప్రసాదాల తయారీకి ఉపయోగించే ఆహారధాన్యాల కొనుగోలుకు ఇప్పటికే టెండరు పొందిన కాంట్రాక్టు గడువు ఇంకా ముగియనిచోట.. రానున్న రోజుల్లో ఎలాంటి న్యాయచిక్కులు తలెత్తకుండా ఎండోమెంట్ స్టాండింగ్ కౌన్సిల్స్ సలహా తీసుకుని తదుపరి చర్యలు చేపట్టాలని ఈవోలకు సూచించారు.

నేటి నుంచి తిరుపతిలో సర్వదర్శనం టోకెన్ల జారీ



తిరుపతి అలిపిరి/తిరుమల: టీటీడీ ధర్మకర్తల మండలి నిర్ణయం మేరకు తిరుపతిలోని భూదేవి కాంప్లెక్స్, శ్రీనివాసం కాంప్లెక్స్, గోవిందరాజస్వామి సత్రాల వద్ద మంగళవారం నుంచి ప్రయోగాత్మకంగా సర్వదర్శనం టైం స్లాట్ టోకెన్ల జారీ ప్రక్రియను పునఃప్రారంభించనున్నట్లు ఈవో ఏవీ ధర్మారెడ్డి తెలిపారు. ఆయన జేఈవో వీరబ్రహ్మం, ఇతర అధికారులతో కలిసి సోమవారం ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఈవో మీడియాతో మాట్లాడుతూ శని, ఆది, సోమవారాల్లో 25 వేల టోకెన్లు, మిగతా రోజుల్లో 15 వేలు చొప్పున టోకెన్లు జారీ చేస్తామని తెలిపారు. టోకెన్ లభించిన భక్తుడు అదేరోజు దర్శనం చేసుకునేలా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. టోకెన్లు దొరకని భక్తులు నేరుగా తిరుమల చేరుకుని వైకుంఠం క్యూ కాంప్లెక్స్-2 ద్వారా స్వామి వారిని దర్శించుకోవడానికి ఏర్పాట్లు చేశామన్నారు. ఆధార్ నంబరు నమోదు చేసుకుని టోకెన్లు జారీ చేయడం వల్ల భక్తులు దర్శనం చేసుకున్నా, చేసుకోకపోయినా నెలకు ఒకసారి మాత్రమే టోకెన్ పొందే అవకాశం ఉంటుందన్నారు. తిరుమలలో వసతికి సంబంధించి ఒత్తిడి తగ్గించడం కోసం డిసెంబర్ ఒకటో తేదీ నుంచి శ్రీవాణి ట్రస్ట్ దాతలకు తిరుపతిలోని మాధవంలో ఆఫ్ లైన్ టికెట్లు జారీ చేస్తామని, అక్కడే గదులు కేటాయిస్తామని చెప్పారు.

శ్రీవారి దర్శనానికి 15 గంటలు

తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూ కంపార్ట్‌మెంట్లు 31 నిండాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 85,131 మంది స్వామి వారిని దర్శించుకోగా, 31,188 మంది తలనీలాలు సమర్పించారు. శ్రీవారి హుండీలో కానుకల రూపంలో భక్తులు రూ.4.47 కోట్లు సమర్పించుకున్నారు. శ్రీవారి దర్శనానికి 15 గంటలు, ప్రత్యేక ప్రవేశ దర్శనానికి రెండు గంటల సమయం పడుతోంది.

బ్రెజిల్ అధ్యక్ష ఎన్నికల్లో డ సిల్వా జయకేతనం

- 20 ఏళ్ల తర్వాత మళ్లీ అధికార పగ్గాలు
- హోరాహోరీ పోరులో అధ్యక్షుడు బోల్సోనారో ఓటమి



సావ్ పావ్లో: ఉత్కంఠభరితంగా జరిగిన బ్రెజిల్ అధ్యక్ష ఎన్నికల్లో వర్కర్స్ పార్టీ నేత, మాజీ దేశాధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లూనా డ సిల్వా (77)ను స్వల్ప ఆధిక్యంతో విజయం వరించింది. అధ్యక్షుడు బోల్సోనారోను ఓడించి 20 ఏళ్ల తర్వాత తిరిగి అధికారాన్ని కైవసం చేసుకున్నారు. 1985 తర్వాత ప్రజాస్వామ్యంలోకి అడుగుపెట్టిన బ్రెజిల్‌లో అధికార పీఠంపై కూర్చున్న వ్యక్తి తదుపరి ఎన్నికల్లో ఓడిపోవడం ఇదే తొలిసారి! సిల్వాను అమెరికా అధ్యక్షుడు బైడెన్, రష్యా అధ్యక్షుడు పుతిన్, ప్రధాని మోదీ, బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ అభినందించారు.

క్లుప్తంగా...

పవార్‌కు అస్వస్థత

ముంబై: నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎన్‌సీపీ) చీఫ్ శరద్ పవార్ (81) సోమవారం అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరారు. ముంబైలోని బ్రీచ్ క్యాండీ ఆస్పత్రిలో వైద్యులు ఆయనకు చికిత్స చేస్తున్నారు. 'నవంబర్ రెండో తేదీన పవార్ ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యే అవకాశం ఉంది. రెండ్రోజులపాటు జరిగే ఎన్‌సీపీ పార్టీ సమావేశాల్లో పవార్ మూడో తేదీన పాల్గొంటారు' అని ఎన్‌సీపీ ప్రధాన కార్యదర్శి శివాజీరావు గర్జే వెల్లడించారు. గత ఏడాది ఏప్రిల్‌లో పవార్‌కు గాల్ బ్లాడర్ శస్త్రచికిత్స జరిగింది. నోటి అల్సర్‌కు సంబంధించి సైతం గతంలో ఆయన చికిత్స చేయించుకున్నారు.

శీతాకాల పార్లమెంట్ భేటీ... ప్రస్తుత భవంతిలోనే

న్యూఢిల్లీ: నూతన పార్లమెంట్ భవంతిలో ఇంకా నిర్మాణపనులు కొనసాగుతుండటంతో ఈసారి శీతాకాల సమావేశాలను పాత (ప్రస్తుత) పార్లమెంట్‌లోనే నిర్వహించనున్నారు. సాధారణంగా పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ప్రతి ఏటా నవంబర్ మూడో వారంలో ప్రారంభమవుతాయి. కొత్త భవనంలో నిర్మాణపనులు పూర్తయినా ఎలక్ట్రిక్, ఫర్నీచర్, కార్పెట్లు, కుడ్య చిత్రాల ఏర్పాటు పనులు ఈ ఏడాది చివరిదాకా పూర్తి కాకపోవచ్చని తెలుస్తోంది.

నీటి కష్టాల్లో కీవ్

కీవ్: రష్యా వైమానిక దాడులతో ఉక్రెయిన్ రాజధాని నగరం నీటి కష్టాల్లో మునిగిపోయింది. నీటి సరఫరాకు కీలకమైన విద్యుత్ సరఫరా కేంద్రంపై రష్యా వైమానిక సేనలు సోమవారం గగనతల దాడులను హఠాత్తుగా ఉధృతం చేశాయి. దీంతో నగరంలో చాలా ప్రాంతాల్లో నీటి రవాణా వ్యవస్థ దారుణంగా దెబ్బతింది. సోమవారం కీవ్ నగరంలో 80 శాతం వినియోగదారులకు నీటి సదుపాయం లేకుండాపోయిందని నగర మేయర్ విటలీ క్లిట్స్‌చోకో ఆందోళన వ్యక్తంచేశారు. కీవ్‌లో సోమవారం తెల్లవారుజాము నుంచే రష్యా దాడులతో పేలుళ్ల శబ్దాలు మార్మోగాయి. ఉక్రెయిన్‌కు మద్దతు ప్రకటిస్తూ చెక్ రిపబ్లిక్ ప్రధాని పీటర్ ఫియాలా, రక్షణ, విదేశాంగ మంత్రులతో కలిసి కీవ్‌ను సందర్శిస్తున్న వేళ కీవ్‌పై బాంబు దాడులు జరగడం గమనార్హం. కీవ్ ఉత్తరప్రాంతంలో ఉక్రెయిన్, రష్యా సేనలు పరస్పర దాడులు చేసుకున్నాయి. డినిపర్ నది ఎడమవైపు తీరం దాడుల పొగతో నిండిపోయింది. కొన్ని చోట్ల రైళ్లకు విద్యుత్ సరఫరా ఆటంకాలు ఏర్పడ్డాయి. క్రిమియా ద్వీపకల్పంలో నల్ల సముద్రంలో తీర స్థావర నౌకలపై ఉక్రెయిన్ బాంబుదాడులు చేసిందని రష్యా ఆరోపిస్తుండగా, రష్యానే పేలుడుపదార్థాలను సరిగా 'నిర్వహించలేక' పేలుళ్లకు కారణమైందని ఉక్రెయిన్ స్పష్టంచేసింది. నౌకలపై దాడులతో ఆగ్రహించిన రష్యా.. ఉక్రెయిన్ నుంచి ఆహార ధాన్యాల ఎగుమతి ఒప్పందాన్ని తాజాగా రద్దుచేసుకుంది. దీంతో పలు దేశాలకు ధాన్యం సరఫరా స్తంభించి మళ్లీ ధరలు పెరిగే ప్రమాదం పొంచిఉంది.

ఈసీ చీఫ్‌పై ఇమ్రాన్ ఖాన్ పరువు నష్టం దావా!



ఇస్లామాబాద్: అనర్హత వేటు వేయడం ద్వారా తన ప్రతిష్టను దెబ్బతీశారని పాకిస్తాన్ మాజీ ప్రధానమంత్రి ఇమ్రాన్ ఖాన్ మండిపడ్డారు. ఇందుకు బాధ్యుడిగా ఎన్నికల సంఘం(ఈసీ) చీఫ్ సికిందర్ సుల్తాన్‌పై రూ.1,000 కోట్లకు పరువు నష్టం దావా వేయబోతున్నట్లు చెప్పారు. ఇమ్రాన్ సోమవారం నాలుగో రోజు లాంగ్‌మార్చ్ సందర్భంగా మద్దతుదారులనుద్దేశించి మాట్లాడారు.

మోర్బీ వంతెన ప్రమాదంలో... 134కు పెరిగిన మృతులు

బీజేపీ ఎంపీ కుటుంబం నుంచే 12 మంది బలి • ప్రధాని సమీక్ష, నేడు ఘటనా స్థలికి

మోర్బీ/న్యూఢిల్లీ: గుజరాత్ రాష్ట్రం మోర్బీ పట్టణంలో మచ్చూ నదిపై బ్రిటిష్ కాలపు తీగల వంతెన కూలిపోయిన దుర్ఘటనలో మృతుల సంఖ్య 134కు పెరిగింది! మరో ఇద్దరి ఆచూకీ దొరకాల్సి ఉంది. సీఎం భూపేంద్ర పటేల్, హోంమంత్రి హర్ష సంఘ్వీ ఆదివారం రాత్రి నుంచి అక్కడే మకాం వేసి సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్, త్రివిధ దళాల సిబ్బంది సహాయక చర్యల్లో నిమగ్నమయ్యారు. వంతెన కూలుతున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. దుర్ఘటన నేపథ్యంలో గుజరాత్‌లో సోమవారం ప్రధాని నరేంద్ర మోదీ అహ్మదాబాద్‌లో రోడ్డు షో రద్దు చేసుకోగా కాంగ్రెస్ పరివర్తన్ సంకల్ప యాత్రను వాయిదా వేసుకుంది. గుజరాత్‌లోనే ఉన్న మోదీ ఈ ఘటనపై సోమవారం రాత్రి ఉన్నత స్థాయి సమీక్ష జరిపారు. బాధితులకు అన్ని విధాలా సాయమందించాలని ఆదేశించారు. మంగళవారం ఆయన ప్రమాద స్థలిని పరిశీలించనున్నారు. మోర్బీ వంతెన ప్రమాదంపై సుప్రీంకోర్టు లేదా హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి ఆధ్వర్యంలో న్యాయ విచారణ జరిపించాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే డిమాండ్ చేశారు.

బీజేపీ ఎంపీ కుటుంబంలో పెను విషాదం

వంతెన ప్రమాదానికి గుజరాత్‌లోని రాజ్‌కోట్ బీజేపీ ఎంపీ మోహన్‌భాయ్ కల్యాణ్‌జీ కుందారియా కుటుంబంలో ఏకంగా 12 మంది బలయ్యారు! వారంతా ఆయన సోదరుడు, సోదరీమణుల కుటుంబాలకు చెందినవారు. వీరిలో ఐదుగురు చిన్నారులు, నలుగురు మహిళలు, ముగ్గురు పురుషులున్నారు. బ్రిడ్జిని చూసేందుకని వెళ్లి తిరిగిరాని లోకాలకు తరలిపోయారంటూ ఎంపీ కంటతడి పెట్టారు. ప్రమాదానికి కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

'అజంతా'కు నిర్వహణ కాంట్రాక్ట్

మోర్బీ వంతెన నిర్వహణ, ఆపరేషన్ కాంట్రాక్ట్‌ను అజంతా ఒరెవా కంపెనీకి అప్పగించారు. సీఎఫ్‌ఎల్ బల్బులు, గోడ గడియారాలు, ఎలక్ట్రానిక్ బైక్‌ల తయారీకి అజంతా గ్రూప్ పేరొందింది. ఎల్‌ఈడీ టీవీలు, ఎలక్ట్రానిక్ పరికరాలు, కాలిక్యులేటర్లు, సెరామిక్ ఉత్పత్తులనూ తయారు చేస్తోంది. గ్రూప్ వార్షిక టర్నోవర్ రూ.800 కోట్ల పైమాటే.

'ఫిట్‌నెట్ సర్టిఫికెట్' లేకుండానే..

బ్రిడ్జికి ఫిట్‌నెట్ సర్టిఫికెట్ జారీ చేయలేదని మున్సిపల్ చీఫ్ ఆఫీసర్ సందీప్ సింగ్ చెప్పారు. మున్సిపాలిటీ అనుమతి లేకుండానే దాన్ని పునఃప్రారంభించారని తెలిపారు. ''వంతెనపైకి 20–25 మందిని ఒక గ్రూప్‌గా అనుమతిస్తుంటారు. కానీ నిర్వాహక సంస్థ అజంతా ఒరెవా నిర్లక్ష్యంగా ఒకేసారి దాదాపు 500 మందిని వెళ్లనిచ్చింది. అదే ఘోర ప్రమాదానికి దారి తీసింది'' అన్నారు.

9 మంది అరెస్టు

ప్రమాదానికి సంబంధించి ఇప్పటిదాకా 9 మందిని అరెస్టు చేసినట్లు గుజరాత్ పోలీసులు తెలియజేశారు. బ్రిడ్జి నిర్వహణ కాంట్రాక్టును పొందిన అజంతా ఒరెవా కంపెనీపై కేసు నమోదు చేశామని తెలిపారు. ఐపీసీ సెక్షన్ 304, సెక్షన్ 308 కింద కేసు పెట్టామన్నారు. ఎఫ్‌ఐఆర్‌లో ప్రధాన నిందితుడి స్థానంలో అజంతా కంపెనీ పేరు చేర్చామన్నారు. పూర్తి వివరాలు బయటపెట్టేందుకు నిరాకరించారు. అరెస్టయిన 9 మందిలో అజంతా ఒవెరా గ్రూప్‌నకు చెందిన ఇద్దరు మేనేజర్లు, ఇద్దరు టిక్కెట్ బుకింగ్ క్లర్కులు ఉన్నారు.



ఘటనాస్థలి వద్ద కొనసాగుతున్న అన్వేషణ



వంతెన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సీఎం పటేల్



ప్రభుత్వాసుపత్రిలో వరసగా మృతదేహాలు

675 టికెట్లు అమ్మారా?

మోర్బీ వంతెన ప్రమాదానికి ముమ్మాటికీ మానవ తప్పిదమే కారణమని స్పష్టమవుతోంది. ప్రమాద సమయంలో 500 మందికిపైగా జనం వంతెనపై ఉన్నారని స్థానికులు పేర్కొన్నారు. బరువు ఎక్కువై కూలిపోయిందని ప్రభుత్వ అధికారులు చెబుతున్నారు. తీగల సాయంతో వేలాడే ఈ వంతెన సామర్థ్యం కేవలం 150 మంది. అంతకంటే ఎక్కువ మంది వెళితే ఆ బరువును తట్టుకోలేదు. ఈ విషయం తెలిసినప్పటికీ కాంట్రాక్ట్ సంస్థ 'అజంతా ఒరెవా' నిర్లక్ష్యంగా వ్యవహరించింది. ఏకంగా 675 మంది సందర్శకులకు టిక్కెట్లు విక్రయించినట్లు విశ్వసనీయంగా తెలిసింది.

బతుకుతెరువు కోసం వెళ్లి బలయ్యాడు

బర్ధమాన్: పశ్చిమ బెంగాల్ రాష్ట్రం పూర్వ బర్ధమాన్ జిల్లా కేశబ్పతి గ్రామానికి చెందిన 18 ఏళ్ల షేక్ హబీబుల్ ఆర్థిక ఇబ్బందుల కారణంగా పదో తరగతితోనే చదువు ఆపేశాడు. బతుకు తెరువు కోసం గుజరాత్‌లోని మోర్బీకి చేరుకున్నాడు. నగల దుకాణంలో పనికి కుదిరాడు. గత 10 నెలలుగా అక్కడే పనిచేస్తున్నాడు. ఆదివారం తీగల వంతెన చూసేందుకు వెళ్లాడు. దానిపైకి చేరుకొని ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు. షేక్ హబీబుల్ మృతితో స్వగ్రామం కేశబ్పతిలో తీవ్ర విషాదం నెలకొంది. అతడి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. తమ కలలన్నీ చెదిరిపోయాయని హబీబుల్ తండ్రి మహీబుల్ షేక్ వాపోయాడు. హబీబుల్ కుటుంబాన్ని ఆదుకుంటామని అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీ నేత కునాల్ ఘోష్ భరోసానిచ్చారు.



రోదిస్తున్న మృతుల బంధువులు

నా చెల్లెలు కనిపించడం లేదు

ప్రమాదంలో చెల్లెలు కనిపించకుండాపోయిందని ఓ యువకుడు రోదిస్తున్నాడు. ''ఆ వంతెనపైకి మొదటిసారి వెళ్లాం. అప్పటికే వందలాది మంది ఉన్నారు. సెల్ఫీలు తీసుకుంటుండగానే కుప్పకూలింది. నేను మాత్రం ఈదుకొచ్చా. చెల్లి కోసం నిన్నటి నుంచి వెతుకుతూనే ఉన్నా'' అన్నాడు.

భారీ శబ్దం వినిపించింది

''స్నేహితులతో కలిసి వంతెన సమీపంలోనే కూర్చున్నా. అంతలో భారీ శబ్దం వినిపించింది. వంతెన కూలింది. వెంటనే అక్కడికి పరుగెత్తాం. కొందరు ఈదుతూ, మరికొందరు మునిగిపోతూ కనిపించారు. మేం పైపు సాయంతో 8 మందిని రక్షించాం'' అని సుభాష్ భాయ్ అనే ప్రత్యక్ష సాక్షి చెప్పాడు.

నా మిత్రుడు రాజేశ్ ఏమయ్యాడు?

తన మిత్రుడు రాజేశ్ గల్లంతయ్యాడంటూ జయేశ్ భాయ్ అనే యువకుడు కంటతడి పెట్టాడు. అధికారులను అడిగితే పట్టించుకోవడం లేదని వాపోయాడు.

15 మృతదేహాలను బయటకు చేర్చా

వంతెనపై 60 మందికి పైగా వేలాడుతూ కనిపించారని రమేశ్ భాయ్ చెప్పాడు. మిత్రులతో కలిసి తాడు సాయంతో 15 మృతదేహాలను బయటకు తెచ్చామన్నాడు.

విచ్ఛిన్న శక్తులను ఎదిరిద్దాం

ప్రజలకు మోదీ పిలుపు • పటేల్‌కు ఘన నివాళులు



సర్దార్ పటేల్‌కు మోదీ సెల్యూట్

కేవడియా: భారతదేశ ఐక్యతను విచ్ఛిన్నం చేసేందుకు శత్రువులు కుట్రలు పన్నుతున్నారని, అలాంటి కుయుక్తులకు వ్యతిరేకంగా దేశ ప్రజలంతా కలిసికట్టుగా ఉండాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. విచ్ఛిన్నకర శక్తులను ఎదిరించాలని అన్నారు. దేశ తొలి హోంశాఖ మంత్రి సర్దార్ వల్లబ్‌భాయ్ పటేల్ జయంతి సందర్భంగా ప్రధాని మోదీ సోమవారం ఘనంగా నివాళులర్పించారు. గుజరాత్‌లోని కేవాడియాలో ఐక్యతా ప్రతిమ (స్టాచ్యూ ఆఫ్ యూనిటీ) వద్ద 'రాష్ట్రీయ ఏక్తా దివస్' కార్యక్రమంలో ప్రసంగించారు. ''మోర్బీ వంతెన దుర్ఘటనలో మృతిచెందిన వారి పట్ల నా మనసంతా ఆవేదనతో నిండిపోయింది. అయినా విధి, బాధ్యత నన్నిక్కడికి తీసుకొచ్చాయి'' అన్నారు. ఐక్యతా ప్రతిమ వద్ద సాంస్కృతిక నృత్యాలను ప్రమాదం దృష్ట్యా రద్దు చేశారు. ''పటేల్ లాంటి నాయకుడు లేకపోతే ఇండియా పరిస్థితి ఏమిటో ఊహించుకోవడమే కష్టంగా ఉంది. ఐక్యత అనేది మనకు నిర్బంధం, బలవంతం కాదు. అదే మన విశిష్టత. గతంలో వెదజల్లిన విషం తాలూకూ దుష్పరిణామాలు ఇప్పుడూ కనిపిస్తున్నాయి. విదేశీ శక్తులు మనకు చేటు చేసేందుకు చేయాల్సిందంతా చేస్తూనే ఉన్నాయి. వారికి గుణపాఠం చెబుదాం'' అన్నారు.

పటేల్ ప్రధాని అయ్యుంటే...

జయంతి వేడుకలో అమిత్ షా వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: సర్దార్ పటేల్ భారత తొలి ప్రధాని అయితే ప్రస్తుతం దేశానికి కొన్ని సమస్యలుండేవి కాదని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. పటేల్ 147వ జయంతి సందర్భంగా ఢిల్లీలో సర్దార్‌పటేల్ పాఠశాల విద్యార్థులనుద్దేశించి ఆయన మాట్లాడారు. ''లక్షద్వీప్, జోధ్‌పూర్, జునాగఢ్, హైదరాబాద్, కశ్మీర్ వంటి కీలక సంస్థానాలను పటేలే దేశంలో విలీనం చేశారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీలో అత్యధిక ఓట్లు సాధించినా ప్రధాని పదవిని త్యాగం చేయాల్సి వచ్చింది. అందుకే ఇప్పుడు దేశాన్ని కొన్ని అంశాలు వేధిస్తున్నాయి'' అని అన్నారు.





ఇందిరకు నివాళులు...

మాజీ ప్రధాని, దివంగత ఇందిరా గాంధీ వర్ధంతి సందర్భంగా సోమవారం ఢిల్లీలో ఆమెకు ఘన నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ, ప్రస్తుత అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే

చైనా రెండో ల్యాబ్ మాడ్యూల్... విజయవంతంగా అంతరిక్షంలోకి

బీజింగ్: సొంత అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం తియాంగ్‌గాంగ్‌ను నిర్మించుకుంటున్న చైనా ఆ దిశగా మరో ముందడుగు వేసింది. హైనాన్ ప్రావిన్స్‌లోని ప్రయోగకేంద్రం నుంచి దూసుకెళ్లిన లాంగ్ మార్చ్ -5బీ రాకెట్ .. రెండోదైన మెంగ్‌టియాన్ ల్యాబ్ మాడ్యూల్‌ను అంతరిక్షంలోకి తీసుకెళ్లింది. 'త్వరలో ప్రధాన కోర్ మాడ్యూల్ తియాన్హేతో మెంగ్‌టియాన్‌ను అనుసంధానిస్తాం. చివరి మాడ్యూల్ ప్రయోగం విజయవంతమైంది'' అని చైనా మ్యాన్డ్ స్పేస్ ఏజెన్సీ తెలిపింది.

'రెండు వేళ్ల' పరీక్ష ఇంకానా?

- పితృస్వామ్యపు ఆధిపత్య వ్యవస్థకు సూచిక: సుప్రీంకోర్టు
- లైంగిక వేధింపులు, రేప్ బాధితులకు ఎంతో బాధాకరం
- ఆ పరీక్షలు చేసేవారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక
- ఆ పరీక్షను ఆపేయాలని, వైద్య పాఠ్యాంశాల్లోంచి కూడా తొలగించాలని కేంద్రానికి సూచన



సాక్షి, న్యూఢిల్లీ: లైంగిక వేధింపులు, అత్యాచార బాధితులకు 'రెండు వేళ్ల' పరీక్ష నిర్వహించడాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. ఇంత పురోగతి, అభివృద్ధి చెందిన తర్వాత కూడా ఆ విధంగా పరీక్షలు చేయడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇది వారిని మరింత బాధించడమేనని స్పష్టం చేసింది. ''రెండువేళ్ల పరీక్ష ఇంకా కొనసాగుతుండటం విచారకరం. ఇది తిరోగమన పోకడే. అప్పటికే లైంగిక దాడికి గురై విపరీతంగా కుంగిపోయిన వారిని పదేపదే బాధితులుగా మార్చి తీవ్రంగా కించపరచడమే'' అని పేర్కొంది. ''దీన్ని కొనసాగించడానికి ఎట్టి పరిస్థితుల్లోనూ వీల్లేదు. ఎలాంటి శాస్త్రీయతా లేని ఈ పరీక్షను నిషేధించండి'' అని కేంద్రానికి సూచించింది.

రేప్, లైంగిక వేధింపుల బాధితులు రెగ్యులర్‌గా సెక్స్‌లో పాల్గొనే అలవాటు ఉందా, లేదా అని తేల్చడానికి ఈ రెండు వేళ్ల పరీక్ష నిర్వహిస్తారు. అత్యాచారం, హత్య కేసులో నిందితుని హైకోర్టు విడుదల చేయడాన్ని సవాలు చేస్తూ జార్ఖండ్ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై న్యాయమూర్తులు జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ హిమా కోహ్లిలతో కూడిన ధర్మాసనం సోమవారం విచారణ జరిపింది. బాధితురాలికి దేవగఢ్ సదర్ ఆస్పత్రి మెడికల్ బోర్డు రెండు వేళ్ల పరీక్ష జరపడాన్ని ప్రస్తావిస్తూ కీలక వ్యాఖ్యలు చేసింది. ఇలాంటి కేసుల్లో మహిళ సాక్ష్యం ఆమె లైంగిక చరిత్రపై ఆధారపడి ఉండదని కుండబద్దలు కొట్టింది. ''ఒక మహిళ కేవలం లైంగికంగా చురుకుగా ఉంటుందనే కారణంతో తనపై అత్యాచారం జరిగిందని ఆమె చెప్పే మాటలను నమ్మబోమనడం పితృస్వామ్యపు ఆధిపత్య వ్యవస్థకు సూచిక. లైంగిక వేధింపులు, అత్యాచార బాధితులకు రెండు వేళ్ల పరీక్ష నిర్వహించడం వారికి కచ్చితంగా బాధాకరమే. కేవలం లైంగికంగా చురుగ్గా ఉండే మహిళపై అత్యాచారం జరగదన్న అపోహతో మాత్రమే ఈ రెండు వేళ్ల పరీక్ష నిర్వహిస్తున్నారు. అందుకే ఈ పరీక్షను నిలిపేయాలని సుప్రీంకోర్టు పదేపదే చెప్పింది. అయినా అవి ఆగడం లేదు'' అంటూ ఆవేదన వెలిబుచ్చింది. రేప్ జరిగిందా, లేదా తేల్చేందుకు బాధితురాలి లైంగిక చరిత్ర ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రాతిపదిక కాబోదని పునరుద్ఘాటించింది. రెండు వేళ్ల పరీక్ష నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించింది. దీన్ని నిషేధిస్తూ 2014లోనే కేంద్ర ఆరోగ్య శాఖ నిర్దేశకాలు జారీ చేసిందని గుర్తు చేసింది. ''వాటిని మరోసారి ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులన్నింటికీ పంపండి. లైంగిక వేధింపులకు గురైన వారిని పరీక్షించడానికి తగిన విధానాన్ని వైద్యులకు తెలియపరిచేందుకు వర్క్‌షాప్‌లు నిర్వహించండి'' అని కేంద్రాన్ని ఆదేశించింది. రెండు వేళ్ల పరీక్షను ఎట్టి పరిస్థితుల్లోనూ సూచించకుండా వైద్య పాఠ్యాంశాలను సవరించాలని ఆదేశించింది. లైంగిక వేధింపులు, అత్యాచారాలకు గురై ప్రాణాలతో బయటపడిన వారికి రెండు వేళ్ల పరీక్ష జరపకుండా చూడాలని కేంద్ర ఆరోగ్య శాఖకు ధర్మాసనం సూచించింది. నిందితున్ని విడుదల చేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును కొట్టేసింది. అతన్ని దోషిగా నిర్ధారిస్తూ ట్రయల్ కోర్టు విధించిన జీవిత ఖైదునే ఖరారు చేస్తూ తీర్పు వెలువరించింది.

ఒకే దేశం, ఒకే చట్టం... సాధ్యమయ్యేనా?

మళ్లీ తెరపైకి ఉమ్మడి పౌరస్మృతి • ఎన్నికల స్టంటేనంటున్న కేజ్రీవాల్

ఉమ్మడి పౌరస్మృతి (యూనిఫాం సివిల్ కోడ్–యూసీసీ) మరోసారి తెరపైకి వచ్చింది. ఒకే దేశం ఒకే చట్టం ఎజెండాతో గతంలో ఉత్తరాఖండ్ ఎన్నికలప్పుడు యూసీసీ అమలుకు బీజేపీ సర్కారు కమిటీ వేయడం తెలిసిందే. తాజాగా గుజరాత్ కూడా అదే బాట పట్టింది. బీజేపీ పాలిత రాష్ట్రాలు ఇలా వరసగా యూసీసీ అమలుకు సై అంటూ ఉండడంపై చర్చ మొదలైంది. విభిన్న పరిస్థితులున్న దేశంలో ఒకే చట్టం ఎలా సాధ్యమన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి...

కుల, మత, జాతి, ప్రాంత, లింగ భేదాలు లేకుండా దేశ పౌరులందరికీ ఒకే విధమైన చట్టాలను అమలు చేయడమే ఉమ్మడి పౌరస్మృతి. ఇది అమల్లోకి వస్తే పెళ్లిళ్లు, విడాకులు, వారసత్వ హక్కులు, జనన మరణాలు, దత్తత ప్రక్రియకు సంబంధించి పౌరులందరికీ ఒకే చట్టం వర్తిస్తుంది. పౌరులందరికీ ఒకే చట్టాన్ని అమలు చేయడానికి ప్రభుత్వాలు కృషి చేయాలని, అప్పుడే సమానత్వ హోదా దక్కుతుందని రాజ్యాంగంలోని ఆర్టికల్ 44 కూడా చెబుతోంది. హిందూత్వ ఎజెండాతో రాజకీయాలు చేస్తున్న బీజేపీ ఉమ్మడి పౌరస్మృతిని ఎన్నడో తన మేనిఫెస్టోలో చేర్చింది. తన రాజకీయ ఎజెండాలో అగ్రభాగాన ఉన్న అయోధ్య రామ మందిర నిర్మాణం చేపట్టింది. కశ్మీర్ స్వతంత్ర ప్రతిపత్తి కల్పించిన ఆర్టికల్ 370ను రద్దు చేసింది. ఇప్పుడు ఉమ్మడి పౌరస్మృతిపై దృష్టి సారించింది. దేశవ్యాప్తంగా ఒకేసారి అమలు చేయకుండా ముందు తాము అధికారంలో ఉన్న రాష్ట్రాల నుంచి మొదలు పెట్టే వ్యూహంతో ముందుకు వెళ్తోంది. బీజేపీ పాలిత యూపీ, హిమాచల్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్ యూసీసీని దేశవ్యాప్తంగా అమలు చేయాలని గట్టిగా డిమాండ్ చేస్తూనే ఉన్నాయి.

అనుమానాలూ లేకపోలేదు...

అయితే యూసీసీపై హిందువుల్లోనే కాస్త వ్యతిరేకత వచ్చే ఆస్కారముందా అన్న అనుమానాలూ లేకపోలేదు. ''భిన్న మతాలకు చెందిన వారికి వేర్వేరు లా బోర్డులున్నాయి. హిందూ మతానికి చెందినవారు కూడా వేర్వేరు రాష్ట్రాల్లో వేర్వేరు ఆచారాలు పాటిస్తున్నారు. వాటన్నింటికీ ఏకరూపత ఎలా సాధ్యం?'' అన్నది ఒక వాదన. కేవలం మెజార్టీ ఓటు బ్యాంకును ఏకమొత్తంగా కొల్లగొట్టేందుకేనని ఒక వర్గం ఆరోపిస్తోంది. ఇది బీజేపీ ఎన్నికల స్టంటని ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ తదితర నేతలు అంటున్నారు.

అందరికీ ఒకే చట్టాల్లేవా...?

ప్రస్తుతం దేశంలో ముస్లింలు, క్రిస్టియన్లు, పార్సీలకు వారి మత సంప్రదాయాలకు అనుగుణంగా వ్యక్తిగత చట్టాలున్నాయి. ముస్లింలకు షరియా చట్టాలకు అనుగుణంగా ముస్లిం పర్సనల్ లా అమలవుతోంది. దాని ప్రకారం ముస్లిం పురుషులకు నాలుగు పెళ్లిళ్లు చేసుకోవడానికి అనుమతి ఉంది. వేరే మతస్తులకు మాత్రం చట్టప్రకారం ఒక్క భార్యే ఉండాలి. సివిల్ అంశాల్లో కాంట్రాక్ట్ చట్టం, సివిల్ ప్రొసీజర్ కోడ్ వంటి అనేకానేక ఉమ్మడి చట్టాలనూ పలు రాష్ట్రాల్లో భారీగా సవరించారు. గోవాలో 1867 నాటి కామన్ సివిల్ కోడ్ అమల్లో ఉన్నా అక్కడా కేథలిక్కులకు, ఇతర మతాలకు భిన్నమైన నియమాలు పాటిస్తున్నారు. నాగాలాండ్, మిజోరం, మేఘాలయాల్లోనైతే హిందూ చట్టాల్లో కూడా భిన్నత్వం ఉంది.



అనుకూలతలు

- కులం, మతం, ప్రాంతం, వర్గం, స్త్రీ పురుష భేదాలు లేకుండా రాజ్యాంగంలోని లౌకిక స్ఫూర్తికి అనుగుణంగా చట్టపరంగా పౌరులందరికీ సమాన హోదా ఉంటుంది.
- ప్రస్తుతం అమల్లో ఉన్న మతపరమైన పర్సనల్ చట్టాలు కాలం చెల్లినవనే వాదనలున్నాయి. యూసీసీ వస్తే అవన్నీ రద్దవుతాయి.
- రోజురోజుకూ జనాభా పెరిగిపోతున్న దృష్ట్యా దాని కట్టడికి అన్ని మతాల్లోనూ చిన్న కుటుంబాలను ప్రోత్సహించడానికి వీలవుతుంది.
- ఉమ్మడి పౌరస్మృతిని వీలైనంత త్వరగా తేవాలని సుప్రీంకోర్టు పలు కేసుల విచారణ సందర్భంగా కేంద్రానికి సూచించింది. ఇప్పటికే అలా తేకపోవడం దురదృష్టకరమని పలు సందర్భాల్లో పేర్కొంది. భిన్న మతాచారాలకనుగుణంగా కేసులు వస్తున్నప్పుడు తీర్పుల్లో గందరగోళం నెలకొంటోందని 2015లోనూ అభిప్రాయపడింది.

ప్రతికూలతలు

- ఉమ్మడి పౌరస్మృతిని మత, సాంస్కృతిక దాడిగా ముస్లింలు భావిస్తారు. బీజేపీ మైనార్టీలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తోందన్న భావన ప్రబలితే దేశంలో ఘర్షణాత్మక వాతావరణం ఏర్పడవచ్చు.
- రాజ్యాంగంలోని ఆర్టికల్ 25 ద్వారా సంక్రమించే మత స్వేచ్ఛ, మైనార్టీల హక్కులను పరిరక్షించే ఆర్టికల్ 29కి యూసీసీ అడ్డంకిగా మారుతుంది.
- దేశంలోని భిన్నత్వ పరిస్థితుల కారణంగా పెళ్లిళ్లు, విడాకులు, ఆస్తి హక్కులు, విడాకుల సమయంలో ఇచ్చే భరణాలు ఏ ప్రాతిపదికన నిర్ణయించాలనేది పెద్ద సమస్యగా మారవచ్చన్న అభిప్రాయముంది.
- 2016లో మోదీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన లా కమిషన్ కూడా ఉమ్మడి పౌరసత్వ చట్టం ప్రస్తుతం తీసుకురావడం వాంఛనీయం కాదని తేల్చి చెప్పింది.

- సాక్షి, నేషనల్ డెస్క్

రష్యా సైన్యంలోకి అఫ్గాన్ కమాండోలు

వాషింగ్టన్: అఫ్గానిస్తాన్‌లో అమెరికా సేనలతో కలిసి తాలిబన్లపై పోరాడిన ప్రత్యేక దళాల సైనికులు ఇప్పుడు రష్యాకు క్యూ కడుతున్నారు. రష్యా సైన్యంలో చేరి, ఉక్రెయిన్‌పై యుద్ధంలో పాలుపంచుకుంటున్నారు. వీరంతా అమెరికా సైన్యం శిక్షణ ఇచ్చిన కమాండోలు కావడం విశేషం. అఫ్గాన్ నుంచి అమెరికా సైన్యం వెనక్కి మళ్లిన తర్వాత తాలిబన్ల నుంచి ముప్పును తప్పించుకొనేందుకు ఈ కమాండోలు ఇరాన్‌కు చేరుకున్నారు. వీరిని రష్యా తన సైన్యంలో చేర్చుకొని, ఉక్రెయిన్‌కు పంపిస్తోంది. ఈ విషయాన్ని ముగ్గురు అఫ్గాన్ మాజీ సైనికాధికారులు స్వయంగా వెల్లడించారు. యుద్ధంలో పాల్గొన్నందుకు గాను ఒక్కో జవానుకు రష్యా ప్రతినెలా 1,500 డాలర్ల చొప్పున వేతనం చెల్లిస్తోందని తెలిపారు. నిజానికి ఉక్రెయిన్‌పై జరుగుతున్న యుద్ధంలో పాల్గొనడం అఫ్గాన్ కమాండోలకు ఇష్టం లేదని, కానీ, వారికి మరో దారి కనిపించడం లేదని అబ్దుల్ రవూఫ్ అనే మాజీ అధికారులు తెలిపారు.

ప్రత్యేక కోర్టులు అక్కర్లేదు: సుప్రీం

న్యూఢిల్లీ: మనీ లాండరింగ్, పన్నుల ఎగవేత వంటి ఆర్థిక నేరాల కేసుల విచారణ కోసం జిల్లాకో ప్రత్యేక కోర్టు ఏర్పాటుచేయాలన్న ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని సుప్రీంకోర్టు తిరస్కరించింది. ఆర్థిక నేరాల కోసం ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేసేలా కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలను ఆదేశించాలంటూ దాఖలైన పిల్‌ను సీజేఐ జస్టిస్ యు.యు. లలిత్, జస్టిస్ ఎస్.రవీంద్ర భట్, జస్టిస్ బేలా ఎం.త్రివేదిల సుప్రీంకోర్టు ధర్మాసనం సోమవారం విచారించింది. ' ఇప్పటికే ఎమ్మెల్యేలు, ఎంపీలపై కేసుల విచారణకు కోర్టులున్నాయి. పోక్సో కోర్టులున్నాయి. ప్రతి ఒక్క అంశానికి విడిగా కోర్టులు ఏర్పాటుచేస్తూ పోతే కింది స్థాయి జ్యుడీషియల్ వ్యవస్థపై తీవ్ర ఒత్తిడి పెరుగుతుంది. అందుకు ఒప్పుకోం' అంటూ పిల్‌ను తిరస్కరించింది.

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా

మంగళవారం । 1 । నవంబర్ । 2022



నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం
ఇంద్రకీలాద్రి: దుర్గమ్మ సన్నిధిలో జరిగే నిత్యాన్న దానానికి విజయవాడ లబ్బీపేటకు చెందిన ఎం. అలేఖ్య పేరిట కుటుంబ సభ్యులు సోమవారం రూ.1,01,116 విరాళం సమర్పించారు.



ఈవీఎం గోడౌన్ పరిశీలన
చిలకలపూడి: నెలవారీ తనిఖీల్లో భాగంగా బందరులోని ఈవీఎం గోడౌన్‌ను కలెక్టర్ రంజిత్ బాషా సోమవారం పరిశీలించారు. గోడౌన్‌కు ఉన్న సీళ్లను, సీసీ కెమెరాలను తనిఖీచేశారు.



పేట ఏఎంసీ ప్రమాణస్వీకారం
జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని మార్కెట్ యార్డు ఆవరణలో ఏఎంసీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం సోమవారం సాయంత్రం జరిగింది. మంత్రి కాకాని గోవర్ధనరెడ్డి, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

జాతీయ కరాటే పోటీల్లో విజయవాడకు పతకాలు



విజయవాడ స్పోర్ట్స్: ఎనిమిదో జాతీయ కరాటే చాంపియన్‌షిప్‌లో విజయవాడ క్రీడాకారులు మహావీర్ మన్నా, పి.అన్వీ, పి.అర్జున్ సత్తా చాటారు. విజయవాడ రైల్వే ఇనిస్టిట్యూట్‌లో ఇటీవల ఈ పోటీలు జరిగాయి. అండర్–12 బాలికల కటా, కుమితే విభాగాల్లో మహావీర్ మన్న బంగారు పతకాలు, అండర్–14 బాలికల కటా, కుమితే విభాగాల్లో పి.అన్వీ కాంస్య పతకాలు, అండర్–12 బాలుర కటా విభాగంలో పి.అర్జున్ రజిత పతకం సాధించారు. ఈ క్రీడాకారులను జపాన్ కరాటే అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ కొడాలి రవిబాబు అభినందించారు.

అవార్డుల ప్రదానోత్సవ ఏర్పాట్ల పరిశీలన



భవానీపురం (విజయవాడ పశ్చిమ): నగరంలోని ఏ కన్వెన్షన్‌లో రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం నిర్వహించనున్న అవార్డుల ప్రదానోత్సవానికి సంబంధించిన భద్రతా ఏర్పాట్లను ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా సోమవారం పరిశీలించారు. వైఎస్సార్ లైఫ్ టైం అచీవ్‌మెంట్, వైఎస్సార్ అచీవ్‌మెంట్ -2022 అవార్డ్‌ల ప్రదానోత్సవానికి గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, పలువురు వీవీఐపీలు, వీఐపీలు హాజరు కానున్నారు. ఈ నేపథ్యంలో ఏ కన్వెన్షన్ ప్రాంగణంలో భద్రత, బందోబస్తు ఏర్పాట్లను పోలీస్ కమిషనర్ రాణా పరిశీలించారు. సంబంధిత అధికారులు సమన్వయంతో భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. డీసీపీ విశాల్‌గున్నీ, మునిసిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, స్పెషల్ బ్రాంచ్ ఏడీసీపీ సీహెచ్ లక్ష్మీపతి, ట్రాఫిక్ ఏడీసీపీ టి.సర్కార్, సెంట్రల్, సౌత్ ఏసీపీలు వర్మ, రావి కిరణ్, ట్రాఫిక్ ఏసీపీ రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

చెస్ ఇన్ స్కూల్ కోచ్‌లుగా ముగ్గురి ఎంపిక



విజయవాడ స్పోర్ట్స్: ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్, ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) సంయుక్తంగా నిర్వహించిన చెస్ ఇన్ స్కూల్ కోచ్‌ల పరీక్షల్లో విజయవాడ వాసులు ముగ్గురు ఉత్తీర్ణత సాధించారు. అక్టోబర్ 23, 24, 25 తేదీల్లో వర్చువల్‌గా ఈ పరీక్షలు జరిగాయి. ఎస్ఆర్ఆర్ చెస్ కోచింగ్ అకాడమీకి చెందిన కోచ్‌లు కె.ఈశ్వరి, గఫర్, పి.రేణుక చెస్ ఇన్ స్కూల్ కోచ్‌లుగా అర్హత సాధించారు. ఇటీవల తిరుపతిలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి ఆర్.కె. రోజా, శాప్ వీసీ, ఎండీ డాక్టర్ ఎస్.ప్రభాకరరెడ్డి చేతుల మీదుగా ఉత్తీర్ణత పత్రాలను అందుకున్నారు.



సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా 3కే రన్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు, కలెక్టర్ ఢిల్లీరావు, ఆర్చరీ క్రీడాకారిణి జ్యోతిసురేఖ

ఐక్యతారాగం
సర్దార్ వల్లభాయ్‌పటేల్ జయంతిని పురస్కరించుకుని విజయవాడ ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియం వద్ద సోమవారం సమైక్యతా (3కే) ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే మల్లాది విష్ణు, ఎన్టీఆర్ కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు ఈ ర్యాలీని ప్రారంభించారు. స్టేడియం నుంచి బెంజిసర్కిల్ వరకు సాగిన 3కే రన్‌లో పలు పాఠశాలల, కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ప్రపంచ ఆర్చరీ క్రీడాకారిణి వెన్నం జ్యోతిసురేఖ, జిల్లా యువజన సర్వీసుల సీఈఓ. యు.శ్రీనివాసరావు తదితరులు హాజరయ్యారు.

– విజయవాడ స్పోర్ట్స్



విజయవాడ వద్ద కృష్ణానది తీరంలో దీపారాధన చేస్తున్న మహిళలు

భక్తిభావం
కార్తిక మాసం తొలి సోమవారాన్ని పురస్కరించుకుని ఉమ్మడి కృష్ణా జిల్లాలోని శైవక్షేత్రాలు కిటకిటలాడాయి. భక్తులు వేకువ జామునే పుణ్యస్నానాలు ఆచరించి శివాలయాలకు చేరుకుని స్వామిని దర్శించుకున్నారు. కృష్ణా నదీ తీరంలో, ఆలయాల వద్ద మహిళలు దీపారాధనలు, పూజలు చేశారు. విజయవాడ దుర్గాఘాట్, పున్నమి ఘాట్, భవానీఘాట్ భక్తులతో కిటకిటలాడాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

రాచపుండుకు రాజ వైద్యం

- కాంప్రహెన్సివ్ క్యాన్సర్ కేర్ కేంద్రానికి నిధుల కేటాయింపు
- రేడియేషన్ థెరపీ పరికరాలకు రూ.18.03 కోట్లు
- పాథాలజీ, మెడికల్, సర్జికల్ ఆంకాలజీ విభాగాలకు రూ.6.05 కోట్లు
- ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాలకు అనుబంధంగా క్యాన్సర్ కేర్ సెంటర్
- నాలుగు ఉమ్మడి జిల్లాల ప్రజలకు మెరుగైన సేవలే లక్ష్యం



విజయవాడ ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాలకు అనుబంధంగా చినకాకానిలోని క్యాన్సర్ యూనిట్

లబ్బీపేట (విజయవాడ తూర్పు): క్యాన్సర్ రోగులకు రాష్ట్రంలో మెరుగైన వైద్య సేవలు అందించాలనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయాన్ని అమలు చేసే దిశగా అడుగులు పడుతున్నాయి. విజయవాడలోని ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాలకు అనుబంధంగా పూర్తిస్థాయి క్యాన్సర్ సేవలు అందించేందుకు కాంప్రహెన్సివ్ క్యాన్సర్ కేర్ యూనిట్‌ను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. అందులో భాగంగా మొదటి విడతగా క్యాన్సర్ చికిత్సకు అవసరమైన పరికరాల కొనుగోలుకు రూ.24 కోట్లు కేటాయించింది. రేడియేషన్ థెరపీతో పాటు సర్జికల్, మెడికల్ ఆంకాలజీ విభాగాల ఏర్పాటుతో పాటు, క్యాన్సర్ నిర్ధారణకు పాథాలజీ విభాగానికి సైతం అధిక ప్రాధాన్యం ఇవ్వనున్నారు.

చినకాకాని క్యాన్సర్ ఆస్పత్రికి పునరుజ్జీవం

చినకాకానిలో నిరుపయోగంగా ఉన్న క్యాన్సర్ ఆస్పత్రికి పునరుజ్జీవం కలిగించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. అక్కడ అత్యాధునిక రేడియేషన్ థెరపీ మెషిన్ ఏర్పాటుకు నిర్ణయించింది. అందులో భాగంగా రూ.18.30 కోట్లు కేటాయించింది. దీంతో రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ (సర్వైకల్ క్యాన్సర్), అన్నవాహిక క్యాన్సర్, తల, మెడ వంటి అన్ని రకాల క్యాన్సర్‌లకు ఇక్కడ రేడియేషన్ థెరపీ సేవలు అందుబాటులోకి రానున్నాయి. అడ్వాన్స్‌డ్ మామోగ్రామ్ మెషిన్‌ను ఏర్పాటు చేయడంతో క్యాన్సర్ రోగులకు మెరుగైన సేవలు అందించనున్నారు.

మెడికల్, సర్జికల్ ఆంకాలజీ యూనిట్లు

రేడియేషన్ థెరపీ యూనిట్‌తో పాటు, సర్జికల్, మెడికల్ ఆంకాలజీ యూనిట్లు కూడా అందుబాటులోకి తీసుకురానున్నారు. సర్జికల్ ఆంకాలజీ విభాగానికి రూ.3 కోట్లు, మెడికల్ ఆంకాలజీ విభాగానికి రూ.2 కోట్లు కేటాయించారు. క్యాన్సర్‌ను నిర్ధారించేందుకు అవసరమైన పరికరాల కోసం పాథాలజీ విభాగానికి రూ.1.50 కోట్లు కేటాయించారు. ఈ నిధులు మొదటి విడత విడుదల చేయగా, మరిన్ని నిధులు విడుదల చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది.

నాలుగు ఉమ్మడి జిల్లాలకు సేవలు

ఉమ్మడి జిల్లాలైన పశ్చిమగోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాలకు సంబంధించి విజయవాడ ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాలకు అనుబంధంగా క్యాన్సర్ కేర్ యూనిట్ అందుబాటులోకి రానుంది. నాలుగు జిల్లాల క్యాన్సర్ రోగులకు ఇది పెద్ద దిక్కుగా మారనుంది.

క్యాన్సర్ రోగులకు వరం



రాష్ట్ర ప్రభుత్వం కాంప్రహెన్సివ్ క్యాన్సర్ కేర్ యూనిట్‌ను వైద్య కళాశాలకు అనుబంధంగా ఏర్పాటు చేయడం క్యాన్సర్ రోగులకు వరం. క్యాన్సర్ రోగులకు ఇకపై ఇక్కడ అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో సేవలు అందుతాయి. రేడియేషన్ థెరపీ సేవలతో పాటు, సర్జికల్, మెడికల్ ఆంకాలజీ సేవలు అందుబాటులోకి తెచ్చేందుకు నిర్ణయించింది. ప్రస్తుతం వారంలో రెండు రోజులు క్యాన్సర్ ఓపీ నిర్వహిస్తున్నాం. పాత ఆస్పత్రిలో కూడా ఓపీ సేవలు ప్రారంభించేందుకు పరిశీలన చేస్తున్నాం.

–డాక్టర్ ఎస్ఎస్ విఠల్‌రావు, ప్రిన్సిపాల్, ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాల

నాణ్యమైన సేవలు అందిస్తాం



కాంప్రహెన్సివ్ క్యాన్సర్ కేర్ యూనిట్ అందుబాటులోకి వస్తే క్యాన్సర్ రోగులకు నాణ్యమైన సేవలు అందించగలుగుతాం. రేడియేషన్ థెరపీ మెషిన్‌తో రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్, అన్నవాహిక వంటి అనేక రకాల క్యాన్సర్‌లకు చికిత్స చేసే అవకాశం ఉంటుంది.

– డాక్టర్ బి.నెహ్రూ, హెచ్‌ఓడీ, రేడియేషన్ ఆంకాలజీ

నేటి నుంచి న్యాయసేవల కార్యక్రమాలు
చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం నుంచి ఈ నెల 13వ తేదీ వరకు న్యాయసేవల కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణసారిక తెలిపారు. న్యాయసేవా సదన్‌లో సోమవారం జరిగిన పారా లీగల్ వలంటీర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. న్యాయసేవలను ప్రజలకు చేరువ చేయడంతోపాటు, జిల్లాలోని అన్ని జైళ్లలో ఖైదీల పూర్తి సమాచారం సేకరిస్తున్నట్లు తెలిపారు. తగిన న్యాయ సహాయం లేక జైలులో ఉన్న ఖైదీలకు చట్టప్రకారం సాయం చేస్తామన్నారు. న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఎ.పద్మ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పుప్పాల శివరామకృష్ణప్రసాద్, మచిలీపట్నం లా కాలేజీ అధ్యాపకుడు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

హత్య కేసులో జీవిత ఖైదు
విజయవాడ స్పోర్ట్స్: అజిత్‌సింగ్‌నగర్‌లో 2017 జూలై 27వ తేదీన జరిగిన హత్యలో ప్రమేయం ఉన్న ప్రధాన నిందితుడికి జీవిత ఖైదు, మరో ముగ్గురికి మూడేళ్ల చొప్పున జైలు శిక్ష విధిస్తూ విజయవాడ 8వ అదనపు జిల్లా సెషన్ న్యాయమూర్తి డి.లక్ష్మి సోమవారం తీర్పు చెప్పారు. పాత కక్షల నేపథ్యంలో న్యూ రాజరాజేశ్వరిపేటకు చెందిన ముగ్గురిపై నిందితులు కట్ల వేణుగోపాల్, కట్ల సమ్ములు, కట్ల కాళీ, పాట్నా పింజరి రాజా కత్తులతో దాడి చేశారు. ఈ దాడిలో ఒకరు మరణించగా మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ కేసులో బాధితుల తరఫున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కల్యాణి వాదనలు వినిపించి 21 మంది సాక్షులను విచారించారు. నేరం రుజువు కావడంతో ప్రధాన ముద్దాయి కట్ల సమ్ములుకు జీవిత ఖైదు, రూ.500 జరిమానా, వేణుగోపాల్, కాళీ, పింజరి రాజాలకు మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

అట్టడుగు వర్గాలకు సముచిత స్థానమే లక్ష్యం



కులధ్రువీకరణ పత్రాలతో నక్కల కులస్తులు

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు
- నక్కల వారికి కులధ్రువీకరణ పత్రాలు జారీ



కులధ్రువీకరణ పత్రాలు పంపిణీచేస్తున్న ఎమ్మెల్యేలు వెలంపల్లి, మల్లాది విష్ణు, కలెక్టర్ ఢిల్లీరావు, అవినాష్

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): బడుగు, బలహీన వర్గాల వారికి సమాజంలో సముచిత స్థానం కల్పించి, వారిని ఆర్థికంగా బలోపేతం చేయాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు అన్నారు. వందేళ్ల క్రితం తమిళనాడు నుంచి వలస వచ్చిన నక్కల కులస్తులను ప్రభుత్వం గిరిజనులుగా గుర్తిస్తూ కుల ధ్రువీకరణ పత్రాలను మంజూరు చేసింది. కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశం మందిరంలో కలెక్టర్ ఢిల్లీరావు, జాయింట్ కలెక్టర్ శ్రీవాస్ నుపూర్ అజయ్‌కుమార్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు, వెలంపల్లి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ విజయవాడ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జ్ దేవినేని అవినాష్ సోమవారం నక్కల కులస్తులకు కుల ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ.. ఎంతో కాలంగా నక్కల కులస్తులు కుల ధ్రువీకరణ పత్రాల కోసం ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. ఈ సమస్య ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి వెళ్లిందన్నారు. ముఖ్యమంత్రి సూచనల మేరకు ఇటీవల నక్కల కుటుంబాల వారితో సమావేశం నిర్వహించామని తెలిపారు. అధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేపట్టిన అనంతరం పూసల దండలు, ప్లాస్టిక్ బొమ్మలు విక్రయిస్తూ జీవిస్తున్న నక్కల కులానికి చెందిన 147 కుటుంబాలను గిరిజనులుగా గుర్తిస్తూ కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేశామని తెలిపారు. ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ.. నక్కల కులానికి చెందిన వారంతా తన నియోజకవర్గం పరిధిలోనే ఉన్నారని తెలిపారు. 84 మంది నక్కల కులస్తులకు ఇళ్లు మంజూరు చేసి నిర్మాణం కోసం మ్యాచింగ్ గ్రాంట్ కింద రూ.53.55 లక్షలు, 18 మందికి బోరుబావుల కోసం రూ.20 లక్షల, విద్యుదీకరణకు రూ.7.55 లక్షల మంజూరు చేశామని వివరించారు. ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. నక్కల కులస్తులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న కల నేడు సాకారమైందన్నారు. దేవినేని అవినాష్ మాట్లాడుతూ.. కుల ధ్రువీకరణ పత్రాలు పొందడం ద్వారా నక్కల కులస్తులకు సమాజంలో గుర్తింపు లభించిందన్నారు. ట్రైనీ డెప్యూటీ కలెక్టర్లు ఎస్. రామలక్ష్మి, ఖలీఫ్ కౌసర్ బానో, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి రుక్మాంగదయ్య పాల్గొన్నారు.

స్పందనపై ప్రజలకు నమ్మకం కల్పించాలి

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): స్పందనలో అర్జీ ఇస్తే సమస్య పరిష్కారం అవుతుందన్న నమ్మకం ప్రజలకు కల్పించాలని అధికారులను ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం స్పందన జరిగింది. కలెక్టర్ ఢిల్లీరావు, జాయింట్ కలెక్టర్ శ్రీవాస్ నుపూర్ అజయ్ కుమార్ తదితరులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. డివిజన్, మండల, గ్రామ/వార్డు సచివాలయా స్థాయిలోనే స్పందన అర్జీలకు పరిష్కారం చూపి, ప్రజల్లో నమ్మకం కలిగించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్పష్టంచేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి స్పందన కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుని, వారం వారం సమీక్ష చేస్తున్నారని వివరించారు. అర్జీలకు నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపాలని, లేకుంటే తగిన కారణాలను అర్జీదారులకు చెప్పాలని సూచించారు. స్పందన ద్వారానే కాకుండా గ్రామ/వార్డు సచివాలయాలు, 1902 కాల్ సెంటర్, మొబైల్ యాప్, వెబ్ అప్లికేషన్ ద్వారా కూడా ప్రజలు అర్జీలను సమర్పిస్తారని, వాటికి కూడా పరిష్కారం చూపాలని ఆయా శాఖల అధికారులను కలెక్టర్ ఢిల్లీరావు ఆదేశించారు. కార్యక్రమంలో ట్రైనీ డెప్యూటీ కలెక్టర్లు ఎస్.రామలక్ష్మి, ఖలీఫ్ కౌసర్ బానో, డ్వామా పీడీ జె.సునీత, డీఈఓ సి.వి.రేణుక, ఐసీడీఎస్ పీడీ ఉమాదేవి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ప్రజల నుంచి వినతి పత్రాలను స్వీకరిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు, జేసీ శ్రీవాస్ నుపూర్

ముఖ్యమైన అర్జీలు ఇవీ..

- గతంలో తాను కొనుగోలు చేసిన భూమిని రికార్డుల్లో సీలింగ్ భూమిగా నమోదు చేశారని, పట్టా భూమిగా రిజిస్టర్ చేయాలని కోరుతూ మైలవరం మండలం పుల్లూరు గ్రామ శివారు కొత్తగూడేనికి చెందిన ఆకుతోట గురవయ్య అర్జీ సమర్పించారు.
- తాను అనారోగ్యంతో బాధపడుతున్నానని, భర్త లేక పోవడంతో పిల్లలను చదివించేందుకు ఇబ్బందులు పడుతున్నానని, ఆస్తి పంపకాల్లో తనకు రావాల్సిన వాటా ఇప్పించాలని విజయవాడ రూరల్ మండలం రాయనపాడు గ్రామానికి చెందిన పాగోలు ఉమాదేవి కోరారు.
- ల్యాండ్ క్లాసిఫికేషన్‌లో మార్పులు చేసి, తన భూమిని అడంగల్‌లో నమోదు చేసి పట్టా ఇవ్వాలని ఇబ్రహీంపట్నం మండలం మూలపాడు గ్రామానికి చెందిన నిమ్మగడ్డ నాగేశ్వరరావు అర్జీ సమర్పించారు.

ప్రశాంతంగా వీఎంసీ కౌన్సిల్

- 146 అంశాలతో ప్రతిపాదనలు
- 127 అంశాలకు సభ్యుల ఆమోదం

పటమట (విజయవాడ తూర్పు): విజయవాడ నగర పాలక సంస్థ (వీఎంసీ) సర్వసభ్య సమా వేశం సోమవారం ప్రశాంతంగా జరిగింది. నగర పరిధిలోని అన్ని డివిజన్ల అభివృద్ధికి, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో రాజీ లేకుండా పాలన సాగిస్తున్నామని మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్లో జరిగిన ఈ సమావేశానికి మొత్తం 146 అంశాలపై ప్రతిపాదనలు వచ్చాయి. 127 అంశాలను సభ్యులు ఆమోదిస్తూ తీర్మానం చేశారు. 11 అంశాలను ఆఫీస్ రిమార్కులకు పంపగా, మరో నాలుగింటిని తిరస్కరించారు. మరో అంశం వాయిదాపడగా, రెండు అంశాలు రికార్డు, ఇంకొకదానిని ధ్రువీకరణకు పంపారు. అనంతరం జరిగిన ప్రశ్నోత్తరాల సమయంలో డీఅండ్‌ఓ (డేంజర్ అండ్ అఫెన్సివ్) ట్రేడ్ లైసెన్స్ బకాయిల వసూళ్లలో అధికారులు నిబద్ధతగా వ్యవహరించడం లేదని, వీఎల్‌టీ (వేకెంట్ ల్యాండ్ ట్యాక్స్) వసూళ్లలోనూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కార్పొరేటర్లు ఆగ్రహం వ్యక్తంచేశారు. మునిసిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సమాధానమిస్తూ.. ట్రేడ్ లైసెన్స్‌ల వ్యవహారంలో స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తామన్నారు. వీఎల్‌టీలో చాలా మంది భూ యజమానులు స్థానికంగా ఉండకపోవడం, విదేశాల్లో స్థిరపడటం వంటి కారణాలతో బకాయిలు పేరుకుపోతున్నాయని, వాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తామని వివరించారు. ఎమ్మెల్సీ రూహుల్లా, ఎమ్మెల్యేలు వెలంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణు, డెప్యూటీ మేయర్ అవుతు శైలజారెడ్డి, ఫ్లోర్‌లీడర్ వెంకట సత్యం తదితరులు పాల్గొన్నారు. సభ ప్రారంభంలో 1984–85 సంవత్సరం విజయవాడ మేయర్‌గా సేవలు అందించిన లంక గోవిందరాజులు, మాజీ కేంద్ర రక్షణ శాఖమంత్రి ములాయం సింగ్ యాదవ్ మృతికి కౌన్సిల్ సభ్యులు సంతాపం ప్రకటించారు.



కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్న మేయర్ రాయన భాగ్యలక్ష్మి

ప్రధాన అంశాలు ఇవీ..

- వీఎంసీ పరిధిలోని ప్రాథమిక పాఠశాలు, హై స్కూళ్లలో 140 మంది విద్యా వలంటీర్ల అవసరం ఉందని, ఐదు నెలలు తాత్కాలిక పద్ధతిపై నియమించి, ఒక్కొక్కరికి నెలకు రూ.8 వేల గౌరవ వేతనం చెల్లించేందుకు కార్పొరేషన్ జనరల్ బడ్జెట్ నుంచి రూ.56 లక్షలు ఖర్చు చేయాలని వచ్చిన ప్రతిపాదనకు సభ్యులు ఆమోదం తెలిపారు.
- సర్కిల్–3 పరిధిలోని కృష్ణలంక, రాణీగారితోట, రామలింగేశ్వర నగర్‌లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడీ) ట్రంక్ లైన్ పూర్తిగా దెబ్బతిన్నదని, పూడిక తొలగింపునకు రూ.69.64 లక్షలను కార్పొరేషన్ జనరల్ బడ్జెట్ నుంచి ఖర్చు చేయాలని వచ్చిన ప్రతిపాదనపై సభ్యులు చర్చించి ఆమోదిస్తూ తీర్మానం చేశారు.
- వినోద సినిమా థియేటర్, మహంతి మార్కెట్ వద్ద ఉన్న మరుగుదొడ్లను సులభ్ ఇంటర్నేషనల్ సోషల్ సర్వీసెస్‌కు 20 ఏళ్ల క్రితం బీఓటీ (బిల్డ్ ఆన్ ట్రాన్స్‌ఫర్) కింద నామినేషన్ పద్ధతిలో కేటాయించగా, ఆ కాలపరిమితి పూర్తయిందని, దీనిని మరో 20 ఏళ్లపాటు కొనసాగించాలని వచ్చిన ప్రతిపాదనకు సభ్యులు ఆమోదం తెలిపారు.
- సర్వసభ్య సమావేశం జరిగే సందర్భంలో కౌన్సిల్ హాల్లో ఎవరూ సెల్‌ఫోన్లు వినియోగించకుండా నివారించేందుకు చర్యలు తీసుకోవాలని వచ్చిన ప్రతిపాదనపై సభ్యులు చర్చించి ఆమోదించారు.

రైతులకు మేలు జరిగేలా చూస్తాం

- రబీ సాగుకు నీటి విడుదలపై రైతుల అభిప్రాయాలు తీసుకుంటాం
- అందరి ఆమోదంతోనే నిర్ణయం ప్రకటిస్తాం
- రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్



రైతులతో మాట్లాడుతున్న మంత్రి జోగి రమేష్

పెడన: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతు ప్రభుత్వమని, రైతులకు మేలు జరిగేలా చూస్తామని రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ స్పష్టం చేశారు. పెడన మార్కెట్ యార్డులోని కమిటీ హాలులో సోమవారం పెడన నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, రైతులు, ఆర్‌బీకే చైర్మన్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రబీ సాగు కోసం నీరు అందించడానికి రైతులందరి నుంచి అభిప్రాయాలు తీసుకుంటామన్నారు. ఈ మేరకు ఇప్పటికే సంబంధిత శాఖాధికారులకు ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. రైతుల నుంచి అభిప్రాయాల సేకరణ పూర్తయిన తరువాత నివేదిక ప్రకారం అందరి ఆమోదంతో వారం రోజుల్లో నిర్ణయం వెల్లడిస్తామని వివరించారు. రైతులు చాలా మంది రబీకి సాగునీరు ఇస్తారా...ఇవ్వరా అంటూ అడుగుతున్నారని తెలిపారు. ఈ విషయమై నీటిపారుదల శాఖ, ఆ శాఖ సలహా మండలి సమావేశాన్ని ఏర్పాటు చేసి అందుకు అనుగుణంగా రైతుల అభిప్రాయాల మేరకు నిర్ణయం తీసుకుని అమలు చేస్తామన్నారు. ప్రస్తుతం అధిక సంఖ్యలో రైతులు రబీకి సాగునీరు ఇవ్వాలని కోరుతున్నారని, ఆ దిశగానే చర్యలు తీసుకుంటామన్నారు. మంత్రి ప్రకటనతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. సమావేశంలో రైతులతో పాటు వైఎస్సార్ సీపీ నాయకులు కొండవీటి నాగబాబు, గరికిపాటి వెంకట రామానాయుడు, పెడన, గూడూరు, బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాలకు చెందిన రైతు నాయకులు, రైతులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన ఏజీపీ

బంటుమిల్లి మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు అదనపు ప్రభుత్వ న్యాయవాది(ఏజీపీ)గా నియమితులైన ఇల్లూరి సుబ్బారాయుడు మంత్రి జోగి రమేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి పుష్పగుచ్ఛం అందజేయడంతో మంత్రి అభినందనలు తెలియజేశారు.

విద్యార్థినిపై లైంగిక వేధింపులు

లైబ్రరీ అసిస్టెంట్‌కు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన బంధువులు



శ్రీకృష్ణపై దాడి చేస్తున్న బాలిక బంధువులు (నిందితుడు చేతికి గడియారం పెట్టుకున్న వ్యక్తి)



పోలీస్ స్టేషన్ వద్ద పోలీసుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న మంత్రి జోగి రమేష్

పెడన: పాఠశాలలో లైబ్రరీ అసిస్టెంట్ విద్యార్థినిని వికృత చేష్టలు, మాటలతో లైంగిక వేధింపులకు గురి చేయడంతో బాలిక తల్లి, బంధువులు దేహశుద్ధి చేశారు. ఈ సంఘటన కృష్ణాజిల్లా పెడన పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మచిలీపట్నం ఈడేపల్లికి చెందిన పల్లపాటి శ్రీకృష్ణ(47) పెడన పట్టణంలోని భట్ల జ్ఞాన కోటయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో లైబ్రరీ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఆ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న బాలిక హైస్కూల్లో జరిగే గ్రంథాలయ తరగతులకు హాజరయ్యేది. గత రెండు రోజులుగా ఇంటి వద్ద ఏడుస్తూ ఉండటం గమనించిన తల్లి ఆరా తీయడంతో బాలిక పాఠశాలలో శ్రీకృష్ణ తనను లైంగికంగా వేధిస్తున్న విషయాన్ని తల్లికి చెప్పింది. దీంతో తల్లి దుర్గాంబిక తన బంధువులతో కలసి సోమవారం ఉదయం పాఠశాలకు వెళ్లి హెచ్‌ఎం గోపాలరావును నిలదీశారు. ఆయన శ్రీకృష్ణను పిలిచి విచారిస్తున్న సమయంలో బాలిక బంధువులు అకస్మాత్తుగా శ్రీకృష్ణపై దాడి చేశారు. సమాచారం అందుకున్న పెడన ఎస్‌ఐ రవిచంద్ర పాఠశాలకు వెళ్లి శ్రీకృష్ణను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బాలిక తల్లి దుర్గాంబిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ కేసుతో పాటు పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బాలిక కుటుంబానికి మంత్రి పరామర్శ

ఘటన గురించి తెలుసుకున్న రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ సోమవారం సాయంత్రం బాలిక ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇది చాలా దురదృష్టకరమైన ఘటన అని, విద్యాబుద్ధులు నేర్పించాల్సిన వ్యక్తి దుర్మార్గపు ఆలోచనలతో వ్యవహరించడం చాలా బాధాకరమన్నారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని, సంబంధిత శాఖాధికారులు కూడా శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బాలిక తల్లికి ధైర్యం చెప్పి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

లైబ్రరీ అసిస్టెంట్‌పై చర్యలకు సిఫార్సు

మచిలీపట్నం: విద్యార్థినితో అసభ్యకరంగా ప్రవర్తించిన పెడన జెడ్పీ స్కూల్ లైబ్రరీ అసిస్టెంట్ పల్లపాటి శ్రీకృష్ణపై క్రమశిక్షణ చర్యలకు సిఫార్సు చేసినట్లు కృష్ణాజిల్లా డీఈవో తాహెరా సుల్తానా సోమవారం వెల్లడించారు. బాలిక తల్లి ఫిర్యాదుపై డెప్యూటీ డీఈవోతో విచారణ జరిపించామన్నారు. శ్రీకృష్ణపై సర్వీసుపరంగా క్రమశిక్షణ చర్యలు తీసుకునేలా జెడ్పీ సీఈవోకు విచారణ నివేదికను పంపించామని పేర్కొన్నారు.

బీమా సొమ్ముకు వడ్డీ చెల్లించండి

చిలకలపూడి(మచిలీపట్నం): హెచ్‌డీఎఫ్‌సీ స్టాండర్డ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆలస్యంగా చెల్లించిన బీమా సొమ్ముకు వడ్డీ చెల్లించాలని వినియోగదారుల ఫోరం సభ్యులు సోమవారం తీర్పు చెప్పారు. పాలసీ మెచ్యూర్ అయినప్పటికీ 110 రోజులు ఆలస్యంగా ఇన్సూరెన్స్ సొమ్మును చెల్లించటంతో కె.వెంకట సుబ్రహ్మణ్య రమణమూర్తి వినియోగదారుల ఫోరంను ఆశ్రయించారు. ఫోరం అధ్యక్షుడు చింతలపూడి కిషోర్, సభ్యులు నందిపాటి పద్మారెడ్డి, లక్ష్మీరాయల పూర్వాపరాలు విచారించిన అనంతరం పాలసీదారుడు రమణమూర్తికి ఆలస్యమైన 110 రోజులకు 9 శాతం వడ్డీ చెల్లించాలని, మానసిక వేదనకు గురి చేసినందుకు రూ.10వేలు, వ్యాజ్యం ఖర్చుల నిమిత్తం రూ.5 వేలు చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు.

బస్సు ఢీకొని వ్యక్తి దుర్మరణం



ఘటనా స్థలిలో రక్తపు మడుగులో పడి ఉన్న శివరామకృష్ణ

చల్లపల్లి: రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందగా, మరొకరు తీవ్ర గాయాలకు గురైన ఘటన స్థానిక బస్టాండ్ సెంటరులో జరిగింది. విజయవాడ నుంచి వస్తున్న పాసింజర్ హైర్ బస్సు సోమవారం మధ్యాహ్నం బస్టాండ్ సెంటరులో మలుపు తిరిగి బస్టాండ్ లోపలికి వెళ్లే క్రమంలో ఎదురుగా వచ్చిన ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు ద్విచక్ర వాహనంపై ఉన్న ఇద్దరి తలలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వారిని లక్ష్మీపురం శివారు పుచ్చగడ్డకు చెందిన కందుల శివరామకృష్ణ, గొరిపర్తి ఏడుకొండలుగా గుర్తించారు. ఏడుకొండలును ఒక యువకుడు బైక్‌పై స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, రక్తపు మడుగులో పడివున్న శివరామకృష్ణను 108 అంబులెన్సులో ఆసుపత్రికి చేర్చారు. శివరామకృష్ణ పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు ప్రాథమిక చికిత్స చేసి మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శివరామకృష్ణ మృతి చెందాడు. ఏడుకొండలుకు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స చేసి బందరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ కోలుకుంటున్నాడు. పోలీసులు ఘటనా స్థలిని పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు.

లాస్య వైద్య ఖర్చులకు రూ.8.01 లక్షల సాయం



అవనిగడ్డలో లాస్య తండ్రికి నగదు అందజేస్తున్న కళాశాల కరస్పాండెంట్ ఉమామహేశ్వరరావు

అవనిగడ్డ: గాజుల లాస్యకు స్థానిక ఎస్‌వీఎల్ విద్యా సంస్థల విద్యార్థులు రూ.8.01 లక్షలను కరస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వరరావు ద్వారా లాస్య తండ్రి గాజుల మురళీకి అందజేశారు. విజయవాడలో ఓ ప్రయివేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్న లాస్యకు తోటి విద్యార్థులు ఆర్థికసాయం అందించారు. లాస్యకు రెండు కిడ్నీలు దెబ్బతినడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఎస్‌వీఎల్ క్రాంతి డిగ్రీ కళాశాలలో డిగ్రీ చదువుతున్న లాస్య త్వరగా కోలుకుని తిరిగి కళాశాలకు యథావిధిగా వచ్చి చదువుకోవాలని కళాశాల కరస్పాండెంట్ ఉమామహేశ్వరావు, విద్యార్థులు ఆకాంక్ష వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు సమన్వయంతో పనిచేయండి



మాట్లాడుతున్న కృష్ణాజిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా, చిత్రంలో ఏఎస్పీ రామాంజనేయులు, డీటీవో సీతాపతిరావు

కృష్ణాజిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా

చిలకలపూడి(మచిలీపట్నం): రోడ్డు ప్రమాదాల నివారణకు ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి నివారించాలని కృష్ణాజిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ హాలులో రోడ్డు భద్రత నివారణ కమిటీ సమావేశాన్ని సోమవారం ఆయన నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల విషయంలో అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయటంతో పాటు లైసెన్సు లేని వాహన చోదకులను గుర్తించి కేసులు నమోదు చేయాలన్నారు. ప్రమాదాలకు ఆస్కారంగా ఉన్న జంక్షన్ల వద్ద ఎస్ క్రాస్ దిమ్మలను ఏర్పాటు చేయటంతో పాటు బ్లాక్‌స్పాట్స్ వద్ద సూచిక బోర్డులను సిద్ధం చేసుకోవాలన్నారు. వేగ నియంత్రణ బోర్డులు సైతం రహదారి పక్కన ఏర్పాటు చేయాలన్నారు. పెనమలూరు సమీపంలో కళాశాలల వద్ద సిగ్నల్ లైట్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. తాడిగడప, కామయ్యతోపు సెంటర్లలో సిగ్నల్ లైట్ల ఏర్పాటుకు స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకోవాలని కలెక్టర్ పోలీస్ అధికారులకు సూచించారు. మచిలీపట్నం - విజయవాడ జాతీయ రహదారిలో ప్రమాదాలను నివారించేందుకు 15 ప్రదేశాలను గుర్తించామని, ఆ ప్రదేశాల వద్ద ఉన్న గ్రామాల ప్రజల రాకపోకలకు డివైడర్ల వద్ద గ్రిల్స్ ఏర్పాటు చేసేందుకు అంచనాలు రూపొందించాలన్నారు. ఆర్టీసీ డిపో నుంచి బస్సులు బయలుదేరే సమయంలో ముందుగా డ్రైవర్లకు ఆల్కహాల్ పరీక్షలు తప్పనిసరిగా నిర్వహించాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. మచిలీపట్నం ప్రధాన రహదారిలో నిత్యం సంచరిస్తున్న పశువుల నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవాలని కమిషనర్ చంద్రయ్యను ఆదేశించారు. రాత్రి సమయాల్లో రహదారులపై గేదెలు ఉండటంతో వాహనాలకు ఉన్న లైట్లు కనపడక పెద్ద పెద్ద ప్రమాదాలు జరుగుతున్నాయని, వీటి నియంత్రణకు పశువుల యజమానులతో సమావేశాలు నిర్వహించి వారి ఇంటి వద్దనే పశువులు ఉంచుకునేలా అవగాహన కల్పించాలన్నారు. రహదారి పైకి వస్తే అపరాధ రుసుం వసూలు చేయాలన్నారు. ఇసుక రీచ్‌ల నుంచి వచ్చే వాహనాలను రాత్రి సమయాల్లో మాత్రమే అనుమతించాలని కలెక్టర్ రవాణాశాఖ అధికారులకు సూచించారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ రామాంజనేయులు, జిల్లా రవాణాశాఖ అధికారి ఎం.సీతాపతిరావు, జిల్లా ప్రజా రవాణాధికారి జి.నాగేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితులు అరెస్ట్



పోలీసులు అరెస్ట్ చేసిన నిందితులు

విజయవాడ స్పోర్ట్స్: గత ఏడాది అక్టోబర్ 31వ తేదీన నున్నలో జరిగిన పీతల అప్పలరాజు అలియాస్ బిల్డర్ రాజు హత్య కేసులో నిందితులను ఎట్టకేలకు పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను సోమవారం విజయవాడ పోలీస్ కమాండ్ రూంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పశ్చిమ పోలీస్ జోన్ ఇన్‌చార్జ్ డీసీపీ కొల్లి శ్రీనివాసరావు వెల్లడించారు. వివరాలు ఆయన మాటల్లోనే... విశాఖపట్నంకు చెందిన రాజు భవన నిర్మాణ పనులు చేపడుతూ విజయవాడలో ఒంటరిగా నివాసం ఉండేవాడు. అదే ఇంట్లో రాజు వద్ద పని చేసే తాపీ మేస్త్రీ కొటారి సాయి కుమార్, అతని భార్య సుధారేవతి నివాసం ఉండేవారు. సాయికుమార్, సుధారేవతి దంపతులు హతుడు రాజు వద్దే పని చేసేవారు. ఈ క్రమంలో కోరిక తీర్చమని సుధారేవతిని రాజు తరచూ బలవంతం చేసేవాడు. ఈ విషయాన్ని సుధారేవతి తన భర్తకు చెప్పడంతో రాజును హతమార్చేందుకు వారిద్దరూ పథకం పన్నారు. రాజును హత్య చేసేందుకు సాయికుమార్ తమ బంధువులైన భవానీ శంకర్, శివపార్వతి, చూడామణిల సాయం కోరారు. పథకం ప్రకారం ముందుగా భోజనంలో ఎలుకల మందు కలిపి రాజుకు ఇచ్చారు. రాజు అపస్మారక స్థితిలోకి చేరుకోగానే అతని తలపై మోది హత్య చేసి ఇంట్లో ఉన్న 30 గ్రాముల బంగారంతో పరారయ్యారు. ఈ నెల 30వ తేదీన శాంతినగర్ డొంక రోడ్డు వద్ద సంచరిస్తున్న నిందితులు సాయికుమార్, సుధారేవతి, భవానీశంకర్, శివపార్వతి, చూడామణిలను అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసినట్లు డీసీపీ చెప్పారు. నిందితుల నుంచి 30 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సమావేశంలో ఏసీపీ రమణమూర్తి, సీఐ కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

భర్తకు తీవ్రగాయాలు



కృపావరం మృతదేహం

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): బైకుపై వెళ్తున్న దంపతులను టిప్పర్ లారీ ఢీకొట్టగా భార్య దుర్మరణం చెందింది. భర్తకు తీవ్రగాయాలయ్యాయి. గుంటుపల్లి సమీపంలో 65వ నంబర్ జాతీయ రహదారిపై సోమవారం ఈ ఘటన జరిగింది. వీరులపాడు మండలం గూడెంమాధవరానికి చెందిన గణపవరపు కృష్ణప్రసాద్, కృపావరం దంపతులు బైకుపై తమ వ్యక్తిగత పనుల కోసం విజయవాడ వెళ్తున్నారు. గుంటుపల్లి దాటిన మరుక్షణం వెనుక నుంచి వచ్చిన టిప్పర్ లారీ బైకును ఢీకొట్టింది. ఈ ఘటనలో భార్య కృపావరం దుర్మరణం చెందింది. భర్త కృష్ణప్రసాద్‌కు తీవ్రగాయాలు అయ్యాయి. ఇబ్రహీంపట్నం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని భర్తను వైద్యశాలకు తరలించారు. భార్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విజయవాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



మృతి చెందిన వ్యక్తి

గుణదల (విజయవాడ తూర్పు): గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన గుణదల పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సుమారు 35 ఏళ్ల వ్యక్తి గులాబీ తోట తూములు సెంటర్ వద్ద అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. ఈ వ్యక్తి వద్ద తిరుపతి నుంచి విజయవాడ రైల్వే టికెట్ ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. 108 సిబ్బంది వైద్య పరీక్షలు చేసి వ్యక్తి మృతి చెందినట్లు నిర్ధారించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు మృత దేహాన్ని పంచనామా నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

దొంగతనం కేసులో నిందితులకు జైలు

విజయవాడ స్పోర్ట్స్: ఈ ఏడాది ఆగస్టు 1వ తేదీన సింగ్‌నగర్‌లో జరిగిన దొంగతనం కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడు బొజ్జా నితీష్‌కుమార్‌కు మూడు నెలల సాధారణ జైలుశిక్ష విధిస్తూ విజయవాడ మెట్రోపాలిటన్ కోర్టు న్యాయమూర్తి సి.హెచ్.సునందమ్మ సోమవారం తీర్పు చెప్పారు. ఈ ఏడాది జూలై 11వ తేదీన సింగ్‌నగర్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగిన మరో దొంగతనం కేసులో నిందితులు ఉయ్యాల రాజేష్, నంబూరి బోలె మణికంఠలకు మూడు నెలల 15 రోజులు సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

గోవాడ జాన్ వెస్లీకు గౌరవ డాక్టరేట్



గోవాడ జాన్ వెస్లీకు గౌరవ డాక్టరేట్‌ను అందజేస్తున్న దృశ్యం

మధురానగర్(విజయవాడ సెంట్రల్): విజయవాడ మధురానగర్ పసుపుతోటకు చెందిన గోవాడ జాన్ వెస్లీ చేస్తున్న సేవలకు యునైటెడ్ థియోలాజికల్ బైబిల్ కాలేజి గౌరవ డాక్టరేట్‌ను అందజేసింది. యూఎస్‌ఏ డే స్ప్రింగ్ థియోలాజికల్ యూనివర్సిటీ ఉన్నత అధికారులు జాన్ వెస్లీ సేవలను గుర్తించి ఇటీవల గోవాలో జరిగిన కార్యక్రమంలో ఆయనకు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య



మృతి చెందిన సంగమేశ్వరరావు

గోకరాజుపల్లి(వీరులపాడు): ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ వ్యక్తి పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని గోకరాజుపల్లి గ్రామంలో సోమవారం జరిగింది. ఎస్‌ఐ సోమేశ్వరరావు తెలిపిన సమాచారం మేరకు గోకరాజుపల్లి గ్రామానికి చెందిన పాపినేని సంగమేశ్వరరావు (57) వ్యవసాయంతో పాటు కోళ్ల ఫారాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి తొమ్మిది గంటల సమయంలో కోళ్ల ఫారం వద్దకు వెళ్తున్నానని భార్య నాగసుధకు చెప్పి వెళ్లారు. సోమవారం తెల్లవారుజామున నాలుగు గంటలకు ఇంటికి వెళ్తున్నానని అక్కడ పనిచేసే వ్యక్తితో చెప్పి బయలుదేరాడు. ఎంత సేపటికీ ఇంటికి రాకపోవటంతో తమ సమీప బంధువు పంచుమర్తి సతీష్‌కుమార్‌కు తెలపగా గ్రామంలో గాలించారు. గ్రామ శివారులోని శ్మశానవాటికలో పురుగు మందు తాగి నిర్జీవంగా పడి ఉండటాన్ని గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అప్పుల బాధ తాళలేక ఆత్మహత్యకు పాల్పడినట్లు భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులున్నారు.

క్లుప్తంగా

జోనల్ కమిషనర్ పదవీ విరమణ



పటమట(విజయవాడ తూర్పు): నగర పాలక సంస్థ సర్కిల్–3 జోనల్ కమిషనర్ యల్. పార్థసారథి సోమవారం స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు. సుదీర్ఘ సేవలు అందించిన ఆయన్ను వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సన్మానించారు. విధి నిర్వహణలో పార్థసారథి వ్యవహరించిన తీరును అభినందించారు. అదనపు కమిషనర్ (జనరల్)యం. శ్యామల, అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) కేవీ సత్యవతి, మేనేజర్ బి. శ్రీనివాస్, ఇతర అధికారులు, మినిస్టీరియల్ సిబ్బంది పార్థసారథిని సన్మానించారు.

ఆర్చరీలో షణ్ముఖి ప్రతిభ



లబ్బీపేట(విజయవాడతూర్పు): అక్టోబరు 17 నుంచి 19 వరకూ విజయనగరంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ 42వ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ రాష్ట్ర స్థాయి ఆర్చరీ చాంపియన్‌షిప్ 2022లో నగర విద్యార్థిని బి.షణ్ముఖి నాగసాయి సత్తా చాటింది. శ్రీ దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ మొదటి ఏడాది చదువుతున్న ఆమె, రాష్ట్ర స్థాయి పోటీల్లో మొదటి స్థానంలో నిలిచి జాతీయ పోటీలకు ఎంపికైంది. దీంతో ఈ నెల 3 నుంచి 12 వరకూ గోవాలో జరగనున్న జూనియర్ నేషనల్ పోటీల్లో పాల్గొననుంది. రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానంలో నిలిచిన తమ విద్యార్థి షణ్ముఖి జాతీయ స్థాయిలో కూడా సత్తా చాటాలని ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. పద్మజ ఆకాంక్షిస్తూ అభినందనలు తెలిపారు.

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి

గుణదల (విజయవాడ తూర్పు): విద్యార్థులు పాఠ్యాంశాలపై పట్టు సాధించి భవిష్యత్‌లో శాస్త్రవేత్తలుగా ఎదగాలని న్యాయవాది కస్తూరి శివశంకర్ అన్నారు. ఆంధ్ర లయోల కళాశాలలో సోమవారం రెసోనెన్స్–2022 కార్యక్రమం నిర్వహించారు. ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజిక్స్ టీచర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథి గా హాజరైన ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకుని పాఠ్యాంశాలపై పట్టు సాధించాలని కోరారు. ముఖ్యంగా సైన్స్ విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ దిశగా ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకుని వాటిని సాకారం చేసుకోవాలని సూచించారు. కేవలం మార్కులే పరమావధిగా కాకుండా విశ్లేషణాత్మకంగా చదువుకోవాలని చెప్పారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను పెంపొందించే దిశగా విద్యా సంస్థలు కృషి చేయాలని అభిప్రాయపడ్డారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ లూర్దురాజ్, అధ్యాపకులు పి.శ్రీనివాస్ శాస్త్రి, టి.శ్రీకుమార్, సహాయభాస్కరన్ తదితరులు పాల్గొన్నారు.

చెస్ రేటింగ్ పోటీల్లో క్రీడాకారుల సత్తా



విజయవాడ స్పోర్ట్స్:ఆలిండియా ఓపెన్ రాపిడ్ రేటింగ్ చెస్ చాంపియన్‌షిప్‌లో గుణదలలోని సెయింట్ జాన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు టి.నిశ్చల్, టి.నాగషణ్ముక్ సత్తా చాటారు. ఆంధ్రా చెస్ అసోసియేషన్, ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) ఆధ్వర్యాన తిరుపతిలో ఈ నెల 29, 30 తేదీల్లో ఈ పోటీలు జరిగాయి. జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన నిశ్చల్ ఓపెన్ క్యాటగిరిలో విజేతగా నిలిచి రూ.8 వేల నగదు బహుమతిని, నాగషణ్ముక్ అండర్–7 కేటగిరికి ప్రాతినిధ్యం వహించి సిల్వర్ మెడల్‌తో పాటు రూ.4 వేల నగదు బహుమతిని కైవసం చేసుకున్నారు. విజేతలను ఆంధ్రా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.వి. శర్మ, స్పార్క్ చెస్ అకాడమీ కార్యదర్శి, కోచ్ టి.నరేష్ అభినందించారు.

ఘనంగా ఏఐటీయూసీ వ్యవస్థాపక దినోత్సవం

భవానీపురం(విజయవాడ పశ్చిమ):ఆలిండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటీయూసీ) 103వ వ్యవస్థాపక దినోత్సవం గొల్లపూడిలోగల రాష్ట్ర కార్యాలయం వద్ద సోమవారం ఘనంగా నిర్వహించారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఏఐటీయూసీ పతాకాన్ని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీ ఓబులేసు ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

గుణదల (విజయవాడ తూర్పు): ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. 2వ డివిజన్ పరిధి గుణదలలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సంక్షేమంతో పాటు పారదర్శక పాలన సాధ్యమైందన్నారు. కోట్లాది రూపాయల నిధులతో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఎటువంటి దళారీ వ్యవస్థ లేకుండా ప్రభుత్వం అమలు పరుస్తున్న పథకాలు నేరుగా ప్రజలకు అందుతున్నాయని వివరించారు. గత ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాలు నిర్వీర్యమయ్యాయని విమర్శించారు. టీడీపీ పాలనలో పేదల బతుకులు రోడ్డున పడ్డాయని గుర్తు చేశారు. కుల, మత ప్రాంతాలకు అతీతంగా ప్రస్తుతం మన రాష్ట్రం అభివృద్ధి దిశగా పయనిస్తుందని చెప్పారు.



సంక్షేమ పథకాల అమలు గురించి వివరిస్తున్న దేవినేని అవినాష్

కొండ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తున్నాం..

తూర్పు నియోజకవర్గం పరిధిలో ఉన్న కొండ ప్రాంతాలను అభివృద్ధి చేసే దిశగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. గుణదల, మాచవరం, చుట్టుగుంట, మొగల్రాజపురం, క్రీస్తురాజపురం తదితర ప్రాంతాల్లో వేలాది మంది పేదలు నివసిస్తున్నారని తెలిపారు. వీరందరికీ తాగునీరు, రహదారులు, విద్యుత్ వంటి సదుపాయాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే ఆయా ప్రదేశాల్లో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని వివరించారు. 2వ డివిజన్ కార్పొరేటర్ అంబడిపూడి నిర్మలాకుమారి, వైఎస్సార్ సీపీ నాయకులు రవిప్రకాష్, చందా కిరణ్ తేజ, డేవిడ్ రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గుండె వైద్యంలో ఆధునిక టెక్నాలజీ అభినందనీయం

మంత్రి జోగి రమేష్

లబ్బీపేట(విజయవాడతూర్పు): గుండె వైద్యంలో ఆధునిక టెక్నాలజీని అందుబాటులోకి తేవడం అభినందనీయమని రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. విజయవాడ ఆంధ్రా హార్ట్ అండ్ బ్రెయిన్ ఇనిస్టిట్యూట్‌లో ఓసీటీ (ఆప్టికల్ కొహెరెన్స్ టోమోగ్రఫీ) పరికరాన్ని సోమవారం సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణుతో కలిసి జోగి రమేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నాణ్యమైన వైద్య సేవలు అందుతాయని చెప్పారు. విజయవాడ ఆంధ్రా హాస్పటల్ అంటే కచ్చితమైన వ్యాధి నిర్ధారణతో పాటు మంచి వైద్యం అందుతుందనే నమ్మకం ప్రజల్లో ఉందన్నారు. సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ గుండె వైద్యంలో ఆధునిక టెక్నాలజీ అందుబాటులోకి రావడం మంచి పరిణామం అన్నారు.

అనంతరం ఆస్పత్రి చీఫ్ కార్డియాలజిస్ట్ డాక్టర్ జె. శ్రీమన్నారాయణ మాట్లాడుతూ ఓసీటీ మెషిన్ ద్వారా రక్తనాళాల్లోని పూడికలను కచ్చితమైన నిర్ధారణ చేయవచ్చని వెల్లడించారు. కొలెస్ట్రాల్, కాల్షియం, స్టెంట్ ఎంత వేయాలి, ఏ సైజులో వేయాలి అనే అంశాలు తెలుసుకోవచ్చని వెల్లడించారు. అసలు స్టెంట్ అవసరమా లేదా అనేది సైతం తేల్చవచ్చన్నారు. బెల్జియంకు చెందిన డాక్టర్ ఎల్విన్ కేదీ పాల్గొన్నారు.



ఆంధ్ర హస్పటల్లో ఓసిటి మిషన్ ప్రారంభిస్తున్న మంత్రి జోగి రమేష్, సెంట్రల్ ఎమ్మెల్యే విష్ణు

ఆహ్లాదకర వాతావరణం కనిపించాలి

పటమట(విజయవాడ తూర్పు): రోడ్డుకు ఇరువైపులా ఆహ్లాదకరమైన వాతావరణం కనిపించేలా ఏర్పాటు చేసిన మొక్కలను నిరంతరం పర్యవేక్షించాలని కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా సోమవారం ఆయన బెంజిసర్కిల్, ఏ కన్వెన్షన్ సెంటర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెంజి సర్కిల్ దగ్గర ప్రధాన అంతర్గత రోడ్లలో పారిశుద్ధ్య నిర్వహణ విధానం, సైడ్ డ్రెయిన్స్‌లో మురుగునీటి పారుదల విధానాన్ని పర్యవేక్షించారు. అనంతరం ఆయన ఏ కన్వెన్షన్ సెంటర్ లో మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న వైఎస్సార్ లైఫ్ టైం ఎచీవ్‌మెంట్, వైఎస్సార్ ఎచీవ్‌మెంట్ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతున్నందున వారధి ఏ కన్వెన్షన్ సెంటర్ వరకు సుందరంగా, శుభ్రంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. పూర్తి చేయాల్సిన పనులు యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని సూచించారు. డెప్యూటీ సిటీ ప్లానర్ (ప్లానింగ్) జుబిన్ శిరన్ రాయ్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వి.చంద్ర శేఖర్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఏ.ఎస్.ఎన్ ప్రసాద్, ఏడీహెచ్ శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.



బెంజసర్కిల్ వద్ద గ్రీనరీని పరిశీలిస్తున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

సౌకర్యాల కల్పనకు చర్యలు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు):ప్రజలకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నామని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ చెప్పారు. సోమవారం 6వ డివిజన్ పరిధిలోని బ్రహ్మానందరెడ్డి నగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ సభ్యుడు వియ్యపు అమర్‌నాథ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం అవినాష్ మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఈ ప్రాంతవాసులు రోడ్డు నిర్మాణం చేయాలంటూ తనను కోరారన్నారు. వార్డు సచివాలయం పరిధిలో అభివృద్ధి పనులకు సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కేటాయించిన రూ.20 లక్షలతో ఈ రోడ్డు నిర్మాణ పనులను చేపట్టామన్నారు. ఈ ప్రాంత ప్రజలు కోరిన వెంటనే తాను మున్సిపల్ కమిషనర్, నగర మేయర్ దృష్టికి తీసుకువెళ్లి నిధులు మంజూరు అయ్యేలా చేశామన్నారు. ప్రజలకు అవసరమైన ఏ సౌకర్యాన్ని అయినా కల్పించడానికి తమ ప్రభుత్వం ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటుందని చెప్పారు. గత టీడీపీ హయాంలో అభివృద్ధి అనేది కేవలం శంకుస్థాపనలకే పరిమితం అయ్యిందని విమర్శించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో శంకుస్థాపన చేసిన వెంటనే పనులు మొదలు పెట్టి అత్యంత నాణ్యతా ప్రమాణాలతో త్వరగా పూర్తి చేస్తున్నామని చెప్పారు. వైఎస్సార్ సీపీకి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. స్థానికంగా ఉన్న సమస్యలను వారి దృష్టికి తీసుకురావాలని కోరారు. ఆరో డివిజన్ కార్పొరేటర్ వియ్యపు అమర్‌నాథ్ మాట్లాడుతూ టీడీపీ హయాంలో డివిజన్ పరిధిలో ఎక్కడా అభివృద్ధి పనులు జరగలేదన్నారు. వైఎస్సార్ సీపీ ఏడో డివిజన్ అధ్యక్షుడు వడ్లమూడి సంపత్, డివిజన్ నాయకులు అబ్బినాయుడు, ఎం.వెంకటేశ్వరరావు, మోహన్‌రావు, రామారావు, రామకృష్ణ, పానుగుపాటి శ్రీనివాస్, హరీష్, దాలినాయుడు, హుస్సేన్, వడివేలు, వెంకటేష్, రాజాతో పాటుగా స్థానికులు పాల్గొన్నారు.



పనులకు శంకుస్థాపన చేస్తున్న దేవినేని అవినాష్

నిత్యాన్నదానానికి రూ. లక్ష విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ):దుర్గమ్మ నిత్యాన్నదాన పథకానికి విజయవాడకు చెందిన భక్తులు సోమవారం రూ. లక్ష విరాళాన్ని అందచేశారు. కానూరుకు చెందిన ఎ.ప్రపూర్ణచంద్ కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసింది. ఆలయ అధికారులను కలిసి నిత్యాన్నదాన పథకానికి రూ. 1,01,116 విరాళాన్ని సమర్పించారు. అనంతరం దాతలకు ఆలయ అర్చకులు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను అందచేశారు.

శివాలయాల్లో ప్రత్యేక పూజలు

కృష్ణలంక(విజయవాడ తూర్పు):పవిత్ర కార్తిక మాసం మొదటి సోమవారం సందర్భంగా శివాలయాలు భక్తులతో కిక్కిరిశాయి. భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి శివాలయాలకు చేరుకుని కార్తిక దీపాలు వెలిగించి స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు, పూజలు నిర్వహించారు. కృష్ణలంక, మెట్లబజార్‌లో కృష్ణానది కరకట్ట వెంబడి వేంచేసి ఉన్న అన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో భక్తులు వేకువజామున నుంచే స్వామివారి దర్శనానికి బారులుతీరారు. ఆలయ కమిటీ చైర్మన్ మూలంరెడ్డి సుబ్బారెడ్డి, ఆలయ ప్రధానార్చకుడు మార్తి వెంకట్రామశాస్త్రి అధ్వర్యంలో అర్చకులు స్వామివారికి విశేష పూజలు, మహాన్యాస పూర్వక ఏక రుద్రాభిషేకం, పుష్పార్చనలు, అభిషేకాలు నిర్వహించారు.

శివగిరిపై కార్తికమాస పూజలు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు):కార్తిక మాసం మొదటి సోమవారం సందర్భంగా స్థానిక వాగ్దేవి జ్యోతిర్లింగ క్షేత్రం (శివగిరి)పైన ఉన్న శివలింగానికి భక్తులు పూజలు చేశారు. శివగిరి వ్యవస్థాపకుడు మల్లికార్జునశర్మ తెల్లవారుజామున శివలింగానికి రుద్రాభిషేకం, రుద్రహోమంతో పాటుగా సాయంత్రం ప్రదోషపూజ, శివ కళ్యాణం నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. సోమవారం సాయంత్రం బృందావన్ కాలనీలో ప్రధాన, అంతర్గత రహదారుల్లో శివగిరిపైన ఉన్న ఉత్సవ మూర్తులను ఊరేగింపు నిర్వహించారు. మంగళవారం సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు నిమ్మతోట సెంటర్ నుంచి విశాలాంధ్రరోడ్డు, బ్రహ్మానందరెడ్డి నగర్, మారుతీనగర్ ప్రాంతాల్లో శివగిరి ఉత్సవ మూర్తులను ఊరేగింపు నిర్వహిస్తామని తెలిపారు. భక్తులు ఊరేగింపులో పాల్గొని స్వామి వారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించాల్సిందిగా కోరారు.



శివాలయంలో శివలింగానికి అభిషేకం చేస్తున్న అర్చకులు



ముత్యాలంపాడులో రుద్రాక్షల అలంకారం

ఇంద్రకీలాద్రిపై సహస్ర లింగార్చన



సహస్ర లింగార్చన సేవలో ఉభయదాతలు



స్వామి వారికి వడ్లతో విశేష అలంకరణ

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ):కార్తిక మాసం తొలి సోమవారం ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామి వారికి విశేష అర్జిత సేవలు నిర్వహించగా పెద్ద ఎత్తున భక్తులు, ఉభయదాతలు పాల్గొన్నారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని మల్లేశ్వర స్వామి వారి బాలాలయంలో స్వామి వారికి తెల్లవారుజాము నుంచి పంచామృత అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఉదయం 9 గంటలకు నటరాజ కళావేదిక వద్ద సహస్ర లింగార్చన జరిగింది. పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించిన అనంతరం ఒడ్లతో స్వామి వారిని అలంకరించారు. సహస్ర లింగార్చనను ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించగా, పలువురు ఉభయదాతలు, భక్తులు పాల్గొన్నారు. సేవలో పాల్గొన్న ఉభయదాతలకు రూ. 300 క్యూలైన్ మార్గం ద్వారా అమ్మవారి దర్శనానికి అనుమతించారు. సాయంత్రం దుర్గామల్లేశ్వర స్వామి వార్ల ఉత్సవ మూర్తులకు సహస్ర దీపార్చన జరిగింది. అమ్మవారికి పంచహారతుల సేవలోనూ ఉభయదాతలు విశేషంగా పాల్గొన్నారు. అమ్మవారి ఆలయం, నటరాజ స్వామి వారి ఆలయం ప్రాంగణంలో ఆకాశదీపాన్ని వెలిగించారు.

భక్తులతో కిటకిటలాడిన స్నానఘాట్లు



కృష్ణానదిలో స్నానాలు చేసి కార్తికదీపాలు వెలిగిస్తున్న భక్తులు

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ):కార్తిక మాసం తొలి సోమవారాన్ని పురస్కరించుకుని పవిత్ర కృష్ణానదిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. దుర్గాఘాట్, పున్నమి ఘాట్, భవానీఘాట్లు భక్తులతో కిటకిటలాడాయి. సోమవారం నుంచి స్నానఘాట్లలోకి భక్తులను అనుమతిస్తామని ముందుగా ప్రకటించినప్పటికీ నదిలో నీటి ప్రవాహం అధికంగా ఉండటం, స్నానఘాట్ల మెట్లపై అడుగు మేర బురద పేరుకుపోవడంతో భక్తులను నదిలోకి అనుమతించలేదు.

దీంతో దుర్గాఘాట్‌లో భక్తులు జల్లు స్నానాలను ఆచరించారు. పుణ్యస్నానాల అనంతరం ఘాట్లలో కార్తిక పూజలు నిర్వహించారు. అరటి డొప్పలపై కార్తిక దీపాలు వెలిగించారు. తెల్లవారుజామున రెండు గంటల నుంచి ప్రారంభమైన పుణ్యస్నానాలు ఉదయం 10 గంటల వరకు కొనసాగాయి. మరో వైపున ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను దర్శించుకునేందుకు విచ్చేసిన భక్తులు కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం ఇంద్రకీలాద్రికి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు.

క్యాన్సర్‌పై స్టెల్లా కళాశాలలో అవగాహన

పటమట(విజయవాడ తూర్పు): విద్యార్థులు చదువుతోపాటు ఆరోగ్య పరిరక్షణపై శ్రద్ధ వహించాలని హెచ్‌సీజీ ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ వీఎస్ఎన్ రావ్ అన్నారు. నగరంలోని స్టెల్లా కళాశాలలో క్యాన్సర్‌పై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాన్సర్‌ను ముందుగానే గుర్తిస్తే ప్రాణాపాయం నుంచి బయటపడొచ్చని చెప్పారు. దేశంలో ఎక్కువగా బ్రెస్ట్ క్యాన్సర్, సర్వైకల్ క్యాన్సర్, ఒవేరియన్ క్యాన్సర్ గుర్తిస్తున్నామన్నారు.

క్యాన్సర్‌ను సర్జికల్, రేడియేషన్, అంకాలజీ విభాగం పర్యవేక్షణలో ట్రీట్‌మెంట్ ఇస్తారని తెలిపారు. ఏటా 7 లక్షల మంది ఈ రోగం బారిన పడి చనిపోతున్నారని పేర్కొన్నారు. సమతుల్య ఆహారం, యోగా, మెడిటేషన్ పాటిస్తే రిస్క్ తక్కువగా ఉంటుందన్నారు. ఇంటర్మీడియట్ విభాగం వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణ, కో–ఆర్డినేటర్ వి. స్వప్న, టి. గ్రేస్ యూనిస్, అధ్యాపకులు పద్మావతి, భరత జ్యోతి పాల్గొన్నారు.



స్టెల్లాలో జరిగిన క్యాన్సర్ అవగాహన కార్యక్రమం

లయన్స్ క్లబ్ సేవలు విస్తృతం చేయాలి

ఆటోనగర్(విజయవాడతూర్పు): లయన్స్ క్లబ్ సేవలను విస్తృతం చేయాలని జిల్లా లయన్స్ క్లబ్ గవర్నర్ శ్రీశాంతి అన్నారు. సోమవారం ఓ ఫంక్షన్ హాల్లో లయన్స్ క్లబ్ ఆఫ్ ఆటోనగర్ జెడ్‌సీ జోనల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాబోయే రోజుల్లో గ్రామాల్లో సేవా కార్యక్రమాలను చేయనున్నట్టు చెప్పారు. మహిళల ఆర్థికాభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని సుమారు రూ.40 లక్షలతో పట్టణం, గ్రామాల్లోని పలు ప్రముఖ కూడళ్లో టీ స్టాల్స్‌ను ఏర్పాటు చేయిస్తున్నట్టు చెప్పారు.

ఈ విధంగా మహిళలను లయన్స్ క్లబ్ ద్వారా వారి కుటుంబాలకు చేదోడు వాదోడుగా ఉంటామన్నారు. అనంతరం లయన్స్ క్లబ్ ఆఫ్ విజేత సరయి అధ్యక్షుడు బి.ఇందిర, జోనల్ చైర్‌పర్సన్ బెవర నాగేశ్వరరావును గవర్నర్ శ్రీశాంతి శాలువతో సన్మానించారు. ఆర్సీ కాంతారావు తదితరులు పాల్గొన్నారు.



బెవర నాగేశ్వరరావు దంపతులను సన్మానిస్తున్న జిల్లా గవర్నర్ శ్రీశాంతి

సీఐ కాశీవిశ్వనాథ్ బాధ్యతల స్వీకారం

ఆటోనగర్(విజయవాడతూర్పు): ఫిర్యాదుదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించేదుకు కృషి చేస్తామని పటమట సీఐ కాశీ విశ్వనాథ్ తెలిపారు. బదిలీపై వచ్చిన ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ విజయవాడపై తనకు అవగాహన ఉందన్నారు. పటమట పోలీస్‌స్టేషన్‌లో ఉన్న పెండింగ్ కేసులను పరిష్కరించే విధంగా సిబ్బందితో కలిసి పనిచేస్తామన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. ఎక్కడా జూదం, గంజాయి అమ్మకాలు జరగనివ్వకుండా అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. ఖాళీ ప్రదేశాల్లో మద్యం సేవించకూడదన్నారు. బార్లు నిర్దేశించిన సమయాల్లోనే పనిచేయాలని సూచించారు. చోరీలను నియంత్రించే విధంగా రాత్రి పూట పోలీస్ గస్తీ నిర్వహిస్తామన్నారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా ఫిర్యాదుదారులే స్టేషన్‌కు రావాలన్నారు.



బాధ్యతలు స్వీకరించిన పటమట సీఐ కాశీవిశ్వనాథ్

సీఎఫ్ఎంఎస్ హెల్ప్ డెస్క్ పటిష్టంగా పనిచేయాలి

పటమట(విజయవాడ తూర్పు):జిల్లా ఖజానా కార్యాలయంలో సీఎఫ్ఎంఎస్ (సెంట్రలైజ్డ్ ఫండ్స్ మేనేజ్‌మెంట్ సిస్టమ్) హెల్ప్‌డెస్క్ పటిష్టంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా ఖజానా అధికారి ఎంహెచ్ రెహమాన్‌కు డెమొక్రటిక్ పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు డి. శ్రీను వినతిపత్రం అందిచారు. ఈ మేరకు సోమవారం ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా ఖజానా కార్యాలయంలో ఆయన్ను కలిసిన తాము సీఎఫ్ఎంఎస్‌లో వచ్చే అనేక సాంకేతిక సమస్యలు వివరించామని పేర్కొన్నారు. సకాలంలో పనిచేయకపోవటంతో సమస్యలు ఎదురవుతున్నాయని వివరించామన్నారు. డెమొక్రటిక్ పీఆర్‌టీయూ నేతలు అక్బర్ బాషా, నాగేంద్ర, ఐమేశ్వరరావు, జోజయ్య, ఇర్ఫాన్, తోట్లవల్లూరు శ్రీనివాస్, సేవాదళ్ శ్రీనివాస్, కుమార్ రాజా, సుబ్రమణ్యం, కె. బ్రహ్మయ్య పాల్గొన్నారన్నారు.



జిల్లా ఖజానా అధికారికి వినతిపత్రం అందిస్తున్న డీపీఆర్‌టీయూ నాయకులు

29 మంది ఉద్యోగాలకు ఎంపిక



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు):ఎన్టీఆర్ జిల్లాలోని నిరుద్యోగ యువతకు ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగాలు కల్పించేందుకు సోమవారం నగరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో జరిగిన జాబ్‌మేళాలో 29 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. మొత్తం 103 మంది యువతీ యువకులు ఈ మేళాకు హాజరు కాగా వారి అర్హతలను బట్టి ఆయా కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) అధికారి నరేష్‌కుమార్ చెప్పారు. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు కంపెనీ ప్రతినిధులు నియామక పత్రాలను అందచేశారు.

మతిస్థిమితం లేని యువకుడి అదృశ్యం

చిట్టినగర్(విజయవాడ పశ్చిమ):మతి స్థిమితం లేని యువకుడు అదృశ్యమైన ఘటనపై కొత్తపేట పోలీస్ స్టేషన్‌లో సోమవారం కేసు నమోదయింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిట్టినగర్ కటికల మస్తాన్ వీధికి చెందిన పలాంటి ఉష, నాగరాజు దంపతులు నివాసం ఉంటారు. ఉషా అక్క కొంత కాలం కిందట చనిపోవడంతో ఆయన కుమారుడైన రాజు తన వద్దే ఉంటాడు. ఆదివారం ఉదయం 11 గంటలకు రాజు ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. ఇంట్లో నుంచి బయటకు వచ్చిన ఉష రోడ్డుపైకి వచ్చి రాజు కోసం వెతికినా ప్రయోజనం లేకపోయింది. చుట్టు పక్కల వెతికిన అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

జిల్లాల వారీగా 22-ఏ భూముల
జాబితా సిద్ధం చేయండి

డీఆర్‌వోల వర్క్‌షాప్‌లో సీసీఎల్‌ఏ సాయిప్రసాద్

సాక్షి, అమరావతి: కొత్త జిల్లాల వారీగా 22–ఏ జాబితాలో ఉన్న భూముల వివరాల నివేదికలు సిద్ధం చేయాలని జిల్లా రెవెన్యూ అధికారులను (డీఆర్‌వోలను) భూ పరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్‌ఏ), రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ ఆదేశించారు. రాష్ట్రంలోని డీఆర్‌వోలతో మంగళగిరిలోని సీసీఎల్‌ఏ కార్యాలయంలో సోమవారం జరిగిన వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. 22–ఏ భూముల జాబితాలు తయారుచేసే క్రమంలో అసైన్డ్ భూములు, ప్రభుత్వ భూములు, దేవదాయ/వక్ఫ్ భూములు, చుక్కల భూములు, ఇతర భూములు వివరాలను కేటగిరీల వారీగా విభజించి చూపాలని చెప్పారు. కొత్త జిల్లాల ఏర్పాటుతో ప్రతి జిల్లాకి సంబంధించి రికార్డులను ఎలా నిర్వహించాలి, నివేదికలు ఎలా రూపొందించాలో అవగాహన కల్పించారు. రెవెన్యూ రికార్డుల ప్రక్షాళన, నిషేధిత భూముల జాబితాలు, వాటి క్రమబద్ధీకరణ, ఇళ్లస్థలాలు, భూముల రీ సర్వేకి సంబంధించిన అంశాలపై వర్క్‌షాప్‌లో చర్చించారు. అదనపు సీసీఎల్‌ఏ ఎండీ ఇంతియాజ్, సీసీఎల్‌ఏ ల్యాండ్స్ జాయింట్ సెక్రటరీ జి.గణేష్ కుమార్, విజిలెన్స్ జాయింట్ సెక్రటరీ డాక్టర్ అపరాజితసింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ గిరిజన ఉత్పత్తులు

రేషన్ దుకాణాలు, ఎండీయూ వాహనాల ద్వారా విక్రయం

- ఎమ్మార్పీ కంటే తక్కువ రేట్లకు అందుబాటులో..
- నేటినుంచి పైలట్ ప్రాజెక్టుగా విశాఖ, తిరుపతి జిల్లాల్లో అమలు
- 12 రకాల గిరిజన ఉత్పత్తులతోపాటు 4 రకాల వంట నూనెల అమ్మకం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో రేషన్ దుకాణాలు, రేషన్ పంపిణీ వాహనాల (ఎండీయూ) ద్వారా గిరిజన ఉత్పత్తులను ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు పౌర సరఫరాల శాఖ చర్యలు చేపడుతోంది. నవంబర్ 1వ తేదీ నుంచి పైలట్ ప్రాజెక్టు కింద విశాఖపట్నం, తిరుపతి జిల్లాల్లో ప్రారంభించనుంది. తొలి దశలో 290 రేషన్ వాహనాలు, 570 రేషన్ దుకాణాల్లో అమలు చేయనున్నారు. గిరిజన కో–ఆపరేటివ్ కార్పొరేషన్ ఉత్పత్తులకు విస్తృత మార్కెటింగ్ కల్పించడంతోపాటు ఎమ్మార్పీ కంటే తక్కువ రేట్లకే వినియోగదారులకు అందించనున్నారు.



ఎండీయూలకు ఆర్థిక బలం చేకూర్చేలా..

ప్రస్తుతం ప్రజా పంపిణీ వ్యవస్థలో 9,260 ఎండీయూ వాహనాలు సేవలందిస్తున్నాయి. రేషన్ డోర్ డెలివరీ నిమిత్తం ఎండీయూ ఆపరేటర్లకు ప్రభుత్వం ప్రతి నెలా రూ.18 వేల రెమ్యునరేషన్ ఇస్తోంది. వారికి మరింత ఆర్థిక బలం చేకూర్చేందుకు ప్రభుత్వరంగ సంస్థలైన గిరిజన, ఆయిల్‌ఫెడ్, మార్క్‌ఫెడ్ ఉత్పత్తులను విక్రయించుకునే వెసులుబాటు కల్పించింది. ఆయా సంస్థల నుంచి సబ్సిడీపై సరుకులను తీసుకునే ఆపరేటర్లు వాటిని ఎమ్మార్పీ కంటే తక్కువ ధరకు ప్రజలకు విక్రయించాల్సి ఉంటుంది. ప్రతినెలా పీడీఎస్ బియ్యం పంపిణీలో జాప్యం లేకుండా విక్రయాలు చేసేలా చర్యలు చేపట్టింది. వినియోగదారులకు తెలిసేలా వస్తువుల ధరల పట్టికను ప్రదర్శించనున్నారు.

గిరిజనులకు మేలు చేసేలా..

గిరిజనులకు మేలు చేసేలా ఎండీయూ వాహనాల ద్వారా వారి ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తున్నాం. తొలుత విశాఖ, తిరుపతి జిల్లాల్లో స్పందనను బట్టి త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా విస్తరిస్తాం. రేషన్ లబ్ధిదారులే కాకుండా ప్రజలందరూ ఈ ఉత్పత్తులను కొనుక్కోవచ్చు. బియ్యం ఇచ్చే సమయంలో వినియోగదారులపై ఎటువంటి ఒత్తిడి చేయకుండా విక్రయాలు చేసుకోవాలని ఎండీయూలకు సూచించాం.

– హెచ్.అరుణ్‌కుమార్, కమిషనర్, పౌర సరఫరాల శాఖ

విక్రయించే ఉత్పత్తులు..

గిరిజన కో–ఆపరేటివ్ కార్పొరేషన్ ద్వారా తేనె, అరకు కాఫీ పొడి, వైశాఖి కాఫీ పొడి, త్రిఫల చూర్ణం, నన్నారి షర్బత్, ఆయుర్వేద సబ్బులు, చింతపండు, కుంకుడుకాయ పొడి, షికాకాయ పొడి, కారంపొడి, పసుపు, కుంకుమతోపాటు ఆయిల్‌ఫెడ్ నుంచి పామాయిల్, సన్‌ఫ్లవర్, రైస్‌బ్రాన్, వేరుశనగ నూనెలను అందుబాటులో ఉంచనున్నారు.

ఎత్తిపోసే పనిలో మేం.. ఎత్తుకెళ్లే పనిలో బీజేపీ!

కేంద్ర ప్రభుత్వ జేబు సంస్థలుగా ఈడీ, సీబీఐ: హరీశ్‌రావు ధ్వజం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రానికి కృష్ణా, గోదావరి జలాలను ఎత్తిపోసే పనిలో టీఆర్‌ఎస్ ఉంటే.. బీజేపీ మాత్రం తెలంగాణ ఎమ్మెల్యేలను ఎత్తుకెళ్లే పనిలో ఉందని మంత్రి టి.హరీశ్‌రావు మండిపడ్డారు. ఈడీ, సీబీఐ వంటివి కేంద్ర ప్రభుత్వ జేబు సంస్థలుగా పనిచేస్తున్నాయనే విషయాన్ని బీజేపీ నేతలే పరోక్షంగా అంగీకరిస్తున్నారని విమర్శించారు. టీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల కొనుగోలు వ్యవహారంలో దూతలను కోన్‌కిస్కా గాళ్లు అంటూ మాట్లాడిన బీజేపీ.. ఈ కేసు విచారణను సీబీఐకి అప్పగించాలని హైకోర్టును ఎందుకు ఆశ్రయించిందో చెప్పాలని డిమాండ్ చేశారు. సోమవారం తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. బీజేపీ డీఎన్‌ఏలోనే పచ్చి అబద్ధాలు ఉన్నాయని మండిపడ్డారు. టీఆర్‌ఎస్‌లో ఇతర పార్టీల విలీనాన్ని ప్రస్తావిస్తున్న బీజేపీ.. ఎంపీలు సీఎం రమేశ్, సుజనా చౌదరి తదితరుల విషయంలో చేసిందేమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. బీజేపీ పాలిత రాష్ట్రం గుజరాత్‌లో జరిగిన కేబుల్ బ్రిడ్జి ప్రమాదం ఘటనలో వంద మందికిపైగా ప్రాణాలు కోల్పోవడంపై మంత్రి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గతంలో పశ్చిమ బెంగాల్‌లో బ్రిడ్జి కూలితే ప్రభుత్వ పతనానికి సంకేతం అంటూ మాట్లాడిన ప్రధాని మోదీ.. ఇప్పుడు అదే విషయాన్ని అంగీకరిస్తారా అని ప్రశ్నించారు. "బీజేపీ అంటే కూలిపోయే బ్రిడ్జిలు. ప్రజల ప్రాణాలు నీళ్ల పాలు అన్నట్టుగా తయారైంది. సంక్షేమానికి టీఆర్‌ఎస్.. సంక్షోభానికి బీజేపీ నిర్వచనంగా మారాయి. మునుగోడు ఎన్నికలో ప్రజలు పాలు, నీళ్లకు తేడాను గుర్తించి ప్రజాస్వామ్య విలువలు పెంచేలా తీర్పునిస్తారన్న నమ్మకం ఉంది" అని పేర్కొన్నారు. హామీలను నిలబెట్టుకోలేకే మునుగోడులో జేపీ నడ్డా సభను రద్దు చేసుకున్నారని ఆరోపించారు.

నేటి సాయంత్రంతో ముగియనున్న మునుగోడు ప్రచారం

- 3న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్

సాక్షి, హైదరాబాద్/నల్లగొండ: మునుగోడు అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికల ప్రచార గడువు మంగళవారం సాయంత్రం 6 గంటలతో ముగుస్తుందని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈఓ) వికాస్ రాజ్ తెలిపారు. ప్రచార గడువు ముగిసిన తర్వాత నియోజకవర్గం పరిధిలో స్థానికేతరులెవరూ ఉండరాదని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రచారంలో పాల్గొనడానికి వచ్చిన స్థానికేతరులు సాయంత్రం 6 గంటలలోగా వెళ్లిపోవాలని, లేకుంటే వారిపై కూడా చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. నియోజకవర్గంలో స్థానికేతరులను గుర్తించడానికి లాడ్జీలు, హోటళ్లు, కళ్యాణమండపాలు వంటి ప్రాంతాల్లో పోలీసులతో తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు. మునుగోడు ఉప ఎన్నిక పోలింగ్ ఏర్పాట్లను సోమవారం ఆయన ఇక్కడ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. నవంబర్ 3న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరగనుందని, మొత్తం 298 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని సీఈఓ తెలిపారు. అందులో 105 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలున్నాయని చెప్పారు. 2,41,795 మంది సాధారణ ఓటర్లతో పాటు 10 మంది ఎన్‌ఆర్‌ఐ ఓటర్లు, 50 మంది సర్వీసు ఓటర్లు ఉన్నారని వివరించారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. పోలింగ్ రోజున 15 కేంద్ర బలగాలతో పాటు 3,366 మంది రాష్ట్ర పోలీసులతో బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. నియోజకవర్గం సరిహద్దుల్లో 100 చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి పకడ్బందీగా నిఘా పెట్టామన్నారు. ఇప్పటివరకు రూ.6.8 కోట్ల నగదు, 4,560 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

షార్జా-విజయవాడ విమాన సర్వీస్ ప్రారంభం

మూడేళ్ల తరువాత అంతర్జాతీయ విమాన సర్వీసులు



గన్నవరం: సుమారు మూడేళ్ల తర్వాత విజయవాడ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్(గన్నవరం) నుంచి పూర్తిస్థాయి అంతర్జాతీయ విమాన సర్వీసులు అందుబాటులోకి వచ్చాయి. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లోని షార్జా నుంచి విజయవాడకు ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ సంస్థ సోమవారం విమాన సర్వీసును ప్రారంభించింది. షార్జా నుంచి 49 మంది ప్రయాణికులతో బోయింగ్ 737–800 విమానం సాయంత్రం 4.35కు ఇక్కడికి చేరుకుంది. షార్జా సర్వీస్ ప్రారంభోత్సవం సందర్భంగా మచిలీపట్నం, విజయవాడ ఎంపీలు వల్లభనేని బాలశౌరి, విజయవాడ ఎంపీ కేశినేని నాని జ్యోతి ప్రజ్వలన చేశారు. షార్జా వెళ్లే ప్రయాణికులకు బోర్డింగ్ పాస్‌ను అందజేశారు. సాయంత్రం 6.35 గంటలకు 125 మంది ప్రయాణికులతో విమానం ఇక్కడి నుంచి షార్జా బయలుదేరి వెళ్లింది. ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ ఎం.లక్ష్మీకాంతరెడ్డి, సలహా కమిటీ సభ్యులు ఎంసీ దాసు పాల్గొన్నారు.

పట్టణ సర్వే సిబ్బందికి మరో దఫా శిక్షణ

- 10 రోజుల్లో క్షేత్రస్థాయి సర్వే ప్రారంభం
- సమర్థవంతంగా 'వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్షా పథకం' అమలు



సాక్షి, అమరావతి: పట్టణాల్లోని ఆస్తుల సమగ్ర సర్వే కోసం పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ పటిష్ట ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే పలు దఫాలుగా సిబ్బందికి సమగ్ర శిక్షణ ఇచ్చిన మునిసిపల్ అధికారులు నవంబర్ 1 నుంచి సర్వే చేపట్టాలని భావించారు. సర్వే విధానంపై సిబ్బందికి గల అనుమానాలను నివృత్తి చేసేందుకు మంగళవారం 400 మందికి శిక్షణ ఇచ్చేందుకు చర్యలు చేపట్టారు. ప్రతి యూఎల్బీ నుంచి ముగ్గురు చొప్పున రాష్ట్రంలోని 123 యూఎల్బీల నుంచి సిబ్బంది హాజరు కానున్నారు. సర్వే పనుల కోసం వివిధ విభాగాల అధికారులతో ఇప్పటికే ప్రత్యేకంగా ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ యూనిట్(పీఎంయూ)ను ఏర్పాటు చేయడంతోపాటు, ఆయా కార్పొరేషన్లు, మునిసిపాలిటీల్లో సైతం పీఎంయూలను ఏర్పాటు చేయడంతో పాటు పరిపాలనాధికారిని కూడా నియమించారు. మంగళవారం జరిగే శిక్షణలో పీఎంయూ అధికారితో పాటు వార్డు పరిపాలనా కార్యదర్శి, ప్లానింగ్ కార్యదర్శులు పాల్గొననున్నారు. ప్రజల ఆస్తులను సర్వేచేసి, సరిహద్దులను గుర్తించి హక్కుదారుకు సమగ్రమైన వివరాలతో కూడిన హక్కుపత్రం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్షా పథకం' ప్రవేశపెట్టింది. మొత్తం 123 యూఎల్బీల్లోను 38 లక్షల ఆస్తులు ఉన్నాయని, సర్వేలో మరో పది శాతం పెరగవచ్చని అంచనా వేస్తున్నారు.

వారం, పది రోజుల్లో క్షేత్ర స్థాయి పరిశీలన

సర్వేలో ప్రతి వార్డు నుంచి ఆరుగురు సిబ్బంది చొప్పున మొత్తం 20 వేలమంది పాలుపంచుకునేలా చర్యలు తీసుకున్నారు. వారం, పది రోజుల్లో క్షేత్ర స్థాయి సర్వే ప్రక్రియ ప్రారంభించాలని యోచిస్తున్న అధికారులు మ్యాపింగ్, రికార్డుల పరిశీలనలో తలెత్తే సమస్యలపై వివరించనున్నారు. ఇప్పటికే నాలుగు దఫాలుగా వివిధ స్థాయిల్లో వార్డు ప్లానింగ్ అండ్ రెగ్యులేషన్ సెక్రటరీలతో పాటు ఇతర మునిసిపల్ సిబ్బందికి మాస్టర్ ట్రైనర్లతో శిక్షణ ఇచ్చారు. ఈసారి వారికి రికార్డుల ప్రకారం ఆస్తుల గుర్తింపు, మునిసిపాలిటీ పరిధి మ్యాపింగ్‌తో పాటు, ప్రతి వార్డు మ్యాప్, ఫీల్డ్ మెజర్‌మెంట్ బుక్, ఆర్‌ఎస్‌ఆర్, టీఎస్‌ఆర్, కేఎంఎల్ ఫైల్స్ పరిశీలనపై శిక్షణ ఇవ్వనున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న 123 నగర, పురపాలక సంఘాల్లో సమీప గ్రామాలు విలీనమయ్యాయి. విలీనమైన వాటిలో 648 రెవెన్యూ గ్రామాలున్నాయి. పకడ్బందీగా సర్వే చేపట్టాలని నిర్ణయించామని పట్టణ ఆస్తుల సర్వే ప్రత్యేకాధికారి సుబ్బారావు 'సాక్షి'కి తెలిపారు.

చంద్రబాబు జీవితమే అబద్ధం

- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

సాక్షి, అమరావతి: చంద్రబాబు జీవితమంతా అబద్ధాలమయమేనని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి విమర్శించారు. అధికారంలో ఉండగా ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఒక్కటీ నెరవేర్చని ఆయన రైతులకు అన్ని విధాలుగా అండగా ఉన్న తమ ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. చంద్రబాబు అబద్ధాల వ్యాధి టీడీపీ నాయకులందరికీ అంటుకుందన్నారు. సోమవారం సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు. వ్యవసాయం, రైతుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ చిత్తశుద్ధితో పనిచేస్తున్న తమ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు బురదజల్లడం సమంజసం కాదన్నారు. పచ్చ మీడియాలో రోజుకో అబద్ధాన్ని ప్రచారం చేస్తున్నారన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని రీతిలో వ్యవసాయరంగానికి ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నామని చెప్పారు. ఈ ఏడాది వైఎస్సార్ రైతు భరోసా – పీఎం కిసాన్ పథకం కింద మొదటి విడతలో 50.10 లక్షలమంది రైతులకు రూ.3,757 కోట్ల లబ్ధి చేకూర్చామని చెప్పారు. అక్టోబరు 17న రెండో విడతలో 50.90 లక్షలమంది రైతులకు రూ.2,036 కోట్ల సహాయం అందించామన్నారు. గత టీడీపీ ప్రభుత్వం రైతులకు డ్రిప్ ఇరిగేషన్‌సహా వివిధ పథకాల కింద చెల్లించాల్సిన బకాయిలను కూడా తమ ప్రభుత్వం చెల్లిస్తోందని తెలిపారు. అంతకుముందు మంత్రి స్టేట్ వేర్ హౌసింగ్, సుబాబుల్, ఆయిల్‌ఫెడ్ ప్రగతిపై అధికారులతో సమీక్షించారు.

టీఆర్‌ఎస్‌తో కలిసే ప్రశ్నే లేదు

- పొత్తు గందరగోళం ఆ పార్టీ సృష్టిస్తున్నదే : రాహుల్ గాంధీ

(భారత్ జోడో యాత్ర నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి) తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్‌ఎస్)తో కాంగ్రెస్ కలిసి వెళ్లే ప్రశ్నే లేదని ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. తెలంగాణలో తాము కచ్చితంగా అధికారంలోకి వస్తామని చెప్పారు. సీఎం కేసీఆర్ జాతీయ పార్టీనే కాదు అంతర్జాతీయ పార్టీ కూడా పెట్టుకోవచ్చని, అమెరికా, చైనా, ఇతర దేశాల్లోనూ పోటీ చేయొచ్చని వ్యాఖ్యానించారు. 'భారత్ జోడో యాత్ర'లో భాగంగా తెలంగాణలో పాదయాత్ర చేస్తున్న రాహుల్‌గాంధీ.. సోమవారం రంగారెడ్డి జిల్లా కొత్తూరులో విలేకరులతో మాట్లాడారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక మీడియా, న్యాయ, అధికార వ్యవస్థలను నిర్వీర్యం చేసిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఈ వ్యవస్థలకు స్వతంత్ర ప్రతిపత్తి కల్పిస్తామని తెలిపారు. తాము అధికారంలోకి వస్తే స్వేచ్ఛా వాణిజ్య వాతావరణాన్ని కల్పిస్తామని చెప్పారు. బీసీల జనాభా లెక్కలను ప్రజల ముందు పెట్టాల్సిందేనని, దేశ జనాభా స్వరూపాన్ని ప్రజలు తెలుసుకోవాలని చెప్పారు. తనకు 25, 26 ఏళ్ల వయసున్నప్పుడే పాదయాత్ర చేయాలనుకున్నానన్నారు. కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు నడిచి తనను కలుస్తున్న వారి అభిప్రాయాలు వినడమే ప్రస్తుతం తన పని అని చెప్పారు.

కాగా, రాహుల్ పాదయాత్రలోకి అనుమతి లేకుండా ఇద్దరు వ్యక్తులు ప్రవేశించి, నేరుగా ఆయన కాళ్లను గట్టిపట్టుకున్న సంఘటన కలకలం సృష్టించింది. పోలీసుల భద్రతా వైఫల్యం వల్లే ఇది జరిగిందని కాంగ్రెస్ పార్టీ వ్యాఖ్యానించింది.

నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించండి

కృష్ణాజిల్లా పరిశ్రమల సమావేశంలో కలెక్టర్ రంజిత్ బాషా



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో అర్హులైన నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ హాలులో సోమవారం జిల్లా పరిశ్రమల ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కమిటీ సభ్యులతో పరిశ్రమల ఏర్పాటు అనుమతులపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో గరిష్టంగా ఉపాధి కల్పన జరగాలని, దీనికి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చే ఔత్సాహికులకు అవసరమైన అనుమతులను నిబంధనలకు అనుగుణంగా ఇవ్వాలన్నారు. జిల్లాలో వీరపనేనిగూడెం, మల్లవల్లి, చల్లపల్లి, మచిలీపట్నం వంటి ప్రదేశాల్లో ఇండస్ట్రియల్ ఎస్టేట్స్ అందుబాటులో ఉన్నాయని, పరిశ్రమలు ఏర్పాటు చేయాలనుకునే వారు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రధాన మంత్రి ఎంప్లాయిమెంట్ ప్రోగ్రాం పథకం ద్వారా రూ.50 లక్షల వరకు యూనిట్ కాస్ట్ ఇవ్వటంతో పాటు 35 శాతం వరకు సబ్సిడీ ఇస్తామన్నారు. వైఎస్సార్ జగనన్న బడుగు వికాసం పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ, నిరుద్యోగ యువతకు మ్యాన్యుఫ్యాక్చరింగ్, సర్వీసింగ్ యూనిట్లను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందన్నారు. వీరికి రూ.75 లక్షల నుంచి కోటి రూపాయల వరకు యూనిట్ కాస్ట్‌తో పాటు 45 శాతం సబ్సిడీ ఉంటుందన్నారు. బీసీ మహిళలకు రూ.50 లక్షల యూనిట్ కాస్ట్‌తో 35 శాతం సబ్సిడీ ఇస్తున్నామన్నారు. జిల్లాలో గత నెలలో ఎస్సీ–11, ఎస్టీ–1, బీసీ–2, జనరల్–17 మొత్తం 31 మందికి రూ.12 కోట్లకు పైగా మంజూరు చేసినట్టు వివరించారు. జిల్లాలో నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఉపాధి పొందాలని కోరారు. సమావేశంలో పరిశ్రమల శాఖ జీఎం ఆర్.వెంకట్రావు, ఏపీఐఐసీ జెడ్‌ఎం శ్రీనివాసరావు, ఎంయూడీఏ వీసీ నారాయణరెడ్డి, ఎల్‌డీఎం సాయిరామ్, నగర కమిషనర్ చంద్రయ్య, డీపీవో నాగేశ్వర నాయక్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమంలో సరికొత్త చరిత్ర

జగ్గయ్యపేట మార్కెట్ యార్డు కమిటీ ప్రమాణ స్వీకారోత్సవంలో మంత్రి కాకాని గోవర్ధనరెడ్డి



మాట్లాడుతున్న మంత్రి కాకాని గోవర్ధనరెడ్డి. చిత్రంలో విప్ ఉదయభాను, ఎమ్మెల్యే మొండితోక తదితరులు

జగ్గయ్యపేట అర్బన్: భారత దేశ చరిత్రలో ఏ ముఖ్యమంత్రికి సాధ్యం కాని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కొత్త చరిత్రను లిఖిస్తున్నాయని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి కాకాని గోవర్ధనరెడ్డి అన్నారు. పట్టణంలోని మార్కెట్ యార్డు ఆవరణలో వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం సోమవారం సాయంత్రం ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ రైతుపక్షపాతిగా ప్రకటించుకున్న దేశంలో తొలి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. రైతు సంక్షేమానికి మహానేత వైఎస్సార్ ఒకడుగు ముందుకు వేస్తే, ఆయన తనయుడు వైఎస్ జగన్ 10 అడుగులు ముందుకు వేశారన్నారు.

రైతే రాజు..

ప్రభుత్వ విప్ ఉదయభాను మాట్లాడుతూ నాడు చంద్రబాబు వ్యవసాయం దండుగ అని హేళన చేయగా, ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన జగన్ పాలనలో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి రైతును రాజు చేశారన్నారు. అందుకోసం రాష్ట్ర బడ్జెట్‌లో సింహభాగం నిధులు వ్యవసాయానికి కేటాయించి రైతు పట్ల ఆయనకు ఉన్న చిత్తశుద్ధిని చాటుకున్నారన్నారు. సీఎం జగన్ పాలనలో పులిచింతల మొదటి సారిగా 45 టీఎంసీల నీటిని నిల్వ చేయడం జరిగిందన్నారు. ముందుగా మంత్రి యార్డు చైర్మన్, వైస్ చైర్మన్లుగా ముత్తినేని విజయశేఖర్, మానేపల్లి నాగబ్రహ్మంలతో పాటు సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు.

చిల్లర రాజకీయాలు చేతకావు..

శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి మాట్లాడుతూ చిల్లర రాజకీయాలు చేయడం సీఎం వైఎస్ జగన్‌కు తెలియవని, అవి చేసే వారి మాటలు ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. టీడీపీ నాయకుడు లోకేష్ ఇటీవల ఏ ప్రెస్‌మీట్ పెట్టినా బయోడేటా గురించి చెబుతున్నాడని, వాటిని నమ్మే వారు ఎవరూ లేరని అన్నారు. సినిమా డైలాగులకు ఓట్లు రావన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు వెలంపల్లి శ్రీనివాస్, తిరువూరు, నందిగామ ఎమ్మెల్యేలు రక్షణనిధి, మొండితోక జగన్మోహనరావు, కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ మార్కెటింగ్ అధికారి ఏ.కిషోర్, జేడీ శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యం

చిల్లకల్లు(జగ్గయ్యపేట): రాష్ట్రంలో రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని రాష్ట్ర వ్యవసాయశాఖమంత్రి కాకాణి గోవర్ధనరెడ్డి పేర్కొన్నారు. చిల్లకల్లు నుంచి జగ్గయ్యపేటకు స్టేట్ డెవలప్‌మెంట్ స్కీమ్ నుంచి విడుదలైన రూ.14 కోట్ల నిధులతో నిర్మించే రహదారి అభివృద్ధి పనులకు ప్రభుత్వవిప్, స్థానిక ఎమ్మెల్యే సామినేని ఉదయభానుతో కలిసి ఆయన సోమవారం శంకుస్థాపన చేశారు.

ముగిసిన 'మిషన్ క్లీన్ కృష్ణా'



ప్రతిజ్ఞ చేయిస్తున్న వీఎంసీ సీఎంవోహెచ్ డాక్టర్ రత్నావళి

పటమట(విజయవాడ తూర్పు): విజయవాడ నగరపాలక సంస్థ అక్టోబర్ 2 నుంచి 31 వరకు నిర్వహించిన మిషన్ క్లీన్ కృష్ణా–గోదావరి కార్యక్రమం సోమవారంతో ముగిసింది. చివరి రోజు పలు డివిజన్‌లలో అవగాహన ర్యాలీలు, ప్రతిజ్ఞల కార్యక్రమాలు నిర్వహించారు. 35వ డివిజన్ ఏలూరు లాకుల వద్ద నిర్వహించిన కార్యక్రమంలో అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) కేవీ సత్యవతి పాల్గొనగా.. 27వ డివిజన్‌లో రైవస్ కాల్వ అల్లూరి సీతారామరాజు వంతెన వద్ద దుర్గాపురం వాకర్స్ క్లబ్ సౌజన్యంతో నిర్వహించిన కార్యక్రమానికి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు స్ట్రీట్ వెండార్స్, ఆయా షాపులు, హోటల్ సంబంధిత వ్యక్తులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. కెనాల్ బండ్ సుందరీకరణకు సహకరించాలని పిలుపునిచ్చారు. కాల్వల వెంబడి చెత్త వ్యర్థాలను వేయకుండా జల కాలుష్యాన్ని తగ్గించే విధంగా కృషి చేయాలని సూచించారు. అనంతరం మున్సిపల్ సిబ్బంది, స్థానికులు, హ్యాకర్లు, వ్యాపారులతో ప్రతిజ్ఞ చేయించారు. ఆయా కార్యక్రమాల్లో 27వ డివిజన్ కార్పొరేటర్ కొండాయిగుంట మల్లీశ్వరి, 35వ డివిజన్ కార్పొరేటర్ బాలసాని మణిమ్మ, హెల్త్ ఆఫీసర్లు, శానిటరీ సూపర్‌వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల త్యాగాలు అజరామరం

మచిలీపట్నంలో ఐక్యతను చాటిన ఏక్తా దివస్



రన్ ఫర్ యూనిటీని ప్రారంభిస్తున్న ఎస్పీ జాషువా

కోనేరు సెంటర్(మచిలీపట్నం): దేశంలో పోలీసు వ్యవస్థను పటిష్ట పరచటంలో సర్దార్ వల్లభాయ్‌పటేల్ పాత్ర మరువలేనిదని కృష్ణా జిల్లా ఎస్పీ పి.జాషువా అన్నారు. సర్దార్ వల్లభాయ్‌పటేల్ జయంతిని పురస్కరించుకుని రాష్ట్రీయ ఏక్తా దివస్ కార్యక్రమంలో భాగంగా జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో మచిలీపట్నంలో సోమవారం రన్ ఫర్ యూనిటీని నిర్వహించారు. ఎస్పీ జాషువా ఈ రన్‌ను జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో వల్లభాయ్‌పటేల్ చిత్రపటానికి ఆయన పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఎస్పీతో పాటు అడిషనల్ ఎస్పీ ఎన్. వెంకటరామాంజనేయులు, సెబ్ ఏఎస్పీ అస్మాఫర్హీన్, ఏఆర్ ఏఎస్పీ ప్రసాద్ తదితరులు పటేల్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కుల, మత, వర్గ భేదాలు లేకుండా ప్రజలంతా ఐకమత్యంగా మెలగాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు, ఏఆర్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'రన్ ఫర్ యూనిటీ'



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఆర్‌ఎం శివేంద్రమోహన్

రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): భారతదేశ ఉక్కు మనిషిగా పేరొందిన సర్దార్ వల్లభాయ్ పటేల్ 147వ జయంతిని పురస్కరించుకుని సోమవారం దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్‌లో రాష్ట్రీయ ఏక్తా దివస్ పేరుతో 'రన్ ఫర్ యూనిటీ' అవగాహన ప్రచార ర్యాలీ నిర్వహించారు. విజయవాడ రైల్వే మినీ స్టేడియంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి డీఆర్‌ఎం శివేంద్రమోహన్ అధికారులతో కలసి పరుగులో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా భారతీయ రైల్వే అక్టోబర్ 31 నుంచి నవంబర్ 6 వరకు విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్ పేరుతో పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం డీఆర్‌ఎం కార్యాలయ ఆవరణలో, రైల్వే స్టేషన్ ఒకటో నంబర్ ప్లాట్‌ఫాంపై, సత్యనారాయణపురంలోని ఈటీటీసీ తదితర ప్రాంతాలలో సిబ్బంది చేత రాష్ట్రీయ ఏక్తా దివాస్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఏడీఆర్‌ఎంలు డి.శ్రీనివాసరావు, ఎం.శ్రీకాంత్, సీనియర్ డీఎస్‌సీ వల్లేశ్వర బిటి, సీనియర్ డీపీఓ బాలమురళీధర్, సీనియర్ డీఎంఈ రవికిరణ్, పీఆర్‌ఓ నుస్రత్ మండ్రుప్కర్ పాల్గొన్నారు.

కొమ్మారెడ్డి కిషోర్‌కు అబ్దుల్‌కలాం ఎక్సలెన్సీ అవార్డు



బంటుమిల్లి(పెడన): గ్రామీణ ప్రాంత విద్యా రంగంలో చేసిన విశిష్ట సేవలకు గాను బంటుమిల్లికి చెందిన కొమ్మారెడ్డి పాఠశాలల డైరెక్టర్ కొమ్మారెడ్డి కిషోర్‌కు ఏపీజే అబ్దుల్‌కలాం ఎక్సలెన్సీ అవార్డు లభించింది. ఈ నెల 22వ తేదీన జరిగిన కలాం జయంతి వేడుకల్లో భాగంగా ఉభయ రాష్ట్రాలలో వివిధ రంగాలలో సేవలు చేసిన వారిని గుర్తించి ఈ అవార్డులకు ఎంపిక చేశారు. ఆంధ్ర, తెలంగాణాలలో 29 మందిని ఎంపిక చేయగా వారిలో కిషోర్‌కు చోటు లభించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

ముగిసిన టెన్నిస్ పోటీలు

విజయవాడ స్పోర్ట్స్: విజయవాడ ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలో రెండు రోజుల పాటు జరిగిన 8వ రాష్ట్ర స్థాయి శాప్ లీగ్ టెన్నిస్ పోటీలు ముగిశాయి. ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ(శాప్), ఆంధ్రప్రదేశ్ టెన్నిస్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి. ఈ పోటీల అండర్–8 బాలుర విభాగంలో పి.రేవంత్‌రిషి(విశాఖపట్నం), వై.పర్తిక్(తూర్పుగోదావరి), బాలికల విభాగంలో పి.అతర్వ(గుంటూరు), పి.సుక్తిశ్రీ(పల్నాడు), అండర్–10 బాలుర విభాగంలో వై.క్రిష్(ఎన్టీఆర్ జిల్లా), వి.భువన్ దీరజ్(నరసాపురం), బాలికల విభాగంలో వి.పర్ణితకుట్టి(విశాఖపట్నం), ఎం.మోహినికై రవి(తూర్పుగోదావరి), అండర్–12 బాలుర విభాగంలో బి.యశ్వంత్(విశాఖపట్నం), కె.విన్సెంట్(గుంటూరు), బాలికల విభాగంలో వి.పరినితకుట్టి(విశాఖపట్నం), జి.జోషిత(గుంటూరు), అండర్–14 బాలుర విభాగంలో వై.తేజిత్(గుంటూరు), కె.విన్సెంట్(గుంటూరు), బాలికల విభాగంలో ఆర్.హాసిని(విశాఖపట్నం), జి.జోషిత(గుంటూరు), అండర్–16 బాలుర విభాగంలో ఎ.నిషిత్(వైఎస్సార్ కడప), జె.సాయిమాన్విత్(వైఎస్సార్ కడప), బాలికల విభాగంలో వై.భావన(విశాఖపట్నం), ఆర్.హాసిని(విశాఖపట్నం), అండర్–18 మిక్స్‌డ్ విభాగంలో ఎస్.అరోన్‌రోనాల్డినో(అనంతపురం), టి.రాఘవ్(ఎన్టీఆర్ జిల్లా), పురుషుల విభాగంలో కె.శ్రీనివాస్(విశాఖపట్నం), ఎం.రాజ్‌కుమార్(వైఎస్సార్ కడప) వరుసగా ప్రథమ, ద్వితీయ స్థానాలను సాధించారు. విజేతలకు కృష్ణాజిల్లా టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు రాధాకృష్ణమూర్తి బహుమతులు అందజేశారు.



రాష్ట్ర స్థాయి టెన్నిస్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేసిన నిర్వాహకులు

ఉపాధికి నగిషీలు చెక్కింది



ప్రధాన మంత్రి నుంచి ప్రశంసలు
ఏపీ ప్రభుత్వం నుంచి పురస్కారం
వీటి వెనుక దశాబ్దాల సాధన
అంతకు మించిన అకుంఠిత దీక్ష
మహిళ సాధికారతకు మరో ప్రతీక
ఉడెన్ కట్లరీ మేకర్ షేక్ గౌసియా బేగం.

షేక్ గౌసియా బేగం... నెల్లూరు జిల్లా, ఉదయగిరిలో ఓ సాధారణ కుటుంబంలో పుట్టింది. సంప్రదాయ ముస్లిం కుటుంబంలో పుట్టిన గౌసియా సమాజం ఆచరణలో పెట్టిన 'ఆడపిల్లలు ఈ పనులు చేయరాదు, వంటకే పరిమితం' వంటి అవసరం లేని సామాజిక పరిధిని చెరిపివేసింది. తండ్రి అబ్దుల్ బషీర్ చేతిలో చెక్క చక్కని రూపంలో మారిపోవడాన్ని ఆసక్తిగా చూసింది. అచ్చు నాన్నలాగే చేయాలనే ఉత్సాహంతో అద్భుతమైన నగిషీ కళను నేర్చుకుంది. ఆ కళను మెరుగు పరచుకుంటూ యుక్తవయస్సు వచ్చేనాటికి వందకు పైగా డిజైన్లలో ఆరితేరింది. ఆ చేతుల మీదుగానే నేడు వందల కుటుంబాలకు ఉపాధి దొరుకుతోంది. ఉదయగిరి పట్టణంలోని దిలావర్ భాయి వీధిలో షేక్ గౌసియాబేగం ఆధ్వర్యంలో నడుస్తున్న చెక్కనగిషీ కేంద్రంలో తయారవుతున్న వివిధ వస్తువులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు వచ్చింది. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లాంటి మార్కెట్లలో ఉదయగిరి కళా నైపుణ్యాలు దర్శనమిస్తున్నాయి. దేశంలోను, రాష్ట్రంలోను వివిధ ప్రాంతాలలో పేరుగడించిన కళారూపాలకు దీటుగా ఉదయగిరి దారు కళారూపాలు పోటీపడుతున్నాయి. ముఖ్యంగా వంటగదిలో ఉపయోగించే గరిటెలు, స్పూన్‌లు, ఫోర్క్‌ల తయారీలో నైపుణ్యాన్ని సాధించింది గౌసియా బేగం. ఆమె 2019, ఫిబ్రవరిలో ఢిల్లీ హస్తకళాకృతుల ప్రదర్శనలో స్టాల్ పెట్టింది. ఈ వస్తువులను ఓ ఎగ్జిబిషన్‌లో చూసిన దేశ ప్రధాని నరేంద్రమోదీ ముగ్ధులయ్యారు. ఈ విద్యను పదిమందికి పంచుతూ వందలాది కుటుంబాలకు ఉపాధి కల్పిస్తున్న షేక్ గౌసియా బేగంను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం... వైఎస్సార్ అచీవ్‌మెంట్ అవార్డుకు ఎంపిక చేసింది. నేడు ఆమె ఆ పురస్కారాన్ని అందుకుంటున్నారు. ఈ సందర్భంగా ఆమె సాక్షితో పంచుకున్న వివరాలివి.

ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది!



నాణ్యమైన నగిషీ వస్తువులు తయారు చేయడానికి అనువైన పదిలక్షల విలువ చేసే మెషినరీని మన రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చింది. గతంలో వ్యాపారం ఏడాదికి 20 లక్షల రూపాయలుండేది. ఈ యేడు ఆధునిక యంత్రాల సహకారంతో 50 లక్షలకు పైగా వ్యాపారం చేయగలిగాం. ఈ కేంద్రంలో పనిచేసే కుటుంబానికి నెలకు 30 వేల రాబడి తీసుకురావాలనేదే నా ఆకాంక్ష. ఇప్పటికైతే నెలకు 15 నుంచి 20 వేలు తీసుకుంటున్న వారు చాలామంది ఉన్నారు.

– షేక్ గౌసియా బేగం, దారుహస్తకళాకారిణి

వందేళ్ల నాటి కళ

''చారిత్రాత్మక నేపథ్యం గల ఉదయగిరిలో వందేళ్ల క్రితం దాదాసాహెబ్ అనే కార్పెంటర్ నుంచి ఈ విద్య ఉద్భవించింది. ఉదయగిరి దుర్గం కొండల్లో లభించే కలివె, మద్ది, రోజ్‌వుడ్ తదితర వృక్షాల కలపను సేకరించి అందమైన వస్తువులు తయారుచేసేవారు. దాదాసాహెబ్ వద్ద మా నాన్న ఈ పని నేర్చుకున్నారు. మొదట్లో ఈ ప్రాక్టీస్ అంతా ఉదయగిరి వరకే పరిమితమై ఉండేది. స్పూన్లు, దువ్వెనలు, వివిధ రకాల ఫోర్కులు తయారుచేసి ఉదయగిరికి వచ్చే పలువురు ప్రముఖులకు చూపించేవారు మా నాన్న. హ్యాండీక్రాఫ్ట్స్ డిపార్ట్‌మెంట్ వారు ఈ కళను గుర్తించి ప్రోత్సహించారు. ఆయన తాను నేర్చుకున్న విద్యను, తన ప్రయోగాలతో రూపొందించిన కొత్త రూపాలను ఉదయగిరిలో అనేక మందికి నేర్పించారు. వయస్సు పైబడిన తర్వాత ఆయన తన కార్పెంటరీ యూనిట్ నిర్వహణ బాధ్యతను నాకు, మా చెల్లి షాహీదాకు అప్పగించారు. అప్పటి నుంచి నేను ఈ కళను మహిళలకు నేర్పిస్తున్నాను. 1995లో 35 మంది మహిళలతో కేంద్రాన్ని ఏర్పాటు చేశాను. నేడది 500 కుటుంబాలకు విస్తరించింది. భవిష్యత్తులో వెయ్యి కుటుంబాలకు పైగా విస్తరించి వారికి ఉపాధి కల్పించాలనేది నా ఆశయం.

విదేశాల్లో మన కట్లరీ!

మా కేంద్రంలో తయారుచేసిన వంటింటి వాడుక వస్తువులను మా అబ్బాయి సహకారంతో ఆన్‌లైన్‌లో మార్కెట్ చేస్తున్నాం. ఆన్‌లైన్ మూలాన మేము తయారు చేసిన వస్తువులు విదేశాలకు కూడా విస్తరించాయి. భవిష్యత్తులో ఉదయగిరి బ్రాండ్‌కు మంచి గుర్తింపు తేవాలనేది నా ఆశయం. రాష్ట్ర ప్రభుత్వం మారుమూల ఉదయగిరిలోని మా కేంద్రాన్ని గుర్తించి వైఎస్సార్ అచీవ్‌మెంట్ అవార్డు ఇవ్వటం ఎంతో ఆనందంగా ఉంది'' అంటూ సంతోషాన్ని వ్యక్తం చేశారామె.

– మేడగం భాస్కర్ రెడ్డి, సాక్షి, ఉదయగిరి, నెల్లూరు జిల్లా

న్యూస్‌మేకర్

ఆదిలాబాద్ అమ్మాయికి రెక్కలొచ్చాయి



అవును. ఇండిగో రంగు రెక్కలు.
ఆకాశంలో దూసుకువెళ్లే రెక్కలు.
ఆ రెక్కలు ఇకపై ఎందరినో
గమ్యానికి చేర్చనున్నాయి.
ఆదిలాబాద్ నుంచి మొదటి మహిళా పైలెట్
అయిన స్వాతి రావు స్ఫూర్తితో అదే అదిలాబాద్ జిల్లా నుంచి
రెండో పైలెట్ అయ్యింది ఆఫ్రిన్ హిరానీ.
ఇంద్రవెల్లిలో డిపార్ట్‌మెంటల్ స్టోర్ నడిపే ఆమె తండ్రి
ఆఫ్రిన్‌కు అపాయింట్‌మెంట్ లెటర్ రావడంతోటే
తన దగ్గర పని చేసే 15 మంది గిరిజన ఉద్యోగులను
విమానం ఎక్కించి తిరుపతి తీసుకెళ్లడం విశేషం.



తల్లిదండ్రులతో ఆఫ్రిన్ హిరానీ

ఆఫ్రిన్ హిరానీకి కొంత దారి ముందే పడింది.

ఆ దారి వేసింది అదే జిల్లా నుంచి మొదటిసారి కమర్షియల్ పైలెట్ అయిన స్వాతి రావు. 2005లో స్వాతి రావు కమర్షియల్ పైలెట్ అవ్వాలని అనుకున్నప్పుడు వెనుకబడిన జిల్లా కావడం వల్ల ఆమెకు ఏ సమాచారం దొరకలేదు. ఇంటర్నెట్ లేదు. కోర్సు ఎక్కడ దొరుకుతుందో తెలియదు. తండ్రికి కూడా పెద్దగా వివరాలు తెలియలేదు. కాని అదే సమయంలో ఆమె తమ్ముడు బిట్స్ పిలానిలో చేరడంతో అక్కడి నుంచే వివరాలు తెలుసుకుని అక్కకు చెప్పాడు. దాంతో స్వాతి రావు మొదట హైదరాబాద్‌లో చదివి ఆ తర్వాత ఫిలిప్పైన్స్ వెళ్లి 'కమర్షియల్ పైలెట్ లైసెన్స్' (సి.పి.ఎల్) చేసింది. ఇండియా తిరిగొచ్చి పైలెట్ అయ్యింది.

'నేను పైలెట్ అవ్వాలనుకున్నప్పుడు ఆమె నుంచే స్ఫూర్తి పొందాను' అంది ఆఫ్రిన్ హిరానీ. 'మా జిల్లా నుంచి ఆమె పైలెట్ అయినప్పుడు నేనెందుకు కాకూడదు అని గట్టిగా అనుకున్నాను' అంటుంది ఆఫ్రిన్.



తన దగ్గర పనిచేస్తున్న ఉద్యోగులను విమానంలో తీసుకెళ్తున్న ఆఫ్రీన్ తండ్రి

28 ఏళ్ల ఆఫ్రిన్ ఇప్పుడు ఇండిగో పైలెట్. మనం ఏ చెన్నైకో, ఢిల్లీకో ఇండిగోలో వెళుతున్నప్పుడు మనం ఎక్కిన ఫ్లయిట్‌ను ఆఫ్రిన్ నడపవచ్చు. 'నేను మీ పైలెట్ ఆఫ్రిన్‌ని' అని మైక్రోఫోన్‌లో మనకు గొంతు వినిపించవచ్చు. ఆదిలాబాద్ జిల్లా నుంచే మరో అమ్మాయి పైలెట్ కావడం అంటే చిన్న విషయం కాదు.

చిల్లర అంగడి నుంచి నింగికి

ఆఫ్రిన్ తండ్రి అజీజ్ హిరానీకి ఇంద్రవెల్లిలో పెద్ద డిపార్ట్‌మెంటల్ స్టోర్ ఉంది. అతను స్కూల్ చదువు మాత్రమే చదువుకున్నాడు. భార్య నవీన హిరాని గృహిణి. వారి కుమార్తె ఆఫ్రిన్ పైలెట్ కావాలని అనుకున్నప్పుడు తల్లిదండ్రులు ఇద్దరూ ఆమెకు మద్దతు పలికారు. 'నా కూతురికి ఎంత సపోర్ట్ కావాలంటే అంత సపోర్ట్ ఇవ్వాలనుకున్నాను' అంటాడు అజీజ్. అతను ఇంద్రవెల్లిలోని గిరిజనేతర పిల్లలతో పాటు గిరిజన పిల్లలకు కూడా సమాన చదువు అందాలని 'ఇంద్రవెల్లి పబ్లిక్ స్కూల్' పేరుతో ఒక స్కూల్ కూడా నడుపుతున్నాడు. ఆఫ్రిన్ తన ప్రాథమిక విద్యను అక్కడే చదివింది. హైదరాబాద్‌లో ఇంటర్ చేసి మల్లారెడ్డి కాలేజ్ నుంచి ఏరోనాటికల్ ఇంజనీరింగ్ చేసింది. ఆ తర్వాత ఆస్ట్రేలియాలో రెండేళ్ల ఫ్లయింగ్ కోర్సు చేసింది. 2020 సంవత్సరం నాటికి పూర్తి యోగ్యతతో ఆమె ఇండియా తిరిగి వచ్చింది. అయితే కోవిడ్ వల్ల ఆమె అపాయింట్‌మెంట్ ఆలస్యమైంది. ఇటీవలే ఇండిగోలో జాయిన్ అయ్యింది. 'ఎప్పుడెప్పుడు నా దేశంలో విమానం ఎగరేద్దామా అన్న నా కోరిక ఇన్నాళ్లకు తీరింది' అంటుంది ఆఫ్రిన్.

మత సామరస్యం

ఆఫ్రిన్‌కు పైలెట్‌గా అపాయింట్‌మెంట్ రాగానే ఆమె తల్లిదండ్రులతో పాటు స్టోర్‌లో పని చేసే సిబ్బంది కూడా ఆనందించారు. వారంతా చుట్టుపక్కల పల్లెలకు చెందినవారు. చిరు సంపాదనాపరులు. ఆఫ్రిన్ తండ్రి వారి కోసమని ఈ సందర్భాన్ని పురస్కరించుకుని వెంట ఉండి మరీ అందరినీ మొదటిసారి హైదరాబాద్ నుంచి విమానంలో తిరుమల యాత్రకు తీసుకెళ్లాడు. జీవితంలో మొదటిసారి విమానం ఎక్కినందుకు వారు ఆనందించారు. ఆఫ్రిన్ అంతటి విమానాన్ని నడపబోతుందా అని ఆశ్చర్యపోయారు. ఏమో... రేపు ఈ సిబ్బంది పిల్లల నుంచి మరో స్వాతి, మరో ఆఫ్రిన్ రావచ్చు.

ఆడపిల్లలను స్కూల్ మాన్పించడం, చిన్న వయసులో వివాహం చేయడం వంటివి మానుకుని వారికి తగిన సపోర్ట్ ఇస్తే ఆకాశమే హద్దు.

సాగుబడి
స్వాతి కార్తె : నవంబర్ 6 వరకు
విశాఖ కార్తె : 7 నుంచి

5న గుంటూరు, 6న కడియపులంకలో...

గోకృపామృతంపై సదస్సులు



గో-ఆధారిత ప్రకృతి వ్యవసాయానికి మూలాధారమైన గో-కృపామృతం ద్రావణం వినియోగం, ప్రయోజనాలపై నవంబర్ 5, 6 తేదీల్లో గుంటూరు, కడియపులంకల్లో రైతునేస్తం ఫౌండేషన్ అవగాహన సదస్సులు నిర్వహించనుంది. 5వ తేదీ (శనివారం)న గుంటూరులోని శ్రీవేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఉ. 10–సా.4 గం. వరకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు రైతునేస్తం ఫౌండేషన్ అధ్యక్షులు యడ్లపల్లి వేంకటేశ్వరరావు తెలిపారు. అదేవిధంగా, తూర్పుగోదావరి జిల్లా కడియపులంక (రాజమండ్రి దగ్గర)లోని సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ ఆవరణలో ఈ నెల 6న (ఆదివారం) మ. 2 గం. నుంచి సా. 6 గం. వరకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్, నర్సరీ అసోసియేషన్, గోఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం ఆధ్వర్యంలో ఈ సదస్సు జరుగుతుందన్నారు. గో-కృపామృతాన్ని రూపొందించిన గుజరాత్‌కు చెందిన గోపాల్‌భాయ్ సుతారియా స్వయంగా ఈ సదస్సుల్లో ప్రసంగించి, రైతుల ప్రశ్నలకు సమాధానాలిస్తారు. గో-కృపామృతం మదర్‌కల్చర్ 1 లీటర్ బాటిల్‌ను రైతులకు ఉచితంగా పంపిణీ చేస్తారు. దీన్ని ఒకసారి తీసుకుంటే చాలు.. మళ్లీ మళ్లీ రైతులే (బెల్లం, దేశీ ఆవు మజ్జిగను కలుపుకొని) స్వయంగా తయారు చేసుకొని నిరంతరం పంటలకు వాడుకోవచ్చు. అందరూ ఆహ్వానితులే. ప్రవేశం ఉచితం. వివరాలకు.. 95538 25532, 97053 83666.

నల్ల తామరకు హోమియో మందు

తెలుగు రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాల్లో మిరప పంటను ఈ ఏడాది కూడా నల్ల తామర పురుగు (బ్లాక్ త్రిప్స్) ఆశిస్తున్నట్లు సమాచారం. నల్ల తామరతో పాటు మిరప రైతులు ఎదుర్కొంటున్న అనేక చీడపీడల నియంత్రణకు హోమియో మందులు అద్భుతంగా పని చేస్తున్నాయని యాదాద్రి భువనగిరి జిల్లా రామకృష్ణాపురానికి చెందిన అమేయ కృషి వికాస కేంద్రం వ్యవస్థాపకులు, రైతు శాస్త్రవేత్త జిట్టా బాల్‌రెడ్డి తెలియజేస్తున్నారు. గత ఏడాది 'సాక్షి సాగుబడి' ద్వారా పలువురు రైతులు హోమియో మందులతో మిరప తోటలను కాపాడుకున్న సంగతి తెలిసిందే.

మిరప చీడపీడలకు బాల్‌రెడ్డి సూచించిన హోమియో మందులు: నల్ల పేను (వెస్టర్న్ త్రిప్స్)– ఆర్సేరియా డయాడెమా 30. రింగ్ స్పాట్ వైరస్ (బొబ్బర)– నేట్రమ్ సాలిసికమ్ 30, సాలిసిక్ ఆసిడ్ 30. ఎల్లో మొజాయిక్ వైరస్–జింజింబర్ 30, వాలెరినా 30. బూడిద తెగులు, కొమ్మెండు తెగులు–కూప్రమ్ మెటాలికమ్ 30. వేరు/కాయ/కాండం కుళ్లు – బావిస్టా 30. తెల్లదోమ, పచ్చదోమ–కోక్సినెల్లా 30. సోరినమ్ 30. తుప్పుతెగులు, కాయమచ్చ–బెల్లడోనా 30, కాల్కేరియాకార్బ్ 30. ఇతర వివరాలకు Ameya krishi Vikasa kendram యూట్యూబ్ ఛానల్‌లో వీడియోలు చూడవచ్చు.

6న బసంపల్లిలో రైతులకు శిక్షణ

శ్రీ సత్యసాయి జిల్లా చెన్నేకొత్తపల్లి మండలం బసంపల్లి గ్రామంలో ప్రకృతి వ్యవసాయ నిపుణుడు నాగరాజు ఈ నెల 6న (ప్రతి నెలా మొదటి ఆదివారం) రైతులకు శిక్షణ ఇస్తారు. ప్రవేశ రుసుం: రూ. 200. ఉ. 9 నుంచి 4 సా. వరకు శిక్షణ ఉంటుంది. ధర్మవరం–పుట్టపర్తి రోడ్డులో బసంపల్లి ఉంటుంది. శిక్షణ వివరాలకు.. 91826 71819.

శ్రీగంధం టిష్యూకల్చర్ టెక్నిక్స్‌పై 9 నుంచిశిక్షణ

భారతీయ అటవీ పరిశోధన, విద్యా మండలికి అనుబంధంగా బెంగళూరులో ఏర్పాటైన కేంద్ర ప్రభుత్వ సంస్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఐడబ్ల్యూఎస్‌టి) శ్రీగంధం మొక్కల్ని టిష్యూకల్చర్ పద్ధతిలో ఉత్పత్తి చేయటంపై 3 రోజుల పాటు శిక్షణ ఇవ్వనుంది. నవంబర్ 9 నుంచి 11 వరకు బెంగళూరులోని సంస్థ ఆవరణలో ఆంగ్లంలో శిక్షణ ఇస్తారు. భోజన, వసతులు కలిపి ఫీజు రూ. 15,000. 18% జీఎస్టీ అదనం. వసతి వద్దనుకుంటే రూ. 10,000 చెల్లిస్తే చాలు. శాస్త్రవేత్త ట్రెసా హమల్టన్ కోర్సు డైరెక్టర్‌గా వ్యవహరిస్తారు. ఇతర వివరాలకు.. 080–22190137, 93604 73165. ఈమెయిల్: tresa@icfre.org

నిర్వహణ: పంతంగి రాంబాబు, సాగుబడి డెస్క్

శ్రీగంధం భవిత బంగారం

- మొదటి మూడేళ్లు డ్రిప్ ద్వారా తడులు తప్పనిసరి
- ఇంచ్ నీటితో 10 ఎకరాలు సాగు
- చౌడు సమస్య లేని ఏ భూముల్లోనైనా సాగు చేసుకోవచ్చు
- 15 ఏళ్లలో సిరులు కురిపించే శ్రీగంధం
- బెంగళూరులో శిక్షణ పొంది సాగు చేస్తున్న రైతు బయారెడ్డి



బయారెడ్డి శ్రీగంధం తోట

సాధారణ సీజనల్ పంటల సాగులో సమస్యలతో సతమతమైన రైతు తాళ్లపల్లి బయారెడ్డికి శ్రీగంధం సాగు గొప్ప భరోసాగా నిలిచింది. పొరుగు రాష్ట్రం కర్ణాటకలో విస్తారంగా సాగులో ఉన్న శ్రీగంధం తోటల గురించి తెలుసుకొని ఆసక్తి పెంచుకున్నారు. బెంగళూరులోని కేంద్ర ప్రభుత్వ సంస్థ 'ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఉడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఐడబ్ల్యూఎస్‌టి)' శ్రీగంధం సాగు, నర్సరీ నిర్వహణ, మార్కెటింగ్ తదితర అంశాలపై 5 రోజులపాటు శిక్షణ ఇస్తోంది. 2018లో బయారెడ్డి శిక్షణ పొందారు. శ్రీసత్యసాయి జిల్లా కొత్తచెరువు మండలం ఇరగంపల్లి వాస్తవ్యుడైన ఆయన తనకున్న 10 ఎకరాల పొలం (ఇసుక పాళ్లు ఎక్కువగా ఉండే ఎర్ర నేల)లో శ్రీగంధం సాగుకు శ్రీకారం చుట్టారు. ఐ.డబ్ల్యూ. ఎస్.టి.లోనే 3 వేల మొక్కలను కొనుగోలు చేసి పొలంలో నాటారు. ఎకరాకు 300 చొప్పున పది ఎకరాల్లో 15×10 అడుగుల దూరంలో నాటారు.

ఇతర చెట్ల వేర్లే ఆధారం

శ్రీగంధం మొక్క వేర్లకు నేలలో నుంచి కొన్ని పోషకాలను నేరుగా తీసుకునే శక్తి ఉండదు. అందువల్ల పక్కనే ఉండే ఇతర చెట్ల వేర్లపై ఆధారపడి శ్రీగంధం మొక్కల వేర్లు పోషకాలను తీసుకుంటూ ఉంటాయి. అందుకని, శ్రీగంధం సాగు చేసే రైతులు పక్కనే సరుగుడు, రోజ్‌ఉడ్ తదితర మొక్కల్ని కూడా నాటుకోవాలి. అయితే, శ్రీగంధం మొక్కలకు ఎండ సరిగ్గా తగిలేలా జాగ్రత్తపడాలి. బయారెడ్డి తన పదెకరాల్లో 300 సరుగుడు, 300 రోజ్‌ఉడ్ మొక్కల్ని సైతం నాటారు. ఒకటిన్నర ఇంచ్‌ల నీళ్లు వస్తున్న బోరుకు డ్రిప్పు అమర్చి పంటను సంరక్షించుకుంటున్నారు. ఎప్పటికప్పుడు శాస్త్రవేత్తల ద్వారా సాగులో ఉన్న అనుమానాలను నివృత్తి చేసుకుంటున్నారు. తదనంతరం బయారెడ్డి శ్రీగంధం మొక్కల నర్సరీని నెలకొల్పారు. మూడేళ్ల కాలంలో ఆంధ్ర, తెలంగాణ, మహారాష్ట్ర రైతులకు సుమారు 2.5 లక్షల శ్రీగంధం మొక్కలను అందిస్తూ రైతులకు నిరంతరం సలహాలు, సూచనలు అందిస్తున్నారు. ఫోన్ ద్వారానే గాక యూట్యూబ్ వీడియోల ద్వారా సలహాలు అందిస్తున్నారు.

కంది, సరుగుడు, రోజ్‌ఉడ్...

నల్లరేగడి, ఒండ్రు నేలలు, నీరు నిల్వ ఉండే భూములు, చౌడు నేలలు తప్ప ఏ ఇతర నేలల్లో అయినా శ్రీగంధం తోట నాటుకోవచ్చు. శ్రీగంధం మొక్కలతో పాటు విధిగా కంది, సరుగుడు, రోజ్‌ఉడ్ మొక్కలను నాటుకోవాలి, శ్రీగంధం మొక్కకు వరుసలో రెండు వైపులా 1–1.5 అడుగుల దూరంలో కంది మొక్కలు నాటాలి. 3–5 అడుగుల దూరంలో సరుగుడు, 7.5–8 అడుగుల దూరంలో రోజ్‌ఉడ్ మొక్కల్ని నాటుకోవాలి. ఈ మొక్కల వేళ్లపై ఆధారపడి శ్రీగంధం మొక్కలు ఏపుగా పెరుగుతాయి. కరివేపాకు, అవిశ, కానుగ, సర్కారు తుమ్మ మొక్కల్ని కూడా హోస్ట్ ప్లాంట్లుగా నాటుకోవచ్చు. అయితే, ఈ రకాలను పెంచడం ద్వారా రైతుకు అంతగా ఆదాయం రాదు. కాబట్టి సరుగుడు, రోజ్‌ఉడ్ మొక్కల్ని నాటుతున్నట్లు బయారెడ్డి వివరించారు.

మామిడి, సపోట, నేరేడు వంటి తోటల్లోనూ ఎప్పటి ప్పుడు ప్రూనింగ్ చేసుకునే పరిస్థితి ఉంటే శ్రీగంధం మొక్కలు నాటుకోవచ్చన్నారు. ఎన్ని రకాల మొక్కలు, పంటలనైనా అంతర పంటలుగా వేసుకోవచ్చని, అయితే శ్రీగంధం మొక్కలపై నీడ పడకుండా ఉండేలా చూసుకోవటం ముఖ్యమని ఆయన అంటున్నారు.

మన శ్రీగంధం అత్యుత్తమమైనది



అత్యంత ఖరీదైన కలప జాతుల్లో రెండోది శ్రీగంధం. 17 శ్రీగంధం జాతుల్లోకెల్లా శాంటాలం ఆల్బం అనే భారతీయ జాతి శ్రీగంధం అత్యుత్తమమైనది. 1965లో 2,680 టన్నుల శ్రీగంధం తైలాన్ని ఎగుమతి చేసిన మన దేశం ఇప్పుడు వేల టన్నుల్ని ఆస్ట్రేలియా నుంచి దిగుమతి చేసుకుంటున్నది. ఆస్ట్రేలియా 30 ఏళ్ల క్రితం మన జాతి శ్రీగంధం విత్తనాలను తీసుకెళ్లి వేలాది ఎకరాల్లో సాగు చేస్తోంది. అటవీ జాతి అయిన శ్రీగంధం చెట్లను పొలాల్లో సాగు చేయటంపై 2006లో ఆంక్షలు తొలగిపోయాయి. 2010 నుంచి మా సంస్థ సాగుపై రైతులకు శిక్షణ ఇస్తోంది. రైతుల పొలాల్లో 15 ఏళ్లు పెరిగిన చెట్టు నుంచి 12 కిలోల చావదేలిన చెక్క వస్తుంది. దీని నుంచి 6% నూనె వస్తుంది. కిలో చావదేలిన చెక్క ఖరీదు రూ. 12,500 ఉంది. శ్రీగంధం నూనె ప్రయోజనాలెన్నో ఉన్నాయి. కేన్సర్ మందుల్లోనూ వాడుతున్నారు. మార్కెట్ ధర పెరగడమే గానీ తగ్గటం ఉండదు. రైతులు శ్రీగంధం మొక్కల్ని ఇతర పంటలతో కలిపి సాగు చేసుకోవచ్చు.

– డాక్టర్ ఆర్.సుందరరాజ్. (97404 33959). సీనియర్ శాస్త్రవేత్త. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఉడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ. బెంగళూరు

శ్రీగంధం తోటలకు బీమా కల్పించాలి



ప్రభుత్వం ఉద్యాన తోటలతో సమానంగా శ్రీగంధం సాగుకు రాయితీలు కల్పించి, డ్రిప్‌ను సబ్సిడీపై ఇచ్చి, బీమా సదుపాయం కల్పించి ప్రోత్సహించాలి. శ్రీగంధం చెట్లు కోతకు వచ్చినప్పుడు ఎకరానికి రూ. 4 లక్షల వరకు ప్రభుత్వానికి పన్ను రూపంలో ఆదాయం వస్తుంది. పర్యావరణ పరిరక్షణతో పాటు జీవవైవిధ్యం, పచ్చదనం పెంపుదలకు శ్రీగంధం సాగు దోహదపడుతుంది. సీజనల్ పంటలు, పాడిపై ఆదాయం ద్వారా జీవనం సాగించే చిన్న, సన్నకారు రైతులు కొన్ని శ్రీగంధం మొక్కలు పెంచుకుంటే భవిష్యత్తు బాగుంటుంది. తమకున్నది ఎకరం పొలం అయినా 10 సెంట్లలో 30 శ్రీగంధం మొక్కలు నాటుకుంటే 15 ఏళ్లకు ఒకేసారి మంచి ఆదాయం వస్తుంది.

– తాళ్లపల్లి బయారెడ్డి, (94400 16995), శ్రీగంధం రైతు, ఇరగంపల్లి, కొత్తచెరువు మండలం, శ్రీసత్యసాయి జిల్లా



శ్రీగంధం మొక్కల నర్సరీ

12-15 ఏళ్లకు భారీగా ఆదాయం

మొక్కల మధ్య 10 అడుగులు, వరుసల మధ్య 15 అడుగుల దూరం ఉండాలి, మూడేళ్ల పాటు నీటి తడులు అందిస్తూ సంరక్షించుకోవాలి. అప్పుడప్పుడూ సేంద్రియ ఎరువులు వేస్తే చాలని బయారెడ్డి అంటున్నారు. మూడేళ్ల తరువాత నీటి తడులు అవసరం లేదన్నారు.

శ్రీగంధం పక్కన ఉండే చెట్ల వేర్లపై ఆధారపడి పోషకాలను గ్రహిస్తూ ఉంటాయి. 20 అడుగుల ఎత్తు వరకూ పెరుగుతాయి. 12 నుంచి 15 ఏళ్లకు చేవదేలి కోతకు వస్తాయన్నారు. ఒక్కో చెట్టును సగటున కనీసం 15–20 కిలోల చేవగల శ్రీగంధం చెక్క వస్తుంది. ప్రస్తుత మార్కెట్‌లో కిలో రూ.6 వేల నుండి రూ.12 వేల ధర పలుకుతోందని బయారెడ్డి తెలిపారు. ఈ లెక్కన ఒక్కో చెట్టుకు కనీసం రూ.ఒక లక్ష వరకూ ఆదాయం వస్తుందన్నారు. దీంతో ఒక ఎకరాకు రూ.3 కోట్ల వరకూ ఆదాయం వస్తుందని ఆయన ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

అయితే, ఖరీదైన చెట్లు కావడంతో ముదురు తోటలకు దొంగల బెడద అధికంగా ఉంటుంది. చెట్టుకు ఆరేళ్లు దాటిన తరువాత అక్కడక్కడా సీసీ కెమెరాలు అమర్చుకొని కాపాడుకోవాలన్నారు. శ్రీగంధం చెట్ల మధ్య ఇతర పంటలను సాగు చేసుకోవచ్చన్నారు. శ్రీగంధం చెట్టుకు కొమ్మలను కత్తిరించకూడదన్నారు. మొదలుకు ఎండ అధికంగా తగలకుండా రక్షించుకుంటే మొక్క ఏపుగా పెరుగుతుందన్నారు. ఎటువంటి చీడపీడల బాధ ఉండదన్నారు. ప్రస్తుతం ఆస్ట్రేలియా తదితర దేశాల నుంచి శ్రీగంధం చెక్కలను మన దేశం ఏటా వేల టన్నులు దిగుమతి చేసుకుంటున్నందున మార్కెటింగ్ సమస్య లేదన్నారు. బయారెడ్డి తోటను ఇటీవల సందర్శించిన ఐ.డబ్ల్యూ.ఎస్.టి. సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఆర్.సుందరరాజ్ సంతృప్తిని వ్యక్తం చేశారు.

– జి.కేశవరెడ్డి, పుట్టపర్తి అర్బన్



ఆధిక్యంలో హర్ష భరతకోటి

తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ హర్ష భరతకోటి ఆసియా కాంటినెంటల్ చెస్ చాంపియన్‌షిప్‌లో ఆధిక్యంలో కొనసాగుతున్నాడు. ఓపెన్ కేటగిరీలో సోమవారం టాప్‌సీడ్ ప్రజ్ఞానందతో జరిగిన ఆరో రౌండ్ గేమ్‌ను హర్ష డ్రా చేసుకున్నాడు. తాజా ఫలితంతో అతను 5 పాయింట్లతో ఆధిక్యంలో ఉండగా, ప్రజ్ఞానంద 4.5 పాయింట్లతో మరో 11 మంది ఆటగాళ్లతో కలిసి ఉమ్మడిగా రెండో స్థానంలో కొనసాగుతున్నాడు.


బ్రెవిస్ 57 బంతుల్లో 162 పరుగులు



దక్షిణాఫ్రికా యువ ఆటగాడు డెవాల్డ్ బ్రెవిస్ టి20 క్రికెట్‌లో సంచలన ప్రదర్శన నమోదు చేశాడు. సీఎస్‌ఏ చాలెంజ్ లీగ్‌లో భాగంగా నైట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో టైటాన్స్‌కు ప్రాతినిధ్యం వహించిన అతను 57 బంతుల్లోనే 13 ఫోర్లు, 13 సిక్సర్లతో 162 పరుగులు సాధించాడు. 35 బంతుల్లోనే శతకం సాధించిన అతను ఐదో ఫాస్టెస్ట్ సెంచరీని నమోదు చేయగా, 52 బంతుల్లో 150 పరుగులు సాధించి కొత్త రికార్డు నెలకొల్పాడు. గేల్ (175), ఫించ్ (172) తర్వాత టి20 క్రికెట్‌లో ఇది మూడో అత్యుత్తమ స్కోరు కావడం విశేషం.

కోహ్లి గది ఇలా...


- వీడియో తీసిన హోటల్ ఉద్యోగి
- ఘటనపై విరాట్ తీవ్ర అసహనం



పెర్త్: విరాట్ కోహ్లి మైదానానికి వెళ్లిన సమయంలో అతని హోటల్ గదిలో అనూహ్యం చోటు చేసుకుంది. ఒక అపరిచితుడు అతని గదిని వీడియో తీసి దానిని టిక్‌టాక్‌లో పెట్టాడు. అక్కడ ఉన్న అన్ని వస్తువులను చూపిస్తూ అతను 'కింగ్ కోహ్లి హోటల్ గది' అంటూ క్యాప్షన్ కూడా పెట్టాడు. ఇది ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీనిపై కోహ్లి తీవ్ర అసహనం వ్యక్తం చేశాడు. హోటల్ గదిలో కూడా తమకు ఏకాంతం లేకపోతే ఇంకా ఏం చేస్తామని ప్రశ్నించాడు. తన ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లో వీడియోను కూడా షేర్ చేసిన కోహ్లి తీవ్ర వ్యాఖ్యలతో హోటల్ యాజమాన్యాన్ని ప్రశ్నించాడు. కోహ్లి తేదీపై స్పష్టత ఇవ్వకపోయినా, భారత జట్టు ఆస్ట్రేలియాలో అడుగుపెట్టిన రెండు రోజుల తర్వాత అక్టోబర్ 8న ఈ ఘటన జరిగినట్లుగా తెలిసింది. ఆ సమయంలో భారత జట్టు క్రౌన్ టవర్స్ హోటల్‌లో బస చేసింది. 'తమ అభిమాన ఆటగాళ్లను చూసినప్పుడు అభిమానులు ఉద్వేగానికి గురి కావడం, వారిని కలవాలనుకోవడాన్ని నేను అర్థం చేసుకోగలను. నేను కూడా అందుకు సహకరిస్తా. కానీ ఈ వీడియో మాత్రం నేను నిర్ఘాంతపోయేలా చేసింది. ఒక రకంగా నా ఏకాంతానికి సంబంధించి నన్ను భయపెట్టినట్లు అనిపించింది. నా హోటల్ గదిలో కూడా నాకు ఏకాంతం లేకపోతే ఇంకా ఎక్కడ నేను విడిగా స్వేచ్ఛగా ఉండగలను. ఇది అస్సలు బాగా లేదు. మా ఏకాంతాన్ని భంగపరిచే ఈ తరహా పిచ్చి అభిమానం సరైంది కాదు. మా ఏకాంతాన్ని గౌరవించండి. మమ్మల్ని వినోదాన్ని అందించే వస్తువుల్లా భావించకండి' అని కోహ్లి అన్నాడు. దీనిపై హోటల్ యాజమాన్యం క్షమాపణలు కోరింది. ఈ ఘటనతో సంబంధం ఉన్న తమ ఉద్యోగులను వెంటనే తొలగించామని, ఇకపై ఈ తరహా ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటామని వివరణ ఇచ్చింది. భారత జట్టు అధికారికంగా దీనిపై ఎలాంటి ఫిర్యాదు చేయకపోయినా... ఐసీసీ కూడా విచారం వ్యక్తం చేసింది.

ఆస్ట్రేలియా ఘన విజయం

- 42 పరుగుల తేడాతో ఐర్లాండ్ ఓటమి
- ఫించ్ అర్ధసెంచరీ
- టకర్ పోరాటం వృథా



టకర్



ఫించ్

బ్రిస్బేన్: కెప్టెన్ ఆరోన్ ఫించ్ (44 బంతుల్లో 63; 5 ఫోర్లు, 3 సిక్సర్లు) చాలా కాలం తర్వాత ఆస్ట్రేలియాను గెలిపించే ఇన్నింగ్స్ ఆడాడు. దీంతో టి20 ప్రపంచకప్‌లో సోమవారం జరిగిన 'సూపర్-12' మ్యాచ్‌లో ఆతిథ్య ఆసీస్ 42 పరుగుల తేడాతో ఐర్లాండ్‌పై ఘన విజయం సాధించింది. ఈ గెలుపుతో గ్రూప్-1లో ఫించ్ సేన న్యూజిలాండ్‌తో పాటు 5 పాయింట్లతో సమ ఉజ్జీగా నిలిచింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 179 పరుగులు చేసింది. స్టొయినిస్ (25 బంతుల్లో 35; 3 ఫోర్లు, 1 సిక్స్) మెరుగ్గా ఆడాడు. ఐర్లాండ్ బౌలర్ బారి మెకార్తీ (3/29) టాపార్డర్‌ను కూల్చేశాడు. అనంతరం లక్ష్య ఛేదనకు దిగిన ఐర్లాండ్ 18.1 ఓవర్లలో 137 పరుగులకే ఆలౌటైంది. లోర్కన్ టకర్ (48 బంతుల్లో 71 నాటౌట్; 9 ఫోర్లు, 1 సిక్స్) ఒంటరి పోరాటం చేయగా, మ్యాక్స్‌వెల్ (2/14), స్టార్క్ (2/43) కీలక వికెట్లతో ఐర్లాండ్‌ను పడగొట్టారు.

ఫించ్ ఫిఫ్టీ

గత వరల్డ్ కప్ 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ' డేవిడ్ వార్నర్ (3) వరుసగా మూడో మ్యాచ్‌లోనూ విఫలమయ్యాడు. లిటిల్, మెకార్తీ కట్టుదిట్టమైన బౌలింగ్‌తో ఆరంభంలో ఆస్ట్రేలియా బ్యాటర్లు కష్టపడ్డారు. బౌండరీ కొట్టేందుకు మూడో ఓవర్‌దాకా వేచి చూడక తప్పలేదు. పవర్ ప్లే (6 ఓవర్లు)లో ఆసీస్ స్కోరు 38/1 మాత్రమే. అనంతరం ఫియోన్ హ్యాండ్ ఓవర్లో రెండు సిక్సర్లు బాదిన మిచెల్ మార్ష్ (22 బంతుల్లో 28; 2 ఫోర్లు, 2 సిక్సర్లు) వేగం పెంచాడు. కాసేపటికే అతన్ని అవుట్‌చేసి ఈ వేగానికి మెకార్తీ కళ్లెం వేశాడు. మ్యాక్స్‌వెల్ (13) త్వరగానే పెవిలియన్ చేరగా... స్టొయినిస్‌తో కలిసి ఫించ్ జట్టును నడిపించాడు. ఆసీస్ సారథి 38 బంతుల్లో (4 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. నాలుగో వికెట్‌కు 70 పరుగులు జోడించాక ఫించ్ కూడా మెకార్తీ బౌలింగ్‌లోనే వెనుదిరిగాడు. టిమ్ డేవిడ్ (10 బంతుల్లో 15 నాటౌట్; 2 ఫోర్లు), వేడ్ (7 నాటౌట్) ఆఖరి ఓవర్లో 17 పరుగులు చేశారు.

టకర్ నాటౌట్

పటిష్టమైన ఆస్ట్రేలియా బౌలింగ్‌ను వారి సొంతగడ్డపై ఎదుర్కొనే సత్తా ఐర్లాండ్ బ్యాటర్స్‌కు లేకపోయినా... ఒకే ఒక్కడు టకర్ మాత్రం అదరగొట్టాడు. 25 పరుగులకే ఐర్లాండ్ సగం వికెట్లు కోల్పోయింది. ఓపెనర్లు స్టిర్లింగ్ (11), బాల్బిర్నీ (6) సహా ఆఖరి వరుస దాకా టెక్టర్ (6), కాంఫెర్ (0), డాక్రెల్ (0), డెలానీ (14), అడయిర్ (11), హ్యాండ్ (6), మెకార్తీ (3), లిటిల్ (1)... ఇలా ఏ ఒక్కరు కనీస ప్రదర్శన చేయలేకపోయినా వన్‌డౌన్‌లో వచ్చిన టకర్ అసాధారణ పోరాటం చేశాడు. అండగా నిలిచే సహచరులు కరువైన చోట అతను 40 బంతుల్లో (5 ఫోర్లు, 1 సిక్స్) అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఐర్లాండ్ ఇన్నింగ్స్‌లో ఇద్దరు మినహా అంతా సింగిల్ డిజిట్‌కే నిష్క్రమించినా... తను మాత్రం ఆఖరి దాకా క్రీజులో నిలిచాడు. ఆసీస్ బౌలర్లలో మ్యాక్స్‌వెల్, స్టార్క్‌లతో పాటు కమిన్స్, జంపా తలా రెండేసి వికెట్లు పడగొట్టారు.

టి20 ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

గ్రూప్-1

జట్టు	మ్యా	గె	ఓ	ర	పా	నె.ర.
న్యూజిలాండ్	3	2	0	1	5	3.850
ఆస్ట్రేలియా	4	2	1	1	5	-0.304
ఇంగ్లండ్	3	1	1	1	3	0.239
ఐర్లాండ్	4	1	2	1	3	-1.544
శ్రీలంక	3	1	2	0	2	-0.890
అఫ్గానిస్తాన్	3	0	1	2	2	-0.620

గ్రూప్-2

జట్టు	మ్యా	గె	ఓ	ర	పా	నె.ర.
దక్షిణాఫ్రికా	3	2	0	1	5	2.772
భారత్	3	2	1	0	4	0.844
బంగ్లాదేశ్	3	2	1	0	4	-1.533
జింబాబ్వే	3	1	1	1	3	-0.050
పాకిస్తాన్	3	1	2	0	2	0.765
నెదర్లాండ్స్	3	0	3	0	0	-1.948

నోట్: మ్యా-మ్యాచ్‌లు, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ర-రద్దు, పా-పాయింట్లు, నె.ర-నెట్ రన్‌రేట్

టి20 ప్రపంచకప్‌లో నేడు

అఫ్గానిస్తాన్ X శ్రీలంక (ఉ.గం. 9:30 నుంచి)
ఇంగ్లండ్ X న్యూజిలాండ్ (మ.గం. 1:30 నుంచి)
వేదిక: బ్రిస్బేన్
స్టార్ స్పోర్ట్స్-1లో ప్రత్యక్ష ప్రసారం

టైటాన్స్ మరో పరాజయం

పుణే: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్)లో తెలుగు టైటాన్స్ చెత్త ప్రదర్శన కొనసాగుతోంది. ఈ సీజన్‌లో తొమ్మిదో మ్యాచ్ ఆడిన టైటాన్స్ ఎనిమిదో పరాజయాన్ని చవిచూసింది. సోమవారం జరిగిన మ్యాచ్‌లో టైటాన్స్ 24-43 స్కోరు తేడాతో యూపీ యోధాస్ చేతిలో ఓడిపోయింది. తెలుగు టైటాన్స్ జట్టులో ఏ ఒక్కరు చెప్పుకోదగ్గ పాయింట్లు సాధించలేకపోయారు. ఆదర్శ్, మోహిత్ పహల్ చెరో 5 పాయింట్లు సాధించారు. మిగతావారంతా నిరాశ పరిచారు. యూపీ తరఫున రెయిడర్ సురేందర్ గిల్ (13 పాయింట్లు), ప్రదీప్ నర్వాల్ (9) రాణించారు. 12 జట్లు పోటీపడుతున్న ఈ టోర్నీలో తెలుగు టైటాన్స్ ఒకే ఒక్క విజయంతో అట్టడుగున ఉంది.

హనుమ విహారిపై వేటు

- బంగ్లాదేశ్‌తో టెస్టులకు భారత జట్టు
- కివీస్ టూర్‌కు జట్ల ప్రకటన



ముంబై: టి20 ప్రపంచకప్‌లో కీలక దశలో ఉన్న సమయంలో రాబోయే రెండు పర్యటనలకు సంబంధించి బీసీసీఐ సెలక్టర్లు జట్లను ప్రకటించారు. న్యూజిలాండ్, బంగ్లాదేశ్‌లలో జరిగే ఈ సిరీస్‌ల కోసం ఒకే రోజు నాలుగు భిన్నమైన జట్లను ప్రకటించడం విశేషం. ఆంధ్ర క్రికెటర్ హనుమ విహారి భారత టెస్టు జట్టులో స్థానం కోల్పోయాడు. డిసెంబర్‌లో బంగ్లాదేశ్ వేదికగా జరిగే రెండు టెస్టుల సిరీస్ కోసం ప్రకటించిన జట్టులో అతనికి చోటు దక్కలేదు. 2020 జనవరిలో సిడ్నీలో ఆస్ట్రేలియాతో జరిగిన మూడో టెస్టులో వీరోచితంగా పోరాడి మ్యాచ్‌ను 'డ్రా'గా ముగించిన తర్వాత విహారికి మరో 4 టెస్టులు మాత్రమే ఆడే అవకాశం దక్కింది. వాటిలో 7 ఇన్నింగ్స్‌లలో కలిపి ఒకే అర్ధ సెంచరీతో అతను 215 పరుగులు మాత్రమే చేశాడు. కెరీర్‌లో 16 టెస్టులు ఆడిన విహారి 33.56 సగటుతో 839 పరుగులు చేశాడు. ఇంకా టెస్టుల్లో అరంగేట్రం చేయని ఆంధ్ర వికెట్ కీపర్ కేఎస్ భరత్‌కు మాత్రం చోటు లభించింది. బంగ్లా టూర్‌లో ఆడే మూడు వన్డేల కోసం ప్రకటించిన టీమ్‌లో పేసర్ యశ్ దయాళ్‌కు మొదటి సారి పిలుపు వచ్చింది. రవీంద్ర జడేజా గాయంనుంచి పూర్తిగా కోలుకుంటేనే బంగ్లాదేశ్‌కు వెళతాడు. వరల్డ్ కప్ ముగిసిన వెంటనే భారత జట్టు న్యూజిలాండ్‌కు వెళుతుంది. దీని కోసం కెప్టెన్ రోహిత్ శర్మ, విరాట్ కోహ్లిలకు విశ్రాంతినివ్వగా, రాహుల్ కూడా వ్యక్తిగత కారణాలతో విరామం కోరినట్లు సమాచారం. టి20 టీమ్‌కు హార్దిక్, వన్డే టీమ్‌కు ధావన్ నాయకత్వం వహిస్తారు. టి20ల్లో ఫాస్ట్ బౌలర్ ఉమ్రాన్ మలిక్ మళ్లీ ఎంపిక కాగా, వన్డేల్లో కూడా అతనికి తొలి అవకాశం దక్కింది. వన్డే టీమ్‌లో మరో యువ పేసర్ కుల్దీప్ సేన్‌ను కూడా ఎంపిక చేశారు. టి20 వరల్డ్ కప్ ముగిసిన తర్వాత భవిష్యత్తులో ఈ ఫార్మాట్‌లో దినేశ్ కార్తీక్, అశ్విన్‌లను పేర్లను పరిశీలించే అవకాశం లేదని సెలక్టర్లు పరోక్షంగా చెప్పేశారు. ఇవి మినహా ఎలాంటి సంచలనాలకు చోటు లేకుండా సెలక్టర్లు నాలుగు జట్లను ఎంపిక చేశారు. అయితే దేశవాళీ క్రికెట్‌లో గత కొంత కాలంగా విజృంభిస్తూ టన్నుల కొద్దీ పరుగులు సాధిస్తున్నా...ఏ ఫార్మాట్‌లోనూ సర్ఫరాజ్ ఖాన్, పృథ్వీ షాలను ఎంపిక చేయకపోవడం విశేషం. నవంబర్ 18 నుంచి 30 వరకు న్యూజిలాండ్‌లో, డిసెంబర్ 4 నుంచి 22 వరకు బంగ్లాదేశ్‌లో భారత్ పర్యటిస్తుంది.


చరిత్ర సృష్టించిన వెర్‌స్టాపెన్

- ఎఫ్1 సీజన్‌లో 14వ విజయం
- షుమాకర్, వెటెల్ రికార్డు బద్దలు



మెక్సికో సిటీ: ఫార్ములా వన్ సర్క్యూట్‌లో రెడ్‌బుల్ డ్రైవర్, నెదర్లాండ్స్‌కు చెందిన మ్యాక్స్ వెర్‌స్టాపెన్ చరిత్ర సృష్టించాడు. ఆదివారం ఆటోడ్రోమో హెర్మనోస్ రోడ్రిగ్స్‌లో జరిగిన రేస్‌లో వెర్‌స్టాపెన్ విజేతగా నిలిచాడు. 1 గంటా 38 నిమిషాల 36.729 సెకన్లలో రేస్ పూర్తి చేసిన అతను మొదటి స్థానాన్ని అందుకున్నాడు. లూయిస్ హామిల్టన్ (మెర్సిడెజ్), సెర్గియో పెరెజ్ (రెడ్‌బుల్) రెండో, మూడో స్థానాల్లో నిలిచారు. తాజా విజయంతో 2022 సీజన్‌లో వెర్‌స్టాపెన్ 14 రేస్‌లలో విజేతగా నిలిచిన ఘనతను సొంతం చేసుకున్నాడు. దాంతో అతను ఒకే సీజన్‌లో విజయాల సంఖ్యాపరంగా కొత్త రికార్డును నెలకొల్పాడు. ఇప్పటి వరకు ఒకే సీజన్‌లో అత్యధిక రేస్‌లు (13) నెగ్గిన ఘనత మైకేల్ షుమాకర్ (2004), సెబాస్టియన్ వెటెల్ (2013) పేరిట ఉండగా ఇప్పుడు దానిని వెర్‌స్టాపెన్ బద్దలు కొట్టాడు. తాజా సీజన్‌లో ఇప్పటి వరకు 20 రేస్‌లు జరగ్గా, పెరెజ్ రెండు నెగ్గడంతో 16 రేస్‌లు రెడ్‌బుల్ ఖాతాలోకే చేరాయి. ఈ సీజన్‌లో హామిల్టన్ ఒక్క రేస్ కూడా నెగ్గలేకపోయాడు. తర్వాతి రేస్ 13 నవంబర్‌నుంచి బ్రెజిల్‌లోని సావో పాలోలో జరుగుతుంది.

సినిమా



ప్రభాస్

ఆదిపురుష్ వాయిదా!

సంక్రాంతి రేసు నుంచి 'ఆదిపురుష్' చిత్రం తప్పుకుందా? అంటే అవుననే అంటున్నాయి ఫిల్మ్‌నగర్ వర్గాలు. ప్రభాస్ హీరోగా ఓం రౌత్ దర్శకత్వంలో రూపొందిన భారీ బడ్జెట్ మైథలాజికల్ ఫిల్మ్ 'ఆది పురుష్'. ఈ చిత్రంలో రాముడిగా ప్రభాస్, సీతగా కృతీసనన్, లక్ష్మణుడిగా సన్నీ సింగ్, రావణుడిగా సైఫ్ అలీఖాన్ నటించారు. భూషణ్ కుమార్, క్రిషణ్ కుమార్, ఓం రౌత్, రాజేష్ నాయర్, వంశీ, ప్రమోద్, ప్రసాద్ సుతార్ నిర్మించారు. ఈ సినిమాను సంక్రాంతి సందర్భంగా జనవరి 12న విడుదల చేయనున్నట్లు తొలుత ప్రకటించారు మేకర్స్. అయితే తాజాగా ఈ చిత్రం సంక్రాంతి నుంచి వేసవికి(మే) వాయిదా పడినట్లుగా వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. విజువల్ ఎఫెక్ట్స్ వర్క్స్ ఇంకా పూర్తి కాకపోవడమే 'ఆదిపురుష్' సినిమా వాయిదాకు ప్రధాన కారణం అనే టాక్ వినిపిస్తోంది. అయితే 'ఆదిపురుష్' సినిమా విడుదల వాయిదా విషయంపై చిత్రయూనిట్ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు.




బాలకృష్ణ, విజయలక్ష్మి

ఎన్టీఆర్‌తో నటించేటప్పుడు విలువలు నేర్చుకున్నా

- ఎల్.విజయలక్ష్మి

''నేను చిన్నతనం నుంచి ఎన్టీఆర్‌గారిని ఆదర్శంగా తీసుకునేదాన్ని. ఆయనతో నటించేటప్పుడు క్రమశిక్షణ, సిన్సియారిటీ, అంకితభావం, నిబద్ధత, మాటతీరు.. వంటి విలువలు నేర్చుకున్నాను'' అని సీనియర్ నటి ఎల్.విజయలక్ష్మి అన్నారు. దివంగత నటుడు ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల్లో భాగంగా తెనాలిలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఎన్టీఆర్ అవార్డు అందుకున్నారు ఎల్.విజయలక్ష్మి. ఈ సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లో సినీ ప్రముఖుల సమక్షంలో ఆమెకు హీరో బాలకృష్ణ గౌరవ సత్కారం చేశారు. అనంతరం ఎల్.విజయలక్ష్మి మాట్లాడుతూ– ''ఎంతో అభిమానంతో అమెరికా నుంచి నన్ను పిలిపించి గౌరవించడం చూస్తుంటే కళ్లు చెమర్చుతున్నాయి. ఇందుకు బాలకృష్ణ, ఆలపాటి రాజా, బుర్రా సాయిమాధవ్‌లకు థ్యాంక్స్. వివాహం అయ్యాక సినిమాలు మానేసి అమెరికా వెళ్లాను. అక్కడ సీఏ చదివానంటే ఎన్టీఆర్‌గారి స్ఫూర్తి వల్లే. రామానాయుడు, ఎన్టీఆర్‌గార్ల తరం చూస్తుంటే ఎంతో ఆనందంగా ఉంది. మళ్లీ ఇలాంటి వేడుకలకు రావాలనుంది'' అన్నారు. బాలకృష్ణ మాట్లాడుతూ– ''విజయలక్ష్మిగారు వందకుపైగా సినిమాల్లో నటిస్తే అందులో 60కి పైగా నాన్నగారితో నటించారు. ఆమె మహిళా సాధికారతకు ప్రతీక. ఆమె ఎక్కిన మెట్లను భావితరాలు ఆదర్శంగా తీసుకోవాలి'' అన్నారు. ''1964లో మా బేనర్‌లో(సురేశ్ ప్రొడక్షన్స్) నిర్మించిన 'రాముడు భీముడు' సినిమాలో విజయలక్ష్మిగారు నటించారు. అందులో ''దేశమ్ము మారిందే..' అనే సాంగ్ కోసం ఆమె ఎంత కష్టపడ్డారో నాన్నగారు (రామానాయుడు) చెబుతుండేవారు'' అన్నారు నిర్మాత డి.సురేశ్ బాబు. ఈ వేడుకలో రచయిత పరుచూరి గోపాలకృష్ణ, దర్శక-నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ, డైరెక్టర్ వైవీఎస్ చౌదరి, నిర్మాతలు సి.కల్యాణ్, ప్రసన్న కుమార్, బసిరెడ్డి, రామసత్యనారాయణ, జూబ్లీహిల్స్ మాజీ కార్పొరేటర్ ఖాజా సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



రవితేజ

పోలాండ్‌లో ఈగిల్?

రవితేజ హీరోగా కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో 'ఈగిల్'(ప్రచారంలో ఉన్న టైటిల్) అనే సినిమా తెరకెక్కనుందని వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ మూవీలో అనుపమా పరమేశ్వరన్, కావ్యాథాపర్ హీరోయిన్స్‌గా నటించనున్నారని టాక్. తాజాగా ఈ సినిమా షూటింగ్ పోలాండ్‌లో మొదలైందని ఫిల్మ్‌నగర్ సమాచారం. రవితేజ కూడా ఈ చిత్రీకరణలో పాల్గొంటున్నారని తెలిసింది. అయితే ఈ సినిమాను అధికారికంగా ఓ టీజర్‌తో ప్రకటించాలని చిత్రయూనిట్ భావిస్తోందట. అందుకే పోలాండ్‌లో షూటింగ్‌ను స్టార్ట్ చేశారని భోగట్టా. ఇక 'ఈగిల్' కాకుండా 'రావణాసుర', 'ధమాకా', 'టైగర్ నాగేశ్వరరావు' వంటి సినిమాలు చేస్తున్నారు రవితేజ. అలాగే చిరంజీవి హీరోగా నటిస్తున్న 'వాల్తేరు వీరయ్య' సినిమాలో రవితేజ ఓ కీలక పాత్రలో నటించారు.



అక్కినేని ప్రతిబింబాలు రెడీ

దివంగత నటులు అక్కినేని నాగేశ్వరరావు హీరోగా నటించిన 'ప్రతిబింబాలు'(1982) చిత్రం 40 ఏళ్ల తర్వాత ప్రేక్షకుల ముందుకు వస్తోంది. సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో జయసుధ హీరోయిన్‌గా నటించారు. విష్ణుప్రియ సినీకంబైన్స్ బేనర్‌పై సీనియర్ నిర్మాత జాగర్లమూడి రాధాకృష్ణ నిర్మించిన ఈ చిత్రాన్ని ఈ నెల 5న విడుదల చేయనున్నట్లు చిత్రయూనిట్ ప్రకటించింది. ఈ సందర్భంగా జాగర్లమూడి రాధాకృష్ణ మాట్లాడుతూ– ''ప్రతిబింబాలు' సినిమాని అనేక కారణాల వల్ల అప్పట్లో విడుదల చేయలేకపోయాను. కానీ, ప్రస్తుతం ఉన్న అధునాతన టెక్నాలజీని జోడించి, సరికొత్త హంగులతో రిలీజ్ చేస్తున్నందుకు సంతోషంగా ఉంది. నా గత సక్సెస్‌ఫుల్ చిత్రాల కోవలోనే 'ప్రతిబింబాలు' కూడా నిలుస్తుందనే నమ్మకం ఉంది'' అన్నారు. ''ప్రతిబింబాలు' చిత్రాన్ని మా వాణి వెంకటరమణ సినిమాస్ డిస్ట్రిబ్యూషన్ సంస్థ ద్వారా 250 థియేటర్లలో విడుదల చేస్తున్నందుకు గర్వంగా ఉంది'' అన్నారు నిర్మాత కాకర్లమూడి రవీంద్ర కల్యాణ్. ఈ చిత్రానికి సమర్పణ: రాజేశ్వరస్ రాచర్ల, నిర్వహణ: జాగర్లమూడి సురేశ్ బాబు.



అక్కినేని నాగేశ్వరరావు, జయసుధ

తెలుగు ప్రేక్షకులంటే అందుకే ఇష్టం

- సోనాల్ మోంటెరో

''మంచి కంటెంట్ ఉన్న సినిమాలను తెలుగు ప్రేక్షకులు ఎలా ఆదరిస్తారో.. నటనలో మంచి ప్రతిభ చూపిన నటీనటులను కూడా అంతే అభిమానిస్తారు.. వారికి నచ్చితే స్టార్‌ని చేసేస్తారు. అందుకే తెలుగు ప్రేక్షకులంటే నాకు చాలా ఇష్టం'' అని హీరోయిన్ సోనాల్ మోంటెరో అన్నారు. జైద్ ఖాన్, సోనాల్ మోంటెరో జంటగా జయతీర్థ దర్శకత్వంలో తిలకరాజ్ బల్లాల్ నిర్మించిన చిత్రం 'బనారస్'. ఈ చిత్రం ఈ నెల 4న విడుదల కానుంది. తెలుగులో నిర్మాత సతీష్ వర్మ విడుదల చేస్తున్నారు. సోనాల్ మోంటెరో మాట్లాడుతూ– ''ఈ చిత్రంలో ధని అనే పాత్ర చేశాను. కథ నా పాత్ర చుట్టే తిరుగుతుంది. హీరో పాత్రకు ఎంత ప్రాధాన్యం ఉందో, హీరోయిన్‌కీ అంతే ప్రాముఖ్యత ఉంది. డిఫరెంట్ జానర్స్ ఉన్న ఈ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తుంది. జైద్‌ఖాన్ మంచి కో స్టార్. జయతీర్థ సినిమా బాగా తీశారు. 'ఆర్ఆర్ఆర్', 'పుష్ప', 'సీతారామం' సినిమాలు చూశాను. విజయ్ దేవరకొండ అంటే చాలా ఇష్టం. ప్రస్తుతం మూడు సినిమాల్లో నటిస్తున్నాను.. వీటిలో సరోజినీ నాయుడుగారి బయోపిక్ కూడా ఉంది.. ఈ మూవీని చాలెంజింగ్‌గా భావిస్తున్నా'' అన్నారు.

నాపై వాలే ఒక్క నవ్వు చాలే!

యశ్‌రాజ్, నవమి గాయక్ జంటగా రామకృష్ణార్జున్ దర్శకత్వంలో జింకా శ్రీనివాసులు నిర్మించిన చిత్రం 'అభిరామ్'. మీనాక్షీ భుజంగ్ సంగీతం అందించిన ఈ సినిమాలోని 'చాలే చాలే ఇంకా చాలే.. నాపై వాలే ఒక్క నవ్వు చాలే' అంటూ సాగే పాటను దర్శకుడు శివ నిర్వాణ విడుదల చేసి, మాట్లాడుతూ– ''ఈ పాట వింటుంటే ఇంకా వినాలనిపించేలా ఉంది. సంగీత దర్శకుడు మీనాక్షీ భుజంగ్ ఈ పాటను పాడటం బాగుంది. కిరణ్ కొరియోగ్రఫీ, సాగర్ నారాయణ లిరిక్స్ బాగున్నాయి. ఈ సినిమా యూనిట్‌కి పేరు తీసుకురావాలి'' అన్నారు. ''త్వరలో మా సినిమా విడుదల చేస్తాం'' అన్నారు రామకృష్ణార్జున్. ''లవ్, యాక్షన్, కామెడీ, సెంటిమెంట్ ఉన్న ఈ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తుంది'' అన్నారు జింకా శ్రీనివాసులు. ఈ సినిమాకు ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్:ఉల్లగంటి ప్రసాద్.



యశ్‌రాజ్, శివ నిర్వాణ, శ్రీనివాసులు



కల్పన

స్వేచ్ఛ అంటే..

కల్పనా తివారీ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'పేజెస్'. న్యూయార్క్‌లో ఉంటున్న ప్రవాస భారతీయుడు ('చిసెల్', 'రాస్ మెటానోయా' చిత్రాల ఫేమ్) రామ్ అల్లాడి దర్శకత్వం వహిస్తున్నారు. ఏ.ఆర్.ఐటి వర్క్స్ ఇండియాపై తెలుగు, హిందీ, బెంగాలీ, కన్నడ, మలయాళం, తమిళం, ఆంగ్ల భాషల్లో ఈ సినిమా రూపొందుతోంది. ఇటీవల ఈ చిత్రం టీజర్ విడుదల చేశారు. రామ్ అల్లాడి మాట్లాడుతూ– ''ఫిమేల్ ఓరియంటెడ్ చిత్రమిది. సామాజిక స్వేచ్ఛకు, వ్యక్తిగత స్వేచ్ఛకు మధ్య ఉన్న వ్యత్యాసం మరో ప్రధాన అంశం. ఢిల్లీ, భారత్– పాకిస్తాన్ సరిహద్దు, బంగ్లాదేశ్‌లోని నవఖాలి, తెలంగాణ ప్రాంతాలతో ముడిపడిన కథ ఇది. ప్రస్తుతం హైదరాబాద్, వరంగల్‌లో షూటింగ్ చేస్తున్నాం'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: శ్రీవర్ధన్ సాయి, కెమెరా: రామ్ అల్లాడి, కృష్ణ గుంటుపల్లి.



సుధీర్‌బాబు

సెప్పేదేం లేదు.. సేసేదే

'ఇంగ సెప్పేదేం లేదు..సేసేదే' అని హీరో సుధీర్‌బాబు అంటున్నారు. జ్ఞానశేఖర్ ద్వారక దర్శకత్వంలో సుధీర్ బాబు హీరోగా రూపొందుతున్న సినిమాకు 'హరోం హర' అనే టైటిల్ ఖరారు చేశారు. 'ది రివోల్ట్' అనేది ట్యాగ్‌లైన్. జి.రమేష్ కుమార్ సమర్పణలో శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర సినిమాస్(ఎస్ఎస్‌సీ) పతాకంపై సుమంత్ జి.నాయుడు నిర్మిస్తున్నారు. సోమవారం ఈ మూవీ కాన్సెప్ట్ వీడియోతో పాటుగా, టైటిల్‌ను ప్రకటించారు మేకర్స్. ఇందులో సుబ్రహ్మణ్యం అనే పాత్రలో సుధీర్‌బాబు కనిపించనున్నారు. ''1989లో చిత్తూరు జిల్లా కుప్పంలో జరిగే కథ ఇది. సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం, జగదాంబ టాకీస్, రైల్వేస్టేషన్ నేపథ్యాల్లో కథనం సాగుతుంది. టైటిల్ ఆధ్యాత్మికంగా ఉన్నప్పటికీ ప్రతీకార కోణం కూడా ఉంటుంది'' అని యూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: చేతన్ భరద్వాజ్, కెమెరా: అరవింద్ విశ్వనాథన్.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	787	60,747
నిఫ్టీ ▲	225	18,012

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమవారం రాత్రి 11.30 నిమిషాలు)			
నాస్‌డాక్	11,011	▽	91
డోజోన్స్	32,978	▽	64
ఎఫ్‌టీఎస్ఈ 100	7,095	▲	47
డాక్స్	13,254	▲	10
షాంఘై	2,893	▽	22
నికాయ్	27,587	▲	482

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (ముంబై)	
బంగారం (99.9 స్వచ్ఛత)	50,480
బంగారం (99.5 స్వచ్ఛత)	50,278
వెండి (కేజీ)	57,350

డిజిటల్ రూపీ ట్రయల్స్ షురూ

ముంబై: దేశీయంగా తొలిసారి డిజిటల్ రూపాయి (సీబీడీసీ) ప్రాజెక్టు నేడు (మంగళవారం) ప్రారంభం కానుంది. బ్యాంకుల స్థాయిలో నిర్వహించే హోల్‌సేల్ లావాదేవీల కోసం రిజర్వ్ బ్యాంక్ ప్రయోగాత్మకంగా దీన్ని ప్రవేశపెడుతోంది. నెల రోజుల వ్యవధిలో సాధారణ కస్టమర్లు, వ్యాపారస్తుల కోసం ఎంపిక చేసిన ప్రాంతాల్లో డిజిటల్ రూపీ – రిటైల్ సెగ్మెంట్ ప్రాజెక్టును కూడా ప్రారంభించనుంది. 'డిజిటల్ రూపీ (హోల్‌సేల్ విభాగం) తొలి పైలట్ ప్రాజెక్టు నవంబర్ 1న ప్రారంభమవుతుంది' అని రిజర్వ్ బ్యాంక్ ఒక ప్రకటనలో తెలిపింది. ప్రభుత్వ బాండ్లకు సంబంధించి సెకండరీ మార్కెట్ లావాదేవీల సెటిల్మెంట్ కోసం దీన్ని ప్రయోగాత్మకంగా పరీక్షించనున్నారు. ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ మొదలైన 9 బ్యాంకులు ఈ ప్రాజెక్టులో పాల్గొంటున్నాయి. సీమాంతర చెల్లింపులకు కూడా పైలట్ ప్రాజెక్టు నిర్వహించనున్నట్లు ఆర్‌బీఐ తెలిపింది.

- హోల్‌సేల్ లావాదేవీల కోసం నేటి నుండి ప్రారంభం
- ప్రభుత్వ బాండ్ల 'సెటిల్మెంట్'కు వినియోగం

సీబీడీసీతో ప్రయోజనాలు..: ప్రస్తుతం పేపర్ రూపంలో ఉన్న కరెన్సీ నోట్లను ఆర్‌బీఐ ముద్రించి, వ్యవస్థలోకి జారీ చేస్తుంది. ఇలా పేపర్ రూపంలో కాకుండా డిజిటల్ రూపంలో అధికారికంగా జారీ చేసే కరెన్సీని సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీగా (సీబీడీసీ) వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం పేటీఎం, గూగుల్‌పే వంటి యాప్స్ ద్వారా డిజిటల్ రూపంలో చెల్లించగలుగుతున్నప్పటికీ, ఇందుకోసం వివిధ బ్యాంకుల్లో ఖాతాలు, వాటిలో భౌతికమైన నోట్ల నిల్వలు తప్పనిసరిగా అవసరమవుతోంది. లావాదేవీల సెటిల్మెంట్ రెండు బ్యాంకుల మధ్య, ఆర్‌బీఐ దగ్గర జరగాల్సి ఉంటోంది. అప్పుడప్పుడు



సాంకేతిక సమస్యలు తలెత్తి సెటిల్మెంట్‌లో అంతరాయాలు ఏర్పడటంతో పాటు ఈ విధానం కొంత ఖర్చుతో కూడినది. సీబీడీసీ విధానంలో థర్డ్ పార్టీ బ్యాంకు ఖాతాల ప్రస్తావన, అవసరం లేకుండా నేరుగా ఆర్‌బీఐ నిర్వహించే ఖాతాల ద్వారా డిజిటల్ రూపంలో లావాదేవీల సెటిల్మెంట్ పూర్తయిపోతుంది. దీనితో సమయం, వ్యయాలూ ఆదా అవుతాయి. అలాగే ప్రత్యేకంగా పేపర్ కరెన్సీని ముద్రించాల్సిన వ్యయాల భారమూ ఆర్‌బీఐకి కొంత తగ్గుతుంది. డిజిటల్ రూపంలో ఉంటుంది కాబట్టి భౌతిక రూపంలోని నగదు చోరీ భయాలు ఉండవని పరిశీలకుల విశ్లేషణ. అంతే గాకుండా ప్రభుత్వ పథకాల నిధులను మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా ఆర్‌బీఐ ద్వారా లబ్ధిదారులకు చేర్చేందుకు కూడా ఇది ఉపయోగపడుతుందని అంచనా. సీబీడీసీ అనేది పేపర్ రూపంలోని కరెన్సీ నోట్లకు బదులు కాకుండా చెల్లింపు విధానాలకు మరో ప్రత్యామ్నాయంగా మాత్రమే ఉంటుందని రిజర్వ్ బ్యాంక్ స్పష్టం చేసింది.

అంతర్జాతీయంగా..

2022–23లో డిజిటల్ రూపీని అందుబాటులోకి తేనున్నట్లు ఈ ఏడాది ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కేంద్రం ప్రకటించినప్పటి నుండి సీబీడీసీ ప్రయత్నాలు వేగం పుంజుకున్నాయి. అటు అంతర్జాతీయంగా పలు దేశాలు సీబీడీసీల జారీ సాధ్యాసాధ్యాలపై కసరత్తు చేస్తున్నాయి. దాదాపు 90 పైగా సెంట్రల్ బ్యాంకులు వీటిని అధ్యయనం చేస్తున్నాయి. బహమాస్, నైజీరియా, డొమినికా వంటి కొన్ని దేశాలు ఇప్పటికే సీబీడీసీలను ప్రవేశపెట్టాయి.

ఎయిర్‌టెల్ లాభం జూమ్

- క్యూ2లో రూ. 2,145 కోట్లు
- రూ. 193కు ఏఆర్‌పీయూ

న్యూఢిల్లీ: భారతీ ఎయిర్‌టెల్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2022–23) రెండో త్రైమాసికంలో ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జులై–సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం 89% జంప్‌చేసి రూ. 2,145 కోట్లను తాకింది. అనూహ్య రాబడిని మినహాయిస్తే రూ. 2,052 కోట్ల నికర లాభం ఆర్జించింది. గతేడాది(2021–22) క్యూ2లో కేవలం రూ.11,340 కోట్లు ఆర్జించింది. 4జీ లాభదాయకత, వినియోగదారుపై సగటు ఆదాయం (ఏఆర్‌పీయూ), డేటా వినియోగం పుంజుకోవడం అధిక లాభాలకు దోహదం చేసింది. మొత్తం ఆదాయం సైతం 22% ఎగసి రూ. 34,527 కోట్లకు చేరింది. ఈ కాలంలో ప్రపంచవ్యాప్తంగా 50 కోట్ల కస్టమర్లను అధిగమించడంతోపాటు.. నిల



కడైన పటిష్ట పనితీరును చూపగలిగినట్లు కంపెనీ పేర్కొంది. పరిశ్రమలోనే అత్యుత్తమంగా రూ. 190 ఏఆర్‌పీయూను సాధించింది. గత క్యూ2లో ఇది రూ. 153 మాత్రమే.

20 జీబీ వినియోగం: 5జీ ప్రారంభించనున్న నేపథ్యంలో మరింత ఉత్తమ సేవలు అందించగలమని ఎయిర్‌టెల్ సీఈవో గోపాల్ విఠల్ పేర్కొన్నారు. ప్రపంచంలోనే చౌక ధరల కారణంగా తక్కువ ఆర్‌వోసీఈని నమోదు చేస్తున్నట్లు తెలియజేశారు. కంపెనీ 8 పట్టణాలలో 5జీ సేవలకు శ్రీకారం చుట్టింది. కాగా ప్రస్తుత సమీక్షా కాలంలో 1.78 కోట్లమంది 4జీ కస్టమర్లు లభించగా.. ఒక్కొక్కరి నెలవారీ సగటు డేటా వినియోగం 20.3 జీబీకి చేరింది.

ఫలితాల నేపథ్యంలో ఎయిర్‌టెల్ షేరు 2 శాతం లాభపడి రూ. 832 వద్ద ముగిసింది.

ఎల్ అండ్ టీ లాభం రూ. 2,819 కోట్లు

క్యూ2లో 26 శాతం వృద్ధి

న్యూఢిల్లీ: లార్సన్ అండ్ టూబ్రో (ఎల్ అండ్ టీ) జూలై–సెప్టెంబర్ త్రైమాసికంలో రూ.2,819 కోట్ల నికర లాభం ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం క్యూ2లో నమోదైన రూ. 2,231 కోట్లతో పోలిస్తే ఇది 26 శాతం పెరిగింది. అటు ఆదాయాలు 23 శాతం వృద్ధి చెంది రూ. 34,773 కోట్ల నుంచి రూ. 42,763 కోట్లకు చేరాయి. ఆర్థిక సేవల విభాగంలో నుంచి మ్యూచువల్ ఫండ్ వ్యాపారాన్ని విక్రయించే ప్రయత్నం జరుగుతోందని సంస్థ సీఎఫ్‌వో ఆర్ శం




కర్ రామన్ తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం ఆఖరు నాటికి ప్రక్రియ పూర్తి కావచ్చని భావిస్తున్నట్లు వివరించారు. హైదరాబాద్ మెట్రోను కూడా వీలైనంత త్వరగా విక్రయించే యోచన ఉందని, ప్రాజెక్టు నుంచి నిష్క్రమణకు కసరత్తు జరగాలని పేర్కొన్నారు. అటు నభా పవర్ ప్లాంటును విక్రయించేందుకు మెరుగైన మార్గాలు అన్వేషిస్తున్నట్లు రామన్ చెప్పారు. ప్రస్తుతం ఆర్డర్ బుక్ విలువ రూ. 3,72,381 కోట్లకు చేరింది.

ఈపీఎస్ నుంచీ డబ్బు తీసుకోవచ్చు

ఈపీఎఫ్‌వో సీబీటీ నిర్ణయం

న్యూఢిల్లీ: సంఘటిత రంగంలోని ఉద్యోగులకు అనుకూలమైన నిర్ణయాన్ని ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్‌వో) సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ (సీబీటీ) తీసుకుంది. ఒక ఉద్యోగి ఒక సంస్థలో చేరి ఆరు నెలల్లోపు మానేస్తే, కేవలం తన పీఎఫ్ ఖాతాలోని బ్యాలన్స్ వరకే వెనక్కి తీసుకోగలరు. పెన్షన్ ఖాతా (ఈపీఎస్–95)లోని జమలను తీసుకోవడానికి లేదు. కానీ, ఆరు నెలల సర్వీసు కూడా లేకుండా ఉద్యోగం మానేసే వారు పెన్షన్ ఖాతాలోని బ్యాలన్స్‌ను సైతం వెనక్కి తీసుకునేందుకు అనుమతించాలని కేంద్ర కార్మిక శాఖ మంత్రి



ఆధ్వర్యంలోని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ సోమవారం నాటి 232వ సమావేశంలో నిర్ణయించింది. ఇక ఈటీఎఫ్‌లలో తన పెట్టుబడుల ఉపసంహరణకు సంబంధించిన విధానానికీ ఆమోదం తెలిపింది. 2018లో కొనుగోలు చేసిన ఈటీఎఫ్ యూనిట్లకు సంబంధించి లాభాలను వెనక్కి తీసుకుని, 2022–23 సంవత్సరానికి వడ్డీ ఆదాయం లెక్కింపులోకి పరిగణనలోకి తీసుకోవాలని నిర్ణయించింది.


మళ్లీ 18000 పైకి నిఫ్టీ

- సెన్సెక్స్ లాభం 787 పాయింట్లు
- ఏడు వారాల గరిష్ఠంపై ముగింపు
- సూచీలకు మూడోరోజూ లాభాలే...

ముంబై: స్టాక్ మార్కెట్‌లో విస్తృతస్థాయి కొనుగోళ్లు జరగడంతో సూచీలు సోమవారం ఏడు వారాల గరిష్ఠంపై ముగిశాయి. సెన్సెక్స్ 787 పాయింట్లు పెరిగి 60,747 వద్ద స్థిరపడింది. ఈ సూచీలోని 30 షేర్లలో మూడు మాత్రమే నష్టపోయాయి. నిఫ్టీ 225 పాయింట్లు బలపడి 18 వేల స్థాయిపై 18,012 వద్ద నిలిచింది. ఇరు సూచీలకిది మూడోరోజూ లాభాల ముగింపు. ఐటీ, ఫార్మా, ఆటో, ఇంధన, కన్జూమర్ డ్యూరబుల్స్ రంగాల షేర్లకు భారీ డిమాండ్ లభించింది. బీఎస్ఈ మిడ్‌క్యాప్ 1%, స్మాల్‌క్యాప్ సూచీ 0.5% లాభపడ్డాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.4179 కోట్ల షేర్లను కొన్నారు. దేశీయ ఇన్వెస్టర్లు రూ.1107 కోట్ల షేర్లను అమ్మేశారు. ఆసియాలో చైనా, హాంగ్‌కాంగ్ మాత్రమే నష్టపోయాయి. రూపాయి 34 పైసలు బలహీనపడి 82.81 స్థాయి వద్ద ముగిసింది. గత 3 సెషన్లలో సెన్సెక్స్ 1203 పాయింట్లు బలపడటంతో బీఎస్ఈలో 4.3 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. ఇన్వెస్టర్ల సంపద భావించే బీఎస్ఈ కంపెనీల మొత్తం విలువ రూ.279.91 లక్షల కోట్లకు చేరింది.

లాభాలు ఎందుకంటే...

ప్రపంచం ఆర్థిక మాంద్యంలోకి జారుకోంటున్న



తరుణంలో యూఎస్ ఫెడ్ రిజర్వ్‌తో సహా ఆయా దేశాల కేంద్ర బ్యాంకులు ఇకపై సర్దుకుపోయే ద్రవ్య విధాన వైఖరిని అనుసరించే వీలుందని ఇన్వెస్టర్లు కొనుగోళ్లకు ఎగబడ్డారు. విదేశీ ఇన్వెస్టర్లు గడిచిన మూడు రోజుల్లో ఏకంగా రూ.8566 కోట్ల విలువైన షేర్లను కొన్నారు. క్రూడాయిల్ ధరలు దిగిరావడం మార్కెట్ వర్గాలకు మరింత ఉత్సాహాన్నిచ్చింది.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- డిమాండ్ రికవరీ ఆశలతో సిమెంట్ షేర్లు బలపడ్డాయి. అల్ట్రాటెక్ సిమెంట్, అంబుజా సిమెంట్స్, శ్రీ సిమెంట్, జేకే సిమెంట్, దాల్మియా భారత్, ఇండియా సిమెంట్స్, ఏసీసీ 2–4% రాణించాయి.
- క్యూ2లో నిర్వహణ లాభం తగ్గడంతో బంధన్ బ్యాంక్ 10% నష్టపోయి రూ.238 వద్ద స్థిరపడింది.
- నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీ కాప్రీ గ్లోబల్ క్యాపిటల్‌లో ఎల్ఐసీ తన వాటాను 7.052% నుంచి 9.072 శాతానికి పెంచుకుంది.

ఎనిమిది పరిశ్రమల మౌలిక రంగం.. స్పీడ్!

- సెప్టెంబర్‌లో 7.9 శాతం వృద్ధి
- మూడు నెలల గరిష్ఠ స్థాయి

న్యూఢిల్లీ: ఎనిమిది పరిశ్రమల మౌలిక రంగం సెప్టెంబర్‌లో 7.9% వృద్ధి (2021 సెప్టెంబర్‌తో పోల్చితే) చెందింది. ఇది మూడు నెలల గరిష్ఠ స్థాయి. 2021 సెప్టెంబర్‌లో వృద్ధి రేటు 5.4% కాగా, 2022 ఆగస్టులో 4.1%. పారిశ్రామిక ఉత్పత్తి సూచీలో (ఐఐపీ) ఈ గ్రూప్ వాటా 40.27 శాతం. ఐఐపీ సెప్టెంబర్ అధికారిక గణాంకాలు నవంబర్ రెండవ వారంలో విడుదలవుతాయి. వాణిజ్య పరిశ్రమల శాఖ సోమవారం ఈ గణాంకాలను విడుదల చేసింది.

రెండు త్రైమాసికాల్లో..

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ మధ్య గ్రూప్ వృద్ధి రేటు 9.6% కాగా, గత ఏడాది ఇదే నెల్లో 16.9%గా ఉంది.



టాటా స్టీల్ లాభం 90% డౌన్

క్యూ2లో రూ. 1,297 కోట్లకు పరిమితం

న్యూఢిల్లీ: భారీగా పెరిగిన వ్యయాల కారణంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో దేశీ ఉక్కు దిగ్గజం టాటా స్టీల్ నికర లాభం (కన్సాలిడేటెడ్) ఏకంగా 90 శాతం క్షీణించింది. రూ. 1,297 కోట్లకు పరిమితమైంది. గత ఆర్థిక సంవత్సరం క్యూ2లో ఇది రూ. 12,548 కోట్లు. తాజాగా జులై–సెప్టెంబర్ త్రైమాసికంలో మొత్తం ఆదాయం రూ. 60,658 కోట్ల నుంచి రూ. 60,207 కోట్లకు తగ్గింది. వ్యయాలు రూ. 47,240 కోట్ల నుంచి రూ. 57,684 కోట్లకు పెరిగాయి. కీలక ఎకానమీల్లో మందగమన భయాలు, సీజనల్ అంశాలతో పాటు భౌగోళికరాజకీయ అనిశ్చితి తదితర అం



శాలు వ్యాపార నిర్వహణలో ఒడిదుడుకులకు కారణమయ్యాయని టాటా స్టీల్ సీఈవో టీవీ నరేంద్రన్ చెప్పారు. ప్రతికూల పరిస్థితులు ఉన్నప్పటికీ కంపెనీ దేశీ అమ్మకాలు అత్యుత్తమంగా నమోదయ్యాయని పేర్కొన్నారు. అధిక ధరలకు కొనుగోలు చేసిన ముడి సరుకుల నిల్వలను ఉపయోగించుకోవాల్సి రావడం వల్ల మార్జిన్లు తగ్గాయని టాటా స్టీల్ ఈడీ కౌశిక్ ఛటర్జీ చెప్పారు. ప్రస్తుతం భారత మార్కెట్ కోలుకుంటూ ఉండటం, ముడి సరుకుల రేట్లు సానుకూలంగా మారుతుండటం వంటి అంశాలతో మార్జిన్లు మళ్లీ మెరుగుపడగలవని ఆశాభావం వ్యక్తం చేశారు.

భవిత

- గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- ఇండియన్ పాలిటీ కోసం

ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

కేంద్ర బలగాల్లో 24,369 ఉద్యోగాలు

స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ) వివిధ సాయుధ బలగాల్లో కానిస్టేబుల్ /రైఫిల్‌మ్యాన్/సిపాయి పోస్టులు భర్తీకి ఓపెన్ కాంపిటీటివ్ పరీక్షను నిర్వహిస్తోంది. » **మొత్తం పోస్టుల సంఖ్య:** 24,369

» **విభాగాలు:** బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్(బీఎస్ఎఫ్),సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్(సీఐఎస్ఎఫ్), సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్(సీఆర్‌పీఎఫ్), ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్(ఐటీబీపీ), సశస్త్ర సీమ బల్(ఎస్ఎస్‌బీ), సెక్రటేరియట్ సెక్యూరిటీ ఫోర్స్(ఎస్ఎస్ఎఫ్)లో కానిస్టేబుల్(జనరల్ డ్యూటీ) పోస్టులు, అస్సాం రైఫిల్స్(ఏఆర్)లో రైఫిల్‌మ్యాన్(జనరల్ డ్యూటీ),నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో(ఎన్‌సీబీ)లో సిపాయి పోస్టుల భర్తీకి ఎంపిక ప్రక్రియ నిర్వహించనుంది.

» **అర్హత:** గుర్తింపు పొందిన బోర్డు/యూనివర్సిటీ నుంచి మెట్రిక్యులేషన్ లేదా పదో తరగతి పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. పురుష అభ్యర్థుల ఎత్తు 170 సెం.మీ.లకు, మహిళా అభ్యర్థులకు 157 సెం.మీ.లకు తగ్గకూడదు. » **వయసు:** జనవరి 01, 2023 నాటికి 18 నుంచి 23 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్ల సడలింపు ఉంటుంది.

» **వేతనం:** సిపాయి పోస్టుకు రూ.18,000 నుంచి రూ.56,900 వరకు, ఇతర ఖాళీలకు రూ. 21,700 నుంచి రూ.69,100 మధ్య చెల్లిస్తారు.

» **ఎంపిక విధానం:** కంప్యూటర్ బేస్డ్ ఎగ్జామినేషన్, ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్, వైద్య పరీక్షలు, ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.

» **సీబీఈ పరీక్ష విధానం:** ప్రశ్నపత్రంలో 80 ప్రశ్నలు ఉంటాయి. ప్రతి ప్రశ్నకు రెండు మార్కులు. జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్, జనరల్ నాలెడ్జ్ అండ్ జనరల్ అవేర్‌నెస్, ఎలిమెంటరీ మ్యాథమేటిక్స్,ఇంగ్లిష్/హిందీ అంశాల నుంచి ప్రశ్నలుంటాయి. పరీక్ష వ్యవధి 60 నిమిషాలు. నెగిటివ్ మార్కింగ్ విధానం ఉంది.

» **తెలుగు రాష్ట్రాల్లో పరీక్షా కేంద్రాలు:** చీరాల, గుంటూరు, కాకినాడ, కర్నూలు, నెల్లూరు, రాజమహేంద్రవరం, తిరుపతి, విజయనగరం, విజయవాడ,వైజాగ్,హైదరాబాద్,కరీంనగర్,వరంగల్.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **దరఖాస్తు స్వీకరణకు చివరితేది:** 30.11.2022
» **కంప్యూటర్ ఆధారిత పరీక్ష తేది:** జనవరి, 2023
» **వెబ్‌సైట్:** ssc.nic.in

ఏపీ ఫారెస్ట్ సర్వీస్‌లో ఆఫీసర్ కొలువు

డిగ్రీ పూర్తిచేసిన పట్టభద్రుల కోసం ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ).. ఏపీ ఫారెస్ట్ సర్వీసులో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనిద్వారా మొత్తం 8 ఖాళీలను భర్తీ చేయనున్నారు.బ్యాచిలర్ డిగ్రీ విద్యార్హతతో ఈ ఉద్యోగాలను సొంతం చేసుకోవచ్చు.

» **పోస్టుల వివరాలు:** ఏపీ ఫారెస్ట్ సర్వీసులో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్: 08 పోస్టులు

» **అర్హతలు:** అగ్రికల్చర్/బోటనీ/కెమిస్ట్రీ/కంప్యూటర్ అప్లికేషన్స్ లేదా కంప్యూటర్ సైన్స్/ ఇంజనీరింగ్(అగ్రికల్చర్/కెమికల్/సివిల్/కంప్యూటర్/ఎలక్ట్రికల్ /ఎలక్ట్రానిక్స్ /మెకానికల్)/ఎన్విరాన్‌మెంటల్ సైన్స్/ఫారెస్ట్రీ/జియాలజీ/హార్టికల్చర్/వెటర్నరీ సైన్స్/మ్యాథమెటిక్స్/ఫిజిక్స్/స్టాటిస్టిక్స్/జువాలజీ సబ్జెక్టుల్లో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తుకు అర్హులు. » **వయసు:** 01.07.2022 నాటికి 18–30 ఏళ్ల మధ్యలో ఉండాలి. రిజర్వేషన్ వర్గాలకు వయో సడలింపు లభిస్తుంది.

» **వేతనాలు:** ప్రతి నెల రూ.48,440–రూ. 1,37,220 వేతన శ్రేణి లభిస్తుంది.

ఎంపిక ప్రక్రియ

ఏపీపీఎస్సీ జాబ్స్

» క్వాలిఫైయింగ్ టెస్ట్, పేపర్–1, పేపర్–2, పేపర్–3, పేపర్–4 పరీక్షల ఆధారంగా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు.

» **క్వాలిఫైయింగ్ టెస్ట్:** ఇది అర్హత పరీక్ష మాత్రమే. ఇందులో జనరల్ ఇంగ్లిష్ 50 మార్కులు, జనరల్ తెలుగు విభాగం నుంచి 50 మార్కులకు పరీక్ష ఉంటుంది. పదోతరగతి స్థాయిలో ప్రశ్నలుంటాయి. పరీక్ష సమయం 100 నిమిషాలు.

పేపర్–1: జనరల్ స్టడీస్ అండ్ మెంటల్ ఎబిలిటీ. **పేపర్–2:**మ్యాథమెటిక్స్(పదోతరగతి స్థాయి).**పేపర్–3:** జనరల్ ఫారెస్ట్రీ–1గా ఈ పరీక్షను నిర్వహిస్తారు. **పేపర్–4:** జనరల్ ఫారెస్ట్రీ–2గా నిర్వహిస్తారు. పైన పేర్కొన్న నాలుగు పేపర్‌లకు సంబంధించి ఒక్కో పేపర్ 150ప్రశ్నలకు 150మార్కులుంటా యి. పరీక్ష సమయం ప్రతి పేపర్‌కు 150 నిమిషాలు.

కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్ట్

ఈ పరీక్షను 50 మార్కులకు నిర్వహిస్తారు. కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పరీక్షించే విధంగా ఇందులో ప్రశ్నలు అడుగుతారు. ఎంఎస్ వర్డ్–15, ఎంఎస్ ఎక్సెల్–10, ఎంఎస్ పవర్ పాయింట్–10, ఎంఎస్ యాక్సెస్–10, ఇంటర్నెట్‌ల నుంచి 10 మార్కులకు ప్రశ్నలుంటాయి.

ముఖ్యమైన సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **దరఖాస్తు ప్రారంభతేదీ:** 15.11.2022
» **దరఖాస్తులకు చివరి తేదీ:** 05.12.2022
» **వెబ్‌సైట్:** https://psc.ap.gov.in

సీటెట్‌కు.. సిద్ధమవుతారా!!



సీటెట్-డిసెంబర్-2022

» సీటెట్ డిసెంబర్ 2022 నోటిఫికేషన్ విడుదల
» డిసెంబర్ లేదా జనవరిలో పరీక్ష నిర్వహించే అవకాశం

సెంట్రల్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్.. సంక్షిప్తంగా.. సీటెట్! ఇది సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్ఈ) జాతీయ స్థాయిలో నిర్వహించే ఉపాధ్యాయ అర్హత పరీక్ష!! బీఈడీ, డీఈడీ ఉత్తీర్ణులు సీటెట్‌లో అర్హత సాధిస్తే.. సీబీఎస్ఈ, ఎన్‌సీటీఈ, కేంద్ర ప్రభుత్వ పరిధిలోని పాఠశాలల్లో.. ఉపాధ్యాయ వృత్తిలో అడుగుపెట్టే అవకాశం లభిస్తుంది! తాజాగా సీబీఎస్ఈ.. సీటెట్-డిసెంబర్-2022కు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేసింది. డిసెంబర్ లేదా వచ్చే ఏడాది జనవరిలో పరీక్ష నిర్వహించనుంది. ఈ నేపథ్యంలో.. సీటెట్‌తో ప్రయోజనాలు, పరీక్ష విధానం, విజయానికి మార్గాలపై ప్రత్యేక కథనం...

ఉపాధ్యాయ వృత్తిలో స్థిరపడాలనుకునే వారు.. కేవలం బీఈడీ, డీఈడీ అర్హతతోనే సరిపెట్టుకునే పరిస్థితులు ఇప్పుడు లేవు. వారు రాష్ట్ర స్థాయిలో నిర్వహించే టెట్ లేదా జాతీయ స్థాయిలో సీబీఎస్ఈ నిర్వహించే సీటెట్‌లో అర్హత సాధిస్తేనే కొలువులు సొంతం చేసుకునే దిశగా ముందంజలో ఉంటారు.

రెండు పేపర్లుగా సీటెట్

- సీబీఎస్ఈ సీటెట్ పరీక్షను రెండు పేపర్లుగా(పేపర్–1, పేపర్–2) నిర్వహిస్తుంది.
- ఒకటి నుంచి అయిదో తరగతి వరకు బోధించాలనుకునే వారు పేపర్–1కు హాజరు కావలసి ఉంటుంది.
- ఆరు నుంచి ఎనిమిదో తరగతి వరకు టీచింగ్ అభ్యర్థులు పేపర్–2లో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది.
- రెండు స్థాయిల్లోనూ బోధించాలనుకునే వారు రెండు పేపర్లకు హాజరై అర్హత సాధించాలి.
- ఈ పేపర్లు రాసేందుకు నిర్దేశిత విద్యార్హతలు కలిగుండాలి.

అర్హతలు

- **పేపర్–1:** ఇంటర్మీడియెట్/తత్సమాన కోర్సులో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణతతోపాటు రెండేళ్ల డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ లేదా నాలుగేళ్ల బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్ లేదా రెండేళ్ల డిప్లొమా ఇన్ ఎడ్యుకేషన్(స్పెషల్ ఎడ్యుకేషన్)లో ఉత్తీర్ణత ఉండాలి. (లేదా)
- 50 శాతం మార్కులతో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. దీంతోపాటు బీఈడీ లేదా బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్‌లో ఉత్తీర్ణత ఉండాలి.
- ఎన్‌సీటీఈ మార్గదర్శకాల ప్రకారం–బీఈడీ అభ్యర్థులను కూడా ఎస్‌జీటీ పోస్టులకు అర్హులుగా పేర్కొన్నారు. దీంతో.. సీటెట్ టెట్–పేపర్–1కు బీఈడీ ఉత్తీర్ణులకు కూడా అర్హత లభించింది.

పేపర్–2 అర్హత

- బీఏ/బీఎస్సీ/బీకామ్‌లలో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణతతోపాటు బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్(బీఈడీ) లేదా బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్(స్పెషల్ ఎడ్యుకేషన్) లేదా నాలుగేళ్ల బీఏ ఎడ్యుకేషన్ /బీఎస్సీ ఎడ్యుకేషన్‌లలో ఉత్తీర్ణులవ్వాలి. లేదా నాలుగేళ్ల బీఏబీఈడీ/బీఎస్సీ బీఈడీలలో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత ఉండాలి. (లేదా)
- బీఈ/బీటెక్‌లో 50 శాతంతో ఉత్తీర్ణులై బీఈడీ/బీఈడీ(స్పెషల్ ఎడ్యుకేషన్ చదువుతున్న వారు కూడా దరఖాస్తుకు అర్హులే.

పేపర్–1

పేపర్–1 పరీక్ష అయిదు విభాగాల్లో 150 మార్కులకు ఉంటుంది. ఇందులో చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ పెడగాజీ 30 ప్రశ్నలు–30 మార్కులు; లాంగ్వేజ్–1, 30 ప్రశ్నలు–30 మార్కులు; లాంగ్వేజ్–2, 30 ప్రశ్నలు–30 మార్కులు; మ్యాథమెటిక్స్ 30 ప్రశ్నలు–30 మార్కులు; ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్ 30 ప్రశ్నలు–30 మార్కులకు ఉంటాయి.

పేపర్–2 ఇలా

- పేపర్–2ను రెండున్నర గంటల వ్యవధిలో 150 మార్కులకు నిర్వహిస్తారు.
- మొత్తం అయిదు విభాగాల్లో పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలోఈ పరీక్ష ఉంటుంది.
- ఇందులో చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ పెడగాజీ 30 ప్రశ్నలు–30 మార్కులు; లాంగ్వేజ్ 1, 30 ప్రశ్నలు–30 మార్కులు; లాంగ్వేజ్ 2, 30 ప్రశ్నలు–30 మార్కులు; మ్యాథమెటిక్స్/సైన్స్ 60 ప్రశ్నలు–60 మార్కులు; (లేదా) సోషల్ స్టడీస్/సోషల్ సైన్స్ 60 ప్రశ్నలు–60 మార్కులకు పరీక్ష జరుగుతుంది.
- లాంగ్వేజ్–1 విభాగంలో అభ్యర్థులు తాము ఏ మాధ్యమంలో బోధించాలనుకుంటున్నారో ఆ మీడియంలోనే పరీక్ష రాయాల్సి ఉంటుంది.
- లాంగ్వేజ్–2 విభాగంలో లాంగ్వేజ్–1లో హాజరైన భాష కాకుండా.. ఇతర లాంగ్వేజ్‌లలో హాజరు కావాలి. మొత్తం 20 లాంగ్వేజ్‌లు అందుబాటులో ఉన్నాయి.

కనీస అర్హత మార్కులు

సీటెట్ పేపర్–1, పేపర్–2లలో అభ్యర్థులు తప్పనిసరిగా కనీస అర్హత మార్కులు సాధించాలనే నిబంధన ఉంది. జనరల్ కేటగిరీ అభ్యర్థులు కనీసం అరవై శాతం మార్కులతో(90 మార్కులు) ఉత్తీర్ణత సాధించాలి. బీసీ కేటగిరీ అభ్యర్థులు 50 శాతం మార్కులు(70 మార్కులు), ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగుల కేటగిరీలకు చెందిన అభ్యర్థులు 40 శాతం మార్కులు(60 మార్కులు) పొందాలి.

జీవిత కాల గుర్తింపు

సీటెట్‌లో ఒకసారి అర్హత సాధిస్తే..ఆ స్కోర్‌కు జీవిత కాల గుర్తింపు ఉంటుంది. దీంతో ఒకసారి ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధిస్తే.. ఎప్పుడైనా టీచింగ్ ఉద్యోగాలకు పోటీ పడొచ్చు.

విజయం సాధించాలంటే

చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ పెడగాజి

ఈ విభాగంలో బోధన, లెర్నింగ్‌కు సంబంధించి ఎడ్యుకేషనల్ సైకాలజీ మీద ప్రాథమిక స్థాయిలో ప్రశ్నలు ఉంటాయి. అభ్యర్థులు ప్రధానంగా శిశువు సైకాలజీకి సంబంధించిన అంశాలపై ఎక్కువ దృష్టిసారించాలి. వికాస దశలు, వికాస అంశాలైన శారీరక, మానసిక, సాంఘిక, ఉద్వేగ వికాసాలు మొదలైన అంశాలను క్షుణ్నంగా చదవాలి. శిశువు ప్రవర్తనలో మార్పునకు సంబంధించిన అభ్యాసం, అభ్యసన బదలాయింపు అంశాలను అధ్యయనం చేయాలి. సైకాలజీని చదివేటప్పుడు కీలక భావనలు, సాంకేతిక పదాలు, సిద్ధాంతాలు–సూత్రాలు, ప్రతిపాదించిన శాస్త్రవేత్తలు, వారి గ్రంథాలు తదితర విషయాలను విశ్లేషణాత్మకంగా చదవాలి. ఇక పెడగాజి అంటే బోధన శాస్త్రం. ఇందులో సహిత విద్య, శిశువు విద్యాప్రణాళిక, బోధన పద్ధతులు, మూల్యాంకనం–నాయకత్వం–గైడెన్స్–కౌన్సెలింగ్ గురించి అధ్యయనం చేయాలి. ఎడ్యుకేషన్‌కు సంబంధించిన చట్టాలపై పూర్తి అవగాహన పెంచుకోవాలి. పెడగాజిలోని భావనలు, సిద్ధాంతాలు, నిబంధనలను విశ్లేషిస్తూ అధ్యయనం చేస్తేనే.. ఏ కోణంలో ప్రశ్న అడిగినా సమాధానం ఇచ్చే సన్నద్ధత లభిస్తుంది.

లాంగ్వేజ్ పేపర్లకు ఇలా

అభ్యర్థులు తాము బోధించాలనుకునే భాషలో నిర్వహించే లాంగ్వేజ్–1 విభాగంలో రాణించేందుకు.. అదే విధంగా మరో ఇతర లాంగ్వేజ్ నైపుణ్యాన్ని పరీక్షించే లాంగ్వేజ్–2 పేపర్‌లో రాణించేందుకు ఆయా భాషా విభాగాలకు సంబంధించి స్కూల్ స్థాయిలో సబ్జెక్ట్ పుస్తకాలను పూర్తిగా చదవాలి. లాంగ్వేజ్–2కు సంబంధించి ఎక్కువ మంది ఇంగ్లిష్‌ను ఎంచుకుంటున్నారు. ఇంగ్లిష్‌లో పార్ట్స్ ఆఫ్ స్పీచ్, ఆర్టికల్స్, డైరెక్ట్ అండ్ ఇన్‌డైరెక్ట్ స్పీచ్, డిగ్రీస్ ఆఫ్ కంపేరిజన్, వొకాబ్యులరీ.. ఇలా అన్ని అంశాలపైనా అవగాహన పెంచుకోవాలి. అభ్యర్థులు నిర్దిష్టంగా ఒక ప్రామాణిక పుస్తకాన్ని ఎంచుకుని చదవాలి. పెడగాజికి సంబంధించి టీచింగ్ మెథడ్స్, అప్రోచెస్, టెక్నిక్స్, లాంగ్వేజ్ స్కిల్స్, ఇంగ్లిష్ నేపథ్యంపై ప్రశ్నలు వస్తాయి.

మ్యాథమెటిక్స్

పేపర్–1లో ఒకటి నుంచి నుంచి అయిదో తరగతి స్థాయిలో.. పేపర్–2లో ఆరో తరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకు ఉండే కాన్సెప్టులపైనే ప్రశ్నలు అడుగుతారు.

ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్

ఈ విభాగంలో రాణించేందుకు బోటనీ బేసిక్ అంశాలతోపాటు, పర్యావరణ విషయాలు, సైన్స్ ఇన్ డైలీ లైఫ్ వంటి వాటిపైనా దృష్టి పెట్టాలి.

సైన్స్

ఈ విభాగంలో మార్కుల కోసం మూడు నుంచి ఎనిమిదో తరగతి వరకు పుస్తకాలు ఔపోసన పట్టాలి. పేపర్–2 కోసం ప్రత్యేకంగా ఆరు నుంచి పదో తరగతి వరకు పుస్తకాలు చదవాలి. గత టెట్‌లో ఈ విభాగంలో ప్రశ్నలు కొంత క్లిష్టంగానే ఉన్నాయని చెప్పొచ్చు. కాబట్టి అభ్యర్థులు ఆయా అంశాల బేసిక్స్, అప్లికేషన్స్‌ను ప్రత్యేకంగా అధ్యయనం చేయాలి.

సోషల్ స్టడీస్

ఆరు నుంచి ఎనిమిదో తరగతి వరకు పాఠ్య పుస్తకాలను క్షుణ్నంగా చదవాలి. భూగోళ శాస్త్రంలో ఒక ప్రాంతం గురించి చదువుతున్నప్పుడు దానికి సంబంధించిన అన్ని అంశాలను చదివాలి. వాతావరణం, భౌగోళిక పరిస్థితులు, నదులు.. వంటి వాటిపై అవగాహన పెంచుకోవాలి. అదేవిధంగా సివిక్స్, ఎకనామిక్స్ అంశాలను సమకాలీన పరిణామాలతో అప్‌డేట్ చేసుకుంటూ అధ్యయనం చేయాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు తేదీలు:** అక్టోబర్ 21– నవంబర్ 24, 2022
- **సీటెట్ పరీక్ష తేదీ:** డిసెంబర్ లేదా జనవరిలో నిర్వహించే అవకాశం
- **వివరాలకు వెబ్‌సైట్:** https://ctet.nic.in

క్లుప్తంగా

ఇక డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం

- ఉత్తర్వులు జారీచేసిన వైద్య శాఖ

సాక్షి, అమరావతి: ఆరోగ్య విశ్వవిద్యాలయం డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయంగా రూపాంతరం చెందింది. ఇటీవల ఆరోగ్య విశ్వ విద్యాలయం చట్ట సవరణ బిల్లుకు అసెంబ్లీ ఆమోదం తెలిపింది. అసెంబ్లీ ఆమోదించిన ముసాయిదాకు గవర్నర్ ఆమోదం కూడా లభించడంతో చట్ట సవరణ పూర్తయింది. దీంతో సవరించిన చట్టాన్ని సోమవారం నుంచి అమలుచేస్తూ వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి కృష్ణబాబు ఉత్తర్వులిచ్చారు.

'సిపెట్'లో ఉచిత నైపుణ్య శిక్షణ

- పదో తరగతి పాసైన ఎస్టీ, ఎస్సీ యువతకు అవకాశం
- ఉచిత వసతి, భోజన సదుపాయం

సాక్షి, అమరావతి: విజయవాడ సమీపంలోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (సిపెట్)లో ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగ యువతకు 'మెషీన్ ఆపరేటర్–ప్లాస్టిక్స్ ప్రాసెసింగ్' కోర్సులో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ జాయింట్ డైరెక్టర్ సీహెచ్ శేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఎస్ఎంఈ, ఎన్ఎస్ఐసీ సహకారంతో 30 మందికి 'మెషీన్ ఆపరేటర్ –ప్లాస్టిక్స్ ప్రాసెసింగ్' కోర్సులో ఆరు నెలల పాటు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. విజయవంతంగా కోర్సు పూర్తి చేసుకున్నవారికి సర్టిఫికెట్‌తోపాటు అనంతపురం, హైదరాబాద్, బెంగళూరు, హోసూర్, చెన్నై ప్రాంతాల్లోని ప్రముఖ ప్లాస్టిక్స్, అనుబంధ సంస్థల్లో ఉద్యోగ అవకాశం కల్పించనున్నట్లు వివరించారు. అవకాశం ఉన్నవారు సొంతగా సంస్థను ఏర్పాటు చేసుకుని స్వయం ఉపాధి కూడా పొందవచ్చని తెలిపారు. శిక్షణాకాలంలో అభ్యర్థులకు ఉచిత భోజన, వసతి సదుపాయాలను కల్పిస్తామని, 18 ఏళ్ల నిండిన పదో తరగతి ఉత్తీర్ణులైనవారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల ఎస్టీ, ఎస్సీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకునేందుకు 7893586494 నంబర్‌లో సంప్రదించి నవంబర్ నాలుగో తేదీలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

ట్రిపుల్ ఐటీల్లో రెండో విడత 256 మందికి అడ్మిషన్లు



నూజివీడు ట్రిపుల్ ఐటీలో కౌన్సెలింగ్‌ను పరిశీలిస్తున్న ఆచార్య కేసీ రెడ్డి

నూజివీడు: రాష్ట్రంలోని రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్జీయూకేటీ) పరిధిలోని నూజివీడు, ఇడుపులపాయ, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల్లో రెండో విడత కౌన్సెలింగ్‌లో 256 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. ట్రిపుల్ ఐటీల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం సోమవారం నూజివీడు ట్రిపుల్ ఐటీలో రెండో విడత కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ కౌన్సెలింగ్‌కు 460మంది అభ్యర్థులు రావాల్సి ఉండగా, 256 మంది హాజరుకాగా, అధికారులు వీరికి సీట్లను ఖరారు చేశారు. కౌన్సెలింగ్ ప్రక్రియను చాన్సలర్ ఆచార్య కేసీ రెడ్డి, నూజివీడు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఆచార్య జీవీఆర్ శ్రీనివాసరావు పరిశీలించారు. కౌన్సెలింగ్ ముగిసిన అనంతరం మరో 204 సీట్లు మిగిలాయి. ఎన్‌సీసీ, స్పోర్ట్స్ కోటా కౌన్సెలింగ్ సమయంలో ఇప్పుడు మిగిలిన సీట్లకు కలిపి మూడో విడత కౌన్సెలింగ్‌ను త్వరలోనే నిర్వహిస్తామని అడ్మిషన్స్ కన్వీనర్ ఆచార్య గోపాలరాజు తెలిపారు.

15 నుంచి 'అగ్నివీర్' రిక్రూట్‌మెంట్ ర్యాలీ

- ఈ నెల 29వ తేదీ వరకు చెన్నైలో నిర్వహణ
- ఏపీ, తెలంగాణ, తమిళనాడు యువతకు అవకాశం



సాక్షి, అమరావతి: అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ ర్యాలీని నవంబర్ 15 నుంచి 29వ తేదీ వరకు చెన్నైలో నిర్వహించనున్నట్లు ఆర్మీ వర్గాలు వెల్లడించాయి. ఈ ర్యాలీలో ఏపీ, తెలంగాణ, తమిళనాడు యువత పాల్గొనవచ్చు. అగ్నివీర్ (మెన్), అగ్నివీర్ (మహిళా మిలటరీ పోలీస్), సోల్జర్ టెక్నికల్ నర్సింగ్ అసిస్టెంట్ /నర్సింగ్ అసిస్టెంట్ (వెటర్నరీ), జూనియర్ కమిషన్డ్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి ఈ ర్యాలీ నిర్వహించనున్నారు. ర్యాలీకి సంబంధించిన పూర్తి వివరాలు www.joinindianarmy.nic.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. ర్యాలీకి హాజరయ్యే అభ్యర్థులు తీసుకువెళ్లాల్సిన ధ్రువీకరణపత్రాలు, ఇతర సమాచారం మొత్తం వెబ్‌సైట్‌లోని నోటిఫికేషన్‌లో ఉంటుంది. నియామక ప్రక్రియ పూర్తి పారదర్శకంగా జరుగుతుందని, యువత దళారుల మాయ మాటలు నమ్మి మోసపోవద్దని ఆర్మీ వర్గాలు స్పష్టంచేశాయి.

కాపుల సంక్షేమానికి పెద్దపీట

రాజమహేంద్రవరంలో కాపు ప్రజాప్రతినిధుల భేటీలో తీర్మానం



రాజమహేంద్రవరంలో వైఎస్సార్‌సీపీ కాపు ప్రజాప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న నేతలు

సాక్షి ప్రతినిధి, రాజమహేంద్రవరం: గతంలో ఏ ప్రభుత్వం చేయని రీతిలో కాపుల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్ పెద్దపీట వేస్తున్నారని కాపు సామాజికవర్గ ప్రజా ప్రతినిధులు తెలిపారు. కాపులకు గత మూడేళ్లలో పలు పథకాల ద్వారా రూ.27 వేల కోట్ల మేర లబ్ధి చేకూర్చారని, గ్రామ గ్రామాన దీనిపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. కాపుల సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలు, భవిష్యత్తులో చేపట్టాల్సిన అంశాలపై చర్చించేందుకు కాపు సామాజిక వర్గ మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో సమావేశమయ్యారు. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన ఈ భేటీలో ప్రధానంగా మూడు కీలక తీర్మానాలను ఆమోదించారు. త్వరలో విజయవాడలో కాపు సామాజికవర్గ ప్రజా ప్రతినిధులతో విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించాలని ఈ సందర్భంగా నిర్ణయించారు. పవన్ కళ్యాణ్ తమకు పది సీట్లు ఇవ్వాలని ఎవరినో కోరారంటే పార్టీని తాకట్టు పెట్టేందుకే కదా? అని కాపు ప్రజాప్రతినిధులు ప్రశ్నించారు. పవన్‌కు ధైర్యం ఉంటే 175 సీట్లలో సింగిల్‌గా పోటీ చేస్తామని ప్రకటించాలన్నారు. అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్న వైఎస్సార్‌సీపీనే వచ్చే ఎన్నికల్లో సైతం అధికారంలోకి రానుందని స్పష్టం చేశారు.

కాపు యువతకు వివరిద్దాం..

అధికారంలో ఉండగా కాపులను అణగదొక్కిన చంద్రబాబుకు తన సామాజిక వర్గాన్ని తాకట్టు పెడుతున్న పవన్‌కళ్యాణ్ రాజకీయ దిగజారుడుతనాన్ని కాపు ప్రజాప్రతినిధులు తూర్పారబట్టారు. వంగవీటి మోహన్‌రంగా హత్యకు కారకుడైన చంద్రబాబుతో పవన్ అంటకాగటాన్ని తప్పుబట్టారు. కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభం కుటుంబాన్ని రోడ్డుపైకి ఈడ్చేసి వేలాది మంది కాపులపై పోలీసు కేసులతో వేధింపులకు గురిచేసిన చంద్రబాబును సీఎం చేసేందుకు పవన్ చేస్తోన్న కుట్రలను తిప్పికొట్టాలని నిర్ణయించారు. ఈ విషయాన్ని కాపు యువతకు అర్థమయ్యేలా వివరించాలని తీర్మానించారు. ఇటీవల కాపు సామాజికవర్గ ప్రజాప్రతినిధులపై పవన్ చేసిన వ్యాఖ్యలను సమావేశం ముక్తకంఠంతో ఖండించింది. కార్యక్రమంలో మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మాజీ మంత్రులు పేర్ని నాని, అవంతి శ్రీనివాస్, ఎంపీలు వంగా గీత, బాలశౌరి, బి.చంద్రశేఖర్, ఎమ్మెల్సీలు ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, తోట త్రిమూర్తులు, ఎమ్మెల్యేలు జక్కంపూడి రాజా, పర్వత పూర్ణచంద్రప్రసాద్, పెండెం దొరబాబు, జ్యోతుల చంటిబాబు, గెడ్డం శ్రీనివాసనాయుడు, గ్రంధి శ్రీనివాస్, పుప్పాల శ్రీనివాసరావు, దూలం నాగేశ్వరరావు, సింహాద్రి రమేష్ బాబు, సామినేని ఉదయభాను, కిలారి వెంకటరోశయ్య, ఆరాని శ్రీనివాసులు, బొత్స అప్పల నరసయ్య, మద్దిశెట్టి వేణుగోపాల్, రాష్ట్ర కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా నాగేషు తదితరులు పాల్గొన్నారు. భేటీలో చర్చించిన అంశాలను ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, మంత్రులు బొత్స సత్యనారాయణ, అంబటి రాంబాబు, దాడిశెట్టి రాజా, మాజీ మంత్రి కురసాల కన్నబాబు మీడియాకు వివరించారు.

3 తీర్మానాలకు ఆమోదం

1) జిల్లా పరిషత్ చైర్మన్లతో సహా అన్ని నామినేటెడ్ పదవుల్లో ఉన్న కాపు నేతలను ఆహ్వానించి కాపు సంక్షేమ రోడ్ మ్యాప్ రూపొందించేలా భారీ వేదిక ఏర్పాటు చేయాలని నిర్ణయం.

2) కాపుల అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషి, సంక్షేమ పథకాల లబ్ధిని ఇంటింటికీ చేర్చే కార్యక్రమాన్ని చేపట్టేందుకు ఆమోదం.

3) సీనియర్ కాపు నేతలతో చర్చించి కాపుల సంక్షేమం, అభివృద్ధి, సంక్షేమం కోసం చేపట్టాల్సిన మరిన్ని కార్యక్రమాలు రూపొందించాలని నిర్ణయం.

పవన్ కుమ్మక్కు రాజకీయాలు: కొట్టు

టీడీపీ కాపుల సంక్షేమానికి ఏటా రూ.వెయ్యి కోట్లిస్తామని హామీ ఇచ్చి ఐదేళ్లలో రూ.1,824 కోట్లు మాత్రమే విదిల్చింది. ముఖ్యమంత్రి జగన్ కాపులకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చుతూ ఇప్పటిదాకా డీబీటీ ద్వారా రూ.16,485 కోట్లు, నాన్ డీబీటీ ద్వారా రూ.10 వేల కోట్లతో మొత్తం రూ.27 వేల కోట్లు కాపులకు అందచేశారు. 70,83,377 మంది కాపులకు సాయం చేశారు. టికెట్లు, మంత్రి పదవులు ఇచ్చి గౌరవించారు. పవన్ కళ్యాణ్ చంద్రబాబుతో కుమ్మక్కై కాపు సామాజిక వర్గాన్ని కించపరిచేలా వ్యవహరిస్తున్నారు. చెప్పులు చూపిస్తూ అసభ్యంగా మాట్లాడటం సిగ్గుచేటు. విచక్షణ కోల్పోయి ఉన్మాదిలా మాట్లాడుతున్నారు.

సీఎం దృష్టికి తెస్తాం: మంత్రి బొత్స

వైఎస్సార్‌సీపీలో ఎమ్మెల్యే టికెట్ల నుంచి మంత్రులు, నామినేటెడ్ పదవుల వరకు ముఖ్యమంత్రి జగన్ కాపులకు పెద్దపీట వేశారు. కాపులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్న ఉద్దేశంతో కాపు నేస్తం పథకాన్ని అమలు చేస్తున్నారు. అన్ని సామాజికవర్గాలతోపాటు కాపులకు సమాన ప్రాతినిధ్యం కల్పించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుంది. భేటీలో చర్చించిన అంశాలను క్రోడీకరించి కార్యాచరణతో సీఎం దృష్టికి తెస్తాం. ఇటీవల ఓ సెలబ్రిటీ పార్టీ అసభ్యకరమైన పదజాలంతో మాట్లాడుతోంది. కాపు రిజర్వేషన్లపై ఆది నుంచి ప్రభుత్వం ఒకే విధానంతో ఉంది. వాస్తవాలను వక్రీకరించి అపోహలు కల్పించడం లేదు. రాజ్యాంగపరంగా ఎంతవరకు చేయగలమో అది చేస్తాం. కేంద్రం ఈడబ్ల్యుఎస్‌కు ఇచ్చిన పది శాతం రిజర్వేషన్లలో రాష్ట్రానికి సౌలభ్యం కల్పిస్తే అత్యధికంగా 25 శాతానికి పైబడి ఉన్న కాపులకు మేలు చేయవచ్చు.

రంగాకు రక్షణ కల్పించని టీడీపీ సర్కారు: దాడిశెట్టి రాజా, మంత్రి

శాసనసభ సాక్షిగా తనకు ప్రాణహాని ఉంది, రక్షణ కల్పించాలని నాడు వంగవీటి రంగా కోరితే టీడీపీ సర్కారు పట్టించుకోలేదు. నాడు మంత్రిగా ఉన్న హరిరామ జోగయ్య రంగా హత్యపై రాసిన పుస్తకాన్ని పవన్ చదవలేదా?

గంటలోనే బాబును కలసిన పవన్: మంత్రి అంబటి రాంబాబు

టీడీపీ కాపుల వ్యతిరేక పార్టీ. అధికారంలో ఉండగా కాపు నేత ముద్రగడ పద్మనాభం ఉద్యమాన్ని అణచివేసి ఆయన కుటుంబ సభ్యులను వేధించింది. కాపులను గౌరవించే పార్టీ వైఎస్సార్‌సీపీ. కాపు సామాజిక వర్గానికి చెందిన 26 మంది ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎంపీలు, ఐదుగురు ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్, మేయర్లు పార్టీలో ఉన్నారు. ముద్రగడ పద్మనాభంపై చంద్రబాబు సర్కారు బనాయించిన అక్రమ కేసులను సీఎం జగన్ ఎత్తివేశారు. పవన్ కళ్యాణ్ మాట్లాడిన తీరు, కాపు ప్రజా ప్రతినిధులను దూషించిన విధానం గర్హనీయం. ఆయన రాజకీయాలకు అనర్హుడు. రంగా హత్య జరుగుతుందని తెలిసినప్పుడు ప్రతి గ్రామం నుంచి కాపులు వెళ్లి ఎందుకు కాపలా కాయలేదని ప్రశ్నించిన పవన్ అనంతరం గంటలోనే దీనికి కారకుడైన చంద్రబాబును కలవడం ఎంత వరకు సమంజసం?

కాపుల్లో ఉద్వేగాన్ని రగిల్చే కుట్ర: కురసాల కన్నబాబు, మాజీ మంత్రి

టీడీపీ హయాంలో కాపు సామాజిక వర్గాన్ని సంఘ వ్యతిరేక శక్తిగా చూపించాలనుకున్న చంద్రబాబు పాలనలో కాపులపై కేసులు పెట్టడమే కాకుండా వృద్ధులు, మహిళలని కూడా చూడకుండా పోలీసు స్టేషన్లలో కూర్చోబెట్టారు. విశాఖలో సెక్షన్ 30 ఎలా అమలు చేస్తారని ప్రశ్నిస్తున్న చంద్రబాబుకు ఆయన అధికారంలో ఉండగా రాజమహేంద్రవరంలో మూడేళ్ల పాటు సెక్షన్ 30 అమలు చేసిన విషయం గుర్తు లేదా? రంగా హత్య కుట్రను వక్రీకరించి కాపుల్లో ఉద్వేగాన్ని రేపాలని కుట్రలు పన్నుతున్నారు. కాపులకు చంద్రబాబు కంటే సీఎం జగన్ లక్ష రెట్లు మేలు చేస్తున్నారన్నారు.

జగనన్న విదేశీ విద్యా దీవెనకు 546 దరఖాస్తులు

మరింత మందికి మేలు చేసేలా గడువు పొడిగింపు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని పేద వర్గాలకు చెందిన పిల్లలు విదేశాల్లో ఉన్నత చదువుల కోసం ఉద్దేశించిన 'జగనన్న విదేశీ విద్యా దీవెన'కు సోమవారం నాటికి మొత్తం 546 దరఖాస్తులొచ్చాయి. రాష్ట్ర ప్రభుత్వం మహోన్నత లక్ష్యంతో ప్రకటించిన ఈ పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు తొలుత సెప్టెంబర్ 30 వరకు గడువు ఇచ్చిన సంగతి తెల్సిందే. ఆ గడువు ముగిసిన అనంతరం ఎక్కువ మందికి అవకాశం కల్పించేందుకుగాను అక్టోబర్ నెలాఖరు వరకు ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. అర్హత ఉన్న ప్రతి విద్యార్థికీ విదేశీ విద్య అందాలనే లక్ష్యంతో తాజాగా ఆ గడువును మరింత కొనసాగించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని సాంఘిక సంక్షేమ శాఖ సంచాలకుడు హర్షవర్ధన్ చెప్పారు. సోమవారంతో ముగిసిన గడువు మరికొంత కాలం కొనసాగుతుందని.. అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. కాగా, ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని అగ్రవర్ణ పేదలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, దివ్యాంగులు విదేశాల్లో చదువుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రపంచ వ్యాప్తంగా ఒకటి నుంచి 200 క్యూఎస్ ర్యాంకులు కలిగిన వర్సిటీల్లో సీట్లు సాధించిన విద్యార్థులకు ప్రభుత్వం ఆర్థిక సాయమందిస్తుంది. ఒకటి నుంచి వంద క్యూఎస్ ర్యాంకింగ్ కలిగిన వర్సిటీల్లో సీట్లు తెచ్చుకున్న విద్యార్థులకు ఫీజు రూ.కోటి అయినా నూరు శాతం ప్రభుత్వం రీయింబర్స్ చేస్తుంది. అలాగే క్యూఎస్ ర్యాంకుల్లో 101 నుంచి 200 లోపు కలిగిన వర్సిటీల్లో సీట్లు తెచ్చుకుంటే.. రూ.50 లక్షల వరకూ ఫీజు రీయింబర్స్‌మెంట్ చేసేలా జగనన్న విదేశీ విద్యా దీవెన పథకాన్ని రూపొందించారు. ఈ పథకానికి వార్షిక ఆదాయం రూ.8 లక్షల వరకు పెంచడం విశేషం. అర్హులందరికీ ప్రభుత్వం రీయింబర్స్‌మెంట్ ఇస్తుంది. ఇప్పటి వరకు 546 దరఖాస్తులు రాగా, వాటిలో శాఖల వారీగా పరిశీలించి ఆమోదించినవి 82 ఉన్నాయి. మరో 48 దరఖాస్తులు నిబంధనలకు విరుద్ధంగా ఉండటంతో తిరస్కరించారు. 416 దరఖాస్తులు పరిశీలన దశలో ఉన్నాయి.

దరఖాస్తు చేసుకున్నవారు

ఈబీసీ	కాపు	బీసీ	ఎస్సీ
183	101	144	58

ఎస్టీ	మైనారిటీ	దివ్యాంగులు
4	54	2

ఆంగ్లంపై ఏపీ చర్యలు భేష్

- అమెరికన్ కాన్సుల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్
- ఏయూ విద్యార్థులతో ఇష్టాగోష్టి



జెన్నిఫర్‌ను సత్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

విశాఖపట్నం (ఏయూ క్యాంపస్): ఆంగ్ల భాషను అందరికీ చేరువ చేసేలా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న చర్యలు అభినందనీయమని అమెరికన్ కాన్సుల్ జనరల్ (హైదరాబాద్) జెన్నిఫర్ లార్సన్ అన్నారు. సోమవారం ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని సందర్శించిన ఆమె అధికారులతో సమావేశమయ్యారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపుతూ గ్రామీణ ప్రాంతాలకు సైతం ఆంగ్ల భాషను చేరువ చేసేందుకు కృషి చేస్తున్నారన్నారు. విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం స్కాలర్‌షిప్‌లు వంటివి అందిస్తోందా అని ఏయూ వీసీ పీవీజీడీ ప్రసాదరెడ్డిని అడిగారు. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో అత్యధిక శాతం విద్యార్థులకు కళాశాల రుసుములను, హాస్టల్ చార్జీలను జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన పథకాల ద్వారా చెల్లిస్తోందని వివరించారు. ఏయూలో ఇంక్యుబేషన్, స్టార్టప్‌లకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ ప్రోత్సహిస్తున్నామన్నారు. భారత్, అమెరికా దేశాల విద్యార్థులు స్టార్టప్ రంగాలలో పరస్పరం కలసి పనిచేసే దిశగా కృషి చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో ఏయూలో అమెరికన్ కార్నర్ ఏర్పాటైందన్నారు. ఏడాది కాలంలో మున్పెన్నడూ లేనంతగా... ఏడాది కాలంలో ముప్పెక్కి పైగా కార్యక్రమాలను అమెరికన్ కార్నర్ నిర్వహించడాన్ని జెన్నిఫర్ ప్రశంసించారు. ఏయూలో 58 దేశాలకు చెందిన వెయ్యి మందికిపైగా విదేశీ విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారని రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ వివరించగా, అత్యధికంగా విదేశీ విద్యార్థులను కలిగి ఉండటంతో జెన్నిఫర్ హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థులతో మాటామంతి

గ్లోబల్ వర్చువల్ స్కూల్ ఇంగ్లిష్ ప్రోగ్రాంలో భాగంగా ఆంగ్ల భాషలో తర్ఫీదు పొందుతున్న విద్యార్థులతో జెన్నిఫర్ లార్సన్ అమెరికన్ కార్నర్‌లో సమావేశమయ్యారు. తరగతులు జరుగుతున్న విధానం, విద్యార్థుల ప్రగతిపై ఆరా తీశారు. అమెరికన్ కార్నర్‌లో నిర్వహించిన కార్యక్రమాలు, విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు తదితర వివరాలు పాలకమండలి సభ్యుడు జేమ్స్ స్టీఫెన్ వివరించారు. రెక్టార్ కె.సమత, రిజిస్ట్రార్ వి.కృష్ణమోహన్, ప్రిన్సిపాల్స్ కె.శ్రీనివాసరావు, వి.విజయలక్ష్మి, టి.శోభశ్రీ, ఎస్‌కే భట్టి, డీన్‌లు ఎన్.కిశోర్‌బాబు, కె.బసవయ్య పాల్గొన్నారు.

వైయూలో 'కళాదర్శన్' ఆర్ట్ గ్యాలరీ ప్రారంభం



కళాకృతులను పరిశీలిస్తున్న వీసీ సూర్యకళావతి

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన ఆర్ట్ గ్యాలరీ ఓ ప్రత్యేక ఆకర్షణగా సరికొత్త శోభను సంతరించుకుని విశ్వవిద్యాలయ కీర్తి ప్రతిష్టలు పెంచేలా ఉందని వైస్ చాన్సలర్ ఆచార్య మునగల సూర్యకళావతి అన్నారు. సోమవారం వైఎస్సార్ జిల్లా కడపలోని యోగివేమన విశ్వవిద్యాలయం లలితకళల విభాగం ఆధ్వర్యంలో నూతన పరిపాలన భవనంలో ఏర్పాటు చేసిన 'కళాదర్శన్' ఆర్ట్ గ్యాలరీని వీసీ ప్రారంభించారు.ఆమె మాట్లాడుతూ.. రాయలసీమలోనే తొలి ఆర్ట్ గ్యాలరీగా వైవీయూ నిలుస్తుందన్నారు. మహానగరాలకు తీసిపోని విధంగా తీర్చిదిద్దిన అధ్యాపకులు, విద్యార్థులను అభినందించారు. రిజిస్ట్రార్ ఆచార్య డీ విజయరాఘవప్రసాద్, ప్రిన్సిపాల్ ఆచార్య కే కృష్ణారెడ్డి, ఆర్ట్ గ్యాలరీ ఇన్‌చార్జి డాక్టర్ కోట మృత్యుంజయరావు, లలితకళల విభాగాధిపతి డాక్టర్ మూల మల్లికార్జునరెడ్డి, పాలక మండలి సభ్యులు ఆచార్య పీ పద్మ, డాక్టర్ వైపీ వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

ప్రజలపై పైసా భారం లేకుండా

స్మార్ట్ మీటర్లు

పూర్తి పారదర్శకంగా టెండర్ల ప్రక్రియ

- తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని డిస్కంల విజ్ఞప్తి
- నేటితో ముగియనున్న అభ్యంతరాల స్వీకరణ గడువు
- మీటర్లు అందుబాటులోకి వస్తే ప్రయోజనం




సాక్షి, అమరావతి: ప్రజలపై పైసా భారం పడకుండా, పూర్తి పారదర్శకంగా స్మార్ట్ మీటర్ల టెండర్ల ప్రక్రియ నిర్వహించేందుకు విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లు రంగం సిద్ధం చేశాయి. రాష్ట్రంలోని గృహాలకు, వ్యవసాయ సర్వీసులకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయాలని ఇంధన శాఖ సంకల్పించింది. బోర్లకు మీటర్లు అమర్చడం వల్ల డిస్కంల సమర్థత పెంచవచ్చని, విద్యుత్ చౌర్యాన్ని అరికట్టవచ్చని, రైతులకు బాధ్యత పెంచవచ్చనే ఉద్దేశంతో వీటిని ఏర్పాటు చేయనుంది. ఈ వివరాలతో టెండర్ డాక్యుమెంట్లను అక్టోబర్ 21న విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లు న్యాయ సమీక్షకు పంపించాయి. వాటిపై ప్రజలు, వినియోగదారులు సూచనలు, సలహాలు, అభ్యంతరాలను వ్యక్తం చేసేందుకు ఇచ్చిన గడువు మంగళవారంతో ముగుస్తుంది. డాక్యుమెంట్ల పరిశీలన పూర్తికాగానే రాష్ట్ర ప్రభుత్వం అనుమతితో ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ)కి డిస్కంలు దరఖాస్తు చేయనున్నాయి. ఏపీఈఆర్‌సీ తుది నిర్ణయం తరువాత మీటర్ల ఏర్పాటు ప్రక్రియ మొదలవుతుందని విద్యుత్ శాఖ అధికారులు చెబుతున్నారు.

అది అవాస్తవం

మీటరుకు రూ. 6 వేలు, నిర్వహణకు రూ.29వేలు చొప్పున మొత్తం రూ.35 వేలను డిస్కంలు ఖర్చు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అది పూర్తిగా అవాస్తవమని డిస్కంలు స్పష్టం చేశాయి. నిజానికి టెండర్లు కోట్ చేసిన రేటు ప్రకారం ఒక నెలకు ఒక్కో మీటరుకు రూ. 255 చొప్పున అన్ని నిర్వహణ బాధ్యతలు, దొంగతనం జరిగిన, మీటర్లు కాలిపోయిన టెండర్ బిడ్ చేసేవారే మీటర్లు మార్చే విధంగా డాక్యుమెంట్ పొందుపరిచారు. దీని ప్రకారం ఐదేళ్లకు రూ. 15,300 మాత్రమే ఖర్చుఅవుతోంది. వ్యవసాయ విద్యుత్ మీటర్లకు డీఓఎల్ స్టార్టర్లు వాడటం వల్ల 4 నుంచి 5 రెట్లు ఎక్కువ విద్యుత్ డ్రా చేసే అవకాశం ఉంటుంది. కాబట్టి మీటరు సామర్థ్యం దానికి తగ్గట్టుగా ఉండాలి. వ్యవసాయ క్షేత్రాలు, గ్రామీణ ప్రాంతాల్లో కమ్యూనికేషన్ వ్యవస్థ సరిగ్గా ఉండదు. అందువల్ల దానికి తగ్గట్టు కమ్యూనికేషన్ వ్యవస్థను టెండర్స్ బిడ్ చేసే వారే ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది.

మీటర్లతో ప్రయోజనం



స్మార్ట్ మీటర్లు వస్తే విద్యుత్ వృథా, చౌర్యాన్ని అరికట్టడం సాధ్యమవుతుంది. సరఫరాలో లోపాలుంటే డిస్కంలను ప్రశ్నించే హక్కు వినియోగదారులకు లభిస్తుంది. పంపిణీ వ్యవస్థలో లోపాలను సకాలంలో గుర్తించడం వల్ల విద్యుత్ అంతరాయాలను వెంటనే పరిష్కరించే వీలుంటుంది. స్మార్ట్ మీటర్లు 'టూ వే కమ్యూనికేషన్'ను సపోర్ట్ చేస్తాయి. అంటే వినియోగదారుల మొబైల్‌కు అనుసంధానమై ఉంటాయి. విద్యుత్ పంపిణీ సంస్థల నుంచి విద్యుత్ ధరలు, బిల్లు గడువు వంటి సందేశాలను ఎప్పటికప్పుడు వినియోగదారుల మొబైల్ ఫోన్లకు పంపుతాయి.

– కె.సంతోషరావు, సీఎండీ, ఏపీఈపీడీసీఎల్, ఏపీఎస్పీడీసీఎల్



అల్లూరి జిల్లా వీరవరంలో పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి



ప.గో జిల్లా మొగల్తూరులో మహిళకు బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసాదరాజు

వాడవాడలా వేడుకగా

సాక్షి, నెట్‌వర్క్: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ఉత్సాహంగా సాగుతోంది. గ్రామాల్లో పర్యటిస్తున్న ప్రజాప్రతినిధులకు ప్రతి ఇంటి వద్ద ప్రజల నుంచి అపూర్వ ఆదరణ లభిస్తోంది. అన్ని జిల్లాల్లో సోమవారం ఈ కార్యక్రమం సాగింది. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, అధికారులు ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఏమైనా సమస్యలు తమ దృష్టికి వచ్చిన వెంటనే అక్కడికక్కడే వాటిని పరిష్కరించారు. తమ సంక్షేమం కోసం పాటుపడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కి తమ ఆశీస్సులు ఎప్పుడూ ఉంటాయని ప్రజాప్రతినిధులను ప్రజలు దీవిస్తున్నారు. మేనిఫెస్టోలో పేర్కొన్న అన్ని హామీలను తప్పకుండా నెరవేరుస్తున్నామని ప్రజాప్రతినిధులు ప్రజలకు చెప్పారు.



నెల్లూరు జిల్లా సంజీవరాజుపల్లిలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖరరెడ్డి



శ్రీకాకుళం జిల్లా బొరిగివలసలో లబ్ధిదారులకు పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, District Krishna - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, District Krishna - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0863-2512581 Fax: No. 0863-2512584. RNI Reg No. APTEL/2008/23794.